రాజగోపాలరావు, తేకుమళ్ళ

పందొమ్మిదవ శతాబ్దపు హిందూసంఘసంస్కారచరిత్రము

చెన్నపురి, 1901

Record no: 2

Rājagōpālarāvu, Tēkumaḷḷa.

Pandommidava śatābdapu Hindūsaṅghasaṃskāracaritramu.

Cennapuri, 1901.

Record no: 2

Bibliographic Record Target

రాజగోపాలరావు, తేకుమళ్ళ.

పందొమ్మిదవ శతాబ్దపు హిందూసంఘసంస్కారచరిత్రము / ఇది ఆంధ్రదేశీయుల యుపయోగార్థమై తేకుమళ్ళ రాజగోపాలరావుచే వ్రాయబడినది. - చెన్నపురి : శ్రీ చింతామణీముద్రాక్షరశాల, 1901.

vii, (1), 159 p. ; 21 cm

Record no: 2

Rājagōpālarāvu, Tēkumaḷḷa.

Pandommidava śatābdapu Hindūsaṅghasaṃskāracaritramu / idi Āṃdhradēśīyula yupayōgārthamai Tēkumaḷḷa Rājagōpālarāvucē vrāyabaḍinadi. - Cennapuri : Śrī cintāmaṇīmudrākṣaraśāla, 1901.

vii, (1), 159 p. ; 21 cm

Record no: 2

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB **Date filming began:**

A HISTORY OF

INDIAN SOCIAL REFORM

IN THE

NINETEENTH CENTURY.

Compiled by

TEKUMALLA RAJAGOPALA RAO.

Madras:

PRINTED AT THE CHINTAMANI PRESS,
20 Vellala Street, Parasuwakam.

Price Rs. 1- 4- 0.] [వెల రు 1-4-0.

శ్రీ

పందొమ్మిదవ శతాబ్దపు

హిందూసంఘసంస్కారచరిత్రము.

ఇది

ఆంధ్రదేశీయుల యుపయోగార్థమై

తేకుమళ్ల - రాజగోపాలరావుచే

వ్రాయఁబడినది.

చెన్నపురి:

శ్రీ చింతామణీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1901.

దీనివెల 1- 4- 0.

TO

THE SACRED MEMORY

OF THE LATE

HON'BLE Mr. JUSTICE MAHADEV GOVIND RANADE

M. A. L. L. B. C. I. E.

Who By His Life And Deed

Did So Much

To Elevate The Hindu Society

This Little Volume

is

Most Respectfully Dedicated By The

AUTHOR.

PREFACE.

If the late Mr. Justice Ranade, who may be said to be the real author of this attempt were living now, my joy would have been boundless. In the year 1896 when the idea of writing this volume struck me, I duly intimated the matter to him. The venerable gentleman at once referred me to various sources of information, besides himself sending much useful material. His death is a universal loss to all India, and personally to me and this little history, and I herewith express my gratitude and reverence towards him by dedicating this little volume to his memory.

In writing this volume I had no old histories of Social reform to help me on, but I had to gather information from detached sentences here and there in a large number of books I had to refer to. Now and then a few biographies of eminent Indian reformers came to my rescue, and occassionally a few kind-hearted friends helped me by furnishing me with some information relating to the districts where they lived. I herewith express my hearty thanks to all such men who have thus encouraged me.

But with all this it must be admitted that the volume is far from being perfect. First attempts like these are never absolutely so, and it is therefore possible that insufficient or incorrect information has led the author to commit various mistakes of fact. In books treating of subjects like these, and espicially when one has to tread on practically new ground, it is likely that lapses like these which may generally reflect on living persons and incidents within the memory of many men, will not go unresented; but I shall disarm all such resentment by apologising for such faults, and assuring the public that I am always ready to profit by additional facts and information given me to revise my book carefully.

In writing this book clearness and simplicity of style have been thought essential, and I have therefore avoided many strictly grammatical forms where they tended to be pedantic.

With this little preface, I place the book in the reader's hand, and hope that it will produce a beneficient effect upon him, by making him imitate the great examples placed before him, and thus improve the Hindu Society by practical reforms of a permanent nature.

Madras, } T. RAJAGOPALA RAO.

పీఠిక.

ఈ గ్రంథప్రయత్నమునకు నిజమైన ప్రోత్సాహకులని చెప్పవలసిన జస్టిస్ మహాదేవ గోవిందరానెడీగారే యిప్పుడు బ్రదికియుండినయెడల నాసంతోషము మితిమీఱి యుండును. అత్యంత గౌరవనీయుఁడగు నీమహనీయుఁడు, నేను 1896వ సంవత్సరమున నీవిషయమై యొకగ్రంథమును వ్రాయఁ దలఁచి నాయభిప్రాయము నాయనకుఁ దెలిపినప్పుడు నాయందలి నిర్హేతుకమగు దయతో నాకు బహువిషయములను దయచేసి అనేక గ్రంథములనుగూర్చి తెలిపి పెక్కండ్రు జనులవలన సహాయమునందుట కను వేర్పఱిచిరి. ఆయన మరణము హిందూదేశమున కంతకును, స్వవిషయమునుగూర్చి యోచించినప్పుడు నాకును, నాచేవ్రాయఁబడిన ఈచిన్నపొత్తమునకును మిక్కిలి నష్టకరమైనది. అట్టిమహనీయునియెడ నాకుఁగలకృతజ్ఞతను, గౌరవమును దెలుపుకొనుట కాయన జీవించియుండనందున నీగ్రంథము నాయనను జ్ఞాపించున ట్లంకితము చేయుచున్నాను.

సంఘసంస్కారచరిత్రమునుగూర్చి తెలిపెడు పూర్వచరిత్రము లేమియు నాకాధారముగా లేనందున, నీగ్రంథరచనమునందు నేను చూచిన యనేకగ్రంథములలో నక్కడక్కడ సందర్భానుసారముగా వివరింపఁబడిన చరిత్రావిషయికములగు చిన్నచిన్నవాక్యములనే యాధారముగాఁ జేసికొనవలసి వచ్చినది. అక్కడక్కడ హిందూదేశపు ఘనసంస్కర్తల జీవచరిత్రములు నాకాధారము లయినవి. మఱియును దయాహృదయముతోఁ బెక్కండ్రు నాకు తమతమదేశవిషయములనుగూర్చి వ్రాయుచు వచ్చిరి. ఈవిధముగా నీగ్రంథరచనమునందు నాకు సహాయము చేసిన ప్రతివారికిని హృదయపూర్వకముగా వందనము లాచరించుచున్నాను.

ఏది యెట్లున్నను ఈ గ్రంథమునందుఁ గొన్నిదోషము లుండుననిమాత్ర మొప్పుకొనక తప్పదు. ఈరీతి ప్రథమప్రయత్నము లెప్పుడును సర్వసత్యములు కానేరవు. విషయములను సంపూర్ణముగా దెలియమిచేతఁగాని సరియైన విషయవిజ్ఞానము లేకపోవుటచేతఁగాని నేను సత్యము లనుకొన్న బహువిషయము లసత్యములైనను గావచ్చును. కొద్దితప్పులు సహితము సత్యవిషయములకుగాని వానికిసంబంధించిన మనుష్యులకుఁగాని నూతనగౌరవమునో లోపమునో ఆపాదించుచరిత్రాగ్రంథములను గూర్చియు, అంధును నయోమయముగాఁ బడియున్నవిషయములను గ్రహించి యథాస్థానములందుఁ

జేర్ప బ్రయత్నించు ప్రకృతగ్రంథమువంటి ప్రథమప్రయత్నములను గూర్చియు వ్రాయునప్పుడు గ్రంథకర్త తనగ్రంథమునందు దెలుపఁబడిన యెవ్వరిపైఁగాని తనకసూయత, ద్రోహబుద్ధి మొదలగునవి లేవనియు దనగ్రంథమునందలి నిజమైనలోపములను దిద్దుకొనుటకు దా ననుక్షణమును సిద్ధముగానే యున్నాఁడనియుఁ దెలుపవలసి యుండును. ఇంతవఱకును జెప్పినతరువాత నేను న్యాయమును మీఱిచరించుట లేదని తలఁచుచున్నాను.

పాఠకుల కెల్లఱకు నిది సుగమముగానుండు టావశ్యక మగుటచే నీగ్రంథమునందు వాక్యవిస్పష్టతకు హానినిఁ గలిగించునని తోఁచినచోట్ల నెల్లను వ్యాకరణమును నే నంతగాఁ బాటింపలేదు.

ఈ చిన్నపీఠికతో నీగ్రంథము నిప్పు డాంధ్రదేశీయులచేతి కొసఁగుచ ఇందు వివరింపఁబడిన ఘనపురుషుల ననుకరించి, కార్యసంస్కరణములవల దేశమునకు నిత్యమై నిలిచెడు మేళ్ళను జేయనెంచుపాటియుత్సాహము మాప నెవ్వరికైనఁ గలిగినయెడల ఈగ్రంథరచనమునకై నేనుపడిన శ్రమ సార్థ సంతోషించెదను.

చెన్నపురి.
28-10-1901.

☞ తే. రాజగోపాలరావు.

విషయసూచిక.

ప్రకరణములు.

1. పురాతన హిందూసంఘస్థితి. ... ... 1.
2. బలవస్మరణములు. ... ... 8.
3. (స్త్రీ) పునర్వివాహములు, వంగదేశము.... ... ... 18.
4. ,, బొంబాయి.... ... ... 26.
5. ,, చెన్నపురిరాజధాని. ... ... 31.
6. నీతివిషయములు, వల్లభాచార్యుఁడు. ... ... 44.
7. నీతివిషయములు, దొరతనమువారిచట్టములు. ... ... 53.
8. వివాహములు, అతిబాల్యవివాహములు. ... ... 62.
9. వివాహములు, కులీనులు, మళయాళీలు. ... ... 67.
10. విద్య. ... ... 82.
11. వివిధవిషయములు. ... ... 95.
12. ప్రకృతమున సంఘసంస్కరణము జరుగుచున్న విధము. ... 104.
13. మూర్తిసంఘీయులు. ... ... 116.
14. ఆర్యసమాజము. ... ... 121.
15. బ్రహ్మసమాజము, రామమోహనుఁడు. ... ... 131.
16. బ్రహ్మసమాజము, రామమోహనుని తరువాతివారు. ... ... 137.
17. హిందూసంఘసంస్కరణముయొక్క భావిస్థితి. ... ... 150.

హిందూసంఘసంస్కారచరిత్రము.

మొదటి ప్రకరణము.

ఒక సంఘముయొక్క చరిత్రమును వ్రాయునప్పుడందుఁగల లోపములను ముఖ్యముగా బయలు పుచ్చుట చరిత్రకారునికి విధియైయుండును. చరిత్రారంభకాలమునకి హిందూదేశమంధకారావృతమై, తనబిడ్డలమేలునే తానెఱుఁగక, యజ్ఞాన[illegible]మిట్టులాడుచుండెను. ఆకాలమునందు సహజమైన మాతృప్రేమయే, పాతకమని బోధించు కఠినచిత్తులైన బ్రాహ్మణుల యుపదేశములకు లోనువై తల్లులవ్యాఘ్రయ కుహరములనుండి పాఱిపోయి, మనుజులకంటెఁ గోటిమడుఁగులు తక్కువైన తిర్యగ్జంతువుల నాశ్రయించినప్పుడు, గర్భవిచ్ఛేదములైన శిశుహత్యాదులు నిరంకుశముగా నింటింటను జిందులు ద్రొక్కుచు రాజ్యపాలనము సేయుట కేమిసందేహముండును? అదియెట్లున్నను మృగములు సహితము తమబిడ్డల నతిప్రేమతోఁ గాఁచుకొనుచు, వాని రక్షణమునకై తమప్రాణములైన ధారవోయుచున్నప్పుడు, హిందూదేశమునందు స్వభావసిద్ధములైన కరుణాదులే యడుగంటుటకు వలయు కారణము లెవ్వియో, సంఘమేతీఱుననుండవలసియుండునో తెలిసికొనుట మొదట మనకవశ్యకర్తవ్యము.

మానవకోటి మొట్టమొదట నీభూమియందుత్పన్నమైనప్పుడు వారిస్థితియెట్లుండెనని కన్నులుమూసి మననమించుక విచారించితిమేని, వారప్పుడే జన్మించిన పసిపాపవలెనే, జ్ఞానశూన్యులై, దిగంబరులై, తాముపుట్టిన తీఱుననేయుండిరని తెలియఁగలదు. ఆహారనిద్రాభయాదులు పశువులకును మనుష్యులకును సామాన్యమేయైనను, పశువులకంటె నుత్తమమైన జ్ఞానముమాత్రము మానవ ప్రకృతికి స్వభావసిద్ధమగుట మహాశాస్త్రములును ఘోషించుచునే యున్నవి. అట్టిజ్ఞానమున్నను, సానఁబెట్టని యెడల వజ్రమైనను [illegible] మానవజ్ఞానమును నొక్కసారిగా నభివృద్ధిగాంచఁ జాలకయుండెను. మనుష్యులు తాముజన్మించిన తరువాతఁ గొంతకాలము వరకు మృగములవలె దిరుగుచు, పచ్చియాకలములనే భుజించుచు, నెట్టయెదుటఁ గానిపించు[illegible], కొమ్మలు, రాళ్లుమొదలగువానినే యాయుధములుగా నుపయోగించుచు, వన్యమృగములవలెనే దిగంబరులై సంచరించుచుండిరి. మృగములయందు బలవత్తరమైనది బలహీనమైనదానినిఁజంపి భక్షించునట్లే, మనుష్యులలో బలవంతులైన పురుషు లబలలైన స్త్రీల

ను దమకు దాస్యమునకుఁ దీసికొని, కొన్నివేళల వారలను జంపుచుఁగూడ వచ్చుటస్వాభావిక మేకదా. కావున మానవసృష్టి యాదిమదశయందు స్త్రీలు పురుషులకు దాసురాండ్రగుచు వచ్చిరి. స్థితినిబట్టి యోచించినయెడల నప్పటికాలపు వారియందుఁ గులాచారభేదములుండవుగదా. వివాహములు చేయవలయుననియు, నందువలన పవిత్ర సంసారములుత్పన్నమై యన్యోన్య సుఖాస్పదములును, నీతివృద్ధిదములును నైయుండు ననియు, నిట్టియూహ వారియందప్పుడే యుత్పన్నమగుట కవకాశములేదుగాన, నతిబాల్య వివాహమనియు, వితంతూద్వాహమనియు, పరవరణ మహోత్సవమనియు, వేరేల? వివాహమను మాటయే వారియందు లేదయ్యెను. పరదేశగమన మనుటకు వారికితర దేశముల సగతియే తెలియదుగదా. అన్యమతావిష్టులను మరల స్వకుటుంబమునఁ జేర్చుకొనుట యనునది యాకాలమునందుండుటెట్లు? పురుషవిద్యలనియు, స్త్రీవిద్యలనియు వివాదపడుటకాకాలమునందింకను విద్యలేలేవయ్యెను. క్రమక్రమముగా మొట్టమొదటమనుష్యుఁడీ భూమియందుత్పన్నమైనకాలముతరువాత మానవ సంఘముండెననుటకు, అనాగరిక దేశములు కొన్నియు, మానవతత్త్వ శాస్త్రమును (Anthropology) ను మనకుఁ బ్రబలనిదర్శనములై యున్నవి.

మనుష్యుఁడాదిమదశనుండి జ్ఞానము వికసించిన కొలఁదిని నభివృద్ధిఁ జెందుచు వచ్చెను. కొంతకాలమునకు నెముకలును రాళ్లును సాధనములగుటపోయి గనులనుండి లోహములను దీయుట తెలియఁగానే లోహమయ సాధనములు రాఁజొచ్చెను. తరువాత కొంతకాలమునకు మానవజ్ఞానము వికసించిన కొలఁదిని, దిగంబరత్వముపోయి వస్త్రధారణమును దెలిసినది. క్రమక్రమముగా రథములు జేయుటయు, పశువులను మందలుగాఁ బెంచుటయుఁగూడ నున్న తజ్జ్ఞానమువలన మనుష్యులు తెలిసికొనిరి. జ్ఞానమనునది యొక్కదినములోనే మిన్నుముట్టునది కాదుగావున, నేవిషయమునను దినదినాభివృద్ధి గావలసివచ్చెను. అందుచేతనే పూర్వులు రథచక్రములకు మొట్టమొదట యాకులను వేయుటఁ దెలియఁజాలక గుండ్రముగాఁ గఱ్ఱదిమ్మలనుజెక్కి చక్రములను జేయుచువచ్చిరి. ఆయాచారమే నేటికిని మనవారినివిడిచిపోక, రథచక్రములకుఁ గఱ్ఱదిమ్మలనే యుపయోగింపఁ జేయుచుండుట ప్రత్యక్షదృష్టాంతము. అసలు వేయుట యనునది కాలము నాటికిఁగాని తెలియలేదు (యూండక ౨-౨-౬.). ఆకాలమునందే సంఘమునందుఁ [illegible] గలుగుచువచ్చినవి. మెల్లమెల్లగా స్త్రీపురుషు లిరువురును నన్యోన్య [illegible] లును స్త్రీలును సమానస్వాతంత్ర్యసౌఖ్యప్రవర్తకులై [illegible] ములు గలిగియున్ననే సంఘమభివృద్ధి నందుననియు వారికిఁ దెలిసినది. అప్పుడే వివాహ చట్టములును జేయఁబడినవి. ఈ విధముగాఁ గొంతకాలముపోయినతరువాత ల సంఖ్యవృద్ధి గాసాఁగినందున, వారున్న ప్రదేశము చాలకుండుటచే నల

దిసల వెడలిపోవలసినవారైరి. ఉపయోగమున్ననుగూడ నన్యదేశమునకుఁ బోఁగూడదన్నట్టియూహ వారికిఁ దోఁచనందున, నందొక తెగవారువచ్చి సింధునదీప్రాంతములందు విడిసిరి. అప్పటికి వారింకను బంచభూతములనే యుపాసించుచుండిరి. గనులనుండి వజ్రములు, (ఋగ్వేదము ౧-౫౫-౧౨౮) బంగారు (ఋ ౧ ౬౭-౭౧౩; ౭౧౮) మొదలగు కొన్నిలోహములను మాత్రమే త్రవ్వుట వారికిఁ దెలిసియుండెను. అదియేఋగ్వేదకాలము. ఆకాలమునందనర్థదాయకములైనదురాచారములేమియు సృష్టింపఁబడలేదు. స్త్రీపునర్వివాహములు జరుగుచుండెను. (ఋగ్వేదము ౧౦-౧౮-౮).

“ఉదీర్ష్వ నార్యభి జీవలోకం గతాసుమేతముపశేష ఏహి ।
హస్తగ్రాభస్య దిధిషోస్తవేదం పత్యుర్జనిత్వమభి సంబభూథ ॥

ఓనారీ! లెమ్ము. నీవుచచ్చిన వాని (భర్త) చెంతనుబడియున్నావు. (చనిపోయిన) నీభర్తను వదలి బ్రతికియున్న జనులు గల ఈలోకమునకు వచ్చి పాణిగ్రాహకుఁడును, వితంతువును వివాహమాడ నిచ్ఛగలవాఁడును నగుభర్తకు భార్యవగుము.” ఇంతియకాక వేదమునఁదు “పరపూర్వ (=పునర్వివాహము చేసికొన్న వితంతువు,) పౌనర్భవ (=పునర్వివాహమాడిన వితంతువు కుమారుఁడు,), దిధిషు (=వితంతువును ద్వాహమైన వాఁడు), మొదలగు పదములుశాస్త్రీయముగానుండుటయే, స్త్రీపునర్వివాహము వేదవిహితమని తెలియఁగలదని, డాక్టరు రాజేంద్రలాల్ మిత్రగారు వ్రాయుచున్నారు. ఇంకా సుజ్ఞానము వికసింపనియాకాలము వారికొక్కసారి వితంతువులనందఱినిమఱలమాడ్చి వేయవలెనను నంతటి దురూహ పాదముట కవకాశమే లేదుగదా.

ఆకాలమునందు వధూవరులు యుక్తవయస్సునొందిన వెనుకనే, తమతమకోర్కెలను చిత్తవృత్తులనుబట్టి వివాహమాడు చుండవలెనని మనము తేలికగా గ్రహింపఁగలము. బాలికయుక్తవస్కురాలుగాక పూర్వమామెకు వివాహపు తలంపుండకుండుటయు, ముందుగానే యామెకు వివాహము సేయుటకుఁ దల్లిదండ్రుల కారటముండక పోవుటయు నిందుకుఁ గారణములు. పూర్వము వివాహాచారమే లేనప్పుడు వివాహముయొక్క ప్రయోజనము యుక్తవయస్సు రాక పూర్వము తెలియదుగాన, నాకాలమున యుక్తవయస్కులకే వివాహమువిధింపఁబడెను (ఋగ్వేదము ౧౦-౮౫-౨౧; ౨౨).

“ఉదీర్ష్వాతో విశ్వావసో నమసేడామహే త్వా ।
అన్యామిచ్ఛ ప్రఫర్వ్యం సంజాయాం పత్యా సృజ ।
ఉదీర్ష్వాతః పతివతీ హ్యేషా విశ్వావసుం నమసా గీర్భిరీట్టే ।
అన్యామిచ్ఛ పితృషదం వ్యక్తాం స తే భాగో జనుషా తస్య విద్ధి ॥

ఓవిశ్వావసుఁడా! ఇక్కడనుండి లెమ్ము. ఈకన్యవివాహమైనది. మంత్రములతో

విశ్వావసునిఁ బూజింపుచున్నాము. ఇంకను బితృగృహముననేయున్న కుచములురాని మఱియొక స్త్రీయొద్దకుఁబొమ్ము. ఆమె నీభాగమై యుండును &c. &c. &c.''

కన్యకలకు స్వయంవరములే జరుగుట యప్పుడు విధిగానుండవలయునని వారిస్థితినిఁజూచినవారికిఁ దేటపడఁగలదు. కానికొన్నిసమయములందు బాలికలుతమస్వాతంత్రములను జక్కఁగా వినియోగించి, తగినవరులను జూచుకొనఁజాలకుండుటచేఁ (ఋగ్వేదము-౧౦-౨౭-౧౨) దగినవరులను దల్లిదండ్రులు యుక్తవయస్కులైన తమబాలికలకు వారియనుమతిని వివాహముచేసి, వారినలంకరించి యత్తవారింటికంపు నాచారమందుఁగలిగియుండెను (ఋగ్వేదము-౧౦-౩౯-౧౪). ఋగ్వేదకాలమునాటికి ఆర్యులలో జాతిమత భేదములులేవు; అవియుండుటకవకాశమునులేదు. సముద్రయానము చేయఁగూడదనికాని, యన్యదేశమునకుఁ బోఁగూడదనికాని, న్యక్షపుకట్టుబాటు వారియందులేవు. సహగమనమనియు శిశుహత్యలనియుఁ, దరువాత తరువాత మనపవిత్ర భూమికి వేఱుపురుగులుగా, మూర్తీభవించిన దురాచార పిశాచములనఁదగు ఘాతుకపురుషులచే సృష్టింపఁబడినవి, కానితొలికాలమునందెన్నఁడునులేవు. ఋగ్వేదము పదియవ మండలములోని పదునెనిమిదవ సూక్తమునందలి యేడవఋక్కులో, "నగ్రే'' యను పదమును "నగ్నే''ని మార్చినందున, కన్నతల్లులను బ్రతికి యుండఁగనే గుభాలునకటికనిప్పులపైఁబడఁద్రోసి, యామె స్వర్గసుఖమునందనరిగినగని సంతసించు కుమారులను గలుగఁజేసినదిగాని, యాదికాలమునందీ దురాచారమెక్కడనులేదు. జాతిభేదములేని యాసమయమున నొకమతమునఁజేరినవారిని మఱల స్వమతమునందుఁజేర్చుకొనుటకేమి సందేహముండును? ఆకాలమునందు వ్యభిచారమేవృత్తిగా సిగ్గులజ్జలులేక చరించు "దేవదాసీ'' త్వమునందిన "జంగమనాటకము'' లగు "వివేకకల్పలతికాపహరు'' లైన పణ్యస్త్రీలుండలేదు. సర్వవిషయములందును భార్యాభర్తలన్యోన్యముగా నుండుటయేయానాటి యాచారమైయుండెనుగాని, స్త్రీలను బ్రపంచమునుండి వెలివేసియుండలేదు. ఋగ్వేదమునందలి కొన్నిసూక్తములు స్త్రీలచేతనే రచింపఁబడినవి. విశ్వవరయను నొకస్త్రీ ఋగ్వేదము పంచమ మండలములోని ద్వితీయ సూక్తమును రచించెను. అందిరువదియెనిమిదిచక్కని ఋక్కులుగలవు. అట్లేఋగ్వేదము పదియవమండలములోని నూటయిరువదియైదవ సూక్తమును వృకయనునామె రచించినది. ఈసూక్త మేకేశ్వరునిఁ గూర్చిన స్వచ్ఛములైన యభిప్రాయములతోఁగూడినదై, వేదాంత శాస్త్రమునకుఁ బునాదియైనది. లోపాముద్రమున్నగు ననేక స్త్రీలనేకములగు ఋక్కులనిట్లేవిరచించియున్నారు.

ఈవిధముగా నయ్యాదిమకాలమునందుఁ గ్రమముగా సంఘమభివృద్ధిఁగాంచి, దేశక్షేమంకరములైన యనేకచట్టములతో నిండియుండి, హిందూసంఘమునకు మందొక

నాఁడు పూర్ణముగా గ్రుంగిపోవునంతటి దురవస్థ ప్రాపించునని తలఁపరానంతటి యున్నతదశయందుండెను. ఆకాలమువారు పరస్పరక్షేమాభివృద్ధియు, దేశౌన్నత్యమునే ప్రధానములుగా దీసికొని, యందునకు వలయుఁ జట్టముల నేర్పఱచికొనిరి. న్యాయమే ప్రధానముగాఁ జట్టముల నేర్పఱచి నన్నాళ్లును నెన్నఁడును దేశమునకు నష్టము సంభవింపదు. ఇట్లుండఁగాఁ గొంతకాలమునకు వేదముల కాలముదాఁటిపోయి, బ్రాహ్మణముల కాలమువచ్చినది. ఈకాలమునందే జాతిభేదము లేర్పడినవి. మొట్టమొదట మతవిషయికములగు పనులను జూచువారు బ్రాహ్మణులైరి. క్రమక్రమముగా బ్రహ్మవిద్యయనునది తమసొమ్మని చెప్పి బ్రాహ్మణు లగ్రవర్ణులై తమనిరంకుశాధికారము నెల్ల జాతులపైనను జెల్లించుచువచ్చిరి. వీరిప్రభుత్వమురాఁగానే హిందూదేశమునందుఁ గ్రమక్రమముగాఁ దురాచారములు ప్రబలనారంభించినవి. నాటికింకను నార్యులు మాంసభక్షకులుగనే యుండిరి. (శతపథబ్రాహ్మణము ౪-౫ ; ౩-౧-౨-౨౧). న్యాయముగా పనినిఁజూతురని భ్రమపడి సర్వాధికారమును నొక్కరిమీఁదఁబెట్టఁగానే యదివిషమించుచుండుట బ్రపంచచరిత్రము నెఱిఁగిన వారికందఱికిని దెలిసియేయుండును. రోమకరాజ్యమునందు, సర్వాధికారమును పెట్రీషియనులను నొకతెగవారికి రాఁగానే వారు భాగ్యహీనులైన ప్లబియనులను రెండవ తెగవారికే స్వాతంత్రములనీయక సర్వవిధములఁ జిక్కుపఱుప సాఁగిరి. రాజ్యపరిపాలనమునందు సర్వాధికారమును దమమీఁదనే పెట్టుకొని, ప్లబియనులను దమయిచ్చ వచ్చినరీతిగాఁ గష్టపెట్టుచు, వారిని గౌరవోద్యోగములలోనికి రానీయక, బానిసలవలె దూరమునను0చుచు, వారిమీఁద నెక్కుడుగాఁ బన్నులను వేయుచు, వారేదైనఁ దప్పుచేసిన యెడల నతికఠినముగా దండనమును విధించుచు, నెక్కడను వీరిమాటను బైటకి రానీయక, పెట్రీషియనులు రాజ్యపాలనము చేసినన్నాళ్లును, రోమక రాజ్యమతి దీనదశయందే యుండెను. క్రమక్రమముగా నీప్లబియను లెన్నికష్టములువచ్చినను సహించి, పెట్రీషియనులతో హోరాహోరినిఁ బోరాడి, వారితో సమానులనిపించికొనినతరువాత నుభయపక్షములవారికలహములునుదీఱి, యైకమత్యము వచ్చినది. ఉభయపక్షములవారును సమానులుగానెగడఁబడినయాదినముననే రోమక రాజ్యముయొక్క యుచ్ఛదశయారంభమైనది.

హిందూదేశమునందును పెట్రీషియనులవలెనే బ్రాహ్మణులును నిరంకుశాధికారులై, తమమాటనే పరమప్రమాణముగా నెగ్గించుకొనుచుఁ, దక్కినవారినిఁ బ్లబియనులవలెనే యణఁగఁద్రొక్కనారంభించి నందున హిందూదేశమును నాకాలమునందలి రోమక రాజ్యమువలెనే చెడిపోవనారంభించినది. పెట్రీషియనులవలెనే బ్రాహ్మణులును సర్వాధికారమును దమచేతఁ జిక్కించికొని దేశానర్థదాయకములగు జట్టముల నేర్పఱుప మొదలు వెట్టిరి. బ్రహ్మజ్ఞానము కలవాఁడే మొట్టమొదట బ్రాహ్మణుఁడనిపించికొన్న

ప్పుడు బ్రాహ్మణుల కధికారమే లేకయున్నను, వారియందు మొట్టమొదటఁ బవిత్రమైన గౌరవము మాత్రము జనులకుఁగలుగుచువచ్చెను. మనశాస్త్రములయందు మొట్టమొదట బ్రహ్మజ్ఞానము కలవాఁడే బ్రాహ్మణుఁడుగాఁ బరిగణింపఁ బడుచువచ్చెను * (బ్రహ్మోపనిషత్తు &c.). తరువాతనట్టి బ్రాహ్మణుని సంతతి వారందఱును గూడ బ్రాహ్మణులేయని యనిపించుకొనుచుండుటచే, మొట్టమొదటి పవిత్రతపోయి బ్రాహ్మణ జాతియేర్పడినది. మొట్టమొదటి బ్రాహ్మణులయందుఁ బ్రజలకుఁగల గౌరవమును జన్మపారంపర్యముగా వచ్చునట్లు చేసికొని, బ్రాహ్మణులు తమమత వ్యాపారములవలన మెల్లమెల్లఁగా దేశమునందలి సర్వాధికారమును దమ చేతిలోనికిఁ దెచ్చుకొనిరి. ఈవిధముగా దేశమునందుఁ దమదేయధికారముగాఁ జేసికొనిన తరువాతఁ జట్టము లారంభమైనవి. తమ నిరంకుశాధికారముఁ జెల్లునట్లుగాఁ బక్షపాతముతో స్మృతికర్తలు ధర్మశాస్త్రములనువ్రాయ మొదలుపెట్టిరి. బ్రాహ్మణుఁడాకాలమునందే భూదేవుఁడయ్యెను. (మనుస్మృతిసారాంశము,) అతఁడు తప్పుచేసినను దండనము మాడువంతులు లేకుండుటయో, లేకయత్యల్పముగా నుండుటయో ధర్మమయ్యెను. బ్రాహ్మణుఁడు చేసిననేరమునే యితరులు చేసిన యెడల జాతినిబట్టి క్రూరదండనము విధింపఁబడుచు వచ్చెను. (మను-౮-౦౨). క్రమక్రమముగా గొంతకాలమునకుఁ జాతుర్వర్ణములలో భోజన ప్రతిభోజనములును, నగ్రజాతి స్త్రీవివాహములును గట్టువడినవి. మఱి కొంతకాలమునాటికి స్త్రీపునర్వివాహములు నిషేధింపఁబడినవి (మను ౯-౧౬౨). అతిబాల్య వివాహము లాచారమైనవి(వ్యాసపరాశర యాజ్ఞవల్క్య). ఈవిధముగా నొకటి వెనుక నొకటిగా నెల్లదురాచారములునువచ్చి హిందూదేశమును జుట్టుకొనెను.

కాలక్రమమున సిథియనులు హిందూదేశముపై దండెత్తుట తటస్థించెను. ఆకాలమునందా సిథియనులలో నతిక్రూరములగు దురాచారములుకొన్ని ప్రబలియుండెను. భేతాళ పూజలను, నసిపుత్రికా పూజలనువలెనే హిందువులువారినుండి సహగమనమును, పిడుతలను, శిశుహత్యాదులనుగూడ నేర్చుకొనిరి. మఱికొంతకాలమునకు బౌద్ధులు హిందూదేశమునందెక్కడఁజూచినను దామయై చరించుచుండిరి. వారియందు సన్యాసినులకు శిరోజములను దీయించుట యాచారమై యుండెను. భగవంతుఁడు స్త్రీలకెల్లరకు సహజాలంకారములుగానుండ సృజించిన ముద్దుకురులను మూఁడేండ్ల పసిపాఁపయనినైనను జాలిదలఁపక ముంగలివాని కటుకత్తికిబలిపెట్టు దురాచారమీ బౌద్ధులను జూచియే హిందువులు నేర్చుకొనిరి. ఇట్లురానురాను ప్రతివిషయమునందునుగూడ హిందూదేశమున

* బ్రహ్మజ్ఞానంతు బ్రహ్మణః॥ జన్మనాజాయతే శూద్రః కర్మణాజాయతే ద్విజః॥

కు క్షీణత్వము రాసాఁగెను. తుట్టతుదకు జాతిమతాచారములవలన నొక హిందువునికింకొండవవానికిని వైషమ్యములు సంభవించినందున హిందూదేశమునందలి యైకమత్యము చెడి దేశమన్యాక్రాంతమయ్యెను. తనంతట తానే కనోజ దేశపురాజగు జయచంద్రుఁడు మహమ్మదు గోరిని * హిందూదేశమునకుఁ దెప్పించు హేతువయ్యెను. మహమ్మదుగోరియును ౧౧౯౩ వ సంవత్సరమున జయచంద్రుని జ్ఞాతియైన పృథ్వీరాజుఢిల్లీ రాజ్యమును గొల్లఁగొని, తరువాత జయచంద్రునే కీటూర్చి, హిందూరాజ్యమును దనస్వాధీనము చేసికొనెను.

మహమ్మదీయులు హిందూదేశమునకుఁ బ్రభువులుకాఁగానే వయసు వచ్చినచక్కని స్త్రీలను జెఱపెట్టి క్రూరకృత్యములను సలుపుచు వచ్చిరి. దానితో హిందూదేశమునఁ గడపటి వరకును నిలిచియున్న స్త్రీలస్వాతంత్ర్యములడుగంటినవి. అక్కడితో సరిపోక రాజపుత్ర స్థానమునందు పౌరుష ప్రధానశీలురైన రాజపుత్రుల స్త్రీలయందు “జోహూర”ను నొక క్రూరకర్మము బయలు వెడలినది. నీతిమాలిన కొందఱు శత్రురాజులు దేశయాత్రలు వెడలి నప్పుడెదిరి భార్యలను జెఱపట్టుట యొక గౌరవముగా నెంచుచుండుటచే, నిట్టికృత్యములను సహింపఁజాలక యుద్ధారంభమునందే చితిపేర్చియుంచి, యుద్ధమునందుఁ దమభర్తలోడిపోయిన యెడలఁ దామ చితినెక్కి శత్రురాజులనుండి తమమానమునుగాఁపాడుకొన వలసినంతటి దుస్థితిహిందూభార్యలకుఁబట్టినది. దీనితో హిందూదేశమునందలి తుట్టతుది స్వాతంత్ర్యముగూడ నడుగంటిపోయినది.

ఈవిధముగా హిందువులు మొట్టమొదట వేదములకాలమునందుఁ దమకున్న సర్వస్వాతంత్ర్యములను జాతిభేదముల కారణమునఁ బోఁగొట్టుకొని, నేటికాలమునకనర్థదాయకములగు దేశాచారములే ప్రధానమగు మతముగా సంచరించుచుండిరి. లోకములోనెల్లరకంటెను ముందుగనే తలనెత్తి, సకలశాస్త్రములకు నాదిచూపి, స్వచ్ఛములైన దేశాచారములను గల్పించుకొని, యఖండైశ్వర్యముతో నొకనాఁడు తులఁదూఁగిన హిందూదేశమంత కంతకు స్వప్రయోజన పరులైన తన బ్రాహ్మణ కుమారుల స్వాతంత్ర్యముల వలన, దుట్టతుదకు, స్వదేశస్థుల సౌఖ్యవృద్ధులను హరించి, వారిప్రాణములను బలిగొనుటకు సంకోచింపని దయ్యెను. ఈవిధముగా నాలువందల యేండ్లవిచ్ఛిన్నముగా నధర్మపరిపాలనము జరిగినవెనుక, దేశమునాక్రమించిన యజ్ఞానతమమును బోనడచు పవిత్రమైన హూణభాష మనదేశమునకు వచ్చినది. అదియే యుత్తమమైన మన పందొమ్మిదవ శతాబ్దము. చిరకాలమునుండి దేశమునందు నాటుకొనియున్న దురాచారముల నొక్క

* Tod's annals of Rajastan Vol I Page 275.

సారిగా నీశతాబ్దమునందు జనులు నశింపఁజేయ నేరకున్నను, నాదిదశయందు సంస్కారమే తీరున వృద్ధినందినదో తెలియు టెల్లరకు నావశ్యకముగాన, సంస్కారచరిత్రమును జాగ్రతతో మనము నిరీక్షించి చూచుచు, దీనితోడనే మన దేశముయొక్క పురోభివృద్ధి యున్నదని నిశ్చితముగా నెఱిఁగి, యొక్కరొక్కరమే ఈదురాచారములను దొలఁపఁ బ్రయత్నింతము.

రెండవప్రకరణము.

ఈవిధముగా హిందూసంఘము క్షీణదశకు వచ్చిన తరువాత, నాలుఁగువందల యేండ్లవరకును దేశమంధకారావృతమైయుండెను. ఇంగ్లాండు దేశీయులగు హూణులు వర్తకమునకై మొట్టమొదట ౧౬౦౦ వ సంవత్సరమునందు, అప్పటికాలపు వారిరాణియగు నెలిజబెత్తుననుజ్ఞను గొని హిందూదేశమునకువచ్చి, క్రమక్రమముగా హిందువుల యదృష్టవశమున దేశపాలకులైరి. ఆకాలమునందు బహుక్రూరములగు దురాచారములు హిందువులలోఁ బ్రబలియుండెను. తమకు మీఁదఁబుణ్యమును బురుషార్థమును వచ్చునని చెప్పినమూఢపురోహితుల మాటలనునమ్మి తల్లులుతమకన్న బిడ్డలను నదులలోని మొసళ్లకుఁ బాలువైచుచుండిరి. నరబలులవలనఁ గాళికాదేవి సంతసించి తమకు వరములనిచ్చునను భ్రాంతితోఁ బుణ్యపురుషులు గొందఱు, పరదేశీయులను వంచించి తెచ్చి, కాళికాలయమున చఱుక్కున నొక్కవ్రేటుతో వారలకంఠములను దఱుగుచుండిరి. కొందఱు ధన్యాత్ములేయమ్మ వారో యేకైతవ దైవతమో వ్యాధిమొదలగు వానినుండి, తమప్రాణములను గాపాడినదని దుర్భ్రమగొని, యాయమ్మ తల్లికి శాంతికిఁగా నుత్సవ సమయములందు గాలములకుఁ దమవెన్నెముకను గ్రుచ్చికొని, బాధచే విలవిల దన్నుకొనుచు సిడులనాడి ప్రాణములను భంగపెట్టుకొనుచుండిరి. మఱికొందఱు భక్తిపారవశ్యముచే నొడలు తెలియక, ఏశ్రీజగన్నాథస్వామియో, ఏకాశీవిశ్వేశ్వరుఁడో, తమకు మోక్షమును బ్రసాదించునని భావించి, యుత్సవ సమయములందా విగ్రహము లూరేఁగురథచక్రముల క్రిందఁబడి ప్రాణములను బోఁగొట్టుకొనుచుండిరి. ఈవిధముగాఁ బ్రాణములనే లక్ష్యపెట్టక మోక్షకాములై జనులాత్మహత్యలనుగావించికొనునప్పుడు విగ్రహములకు నిలువుదోఁపుడులను జేయుట యొకవింతగాదు.

దేశపాలకులగు రాజసత్తములేమైనఁ బ్రజలపైఁగరుణించి యీదురాచారముల నాపఁగలిగియుందురని మనముభావింతమన్నను, వారు బ్రాహ్మణమంత్రివశులై యుండుటటుండ, క్షత్రియులెవ్వరైన మృతినందినయెడల, వారికిఁ బరలోకమున సహాయుఁడుగానుండుటకై వేఱొకఁడుగూడ నాదినమున బలవంతముగా జంపఁబడి, వారి శవముతోఁగూడ శ్మశానమునకుఁ జేర్పఁబడుచుండెను. "రాచపీనుఁగుతోడు లేక చావ"దన్న లోకోక్తి యెల్లఱకును దెలిసియేయుండును. ఈవిధముగా హద్దుమీఱి లోకమునందు నిరాతంకముగా నరబలులు జరుగుచున్నప్పుడు పరులను జావుఁడని ప్రోత్సాహపఱుచు నరాంతకులును దోడనే యుండియుందురు.

సహగమనమనునది ఇట్టి బలవన్మరణములలోనే చేరినది. తనకు బహిఃప్రాణమైన ప్రాణనాయకుఁడు ప్రేమానుబంధముచే తనకడవరిచూపుల నొక్కసారి తనపైఁ బొలయించి, కన్నీళ్లతోఁ దనకును దనతోడి పాటుగా నీలోకమునకును దిలోదకములను వదలినప్పుడింతింతనరాని దుఃఖముతోఁ బ్రాణనాథునిఁ బైఁబడి హాహారావములు సేయుచు, నాక్షణముతోనే దనమాంగళ్యపుఁ గళనంతను బెడఁబాసిన దీనయగు ననాథయువతిని నానిముషమున నించుక యోదార్చి యామెను గాపాడఁ దలపెట్టక, యామెయాస్తినంతను లోన వైచుకొనవలెనను నంతటి ఘోరమగు నూహ నెదనెంచి, "అమ్మా చనిపోయిన నీభర్తతోఁగూడ నాకటికి నిప్పులపై నీవును బ్రేల్పఁబడితివేని పరలోకమునందుఁగూడ, నీవునీభర్త నెడఁబాయక యుందురని" చిత్తవైకల్యముచే నొడలుతెలియకయున్న యాదిక్కుమాలిన యబలకు బోధించి, నమ్మించి, యామెకు నల్లమందు మొదలగు మత్తుద్రవ్యములచే నొడలు తెలియకుండఁజేసి, చితిపైఁబరుండఁబెట్టి, యామెను భగ్గునమండు నగ్నిహోత్రము నందొక్కసారిగా భగ్నము చేయునంతటి క్రూరాచారమును గొనివచ్చిన చండాలురకైనను నాకాలమునందు దండనము లేదయ్యెను. ఇదియే సహగమనమని మనవారు వ్యవహరింతురు. అటరాజపుత్ర స్థానమునందు దురాగ్రహగ్రస్తులైన రాజపుత్రులు మనుస్మృతిలోని రాక్షస వివాహమును దమకుఁ బరమప్రమాణముగా స్వీకరించికొని, యుద్ధసమయములయందు శత్రురాజుల స్త్రీలను జెఱఁబెట్టి బానిసలనుగా గొనిపోవుచుండిరి, దీనివలన వారిలో నతిభీతమగు నొకదురాచారముత్పన్నమైనది. * ఈజోహారునుగూర్చి వెనుకటి ప్రకరణమునందే చెప్పఁబడినది.

ఇట్లు హిందూదేశమునం దిట్టి క్రూరకర్మములవిచ్ఛిన్నముగా జరుగుచున్న కాలమునందు మనభాగ్యవశమున హూణులు క్రమక్రమముగా హిందూరాజ్యమును దమకులోఁ బఱచికొనుచుండిరి. మొట్టమొదట దొరతనమువారిని విశేషముగా నాకర్షించినవి

* Tod's annals of Rajastan Vol I Page 679.

బలవన్మరణములే. క్రీ॥ శ॥ ౧౫౫౬ మొదలుకొని ౧౬౦౫వరకును హిందూదేశమును బరిపాలించిన యక్బరుచక్రవర్తి కాలమునందే మొట్టమొదట నీదురాచారములను బాపుటకుఁ గొన్నిచట్టము లేర్పఱుపఁబడినను నవి విఫలములే యయ్యెను. అక్బరుచక్రవర్తి తనవద్ది ప్రధానమంత్రియైన అబుల్ ఫేజుల్ అనునతని సహాయమువలన తనరాష్ట్రమునందు సహగమనములు జరుపఁబడరాదని విధించియున్నను, హిందువుల యధికారమా కాలమునందు విస్తరించి యుండుటచేతను, హిందువులతో వైషమ్యములు బెట్టుకొనుట కక్బరున కిష్టములేక పోవుటచేతను, నాతని చట్టములు దేశమున కంతఁగా నుపకారము చేయలేదు. అయినను నక్బరు చక్రవర్తి సహగమన మొకచోట జరుగుచున్నదని తెలిసినప్పుడు మాత్రమూరకున్నవాఁడు. ఇందుకు దృష్టాంతముగా రాజపుత్రరాజులలో చక్రవర్తికిఁబరమ మిత్రుఁడైన జయమాలియను నాంబరురాష్ట్రములోని యొకరాజుచనిపోయినప్పుడు జొడ్పూరు రాజగు నుదయసింగుకుమార్తెయైన ఆతని భార్య యక్బరంతకుఁ బూర్వమే చేసిన శాసనానుసారముగ సహగమనమును జేయనని చెప్పెను. ఆమెపుత్రుఁడేయగు నుదయసింగందునకీయకొనక బలవంతముగా నామెనుఁ జితిపైకి నెక్కెను. వెంటనే మీఁదఁ గఱ్ఱలనుజేర్చి నిప్పంటించిరి ఇట్టిదుర్మార్గము జరుగఁబోవుచున్నదనివిని యక్బరు వెంటనే పాఱివచ్చి, యా నిప్పులమధ్యనుండి సమయమున కాకాంతామణినిఁ గాపాడఁజాలెను. తఱువాత బ్రిటీషు దొరతనమువారు మనదేశమునకు వచ్చినప్పుడు వారిలోఁ బ్రధానరాజకీయ పురుషు లీదురాచారములను మాన్పవలెనని పెక్కువిధములఁ బనిసేసిరి. కాని ౧౮౩౦ వ సంవత్సరమువఱకును వారిప్రయత్నములన్నియు విఫలములగుచునే వచ్చెను.

౧౮౨౮ వ సంవత్సరమునందు వులియం బెంటింకు అను ప్రభువు హూణహిందూమండలకరగ్రాహి గావచ్చెను. దేశమునందలి సహగమన దురాచారమును మాన్పుటకాతఁడు పెక్కులగు నుపాయముల నరసి, పనిచేయఁదలంచి యుండెను.

మొట్టమొదట సిరంపూరులోని కొందఱు క్రైస్తవమత బోధకు లీదురాచారము నాపవలయునని యనేకప్రయత్నములను జేసిరి. ౧౮౦౪ వ సంవత్సరమున నీవిషయమునుగూర్చిన సంగతులను దెలిసికొనుటకై కలకత్తా చుట్టుప్రక్కల ముప్పదిమైళ్లదూరము సంచరించుటకొఱకు వీరుప్రత్యేకముగా జీతములేర్పఱిచి పదిమంది మనుష్యులను గూడనంపియున్నారు. దేశమునందలి ఈఘోరకృత్యముయొక్క ప్రాబల్యమును గన్నీళ్లతో వారువిమర్శన పూర్వకముగాఁ జెప్పినప్పు డెన్నఁడైన నీదురాచారము పోయి హిందూదేశమునకు మంచిదినములు వచ్చునాయని యాపాదిరులు భయపడి, ఏమైనను మీఁద భగవంతుఁడున్నాఁడని ధైర్యముతో దొరతనము వారికొక విజ్ఞాపనము నంపిరి అప్పుడు

వెల్లస్లీ దొరగారు రాజ్యపాలకులుగా నుండిరిగాని, యాయన యంతకు వారముదినముల కావల తమయుద్యోగమును వదలి స్వదేశమునకుఁ బోవలసియుండుటచే, దీనివిషయమున నేమియుఁ బనిసేయలేకపోయెను. ఒకదినము దాఁటినకొలఁదిని మఱికొందఱీ సహగమన మహాభూతమునకు బలిపెట్టఁబడుచుండిరి. ౧౮౧౭ వ సంవత్సరమునందు వేయఁబడిన లెక్కప్రకారముగా వంగదేశమునందు దినమున కిద్దఱు సహగమనమును జేయుచుండిరి. కాని ఈదురాచారమును మాన్పుటకుఁ బ్రసిద్ధుఁడైన యొకహిందూమహాత్ముఁడు కావలసియుండెను.

శ్రీరాజా రామ మోహనరాయలవారు ౧౭౭౪ వ సంవత్సరమునందు మూర్షదాబాదు నవాబుగారి స్వాధీనములోనున్న యొకజమీందారునికిఁ బ్రథమ పుత్రులుగా నుదయించిరి. తనకుఁ దొమ్మిదిసంవత్సరముల ప్రాయము వచ్చినతరువాత శ్రీరాజా రామ మోహనరాయలవారు స్వగ్రామమునువదలి పాటలీపుత్రమునకు పారసీభాషను నేర్చికొనుటకై పోయిరి. మూడుసంవత్సరము లాపురమునందుండి తఱువాత తమపదుమూడవయేట శ్రీరామమోహనరాయలవారు సంస్కృతవిద్య నేర్చికొనుటకై కాశీపట్టణమునకుఁ బోయి, నాలుగేండ్లాపురమున నివసించి, సంస్కృతవిద్యయం దసామాన్యపాండిత్యమును వహించిరి. ఇంటికివచ్చిన తరువాత, విగ్రహారాధనము కూడదన్న తనవాదమునకుఁ దన్నుగృహమునుండి తండ్రి వెడల నడఁపఁగా, బాలుఁడయ్యును నిర్భయముతోఁ దిన్నఁగా హిమాలయపర్వతములమార్గమునఁ దిబెత్తుదేశమునకుఁ బోయి, అచ్చటనాకాలమున క్షీణదశయందున్న బౌద్ధమతమునందలి లోపములను వెల్లడింపసాఁగెను. తమలోని లోపములను దిద్దుకొనుటకు మాఱుగా, వారలు రామమోహన రాయలపై ధ్వజమెత్తి యాతనినిఁ జంపఁబూనిరి. ప్రాణాపాయావసరమున శ్రీరామమోహన రాయలు ధీమతులైన కొందరు పురస్త్రీల సాహాయ్యము వలనఁ బురమునుండి యీవలఁబడి, తిన్నగా హిందూదేశమునకు మఱలివచ్చి, దేశసంచారము చేయసాఁగెను. తరువాత నీతని తండ్రి మఱల కుమారునిగృహమునకుఁ బిలిచెనుగాని, విగ్రహారాధనము విషయమునందు మఱల పితృపుత్రులకు మనస్పర్థలు సంభవించుటచేఁ, దల్లిప్రేరణమువలన రామమోహనరాయలు తిరిగిగృహమునుండి వెడలనడఁపఁబడెను. ౧౮౦౦ వ సంవత్సరము మొదలుకొని ౧౮౧౩ వరకును రామమోహనరాయ లుద్యోగమునందుండెనుగాని, పిమ్మట దేశక్షేమము విషయమై పనిచేయు నుద్దేశముతో నాయన దానిని నువదలివేసెను. తరువాతఁ బవిత్రమైనయే కేశ్వరారాధనమును జనులకు బోధించుచు, గొంతకాల మైనతరువాత ౧౮౧౮ వ సంవత్సరమునందు సహగమన దురాచారమునుజూచి సహింపనేరక “సజీవగత భర్తృ కాగ్నిసంస్కారమను” పేర నొకచిన్నవ్యాస

మును బ్రమరించెను. బ్రదికియున్న తమచుట్టములను బలవంతముగా నగ్నియందు మరణమునొందించుట దూష్యమని వ్రాసిన యాపరోపకారపారీణునిపైఁ గినుకవహించి ఆప్తబలవన్మరణములు సర్వశ్రేయోదాయకములని సూచించుటకై వెంటనే శత్రుపక్షమువారు "చంద్రిక" యనునొక పత్రికను బ్రచురించి, యందు రామమోహనరాయలను దూషింపసాఁగిరి. రామమోహనరాయలవారు, వారుతమ్మును దూషించినను, దాముమాత్రము వారినిదూషింపక, బలవత్తరములైన యుక్తులతో వారివాదములను ఖండించుచు, నీక్రూరచారము కూడదని స్థాపించిరి. శత్రుపక్షము వారుదీనికిఁ దృప్తివహింపక రామమోహనరాయలవారిని మఱియు నెక్కుడుగా దూషించుచు, స్వదేశీయులను నీక్రూరాచారమునుమాత్రము విడువవలదని హెచ్చరింపుచువచ్చిరి. ఈసమయమునందే రామమోహనరాయలువారు సహగమనమునుగూర్చి మఱియొక గ్రంథమునుగూడ వ్రాయుచు, నిదిశాస్త్రగర్హితమనియు, దాయముకొఱకుఁగా జనులుస్త్రీలను బ్రోత్సాహపఱిచి కొన్నిచోట్ల నీదురాచారములను జేయించుచున్నారనియుఁ బ్రబలనిదర్శనములను జూపిరి.

ఆకాలమునందు దేశపాలకులుగానున్న లార్డు వులియం బెంటింకుగారీ వాదప్రతివాదములను విని శ్రీరామమోహనరాయలవారిని తమసమ్ముఖమునకు రప్పించుకొని, వారితో బహువిధముల నీసహగమనమునుగూర్చి ముచ్చటించి, యది యశాస్త్రీయమనియుఁ గొన్నిచోట్ల బలవంతముగా జరుపఁబడుచున్నదనియుఁ దెలిసికొనిరి. తత్క్షణమే యీదురాచారము మాన్పుటకై యొకచట్టమును జేయవలయునని బెంటింకు ప్రభువుగారుద్దేశించిరిగాని సూక్ష్మదృష్టిచేఁ నిట్టివిషయమునఁ దొందరపడినయెడల దేశమునందల్లరులు సంభవించి ప్రజానష్టమును, రాజ్యమునకుఁ గలఁతయు వచ్చుననియెఱిఁగి, బెంటింకు ప్రభువుగారు దీర్ఘాలోచనము చేయమొదలుపెట్టిరి. రామమోహనరాయలవారు తమతోవిన్నవించిన మాటలన్నియు శిలాక్షరములవలెఁ దమహృదయమున నాఁటుకొనియుండుటచే నెట్లు హిందూస్త్రీలను బలవన్మరణములనుండి విడిపింతుమాయని యోచించి, తుట్టతుదకు దీనివిషయమై ప్రజలయభిప్రాయములను దెలిసికొనుటకు మొదలుపెట్టిరి. బెంటింకు ప్రభువుగారు తాము మదరాసు గవర్నరుగానున్నకాలములో సిపాయులయందుఁ గొన్నినూతనములగు చట్టములను దీసికొనివచ్చినప్పుడు వారువెంటనే తమయధికారులను నిర్లక్ష్యముచేసి ఐరోపియనులను జంపనారంభించినందున, నిప్పుడీ విషయమున నాయన నిదానింపవలసి వచ్చెను. హిందూమతాచార విషయములను జక్కఁగా గుర్తెఱిఁగిన వారందఱును నీవిషయమునఁ దమయభిప్రాయముల నీయవలసినదిగా బెంటింకు ప్రభువుగా రుత్తరువిచ్చిరి. నిజామత్ అదాలత్ (న్యాయసభ) లోని న్యాయాధికారులును నితరోద్యోగస్థులును నీదురాచారమును మాన్పవలసినదనియే తమయభిప్రాయమని నుడివిరి. కలకత్తా చట్టనిర్మాణ సభ సభికులందఱును దీనికామోదించిరి.

కాని యక్కడికిని బెంటింకు ప్రభువుగారికిఁ దగిన నిబ్బరము కలుగలేదు. "స్వవిషయమునుగూర్చి విచారించినయెడల నాపూర్వులవలెనే నేనును జల్లఁగా నూరకుండుట యుత్తమమని తోఁచుచున్నది. కాని హిందూసంఘమునందలి యీదురాచారములనుజూచి, నేను సహించి యూరకుండ మనసురాకున్నది. ఎట్లైనను నిర్భాగ్యలగు ననాథలను సంరక్షింపుమాయని నన్ను బహువిధముల నామనస్సాక్షి ప్రేరేపించుచున్నది. నిముషనిముషమునకును నిట్టినిర్భాగ్యలగు స్త్రీలసంఖ్య వృద్ధినందుచున్నది." అనిచింతించి చింతించి, ఎట్టకేలకు ధైర్యమవలంబించి, భగవంతునిపై భారమువేసి, ౧౮౨౯ వ సంవత్సరమున డిశంబరు నెలనాలుగవతేదీని నొక చట్టము నేర్పాటుచేసి, హూణరాజ్యమునం దీదురాచారమును నడుపువారలందఱును శిక్షార్హులని శాసించెను. తమతల్లులను బిడ్డలను జంపుకొనుట కాజ్ఞనీయకపోవుటకుఁ జింతించి, వంగదేశపు బ్రాహ్మణబృందము ప్రభుత్వమువారిపైఁ గోపించి, చట్టమును దీసివేయుఁడని యొకవిజ్ఞాపనము నంపుకొనిరి. సహగమన మత పవిత్రమైన యాచారమనియు, దానివలన జనులజన్మములు తరించుననియు, సహగమన మొకరు చేయుచుండఁ జూచినవారికే కోటియజ్ఞముల ఫలములభించుననియు, నట్టిసమయమున నింక వీనిని జేసినవారికెంత పుణ్యమో దొరతనము వారికే యెఱుకపడుననియు, నీచట్టము దొరతనమువారు హిందువులమతవిషయమున జోక్యముతీసికొనమని వెనుకచేసిన యొడంబడికకు వ్యతిరేకముగానున్నదనియు, ననఁబోలురీతిగా వారు విజ్ఞాపనము నంపినప్పుడు బెంటింకు ప్రభువుగారు ధర్మశూరులై నిలువఁబడి తాము ప్రస్తుతమున నేర్పఱిచిన చట్టమును దీసివేయువారముగామనియు, నీవిషయమున నేమైనఁ దాముచెప్పుకొనవలసినయెడల సీమ కప్పీలు చేసికొనవలసినదనియు నుత్తరమిచ్చిరి.

ఈ సంగతి దెలియఁగానే రాజా రామమోహనరాయలువారు తత్క్షణమే యింగ్లాండు దేశమున నీవిషయమునుగూర్చి ముచ్చటించుటకై స్వయముగా సముద్రయాననిషేధత్వమును బాటింపక వెడలిపోయిరి. పోయియక్కడి వారలకు మనసు కఱఁగునట్లీ విషయమును బోధించి, ప్రివీకౌన్సిలువారి యెదుట నీదురాచారమునుగూర్చి బహువిధముల విన్నవించి, న్యాయము తప్పక పడఁగల పాట్లెల్లనుబడి, తుట్టతుదకీ శాసనమును స్థాపింపఁజేసెను. రామమోహనరాయలుగారు దీనిఁగూర్చి ప్రయత్నములు చేయఁగా బెంటింకు ప్రభువారు శాసనమును విధించిరి. తరువాత మఱల రామమోహనరాయలువారే సీమకేఁగి తమ నిర్దేశమును స్థాపించికొనిరి. నాటినుండియు హిందూ

దేశమునందు సహగమనములులేక, పెక్కండ్రు స్త్రీలు సుఖముగా జీవింపఁగలిగిరి. దేశక్షేమమునకై విదేశమున కరిగిన యాపరోపకార పారీణుఁడుమాత్ర మాదేశముయొక్క శీతోష్ణ స్థితి తనకుఁ బడకపోవుటచే జబ్బుపడి యాదేశముననే ౨౭ సెప్టెంబరు ౧౮౩౩వ సంవత్సరమున హిందూదేశమునే మనస్సున నిడుకొని దానిక్షేమమునకై పరమేశ్వరునిఁ బ్రార్థింపుచు నీశ్వర సన్నిధానమున కరిగెను. ఆయన శరీరమును మిక్కిలి గౌరవముతో దాను చనిపోయిన బ్రిష్టలుపురప్రాంతములందుఁ బాతిపెట్టఁబడెను.

హిందూదురాచారములలో మొట్టమొదట సహగమన మొక్కటిమాన్పఁబడినను దానితో దేశములోని బలవన్మరణము లణఁగిపోలేదు. ఇంకను హిందూదేశమునందు శిశుహత్యలు మొదలగునవి బాహాటముగా జరుగుచునే యుండెను. వీనిని మాన్పుటకుఁ దగినవారెవ్వరును హిందూదేశమునందుఁగాని, పించరైరి. స్వదేశరాజులీ యాచారములను మాన్పఁబ్రయత్నింపక, ఇట్టి క్రూరకార్యముల నాచరించిన దురాత్ములను గామపాశములను ద్రెంచిన మహాత్ములనుగానెంచి యానందించుచుండిరి. ఆసమయమున హిందూరాజ్యములం దొకా నొకటి బయటికివచ్చి తానీదుష్కార్యముల నాపెదనని కంకణము గట్టుకొనెను.

రాజపుత్రస్థానమునందలి రాష్ట్రములలో నెల్లనుదయపురరాజ్యము మిగుల బలవంతమైనది. అదిమొట్టమొదట మిగులచిన్నరాష్ట్రముగనె యున్నను గాలక్రమమున నభివృద్ధిగాంచి తుట్టతుదకు రాజపుత్రస్థానములోని విశేషభాగమునకు సర్వాధికారి యయ్యెను. రాజపుత్రులం దనంతములగు శాఖాభేదములుకలవు. ఒకశాఖలోని కన్యలందఱును రెండవ శాఖలోనివారికి సోదరీప్రాయులుగా భావింపఁబడుటచే నొకశాఖలోని వారు మఱియొక శాఖలోని వారిని వివాహమాడక సంబంధములకై తలక్రిందగుట తటస్థించుచుండెను. స్త్రీలకు వివాహములు చేయునప్పుడగు వ్యయములును ఆచారము ప్రకారముగా మిక్కిలియెక్కుడై, సద్వంశములందు జన్మించియు చేదవశీన స్థితియందున్న రాజులకు మరణతుల్యములై యుండెను. ధనమును సద్వంశమును నున్నచోట తగిన యున్నత వంశసంజాతుఁడు దొరుకకుండుట కన్యకల తండ్రులకుఁ దలవంపులుగా నుండుచుండెను. ఇట్టి హేతువులచేఁ గన్యల నెదుగనిచ్చి వివాహ సమయమున నానాకష్టములఁ బడుటకన్న, బాల్యముననే కన్యల నంతము నొందించుట యుత్తమమైన యాచారముగా దోఁచినందున శిశుహత్యాదురాచారము లాదేశమునం దవిచ్ఛిన్నముగా బ్రబలనారంభించినవి. కారణము లిట్లున్నను నాచారము మాత్రము హిందూదేశమునం దుత్పన్నమైనదికాదు. దీనిజన్మస్థానము ఆసియాఖండ మధ్యభూమి. దీనినుండి జనులు నానాముఖములఁ జెదిరినప్పుడు వీరినిఁజూచియే ఫ్రాంసుదేశములోని ఫ్రిజియనులును, ఇటాలియా దేశములోని లంగోబార్డీలును, స్పెయిను దేశములోని విశిగాదులును నీయాచారము నవలంబించిరి. తమమర్యాగలను గాపాడుకొనుట కుపాయాంతర మేదియు లేని హేతువుచే హిందూదేశమునందలి రాజపుత్రులు వారినిఁజూచి యీదురాచారము నవలంబించిరనుట యుక్తియుక్తముగానే యుండును.

శిశుహత్యల నొనర్చుమని యే శాస్త్రముగాని, యేవేదముగాని యెక్కడను జెప్పియుండ నందున నది యొక యాధారముగా దీసికొని యీదురాచారమును దొలఁగింపవలెనని చిరకాలముక్రిందటనే యూరోపు దేశస్థులు కొందఱు ప్రయత్నించిరి, కాని, వారిప్రయత్నములన్నియు విఫలమగుచునే వచ్చెను. ఒక్కరాజపుత్రస్థానముననే కాక హిందూదేశమునందలి కొన్నికొన్ని యితర భాగములందుగూడ నీదురాచారము ప్రబలియుండెను.

శిశుహత్యాదురాచారము నాపుటకై పలువురు మహాత్ములు హిందూదేశమునందుఁ బనిచేసియున్నారు. ప్రస్తుతమున మనకుఁ దెలిసిన వారిలో బ్రథముఁ డగ్బరు చక్రవర్తియే. అగ్బరునకుఁ దరువాతఁ బదునెనిమిదవశతాబ్దమునందు రాజపుత్రస్థానములోని అంబరు రాష్ట్రమునకుఁ బ్రభువైన జయసింగను నాయన దీనివిషయమై అక్బరు చక్రవర్తికంటెఁ బ్రబలమైన పనిచేసెను. ఆతఁడు శిశుహత్యలకు ముఖ్యకారణము బాలికల తండ్రులు వివాహములం దధికవ్యయములను జేయఁజాలకపోవుట యని గ్రహించి, యాకష్టమునుండి వారలను దప్పించుటకై పనిచేసి, తనసామంతరాజులలో నొక్కరుగాని, తమసాలువచ్చుబడికి మించిన ధనమును వివాహకార్యములకు వెచ్చింపరాదని శాసనముచేసెను. ఆసమయమున నాతని సామంతరాజులలో నొకఁడగు సాలూంబ్రాదేశాధికారియింట వివాహము తటస్థించెను. వివాహమునందు విచ్చలవిడి సొమ్మును వెచ్చపెట్టి తనపూర్వుల గౌరవమును గాపాడవలెనను దురూహతో జనసామాన్యమువలె గర్వభూయిష్ఠుఁడై యాతఁడు తనరాజగు జయసింగైనను వెచ్చింపఁజాలనంతటి గొప్పమొత్తము నీవివాహమునందుఁ గర్చుపెట్టి, జయసింగు శాసనమును మూలమట్టుగఁ గొట్టివైచెను. దానితో జయసింగు ప్రయత్నములన్నియు వ్యర్థమయ్యెను. జయసింగు వెచ్చింపరాదని చేసిన శాసనము మంచిదేయైనను, నట్లువెచ్చించినవారిని శిక్షించుటకు శాసనములేకపోవుటచే నది విఫలమైనది. ఈశాసనమునకువారు బద్ధులైయుండునట్లును, దానిని మీఱినయెడల శిక్షార్హులగునట్లును, దనసామంతుల వద్దినుండి ప్రామిసరీ పత్రములను దీసికొని కార్యము నడపినయెడల నిది విఫలము కాకుండవచ్చును, కాని, జయసింగట్లు చేయఁడయ్యెను.

తరువాతఁ గొంతకాలమునకు డంకనను నొకమహానుభావుఁడీ విషయమై ౧౮౭౦ మొ

దలుకొని ౧౭౯౮ వరకును హూణహిందూ మండలమును బాలించిన సర్ జాన్ షోరను నాంగ్లేయ ప్రభువుతో ముచ్చటించినపుడు సర్ జార్ షోరు దీనిని జక్కగా విమర్శించి ఈక్రింది విధముగా దనయభిప్రాయమును వెల్లడించెను:—“మానవజాతికి సహజగుణములైన ప్రేమాదులను సహితము పోనడిచి, వానికి వ్యతిరేకముగా వారిచేఁ దమకన్న బిడ్డలను జంపించునంతటి క్రూరకార్యమును జేయించుచున్న యీదురాచారము శిక్ష విధించినంతమాత్రమున తొలఁగిపోవునని నాకుఁ దోఁచకున్నది. హిందువులచే మిగుల గౌరవింపఁబడుచున్న వేదశాస్త్రములు విధింపని యీదురాచారమును శాస్త్రగర్హితమని చెప్పి యాపుటయే సర్వోత్కృష్టముగా నాకుఁదోఁచుచున్నది.”

ఎందఱెన్నెన్ని విధములఁ బ్రయత్నించినను హిందూ దేశమునందలి సహగమన విషవృక్షము రూపుమాపి, యనాథకాంతల యుల్లములఁ జల్లఁబఱిచి, వారలకురక్షకుఁడైన లార్డు వులియం బెంటింకు ప్రభువుకాలము వరకును హిందూదేశమునందు శిశుహత్యలుపోలేదు. ఆతని కాలమునందు ఉదయపురరాష్ట్రాధిపతి తనరాజ్యమునందు బలవన్మరణములు జరుగఁగూడదని శాసించి, విరోధులను నిరుత్తరులనుజేసి, తనదేశములో నీదురాచారములను దొలఁగించివైచి, బెంటింకు ప్రభువునకుఁ దానుచేసిన చట్టములను దెలియఁబఱిచెను. బెంటింకు ప్రభు వావర్తమానము నందికొని, ఉదయపురమురాజును బహువిధముల శ్లాఘించుచు నాతనికిఁ బ్రత్యుత్తరమంపెను. ఈవిధముగా రాజపుత్రస్థానమునందీదురాచారముతొలఁగిపోయినది.

తరువాత లార్డుహార్డింజి (౧౮౪౪-౧౮౪౭) కాలమువరకును హిందూదేశమునం దీవిషయమున విశేషముగాఁ బనిజరుపఁబడలేదు. హార్డింజి ప్రభువు హిందూరాజ్యపరిపాలకత్వము వహించునాటికి దేశము శిశుహత్యలతో నిండియుండెను. పరలోకమునందుఁ దమకు సౌఖ్యమువచ్చునను నూహతో స్వలాభాపేక్షులై సహజమైన శిశుప్రేమనుగూడ నరిషడ్వర్గమువలెనే దూరమునకుఁ ద్రోసివైచి, మోక్షకాములైన, రూపమువహించిన పాపదేవతలగు తల్లిదండ్రు లింతటి కార్యమునొనరించినప్పుడు హార్డింజి ప్రభువు కడుపు చెఱువయ్యెను. వెంటనేయాయన దీనికిఁ గారణముల నరసినప్పుడు శక్తిపూజలు మొదలగునవి వీనినిఁ బ్రోత్సాహపఱుచుచున్నట్లు కూడఁదెలియ వచ్చినది. అంతట హార్డింజి ప్రభువుగారు, హూణమండలములందుఁగాని, హూణులకు లోఁబడియున్న స్వదేశ రాష్ట్రములందుఁగాని యీదురాచారము జరిపిన వారిని శిక్షార్హులనుగా జేయుచు నొకచట్టమును విధించెను. దానికిని యథాప్రకారముగా హిందువులవద్దనుండి ఈచట్టమును దీసివేయవలసినదని విజ్ఞాపనములు వచ్చియుండును. కాని అవినెగ్గలేదనుటకు మనకా శాసనమే పరమప్రమాణము.

కాని ఈచట్టములవలన హిందూదేశమునందలి యన్నిభాగములలోను నీదురాచారమణఁగలేదు. చెన్నపురి రాజధానిలోని గంజాము జిల్లాను ఒరిస్సాదేశమునందును నిది బలముగా నాటఁబడి యుండెను. దీనినిఁజూపుటకై పగడాల చినతంబి సెట్టిగారి భూగోళశాస్త్రము (౧౮౬౧) నుండి ఈక్రింది సంగతుల నుదాహరించుచున్నాము.

“ఈ జిల్లా (గంజాము) పశ్చిమోత్తరముల పట్టున కోదులను పర్వతవాసులు గలరు. వీండ్రలో నరబలియను మిక్కిలి క్రూరమైన దురాచారమొకటి కలదు. ఈదుష్టులు పల్లపు దేశములకు వచ్చి చిన్నపిల్లలను వెలకుకొనియైనను, దొంగిలించియైనను స్వదేశమునకుఁ గొనిపోయి యమ్ముదురు. బలినిమిత్తము తేఁబడిన పిల్లలు మర్యులనఁబడుదురు. ప్రతిగ్రామమునందును మర్యవనమను నొకతోఁపు కలదు. గ్రామస్థులా సమయమందు మూఁడుదినములు పండుగు చేయుదురు. మొదటినాఁడు సారాయి త్రాఁగుట మొదలైన చెడ్డపనులు చేయుదురు. రెండవనాఁడు మర్యునికి స్నానము చేయించి అలంకరించి తప్పెటలు మ్రోయఁగా బూరుగలూఁదఁగా తోఁపునకుఁ గొనిపోయి మధ్యనుండు స్తంభమునకుఁగట్టి దినమంతయు అట్టేఉంతురు. వానిమీఁద నూనె నేయిపోసి పసుపునల్చి వానిని పూజించిమూఁడవనాఁడు వానిని చంపు తావునకు కొనిపోవుదురు. మర్యుడు అక్కడికిఁ బోనని తిరుగఁ బడునేని బలి అక్కఱకు రాదని వారుతలంతురు; కాఁబట్టి, మొదటనే వాని కాలుసేతుల యెముకలను విఱిచి, కొంచెము చీల్చిన కొమ్మలోవాని మెడను ఇఱికించి, చీలిన చివరలను బిగియఁ గట్టి వానిని మీఁది కెత్తురురు; అప్పుడు గురువు గొడ్డంటితో వాని మెడ నఱుకును. తక్షణమే తక్కినవారు వానిని నిర్మాంసముగా చీఱుదురు. ఇట్లుచేయుటచే తమదేవతలు తృప్తిపొందుదురనియు, పొలములు ఫలించుననియు తలంతురు. ఈదురాచారమును బ్రిటిషు ప్రభుత్వమువారు చాలమట్టుకు మాన్పిరి.”

కోదులయం దీదురాచారము చట్టమువలనఁ బోలేదని వెనుకనే వ్రాసియున్నాము. ఇది తెలిసి హార్డింజి ప్రభువుగారు ఆకాలమునందు ఒరిస్సాలో రాజకీయోద్యోగమునందున్న మెక్ఫరుసన్ దొరవారిపేర గంజాము జిల్లాయందును, ఒరిస్సాయందును నీచట్టము ప్రవర్తింపఁజేసి యీదురాచారమును మాన్పవలసినదని యొక లేఖనంపిరి. దానివలన నీదురాచారము కోదులయందుఁగూడఁ జాలవరకడుగంటెను. ఇంకను మిగిలిన శేషము నణపుటకై ౧౮౭౦ వ సంవత్సరము నందప్పటివైసిరాయి (Viceroy) గారైన మేయోప్రభువుగారు శిశుహత్యలను మూలమట్టుగ నశింపఁజేయుటకై ౧౮౭౦ వ సంవత్సరపు ఎనిమిదవ చట్టమును జేసిరి.

దానితో హిందూదేశమునందు శిశుహత్యలు చాలవఱకు నివారణమయినవి. ౧౮౭౧ సంవత్సర ప్రాంతములవరకును నంపంది దురాచారమున్నట్లు మనకు నిదర్శనములున్నను నవియే హిందూదేశమునందలి శిశుహత్యలలోఁగడపటివి.

జోహారు సిదుల్కు, వీనినిఁగూర్చి రెండుమాటలు చెప్పవలసియున్నది. రాజపుత్రస్థానము బ్రిటీషు దొరతనమువారి చల్లని సంరక్షణమునకు లోఁబడఁగానే ఒడంబడిక పత్రికలందు రాజపుత్ర రాష్ట్రములు పరరాష్ట్రములపైఁ దాఁడి వెడలరాదనియు, నితరులు దండెత్తి వచ్చినయెడల బ్రిటీషు దొరతనమువారు వ్యాయమునుబట్టి రాజపుత్ర సైన్యమునకు తోడై అట్టిశత్రువులను ద్రోలివైచెదమనియు గొన్నిచోట్ల వ్రాఁతమూలములు చేయించినందున జోహారు దురాచారమున కంపవకాశములేక పోయెను. దొరతనము వారాత్మహత్యాపరహత్యాదుల విషయమున జట్టములు చేసినతోడనే హిందూదేశమునందలి బలవన్మరణములు పూర్ణముగా నశించినవి. ఇంతటితో హిందూదేశమున జనులు తమంతట తామే బలవంతముగా హత్యలను జేసికొను దురాచారము లడుగంటినవి. ఇఁకమీఁద జనులందఱును బ్రాణభీతిలేక బ్రదుకఁగలిగియున్నను వారు సుఖముగా జీవించుటకు వలయు సంస్కారములను జేసికొని, హిందూసంఘమును మంచిస్థితికిఁ దీసికొని రావలసియున్నది. హిందూజనులను గ్రూరముగా జంపివేసెడి దురాచారములుపోయినవి. జనులొక్కసారిగా నీచల్లని ప్రభుత్వమున ప్రాణభయములను వీడి, మృగప్రాయమును దాఁటి మఱల మనుష్యులైరి. గాఢముగా నజ్ఞాన మేఘములు క్రాఱు క్రమ్మి చిరకాలము తమఘోరాంధకారమువలన సుజ్ఞానసూర్యరశ్మినిఁ జొరనీయక, ప్రళయాభీలమై లోకము నల్లకల్లోలముచేసి, హూణప్రభుత్వమను మహావాతము వలన తొలఁగిపోయినప్పుడు, హూణభాషయను బాలసూర్యోదయమూలమున మనవారు భయంకరమైనరాత్రి తెల్లవాఱినదని లేచి, తుపానువలన శిథిలములైన సంసారములను బాగు చేసికొనవలసియున్నది. ఇఁకముందు ప్రకరణములందా విషయమును గూర్చి వ్రాయుచున్నాము.

మూఁడవప్రకరణము.

స్త్రీ పు న ర్వి వా హ ము లు.

హిందూసంఘమునందలి యాత్మహత్యావిషయికములగు దురాచారములడఁగిపోఁగానే యంతకు మించిన యితరదురాచారములీ సంఘమునందుఁ బెల్లుగా నున్నవని జనులు తెలిసికొనఁజాలిరి. అట్టిదురాచారములలో మొట్టమొదటిది వితంతుపునరుద్వాహవిషయికమయినది. వేదముల కాలమునాటికీ దురాచారము హిందువులలో లేదనుటకు ఈగ్రంథములో మొదటి ప్రకరణమే దృష్టాంతము. తరువాతఁగూడఁ బాలకాలము వరకు హిందువులలో వితంతూద్వాహములు నిషేధింపఁబడలేదు. స్వాయంభువమనువు కాలమువరకును మనవారిలో వితంతూద్వాహములు బాహాటముగా జరుగుచునే యుండెను. మనువుమాత్రమందుల కంగీకరింపక, క్షతస్త్రీపునర్వివాహములను నిషేధించెను. (౧-౧౫౬, ౧౬౨.) కాని వితంతూద్వాహకులను, వారిసంతతి వారినిఁ గూర్చిన వితంతూద్వాహసద్ధర్మాంగీకార సూచకములగు ధర్మవచనము లీస్మృతియందుఁ బెక్కులు గలవు. మను వక్షతస్త్రీపునర్వివాహములను విధించినను, నాతని తరువాత మఱికొంతకాలమున కాదిత్య పురాణకారుఁడు శ్రుతిస్మృతుల ప్రమాణములనుగూడ లక్ష్యము చేయక, వానిబలీయ ప్రమాణముల యెదుటఁ గ్రుడ్డి కాసునకుఁ గొఱగాని తనగ్రంథమునందు మూఁడు నిషేధవాక్యములను జొప్పించెను. మహాభారతయుద్ధమునందుఁ బదునెనిమిదిఅక్షౌహిణుల (=విస్తారమగు) సైన్యము నశించినందున, నంతమంది భార్యలకుఁ బునరుద్వాహమగునేని లోకములో వరులు దొరకుట అసంభవమగుటచే మన్వాదులు దీనిని నప్పటికి అక్షతలకు మాత్రమే విధించుట న్యాయముగానే తోఁచుచున్నది. కాని మనవారు గ్రుడ్డియెద్దు జొన్నబడినట్లు పడ్డత్రోవను దాఁటఁజాలక, క్రమముగా నాయక్షతలకుఁగూడ దీనినిఁ దొలఁగించుటయేకాక, మీఁదుమిక్కిలి స్వకార్య ధురంధరత్వము వహించి, తమపిల్లలను బనికిమాలినవారికమ్మి మూడ వర్తకము సాగించుచు, స్తన్యము విడువని బాలికలనుగూడఁ బల్లకినెక్కించి, బొమ్మల పెండ్లిండ్లు చేయ మొదలుపెట్టిరి. ఈవిధముగాఁ గొంతకాలము జరిగిన వెనుక సహగమనాదులు బయలువెడలుటచే, నాఘోరకృత్యమునం దీదురాచారములు బయలుపడక యడఁగి యుండెను.

మనుష్యుల ప్రాణములను దీసికొనునంతటి మత పిశాచావేశమునుండి తొలఁగినతోడనే హిందూసంఘము శిథిలమై, జీర్ణదశయం దున్నదని మనవారికిఁ బోడఁగట్టినది. అందు వితంతుపరితాపాపనోదులగు కొందఱు మహాత్ములెట్లైన నీదురాచారముల నాపవలెనని విశ్వప్రయత్నములు చేయ నారంభించిరి. ఈయారంభము సహగమనములు జరుగుచున్న కాలమునందే చేయఁబడినను, నప్పటిసంఘ స్థితి మఱియుఁ బాడుగానుండుటచే నా ప్రయత్నములు విఫలములయ్యెను. క్రీ|| శ|| ౧౫౦౦ కాలమునం దుదయపురమును బాలించుచున్న జస్వంత సింగునాయన మనకుఁదెలిసిన వారిలో మొట్టమొదట నీపనికిఁ బూనినవారు. కాని యాయనప్రయత్నములు విఫలములే యయ్యెను. హిందూదేశమునందఖండ విఖ్యాతిగాంచిన పండితాగ్రణియగు నప్పయ్య దీక్షితులవారు తమ వితంతుపుత్రికకుఁ బునరుద్వాహము చేయఁదలపెట్టియు, లోకమునకు వెఱచి, తమ సత్ప్రయత్నమును

విడిచి పెట్టిరి. ఆయన తరువాత సవాయి జయసింగను మఱియొక రాజపుత్ర ప్రభువు తనరాష్ట్రములో నీవివాహములను జరుపవలెనని నిశ్చయించి, పారివోని యుత్సాహముతోఁ బనిసేయసాఁగెను. అదిచూచి రాష్ట్రములోని కొందఱు జనులీ సదాచార మెక్కడవచ్చి తమ్ముజుట్టుకొనునో, యని భయపడి, తిన్నఁగా రాజమాతను దర్శించి ఆమెతో, "జననీ! హిందూ ధర్మమును సంరక్షించి మమ్ముకాపాడుము"ని యామెపాదములపైఁబడి "మీకుమారుఁడు వితంతూద్వాహములను జేయఁదలపెట్టినాఁడు. ధర్మదేవతలగు మీరుబ్రదికియుండఁగనే, మనదేశమున కిట్టిదుర్దశ పట్టఁబోవుచున్నది. అనాదినుండియు నత్యంత పవిత్రముగా నెగడిన యీపుణ్యభూమియందుఁ దమయెదుటనే కుల భ్రష్టత్వముఁజేసి, మమ్ములను, మీగర్భవాసమునఁ బుట్టటచేఁ మిమ్ములను, నపకీర్తిపాలుచేసి, తుదకు నరకబాధల రుచిచూపు మీకుమారుని ప్రయత్నముల నణఁచివైచి, మనభూమిని మఱల నుద్ధరించుటకు మీరుతప్ప మాకువేఱుగతి లేద"ని మొఱలిడిరి. వారికభయహస్తమిచ్చి వెంటనే యఱువదేండ్లకు మించిన వయసుగల యాకన్యకామణి(?) తనకుమారుని కొలువుకూటమునకుఁ బోయి తానువితంతు వగుటచేఁ దనకు మొట్టమొదట పునరుద్వాహముచేసి యుద్ధరింపుమని వేడుకొనెను. తన తల్లితన్నట్లు కోరుటచే నేమియుఁ దోఁచక, ఖిన్నుఁడై సిగ్గుపడిపోయి, తన్నుమన్నింపుమని తన తల్లిని వేడుకొని సవాయి జయసింగు తనప్రయత్నములను విడిచిపెట్టెను. ఇంచుమించు నాలుగువందలయేండ్లక్రిందట వంగదేశమునఁ బండితాగ్రణియగు శ్రీస్మార్త భట్టాచార్య రఘునందనుల వారొక గ్రంథమును రచించి, వితంతూద్వాహము శాస్త్రసమ్మతమని ప్రమాణములనుజూపి, తమ వితంతు బాలికకుఁ బునః పరిణయముచేయఁ బూనిరి; కాని, యదియు వ్యర్థమే యయ్యెను. తరువాత మఱికొంతకాలమునకు రాజ వల్లభుఁడను నొక ధర్మశీలుఁడు, బలీయములగు ప్రయత్నముల ననేకములను జేసి పండిత మండలము నొప్పించెనుగాని, వివాహములు మాత్రము జరుప లేకుండెను. ఇంచుమించు నూఱేండ్ల క్రిందట పూనాపట్టణమునఁ బేష్వావద్ద సైన్యాధిపత్యము వహించియున్నత పదవియందున్న సరదారు పరాశరము బాపు పట్టవర్ధనుల వారీవిషయమునఁ బ్రయత్నముచేసి సంస్కృతవిద్యయందసామాన్య ప్రతిభవహించిన కాశీపట్టణము పండితుల వలన వితంతూద్వాహములు శాస్త్రసమ్మతములని యొప్పించెను. ఈధర్మశీలుఁడు వితంతువగు తనకుమార్తె దుఃఖశతములను దొలగింపవలెనని, యిన్నిప్రయత్నములనుజేసి, వివాహము నిశ్చయింపఁ బోవుసమయమునకుఁ దనకుమార్తె నామె గతికప్పగించి యకాలమరణము నందుటచే, నాప్రయత్నమును గొనసాఁగలేదు. ఈసారి పూనా కాశీపట్టణముల పండిత బృందమేకాక, శంకరాచార్యులవారుగూడ దీనికి సమ్మతించియుండుటచే నాయన మరణముబహు విచారకరమైనది. ఆయన చనిపోయిన తరువాత సహగమన విషవృక్షము యూపునూపిన శ్రీ

రాజా రామమోహనరాయలవారు మఱికొన్ని ప్రయత్నములను జేసినట్లు తెలియవచ్చుచున్నది.

రామమోహనరాయలు మృతినొందిన వెనుక ౧౮౩౭ వ సంవత్సరమున బొంబాయి పురియందొక యాంధ్రబ్రాహ్మణుఁడును పరశురామ క్షేత్రస్థుఁడగు నొకనావ బ్రాహ్మణుఁడునుజేరి, స్త్రీపునర్వివాహ మవశ్యకర్తృకమని, పెక్కులు ప్రమాణముల నుదాహరింపుచు నొక గ్రంథమును బ్రచురించిరి. ఆగ్రంథమెల్లెడలను వ్యాపించుచుండుటచే నొకధర్మ శాస్త్రిపండితుఁడు దానికొక ఖండనమును వ్రాసి, బొంబాయిలోని దర్పణమను నచ్చుకూటమున ముద్రింపించి, ప్రచురపఱిచెను. "దానిపైపరశురామ క్షేత్రస్థుఁడు కఠినవాద దూషణలను వ్రాసెను. ఈరెంటిని ఆయాంధ్ర బ్రాహ్మణుఁడుచూచి, క్రూరముగా వ్రాయుటకు నేకారణములేదని, యాయిద్దఱు బ్రాహ్మణులకు సమాధానముచెప్పి, యుక్తిప్రత్యుక్తులవలలనఁ దనమతమునే స్థాపించెను. ఇదియంతయు దర్పణమను ముద్రాశాలయం దచ్చువేయఁబడి యున్నది. వానినన్నిటి నొకమధ్యస్థుఁడుచూచి, సాధక బాధక యుక్తివిచార పూర్వకముగా నొక గ్రంథమువ్రాసి, ఋతువుగాని స్త్రీలకు పునర్వివాహము చేయవలయుననెడి, యాంధ్రబ్రాహ్మణుని మతముస్థాపించెను." *

౧౮౪౧ సంవత్సరము మార్చినెలయందు నాగపురమున మఱియొకరు స్త్రీపునర్వివాహ మవశ్యకమని యొకగ్రంథమును వ్రాసిరి. అదిమైసూరులోని శిరస్తదారుగారగు కృష్ణమ నాయకులను నొకరు ౧౮౫౦ ప్రాంతములందుఁ గన్నడ భాషలోనికి మార్చిరి. దానికి ౧౮౬౮వ సంవత్సరమున తెలుఁగు వ్రాయఁబడెను.

ఈవిధముగా చిరకాలము పునర్వివాహములనుగూర్చిన వివిధప్రయత్నములు జరిగినను నవి యాచరణమునకు రావయ్యెను. క్రీ॥ శ॥ ౧౮౨౦ వ సంవత్సరమున శ్రీపండిత ఈశ్వర చంద్రవిద్యా సాగరులవా రుదయమునందిరి. తాను గౌరవ నీయమగు నొకబీద వంశమునం దుద్భవించినను, తన తెలివితేటలవలన నచిర కాలముననే సంస్కృత భాషయం దసామాన్యపాండిత్యమును వహించి, జడ్జిపండిత పరీక్షలో నత్యల్ప కాలములో విజయమునొంది, విద్యాసాగరుఁడను బిరుదువహించి, ఈశ్వర చంద్రులవారు ౧౮౪౧ సంవత్సరమున ఏఁబదిరూపాయల మాసవేతనమున నుద్యోగములో బ్రవేశించెను. ౧౮౫౮వ సంవత్సరమున విద్యాసాగరులవా రుద్యోగము మానివేయునాటి కాయనకు నెలకైదువందల రూపాయల మొత్తము వేతనము ముట్టుచుండెను. స్వచ్ఛంద విహారలో

* (తత్వబోధిని ౧౮౬౮ కాండవసంపుటము పుట ౧౮౯.)

లత్వముచే, నొకకారణమువలనఁ దనయుద్యోగమునువదలి, విద్యాసాగరుఁడు హిందూదేశరక్షణార్థము పనిచేయ నారంభించెను. స్త్రీవిద్యనుగూర్చి విద్యాసాగరుఁడు పడినపాట్లు మఱియొక ప్రకరణమునందు వివరింపఁబడును.

ఇట్లు ధనమునకు లెక్కసేయక తనయుద్యోగమును వదలుకొనుటకు, పూర్వమొకదేశోపకారకమగు కార్యము తటస్థించినది. విద్యాసాగరుని తల్లియగు శ్రీభగవతీదేవిని దర్శించుటకై యొక నాఁడొక బాలవితంతు వామెసన్నిధికి వచ్చియుండెను. ఏఘోరకారణముచేతనో, ఆబాలిక నూత్నయౌవనాంగియయ్యు, కాలవశమున వితంతు వనఁబడుచు, భగవంతునివలన సంపూర్ణ సల్లక్షణగా సృజింపఁబడియు నామెతల్లిదండ్రులవలన నిరర్థక జీవనయై దరిలేని వైధవ్య మహాదుఃఖము ననుభవింపుచుండెను. ఇంతటిలేఁబ్రాయముననే యామెను జుట్టుకొన్న యన్యాయవైధవ్య మహాదుఃఖమునుగూర్చి యాముగ్ధనోటినుండియే విని, భగవతీదేవి పట్టఁజాలని దుఃఖముతోఁ దనకుమారుని వద్దికిఁ బాఱివచ్చి, యక్కడనున్న తనభర్తయగు ట్యాకూరు దాసు బానర్జీనిఁ జూచియైనను సంకోచింపక, మనోవేద నాబలముతో “కుమారా! నీవు సమస్తశాస్త్రములను జదివితివి. ఆపన్నలైన బాలవితంతువులను సంరక్షించు మహావాక్యమొక్కటైనను, నీకంటఁబడలేదా!” అని యడిగెను. ఆమాటలను విన్నతోడనే విద్యాసాగరుఁడెట్లైన ననాథయువతులబెదరుడిపిరక్షింపనెంచి, తిరిగి శాస్త్రములను జదువ నారంభించెను, బాలవితంతువులపాలిటి కల్పసాలమువలె, నీకలియుగమునకుఁ బరమప్రమాణమగు పరాశరస్మృతియందే యాతనికీ క్రిందివాక్యము పొడఁగట్టెను:—

“నష్టేమృతే ప్రవ్రజితే క్లబేచపతితేపతౌ।
పరిచస్వాపత్సు నారీణాం పతిరన్యోవిధీయతే॥

పతినష్టుఁడైనను, మృతినందినను, సన్యసించినను, నున్మత్తుఁడైనను, కులభ్రష్టుఁడైనను, నీయైదు ఆపదలయందును స్త్రీలకన్యపతి విధింపఁబడుచున్నాఁడు.”

ఈవాక్యమునుజూడఁగానే విద్యాసాగరుఁడు మితిమీఱిన యుత్సాహముతో నింకను బ్రమాణములకై శాస్త్రశోధనము నారంభించెను ఇప్పటి యాచారమునకు భిన్నముగా, స్మృతులందును, వేదములందునుగూడ, స్త్రీపునర్వివాహావశ్యకతను సూచించుఁ బ్రమాణవాక్యముల కుప్పలుగా గానిపింప నారంభించెను. అంతట నెట్లైన ననాథయువతులను దరిచేర్చుటకై మితిమీఱిన యుత్సాహముతో ౧౮౫౫వ సంవత్సరమున, “విధవా వివాహము”ను పేరనొక గ్రంథమును రచించి యీకార్యమునకై బలవత్తరములగు ప్రమాణములను జూపెను. ఇదివరకుఁ జనములో

లేని యొక యాచారమును విద్యాసాగరుఁడు బ్రతిష్ఠింపఁ జూచుచున్నాఁడన్నవదంతి బయలుదేరినతోడనే వంగదేశమెల్ల కల్లోల మయ్యెను. ఈచిత్రమును జూడవలెనని పామరులును, నింపలి సత్యమును బరీక్షింపవలెనని పండితులును ముద్రాయంత్రమునుండి బయలువెడలిన యొకవారము దినములలోనే యాగ్రంథము నెగనెత్తికొని పోయిరి. రెండవ కూర్పున మూఁడువేలప్రతులు తీయఁబడినను నవియు నత్యల్పకాలములోనే వ్యయపఱుపఁబడెను.

గ్రంథము దశదిశలను బ్రకటనమగుటతోఁ బనిముగియలేదు. మూలమూలలనుండి జనులు బయలుదేరి యీ విడ్డూరములకు మొగములు త్రిప్పకొనసాగిరి. ఖండన గ్రంథములు విచ్చలవిడి పెచ్చరేగెను. పత్రికలన్నియు నీయంశమునే ప్రచురింపుచుండెను. జనులాహార నిద్రాదులనుమాని ఈసంగతులనే యజస్రము దలపోయుచుండిరి. ఇదివరకు విద్యాసాగరుని మొగముముందర నిదియవశ్యాచరణీయమని శ్లాఘించిన పండితోత్తములే యిప్పుడిది శాస్త్రవిరుద్ధమని దూషింపసాగిరి. కొంతకాలమువరకు విద్యాసాగరుఁడు తనయొడిని తెఱచి, దిక్కుదిక్కులనుండియుఁ దనపైఁ బడుచున్న దూషణవాక్యములను భరింపవలసివచ్చెను. శాస్త్రవిరుద్ధమనియు, నన్యాయమనియు, హిందువుల కనర్థమనియు, నెల్లఱును దన్నుదూషించినను, కులభ్రష్టుఁడని తన్నవమానించినను, వితంతూద్వాహముల వలన నష్టములు వచ్చునని కుయుక్తులను బన్ని, సామమువలనఁ దన్నువంపఁ జూచినను, నెందఱెన్నెన్ని ప్రయత్నములను జేసినను విద్యాసాగరుఁడు మాత్రము పట్టువిడువక “నా కంఠమునందుఁ బ్రాణమున్నంత సేపును సత్యమైన యీసదాచారమును నేను విడువన”ని ప్రతిజ్ఞచేసి ధర్మశూరుఁడై, శాస్త్రశూలమునొక కేలను, యుక్తిఖడ్గము నొకకేలను ధరించి, మహాయోధునివలెఁ బ్రతిఘటించి నిలువఁబడెను. తమ కుయుక్తులును, బన్నుగడలును గొనసాఁగవని తోఁచినతోడనే శత్రుపక్షమువారొక్కరొక్కరే వెనుకకుఁ దిగఁజాఱిరి. అంతట పండితవిద్యాసాగరుఁడు బాలవితంతువుల సంతానమునకుఁ బిత్రార్జితాదులు వచ్చునట్లొకశాసనములేకుండుట అనర్థమని యెఱిఁగి బ్రిటీషు దొరతనము వారిచే నొకచట్టమును జేయింపఁబ్రయత్నించెను. విద్యాసాగరుఁడొకప్పుడు “మనదేశీయులు శాస్త్రముచేఁగట్టుబడియున్నారని ప్రమాణములను జూపినను, నాచార పిశాచావేశముచేవారు వానినంగీకరింపకున్నారు. ఇఁకనేమి సేయుదున”ని యుత్సాహభంగముతో నుండఁగా నాతని తల్లిదండ్రులు చిన్నికుమారా! నీవలంబించిన ఈసన్నుత మార్గము నెన్నఁడును విడువక పూనిన కార్యమును గొనసాగించుకొమ్ము. మేమెల్లప్పుడును నీకుఁ దోడైయున్నాము. కన్నవారమగు మేము నిన్నువిడిచిపెట్టినను నీవు మాత్రము నీకార్యమును విడువకుమా.” అనిబోధించి, పోయిన యుత్సాహమును మరల నాతనికి నూల్కొల్పిరి.

విద్యాసాగరుఁడు స్త్రీపునర్వివాహముల వలన దంపతులకు నష్టము రాకుండున ట్లు పైనుదహరించిన విధమున నొకచట్టమును జేయింపనెంచి మఱల జనించిన యుత్సాహముతోఁ బనిసేయసాగెను. స్త్రీపునర్వివాహములన్నమాట మొట్టమొదట కర్ణకఠోరమని చెవులు మూసికొన్నవారే కొందఱు కొలఁది కాలములో దాని యావశ్యకత కనిపెట్టిరి. పురుషునివలెనే బరమేశ్వరుని వలన నాయాయి విహిత ధర్మములతో సృజింపఁబడిన స్త్రీ తన తల్లిదండ్రుల తెలివితక్కువ వలననో మఱియొందుచేతనో, అన్యాయముగా, దనజోక్యములేనిదే వివాహము చేయఁబడి, తుదకు వైధవ్యదశ ననుభవింపవలసివచ్చినప్పుడు మాత్రము, జోక్యముకలుగఁబడుట న్యాయ విరుద్ధమని జనసామాన్యము తెలిసికొనిరి. వెంటనే వారందఱును విద్యాసాగరుని బ్రోత్సాహ పెట్టుటచే, నాతఁడు పెక్కువేలమంది జనసామాన్యముచేతను, పలువురు జమీదార్లచేతను, రాజులచేతను, మహారాజులచేతను సంతకముచేయించి, స్త్రీపునర్వివాహములను న్యాయసిద్ధముగాఁజేయుఁడని, దొరతనమువారి కొక విజ్ఞాపనము నంపెను. ఈ వివాహములు న్యాయసిద్ధములనియు, నీవివాహితుల సంతతికి, సామాన్య వివాహితుల సంతతివారికిఁగల సర్వస్వాతంత్ర్యములును గలవనియు, ౧౮౫౬ వ సంవత్సరపు ౧౫ వ చట్టమును దొరతనము వారేర్పఱిచి విద్యాసాగరుని విజ్ఞాపనమును సప్రయోజకముగాఁజేసిరి.

అంతట విద్యాసాగరులవారు త్రోవకడ్డముగానున్న కష్టములు దొలఁగినందున వితంతూద్వాహములను దనచేతిమీఁదుగా నెప్పుడు చేయుదునాయని యాత్రముతో నుండెను. ఆసమయమున కలిమతీదేవియను నొకబాలవితంతువుతల్లిదండ్రులామె వివాహమున కంగీకరించిరి. విద్యారత్నమని ప్రసిద్ధిజెందిన పండిత శ్రీశచంద్రుల వారా బాలికను విశేష వైభవముతోఁ దన్ను మెచ్చిచూచు మహోన్నత పదస్థులగు హిందూజనుల సమ్ముఖమున ౧౮౫౩ వ సంవత్సరమునఁ దీయనాథబాలికను నగ్నిసాక్షిగా బరిణయమై తనకీర్తిని నలుదెసల వెలయించెను. పునర్వివాహకాలము నాటికిఁ బాపమీ కలిమతీదేవికిఁ బదియేండ్లవయస్సు. ఈవివాహమైన మఱుసటిదినముననే ఆశ్వయుజ బహుళ దశమి నాఁడు పండ్రెండేండ్ల వయస్సుగల యొకకాయస్థ బ్రాహ్మణ కన్యకకు వివాహము చేయఁబడెను. మఱిరెండు నెలలకు మూడవ వివాహము జరుపఁబడినది. వివాహకాలము నాటికా బాలిక వయస్సు పదునాలుఁగేండ్లు. ఈమెను వైధవ్య మహాదశ పదియవయేడు మొదలుకొని వివాహమువరకును నావహించి యుండియు, సుజ్ఞాన ప్రదీపుఁడగు విద్యాసాగరుని ధాటి కాఁగఁ జాలక యామెనుండి వెడలిపోయి, యుక్తాయుక్త విచారములేని యజ్ఞానుల హృదయకోశములం దిమ్ము వేడికొను. నాలవ వివాహ మీవివాహమైన మాసము దినములలో నైనది. ఈ వివాహమునందు వరుఁడు సుప్రసిద్ధులైన రాజనారాయణ బోసుగారి జ్ఞాతి. వధువు పదునాలుఁగేండ్ల యొకవితంతుకన్యక.

ఈ విధముగా పండిత విద్యాసాగరుల వా రాచరణ దీక్ష వహించి యత్యల్ప కాలములోఁ బెక్కు పునరుద్వాహములను జేయింపఁ గలిగెను. ఇల్లు కట్టియుఁ బెండ్లి చేసియుఁ జూడుమను లోకోక్తి యెల్లఱకును దెలిసినదేకదా. సుప్రసిద్ధులగు నట్లు చేసిన ఈవివాహముల వ్యయములన్నియు విద్యాసాగరులే భరింపుచువచ్చిరి. అంతకంత కీవివాహముల వలన విద్యాసాగరులవా రప్పులపాలుకూడ కావలసి వచ్చెను. ఆసమయమున నొకమిత్రుఁడు విద్యాసాగరుని యనుమతి లేకుండ నొకపత్రికయందు, వితంతు పునరుద్వాహ మహాదీక్షచే నప్పుల పాలు కావలసివచ్చిన దేశోపకార పారీణుఁడగు విద్యాసాగరుని కభిమాను లెవ్వరైన ధనసహాయము సేయుఁడని, ప్రచుర పఱిచెను. విద్యాసాగరుఁడా వర్తమానమును వినఁగానే ఈ క్రింది విధమునఁ నా సంగతినిఁ బ్రచురించిన యాపత్రికాధిపతికి వ్రాసియున్నాఁడు.

“మిత్ర రత్నమా! + + + + + స్త్రీపునర్వివాహ విషయమునఁ దామ ప్రచురించిన లేఖ నామనస్సున కత్యస్వాస్థ్యమును గలిగించినది. స్త్రీపునర్వివాహమునకై యెన్నికష్టములు వచ్చినను వానిని జయింపవలెనని నే నతిదీక్షతో నున్నాను. నాకెంత ప్రియతమమైన యీవిషయమున నన్యులు ధన సహాయముచేసి నాచిక్కులు తొలఁగించిన తరువాత నాకు దీక్షయెక్కడ? + + + ”

స్త్రీపునర్వివాహములకై విద్యాసాగరునికి ధనవ్యయముతో సరిపోలేదు. తనకు మేలు చేయఁబోయిన నదికీడుగానెంచి పూర్వాచార పరాయణులు చేసిన దూషణము లిన్నికావు. కులభ్రష్టుఁడని పేరిడి, మత స్వాములు, విద్యాసాగరుని శాస్త్రజ్ఞాన మునకు లోఁకువయైన వారయ్యు, నాతనికి వెలివేసిరి. దాననైనను విద్యాసాగరుఁడు వారికి లొంగక పోయెను. వీనికన్నిటికినిఁ దోడుగా విద్యాసాగరు నంతముఁనందింప వలెనని కొందరు దుర్మార్గులు కుట్రలు చేయుచుండిరి. స్వప్రాణ రక్షణార్థమై విద్యాసాగరుఁడెల్లప్పుడును దనచుట్టును రక్షకసైన్యము నుంచుకొనవలసి వచ్చెను. ఇంత కట్టుదిట్టముగా నున్నను గూడ నొకనాటి రాత్రి కొందఱు ద్రోహులు, విద్యాసాగరుఁడు కలకత్తా నగరములోని కారన్ వాలీసు వీధినిఁ బోవుచుండఁగా, కలిటోలయని వ్యవహరింపఁ బడునొక భాగమునం దాతని మీఁదికిఁ జంపవలెనను నూహతో వచ్చిపడిరి. కాని విద్యాసాగరుని చుట్టును నున్న రక్షక సైన్యము మూలమున నాతఁడు మఱల జీవింపఁగలిగెను.

తన కుమారుఁడగు నారాయణ చంద్రబ్యానర్జీకి వితంతు కన్యనే వివాహముచేయుటకూడ విద్యాసాగరుని పునర్వివాహ దీక్షకు మఱియొక నిదర్శనము. వివాహములు చేసినంతమాత్రముతో విద్యా సాగరుని పని సరిపోలేదు. వివాహితులలోఁ గొందఱు పేద

పడియుండుటచే, నట్టివారి యన్నపానములకు లోపము రాకుండఁ జూచు భారము విద్యాసాగరుని మీఁదనే యుండెను. కొందఱు కుమతులు మొట్టమొదట వివాహమాడియు, వెలి మొదలైన వానికి వెఱచి, తాముకట్టుకొన్న వితంతు బాలికలను వారిగతి కప్పఁ జెప్పి, ప్రాయశ్చిత్తములను జేయించుకొని, మఱియొక యవితంతుకన్యను వివాహమాడఁ జొచ్చిరి. అట్టి మోసకారుల కృత్యములు విద్యాసాగరుని కెంతటి మనస్తాపము కలిగించినను, బాలికలకు మాత్ర మేలోపమును లేకుండ పితృప్రేమతోఁ గాపాడుచుండెను. అనాథకన్యకా పరిణయముననే గాక సత్పాత్ర దానమునందుఁగూడ నపరకర్ణుఁడని ప్రసిద్ధి వడసిన ఈమహామహునికి దొరతనమువారు సి. ఐ. ఇ. బిరుదు నొసఁగి గౌరవించుట సంతోష సూచకముగదా. తనచే మొలకలెత్తిన ఈ యాచార బీజము నేడు బ్రాహ్మమతావలంబులలో నాచారమై యుండుటయే కాక, హిందుదేశములోని ప్రతి భాగములందును గూడఁ గొద్దిగనో గొప్పగనో ఆమోదింపఁబడుట మనకు శుభ శూచకముగదా. ఈవిధముగా నాలుగువందల యేండ్లనుండి ప్రయత్నములు జరుగుచున్నను, జస్వంత సింగు, సవాయి జయసింగు, పరాశరముబాహు పట్టవర్ధనులు మొదలగు మహామహులుగూడ ప్రయత్నము చేసియు నెఱవేర్పఁ జాలని ఈ మహాకార్యమును దాను నిర్వహించి, తనయఖండ విద్యా మహిమచే నెలకుఁ గొన్నివేల రూప్యములను దనకు రాఁబడి యేర్పఱచికొని, యుదార శ్రీమంతుఁడై దీనార్థికల్పసాలమువలె తనహస్తము పనిచేయుచుండ నిర్వర్తిత స్వకృత్యుఁడై ౧౮౯౧ సంవత్సరము జూలై ౨౯ వ తేదీని బరోపకారము మూలమునఁ దనకు సంభవించిన యొక మహావ్యాధి వలన విద్యాసాగరుఁడు కీర్తిశేషుఁడయ్యెను.

నాలుగవ ప్రకరణము.

స్త్రీపునర్వివాహములు.

శంకరాచార్యులు.

ఈ విధముగా విద్యాసాగరునిచే నాటఁబడిన స్త్రీపునర్వివాహబీజ మత్యల్ప కాలములోనే ఆసేతుహిమాచల పర్యంతమును నాచరణ దీక్షాగరిష్ఠులగు మహామహుల హృదయపీఠములందు నాటుకొని వితంతు సంతానకల్పసాలము కాఁజొచ్చెను. విద్యాసాగరుల వారీ ప్రయత్నమును మొదలుపెట్టిన కొద్దిదినములలోనే పండితాగ్రణియగు విష్ణుశాస్త్రులవారు బొంబాయి రాజధానియందీకార్యములను నెఱవేర్ప నుద్యుక్తులైరి. మొట్ట

మొదట నాచారము ప్రకారముగా విష్ణుశాస్త్రులవారు దేశవిద్య నభ్యసించి, తరువాత పూనా హైస్కూలులో హూణభాషను నేర్చికొని, కొన్నాళ్లు ఉద్యోగమునందుఁ బ్రవేశించిరి. విద్యాసాగరునికి వలెనే విష్ణుశాస్త్రుల వారికినిఁ గొంతకాలమైన తరువాత, తమచుట్టులములయందలి మహోపాస్యమములను గొనసాగెంచుట కన్యవిధవుల మనస్సు నాకర్షించు నుద్యోగములు ప్రతిబంధకములుగా తోఁచినందున, నాయన యుద్యోగమును విడనాడి, స్త్రీపునర్వివాహ సదాచార సంస్థాప నాసక్తిచే 'హిందూప్రకాశిక' యనునొకపత్రికను స్థాపించి, అందువీనినిఁగూర్చి వ్రాయుచు, నీశ్వర చంద్రులవారి "విధవావివాహము" ను గ్రంథమును మరాటీ భాషలోనికిఁ మార్చెను. విష్ణుశాస్త్రులవారు వ్రాఁత నేర్పుగలవారును వక్తలునుగూడ నగుటచే, నీవిషయమునుగూర్చి వ్రాయుటయేకాక, అందందు ఉపన్యాసములను గూడఁ జేయుచునుండుటచే పూనా నివాసియు, నొకగొప్ప ఘనాపాఠియు నగు విట్టోబ అన్న అనునాయన ౧౮౬౮ వ సం॥న విష్ణుశాస్త్రులవారి నాపురమునకాహ్వానము చేసెను. విష్ణుశాస్త్రుల వారాహ్వానపత్రికను దిలకించి ఆపురమునకుఁ బోయినప్పుడు మాత్రము, విట్టోబ అన్న సరియైన చర్చకురాక, విష్ణుశాస్త్రులవారి నాపురమందుంచి, విధవా వివాహము కూడదని, తా నుపన్యాసములను జేయ నారంభించెను. తనతో వాదము చేయక విట్టోబ.అన్న జరుపుచున్న ఈ చిత్రమును జూచి విష్ణుశాస్త్రులవారు స్త్రీపునర్వివాహములు అవశ్యకర్తవ్యకములని ప్రత్యుపన్యాసముల నారంభించి, ప్రజలను దమవైపునకు మళ్లించుకొని, విట్టోబ అన్న ప్రయత్నములను వ్యర్థము చేసిరి. సంస్కార విషయమునందీకాలమున నీవిధాయక వాదులుచూపిన భక్తిశ్రద్ధల నిర్వాణ్యములై యుండెను.

౧౮౬౬ వ సంవత్సరముననే మొట్ట మొదట స్త్రీపునర్వివాహ ప్రవర్తక సంఘ మొక్కటి, జంఖండీ రాజ్యాధిపతులగు నప్పాసాహేబు గార గ్రాసనాధిపతులు గను, ఉమ డెటుల్ ముల్కా దాదా సాహేబు ఏం చూర్కారు వారు సహాయాగ్రాసనాధిపతులు (Vice-President) గను, పండిత విష్ణుశాస్త్రులవారు కార్యదర్శి (Secretary) గను, జస్టిస్ మహదేవ గోవింద రానెడిగారు, జస్టిస్ కాశీనాథత్ర్యంబక టెలాంగుగారు, గోపాలరావు దశముఖ శాంతారాం, నారాయణ మహదేవ్ పరమానంద్ మొదలగు మహానీయులు సభికులుగను బొంబాయి నగరమునందు స్థాపింపఁబడెను. కాని పునర్వివాహ నిషేధవాదు లూరకుండక దీనికి వ్యతిరేకముగా "హిందూధర్మ వ్యవస్థాపక మండలి" యను పేరనొక సమాజమును స్థాపించి, సభలను జరుపుచు, ఉపన్యాసములను బోధకులను నేర్పఱచి, స్త్రీపునర్వివాహము నిషిద్ధమని బోధించి, పునర్వివాహ ప్రవర్తక సంఘము వారిచేఁతల కొకకొంత విఘాతమును గలిగించుచు వ

చ్చిరి. పునర్వివాహ ప్రవర్తక సంఘమువారు వారితోఁ బోరాడి పోరాడి కార్యము గానక, తుట్టతుదకు స్వయముగా వివాహములను జేయ నిశ్చయించిరి.

ఆ సమయమున వేణుభాయి యను నొక విగత భర్తృక తండ్రి చనిపోయెను. తల్లి ఈమెకు వివాహముచేసి, యీమె దుఃఖ శతములను దొలగింప వలెనని యెంచి, పునర్వివాహ ప్రవర్తక సంఘమువారికి దీనినిఁ దెలియఁ బఱిచెను. వితంతువు సోదరులిద్దఱునుగూడ నామె వివాహమున కంగీకరించిరి. కాని యాసమయమున న్యాసమాజమునందు భార్యా విహీనులనేకు లున్నను నందొక్కరును నాయనాథను బరిణయమగుటకు సాహసింపక, పిచ్చి పిచ్చి క్షమార్పణలను జేయ నారంభించిరి. అంతట నేమియుఁ దోఁచక విష్ణుశాస్త్రులవారు అనాథ దుఃఖ నివారణమునకై ఈ పతిహీననెవ్వరైన వివాహమాఁడెదరాయని హిందూ ప్రకాశికయందుఁ బ్రచుర పఱిచెను. ఒక మరాటీ పాఠశాలలో నుపాధ్యాయుఁడగు పి. వి. కార్మార్కరను నాయన, ఎన్నికష్టములువచ్చినను గూడఁ దానువివాహమాడెదనని చెప్పి, బొంబాయికివచ్చి, పదునేడవ జూన్ ౧౮౬౯ వ సంవత్సరమునందు, హైకోర్టు జడ్జీలు, బారిష్టర్లు న్యాయవాదులు డాక్టర్లు మొదలగువారి యెదుట విశేషవైభవముతో, మున్నుసంఘము వారందఱును వివాహమాడభయపడి విడిచిపెట్టిన వేణుభాయినిఁ బాణిగ్రహణము చేసెను. ఆదినమున నాచారము ప్రకారముగా వేసిన చందాలయందు మూడువేల రూపాయలు జమ చేయఁబడినవి. ఇంతకుఁ బూర్వము ౧౮౬౮ వ సంవత్సరమున (దీనినె ౧౮౫౮ అని కొందఱు చెప్పుచున్నారు) నొకటియు, ౧౮౬౫ న మఱియొకటియు, ౧౮౬౬ న వేఱొకటియుఁ గూడ జరిగినను, నవియంత బాహాటముగా జరుపఁబడక పోవుటచేఁ బైటికి రాలేదు.

ఈ కార్యములు జరిగిన తరువాత నైట్లైన నిషేధవాదు లీవివాహము లింక ముందు కాకుండఁ జేయవలయునను నుద్దేశముతో, దమచేతిలోని చివర సాధనమగు వెలివేఁతను బైటికిఁదీసి, ఈవివాహములం దాహ్వాన పత్రికలలో సంతకముచేసిన యేడుగురుని, ఈ నూతన దంపతులను, వేణుభాయి సోదరులను, వెలివేసి శాస్త్రులవారికి నాచార్యులకుఁ బత్రికల నంపిరి. అంతట స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సంఘము వారీవివాహములు శాస్త్రీయములనియు, నవియట్లు కావని ఋజువగు వరకును దమ్మును వెలివేయుట కెవ్వరికిని వలను పడదనియు వాదించిరి. కొంతకాలము వరకును హిందూప్రకాశిక ఈయుత్తరములనే ప్రచురింపుచుండెను. ౧౬౨ మంది నూతనముగా వచ్చి పైయూహను స్థిరపఱిచిరి, పునర్వివాహ నిషేధవాదులు విధిలేక వచ్చినదని దీనికంగీకరించి, కార్వ్వారు, శంఖేశ్వరముల పీఠపు శంకరాచార్యులవారి చేర నీవివాహమును ద్రి

ప్పుఁడని యుత్తరములను వ్రాసిరి. శంకరాచార్యులవారును నందులకు సమ్మతించి, వాదిప్రతివాదుల వాదమును వినుటకు ౧౮౭౦ వ సంవత్సరము మార్చినెల యందుఁ, బూనాకువచ్చిరి. శ్రీ శంకరాచార్యులవారు పునర్వివాహ నిషేధవాదులగుటచే, వారు తీర్పు చెప్పుటకుఁ దగరని ప్రవర్తక సంఘము వారాక్షేపించి తుట్టతుదకు, వాదబలమును బట్టి నిష్పాక్షికముగా తీర్పుచెప్పిన యెడల నంగీకరింతుమని తెలియఁబఱిచిరి. ఉభయపక్షములనుండియు జెటియొక యైదుగురుకు దమవాద బలమును దెలియఁబఱచుటకు వచ్చిరి. శ్రీ శంకరాచార్యులవారును విధాయక వాదమును సలిపిన వారిని వెలివేయమని సెలవిచ్చిరి. ౨౭ వ మార్చి ౧౮౭౦ వ సంవత్సరమున నీవాగ్వాద మారంభమై తొమ్మిదిదినముల వరకును జరిగెను. వాదాంశములన్నియు జస్టిస్ మహాదేవ గోవింద రానెడీ గారిచేతను, విట్టోబ అన్న కాహ్నాడ్కరుగారి చేతను సంపూర్ణముగా వ్రాయఁబడెను. నిషేధవాదులే పెక్కుదినము లుపన్యసించిరి. విధాయక వాదులప్పటి కింకను బెక్కువిషయములను గూర్చి ముచ్చటింప వలసియుండెను. కాని శంకరాచార్యులవారంతటితో వివాదము చాలునని నిలిపివైచి(?) పంచాయతుల యభిప్రాయముల నడిగిరి. ఈ పదిమందిలో నిషేధవాదుల పక్షమున నార్గురును విధాయక వాదుల పక్షమున నలుగురును నిలిచిరి. విధాయక వాదులలో నొకరైన వెంకటశాస్త్రులవారు బలవంతము వలన నిషేధవాదుల పక్షము చేరినందున వీరిపక్షమున కార్గురు వచ్చిరి.

వెంకట శాస్త్రులవారు విధాయక వాదులలో నొకరగు వృద్ధులైన పండితులు; శాస్త్రములందుఁ దమకుఁగల యపార పాండిత్యముచే విష్ణుశాస్త్రులవారికిఁగూడ నభేద్యములగు ప్రమాణములనుజూపి మొదటినుండియు స్త్రీ పునర్వివాహములకుఁ దోడు చూపిన మహనీయులు. తమయందీయనకుఁగల గౌరవమును, నాయన వార్ధక్యమును దమకుఁదోడు చేసికొని శంకరాచార్యులవా రీవాద ప్రతివాదములు జరుగుచున్న దినములలో వెంకట శాస్త్రులవారినిఁ దమపక్షమునకు రమ్మని బహువిధముల నిర్బంధించిరి. మతకర్త లంతటి కార్యమున కొడఁబడి నప్పుడు వెంకటశాస్త్రులవారు దీనజనసంరక్షకులయ్యును. వెఱచి యన్యాయముగా నిషేధవాదుల పక్షమునకు మఱలిరి. ఈ కార్యమున కెంతయు నబ్బురపోయి విష్ణు శాస్త్రులవారు వెంకట శాస్త్రులవారి నిశ్చితాభిప్రాయముల నెఱుఁగఁగోరి, విధాయక వాదులను గొందఱి నాయనకడ కంపిరి. అంతట వెంకట శాస్త్రులవారు పూసఁగ్రుచ్చినట్లుగా మొదటినుండియుఁ దన్నుపెట్టిన నిర్బంధములను దనయవస్థను వెల్లడించికొన్ని, స్త్రీపునర్వివాహా వశ్యకత యందలి తమప్రబలమైన నమ్మకమును జూపించుకొనిరి. అంతట విధాయక వాదులలో నొకరగు గోరనునాయన యీయుదంతము నంతను దానుబ్రచురించుచున్న జ్ఞానప్రకాశికయను పత్రిక

యందుఁ బ్రచురించెను. దీనినిఁ జూడఁగానే నిషేధవాదులు ధ్వజమెత్తి, నిజమును బయలు పుచ్చినందుకు వెంకటశాస్త్రులవారిపైఁ గారములు మిరియములు నూరుచు నాయనను పాపము! తిన్నఁగా శంకరాచార్యులవారికడకు లాఁగుకొనిపోయి, గోరు వ్రాసినదంతయు నసత్యమని యొకకాగితము వ్రాసి, దానిపై బలవంతముగా నావృద్ధబ్రాహ్మణునిచే సంతకము చేయించి, దానిని ముద్రింపించి నలుదెసల విచ్చలవిడి ప్రచురించిరి.

ఇంతలో శంకరాచార్యులవారు స్త్రీపునర్వివాహముల విషయమై తీర్పు చెప్పు కాలము సమీపించెను. మాల్వాంకారు గారను నొకానొకరు పనికై శ్రీశంకరాచార్యులవారిచే నియమింపఁబడిరి. మాల్వాంకారుగారు తమపనిని నిర్వర్తించికొనక సమయము దొరికినదిగదాయని గోరును దూషింపసాగెను. సభామధ్యమునందుఁ దన్నుదూషించిన హేతువుచే గోరాయనపై నొకయభియోగమును తెచ్చెను. అప్పటి రైల్వేమాజిస్ట్రేటుగారగు ఫ్రేజరను నాయన దీనిని విచారణముచేసి మాల్వాంకారుగారికి మూడుమాసములు కారాగృహశిక్ష విధించెను. మాల్వాంకారు దీనిపై నప్పీలు చేసికొనఁగా నూఱురూపాయలు జరిమానా మాత్రము విధింపఁబడెను. ఈసమయమున నసత్యపు సాక్ష్యమిచ్చిన వారందఱును శిక్షింపఁబడిరి. అందు మఱియొక బ్రాహ్మణునికి గారాగృహశిక్ష విధింపఁబడెను. వెంకటశాస్త్రులవారు దొరతనము వారియెదుట, తమరు నిర్బంధింపఁబడినసంగతి నంతను విశదపఱచి తమపునర్వివాహదీక్షను స్థాపించుకొనిరి. ఇంతలో తాము పడ్డదూషణములకై గోరును, విష్ణుశాస్త్రులవారును మాల్వాంకారు గారిపై మాననష్టమున కభియోగము తెచ్చిరి. పలువిధముల కష్టములకుఁ లోనై మాల్వాంకారు గారు విష్ణుశాస్త్రులవారిని క్షమార్పణ చేసికొనిరి. దయఁదలఁచి గోరు తనయభియోగమును దానే తీసివేసికొనెను.

తరువాత విష్ణుశాస్త్రులవారు ౧౮౬౯ వ సంవత్సరమునఁ దమపునర్వివాహదీక్షను జూపుటకై తానే వితంతువును వివాహమాడెను గాని యామఱుసటి సంవత్సరముననే యకాలమృత్యువాయనను మ్రింగివైచి కొంతకాలమువరకు విధాయకవాదుల ఱెక్కలను గొట్టివైచెను. ఇంత యన్యాయము జరిగినను వెలివేతమాత్రము నిషేధ వాదులు మానలేదు.

ఆయన చనిపోయిన తరువాతఁ గొన్నియేళ్ల వఱకును బొంబాయిరాజధాని యందీవిషయమును గూర్చి యంతటి శ్రద్ధాభక్తులు గలవారు బయలు దేరలేదు. ఆచరణదీక్షా పరతంత్రులగు వారులేక దేశము తొల్లింటివలెనే పెక్కేండ్లు నిలిచియుండెను. ఆసమయమున ఘూర్జర దేశమునందు మాధవదాసు రఘునాథదాసుగారను నొకధనవంతుఁడైన వణిజుఁడు బయలుదేరెను. ఆయన తనజీవితకాలమునందించు మించుగా నొక నూఱు వివాహములను జేసి స్వదేశమునందించు మించుగా నీయాచారమును స్థాపించియున్నాఁడు.

ఐదవ ప్రకరణము.

చెన్నపురిరాజధాని:

స్త్రీపునర్వివాహములు.

స్వదేశమునకంటె నుత్తమమైన ప్రదేశ మీప్రపంచమున నెక్కడను జరిత్రకారునికండఁ బోదని యెల్లఱకును దెలిసియేయుండును. తానుపుట్టి పదునాలుగేండ్లవఱకును బెఱిగిన పెద్దాపురమున కించుమించు ముప్పదిమైళ్లదూరములోనున్న చెన్నపురిరాజధానికిఁ దిలకాయమానమగు రాజమహేంద్రవర మాసమయమునఁ జరిత్రకారుని కెట్లుండునో మీకువివరింప వలసినదేమి? తొల్లియొక కాలమున రాజరాజనరేంద్రుని రాష్ట్రమున కలంకారస్థానమై, సారంగధరునివంటి భక్తాగ్రేసరుని లోకమునకొసఁగి, తరువాత వాగనుశాసనాద్యాంధ్రకవి బ్రహ్మల పాదధూళిచే గౌరవమును గాంచి, ఆపెనుక భువనవిజయ సభాభరణుఁడై మూరురాయర గండాభిధానుఁడగు కృష్ణరాయునిఁ గొన్నాళ్లు నీకడ నిల్పికొని, నేటికాలమున చెన్నపురి రాజధాని యంతయు భోరుకొనునట్లు పవిత్రమైన సంఘసంస్కరణమునకు దారిచూపిన యోరాజమహేంద్రపట్టణమా! నీవు చిరకాలము ప్రసిద్ధిగాంచుము. ఎవ్వాని రమణీయ కవితామాధురీధురీణత యాంధ్రప్రపంచమునం దానందాబ్ధినోలలాడఁ జేసెనో, ఎవ్వాని యుదారదాతృత్వము రాజమహేంద్రపట్టణ ప్రార్థనశాలాదికాదుల వితంతుపోష గృహాదుల నిర్మించెనో, యెవ్వాని యపారకరుణా సాగరత్వము దురాచార వశులగు దీనవితంతుసంతానమునకు మఱల వారికి భగవంతుఁ డనుభవింప నొసఁగిన వరములను గరతలామలకము చేసి ఈశ్వరశాసనముల నిర్వర్తించెనో సుగుణగణ భూషితుఁడవగు నట్టియో రావు బహదూరు బిరుదాభిధాన! శ్రీకందుకూరి వీరేశలింగ ప్రధాన! నీవు మాసంఘమును సంరక్షించుచుఁ జిరకాలము సుఖంబుండుము. ఒక్క వితంతూద్వాహవిషయిక దురాచారములనే కాక యితరములగు దురాచారములనుగూడ శాశ్వితముగా దొలంపుము!

వితంతూద్వాహముల విషయమున హిందూదేశమున వంగదేశమును బొంబా

యి రాజధానియందుఁ బనిబూనిన వెనుక మా చెన్నపురి రాజధానియే ముందున కడుగిడినది. సంస్కారము సామాన్యముగా మొట్ట మొదట గ్రంథ ప్రచురము వలననో యుపన్యాసముల వలననో బయలుదేరి క్రమముగా నాచరణమునకు వచ్చుచుండును. దీనికి వ్యతిరేకముగా నెక్కడనో కాని జరుగదు. తెలుఁగు భాషలో వితంతూ ద్వాహ విషయిక మగు ప్రథమ గ్రంథము ౧౮౬౮ వ సంవత్సరమునఁ బ్రచురమైనదని ఇది వరకే వ్రాసి యున్నాము. బ్రహ్మమత సంస్థాపకాగ్రేసరులగు కేశవ చంద్ర బ్రహ్మానందులవారు ౧౮౬౮ వ సంవత్సరమునఁ జెన్నపురిలో నొక ప్రార్థనా సమాజమును స్థాపించిన తరువాత వితంతూ ద్వాహముల విషయమై ఈ రాజధానియందు మొట్ట మొదట ప్రయత్నములు జరిగినవి. తరువాతఁ గొందఱు మహనీయు లనేకములగు నుపన్యాసముల నొసఁగిరి కాని యవి మాటలతోనే కడతేరెను. ఈవిధముగా నించుమించు పండ్రెండు సంవత్సరములు జరిగిన తరువాత రాజ మహేంద్రవరము నందలి దొరతనమువారి పాఠశాలలోఁ బ్రధాన పండితులుగా నున్న కందుకూరి వీరేశలింగము గారీ విషయమునఁ బనిసేయఁబూనిరి. చిరకాలముక్రిందటనే ఈ యూహ యాయన హృదయమున జనించి యున్నను పనిబూనుట కాయనకుఁ దోడుసూపువారెవ్వరును లేక యుండిరి. సత్కార్యా చరణమునకుఁ దమ కెవ్వరును సహాయముగా నుండక పోదు రేమోయని నాయన సాహసింపఁ జాలకుండెను. ఈ విధముగా బహుదినములు గడచిన వెనుక ౧౮౭౯ వ సంవత్సరము వచ్చినది. “కాని నాకు ముఖ్య ప్రోత్సాహకులుగా నుండి యీ కృషిలో నన్ను ప్రవేశపెట్టి నాచేత పని చేయించినవారు నాసహపాఠియు మిత్రులు నైన చల్లపల్లి బాపయ్యగారు” అని పంతులవారే వ్రాసియున్నారు. అట్టి లోకోపకార పారీణుని ప్రోత్సాహము వలన ధైర్యమును వహించి, తమయుల్లమున నిదివరకే జనించిన సంస్కార బీజమును దలనెత్తించి ౧౮౭౯ వ సంవత్సరము జూలై నెలలో స్త్రీపునర్వివాహ విషయికోపన్యాసము నొసఁగెదమని ప్రకటించిరి. ఈ కార్యమునకు వారు సాహసించుటకు లోపలనే స్త్రీపునర్వివాహ ప్రవర్తక సంఘమొక్కటి రాజ మహేంద్ర వరమున స్థాపింపఁ బడినది. ఆ సమయమున “కాకినాడ యందలి వణిగ్రత్నమగు మ-రా-శ్రీ పైడా రామ కృష్ణయ్యగారీ సమాజమునకు ముఖ్యసహాయులయి నిలిచి, ముప్పదివేల రూపాయల నీపనికై మూలధనముగా నేర్పఱచెద *” మని వాగ్దానము చేసిరి. శ్రీ వీరేశలింగము పంతులవారు తొందరపడి పని చేయువారుకారు. ఒక సంవత్సరము గ్రంథ పరిశోధనము వలన

(సశేషము.)

* Vivekavarthani July 1879 Page 110. Vol IV. No 7

ఈ యాచారము యొక్క యావశ్యకతను జరిత్రమును గట్టి చేసికొని, దీక్షాపరతంత్రులగు చల్లపల్లి బాపయ్య పంతులవారి యంతటి ఘనులవలనఁ బ్రోత్సాహపఱుపఁబడి, శ్రీపైడా రామకృష్ణయ్యగారివలన నంతటిసహాయసంపత్తినిఁ గాంచినప్పుడు, పంతులవారు పునర్వివాహములను జేయఁబూనుట గొప్పగా కానఁబడక పోవచ్చునుగాని, తమ మిత్రులచే నిట్టివిషయమున నంతటిసహాయమును గాంచుటకు వారికి వీరియం దేమి యసాధారణ మగువిశేషము కానిపించినదో యని విచారించినప్పుడుమాత్రము పంతులవారి యాధిక్యత మనకు గోచరము కాకపోదు. ఈవిధముగాఁ బలువురవలన సహాయమును గాంచి పంతులవారు 1879వ సం॥ ఆగస్టు నెల మూడవతేదిని ఆదివారమున* స్త్రీపునర్వివాహమునుగూర్చి యుపన్యసించెద మని ప్రకటించిరి. ఆదినమున నాయూర శ్రీవిజయనగరమహారాజావారు స్థాపించిన బాలికాపాఠశాలయందు సభ జరుపఁబడినది.

వాడవాడలనుండి యీవిడ్డూరమును జూచుట కయి పండితోత్తములు పాటివచ్చిరి. కలికాల మీవిధముగా కాలిపోవుచున్నప్పుడు పండితోత్తము లెట్లు సహింపఁగలుగుదురు! డబ్బున కాశించి మూడేండ్లకుమారైను డెంబదేండ్లవాని కిచ్చి గృహములు వయసైనను రాని విధవబాలికలతో నిండునట్లు చేయుట యుత్తమముకాని వారలకుఁ బెండ్లి చేయుమను టెంతతప్పు! విధవలకుఁ బెండ్లి యేమిటి? చేయుమన్నవారు చేసికొన్నవారా? దేశమంతయును నీకలికాలమహిమ కద్భుతపడుచుండఁగా మెల్లఁగా నాదినమునయుక్తసమయమునకు శ్రీపంతులవారు, పులులవలె నిరీక్షించుచున్న శత్రువుల మధ్యమునకుఁ బోయి నిలిచిరి. తరువాత మెల్లమెల్లఁగా సభవారి మనస్సులు కఱఁగి నీరై పారునట్లు వారు వ్రాసినయుపన్యాసమును జూడఁగానే సభికులలో ననేకులు వానియావశ్యకత నంగీకరించిరి. కువాదములకు బ్రహ్మాస్త్రమువలె నున్న యాయుపన్యాసము ముగిసినతరువాత “ప్రతిపక్షులలోని నూరి వెంకటకృష్ణయ్యగారును, అద్దేపల్లి కృష్ణశాస్త్రులవారును లేచి పయి యుపన్యాసమును పూర్వపక్షము చేయుటకు పూనుకొని చెప్పినమాటలలోని యుక్తులను శాస్త్రమును యెట్లున్నను బిగ్గరగామాత్రము మాటలాడిరి. కృష్ణశాస్త్రులవారు + + (చేసిన ప్రమాణముల అపార్థములు) + + (వారు) వ్యాకరణశాస్త్రమును జదువుకొన్నయెడల వారికిఁ దెలిసియే యుండును. వీరివాదమిట్లుండఁగా నడుమ వెంకటకృష్ణయ్యగారు లేచి”† వారును విపరీతార్థములను గొన్నిటినిఁ గల్పించిరి. “వా రింకను యేమో చెప్పిరి కాని యవి వాదముతో నంతగా సంబంధించినవి గావు.” ఈయుపన్యాసమునందు పంతులవా రనేక ప్రమాణముల నుద

* ప్రమాది స౦॥ శ్రావణ బ. ౧ ఆదివారము.

† The Vivekavarthani, July 18th, 1879.

హరించి యున్నారు. శ్రోత్రమధ్యమునందు సత్యమైన తమసిద్ధాంతమును స్థాపించుటకయి పూనికతో వ్రాయఁబడిన యీయుపన్యాసమునం దెంతటి బలవత్తరము లగుదృష్టాంతము లుండునో నేను వివరింపవలసినపని లేదు. ఈయుపన్యాసము కాఁగానే పలుచోట్ల గడబిడలు జరుగసాగెను. తమ్ము నుద్ధరించుటకయి యింతటి కార్యమును జేయుచున్నను వితంతువులే యిట్టికార్యమును దూషింప మొదలుపెట్టినప్పుడు లోకసామాన్య మెట్లుండునో నేను వివరింప నక్కఱ లేదు. ప్రతివాఁడును నీసంగతినే తలపోయుచుండెను. ప్రతిపత్రికయు శ్రీ పంతులవారిని దూషింపుచుండెను. లోక మంతటను నీవిధముగా నల్లరి జరుగుచున్నప్పుడం దొకానొకరు నేతిబీరకాయవలె సార్థకమగునట్లు "వితంతు పునస్తంతుసంధానేచ్ఛాచ్ఛేదనాచ్ఛాసి" అని మూఁడు బారెడు పొడుగున నొక "గ్రంథమునిండ అనుప్రాసములకయి అర్థము లేనిపదములతో, అన్వయము లేని వాక్యరత్నములను బెల్లుగ"* నల్లి పంతులవారి శ్రీ వివేకవర్ధనీ ముద్రాక్షరశాలయందే అచ్చొత్తించిరి. తరువాత 1879వ సంవత్సరములోనే 12 అక్టోబరు ఆదివారము (ప్రమాది సంవత్సర అధికాశ్వయుజ బహుళ ద్వాదశి,) నాఁడు తమ స్త్రీపునర్వివాహవిషయక ద్వితీయవిజ్ఞాపనమును బ్రచురించిరి. అది ఈవిధముగా నారంభింపఁబడినది. "అస్మద్దేశీయు లగు సదయహృదయులారా! గతమాసమున స్త్రీపునర్వివాహవిషయమైన యుపన్యాస మొకదానినిఁ బ్రచురించి యున్నాను గదా? ఏమో వ్రాసినానని యనాదరింపక పలువురు పండితులును మహాజనులును దానిని సావధానముగాఁ జదివి యాదరించుటచే నేను పడినప్రయాస మంతయు సఫల మయినదని యెంతయు హర్షించుచున్నాను. నే నాయుపన్యాసమును సభలోఁ జదివినతోడనే యిచ్చటి పండితులు కొందఱు + + కొన్ని యాక్షేపణములను జేసి, విచారణీయాంశముతో సంబంధింపని సంగతులనుగూడ చాలసేపు చెప్పిరి. ఆదినమున నాకుఁ బ్రత్యుత్తరము చెప్పుటకవకాశ మియ్యనందునను, పండితు లసత్యము చెప్పరా యనువిశ్వాసముచేతను, సామాన్యజనులు కొందఱు మొట్టమొదట వారివాదముకూడ న్యాయ మయినదేమో యని భ్రమపడినను, రెండవసారి వారు మొదట వాదించినవాదమును గట్టిపెట్టి కొంతవఱకు నేను జెప్పిన యర్థములనే యొప్పుకొన్నందున నందఱికిని సంశయనివారణ మయినది. నాయుపన్యాసమునకు ఖండనగ్రంథమును తెనుఁగుభాషలో వ్రాసికొని వచ్చి చదివెదమని వారు మొదటిసభదినమున వాగ్దానము చేసియు, వా రట్లు దయచేయక సంస్కృతమున వ్రాసికొని వచ్చినందునను, వారి కాధారముగా నున్న వన్న భారద్వాజసూత్రాదులు తీసికొనిరాక నిరాధారము లయినమాటలు చెప్పుచు వచ్చినందునను వారివాద మేదియు జనులు గ్రహింపలేక యల్లరి చేసిరి. మఱల పదియేనుదినము

* Vivekavarthani September 1879.

లకు జరగఁబోవుసభయందు వారు తమఖండనగ్రంథమును తెనుఁగున వ్రాసికొని వచ్చెదమనియు భారద్వాజసూత్రములను తెచ్చెదమనియు వాగ్దానము చేసినమీఁదట నాఁటికి సభ ముగిసినది. మఱల జరిగినసభ నాఁడు వెనుకటిసభయందు నిర్ణయమయినప్రకారముగా సభికు లందఱును బండ్రెండుగంటలకే వచ్చినను, పండితులుమాత్రము మూఁడుగంటలకువచ్చి తమయుపన్యాసమును జదివిరిగాని భారద్వాజసూత్రమును దీసికొని రాలేకపోయిరి. వారియుపన్యాసము ముగిసినతోడనే నేనునుబోధించినంతవరకు సదుత్తరములను జెప్పినాను. నాఁటివారి వాదములో ముఖ్యమైనది శ్రుతిస్మృతులకంటె శిష్టాచారము ప్రధానమైనదని. ఇదియిట్లుండఁగా నామఱుసటిభానువారము నాఁడు జోస్యుల పేరిచయనులగారిలోపల మఱియొకసభ చేసి, ఆసభకుఁ దమపక్షమున కనుకూలురై యున్నవా రని తోఁచిన వారినిమాత్రమే యాహ్వానము చేసి, యెక్కడినుండియో వ్రాయించి తెప్పించిన నాయుపన్యాసముమీఁదిఖండనమును అద్దేపల్లి కృష్ణశాస్త్రులగారు చదివిరి. ఆఖండనమునకు సమాధానము చెప్పుటకయి నాకవకాశము నిచ్చెదమని సభికులందఱు వాగ్దానముచేసియు, వారిసిద్ధాంతమును నేను పూర్వపక్షము చేయ నారంభించిన కొంతసేపటికి కడుపునొప్పి యని యొకరును కాలునొప్పి యని యొకరును లేచిపోవ మొదలుపెట్టిరి. కృష్ణశాస్త్రులవారు తమకుఁ జెప్పుటకేమియుఁ దోఁచనప్పుడు 'ఏమియుం దోఁచకున్న వెక్కిరించుమన్న సామెతను జ్ఞప్తికిఁ దెచ్చుకొని "శేషంకోపే నపూరయే' త్తను నార్యోక్తికిని లక్ష్యభూతు లగుచు వచ్చిరి." ఈద్వితీయవిజ్ఞాపనమునం దంతవరకును దమమీఁదఁ గొని వచ్చినఖండనముల నన్నిటినిఁ బూర్వపక్షము చేసిరి.

ఈరెండు ఉపన్యాసములును నైనతరువాత దేశ మంతయు మఱియు నల్లకల్లోలము కాఁజొచ్చెను. ఆకాలమున రాజమహేంద్రవరమున ప్రచుర మగుచున్న "వివేకవర్ధని" యం దెక్కడఁ జూచినను స్త్రీపునర్వివాహమును గూర్చినవార్తలే మెండయ్యెను. దేశదేశములనుండి పంతులవారిగ్రంథములపై ఖండనగ్రంథములు హెచ్చఁగెను. చెన్నపురిలోని యాంధ్రభాషాసంజీవనియు, వర్తమానరత్నాకరమును మందారమంజరియు, నిట్టిపత్రికలు పునర్వివాహమునుగూర్చి ప్రబలముగా వ్రాయుచుండెను. పంతులవారుమాత్రము శత్రుపక్షము వారికి జంకక నిర్భయముగా వారిఖండనములకుఁ బ్రత్యుత్తరములను వ్రాసి విరోధులను నిరుత్తరులను జేయుచుండిరి. కొందఱు కొందఱు చిత్రము లగువ్రాఁతలనుగూడ వ్రాయుచుండిరి. అందొకరు "అనల్పజల్పితాకల్పకల్పవల్లీ నామకపత్రిక" యనుపేర "నయిదు మాసముల కొక్కసేపత్రికగా బృందావనపట్టణమున" (Masulipatam) నొక్కపత్రికను వెలువఱిచి అందు రత్నములను పేరము పదునాలుయుక్తులను వెల్లడించుటయేకాక "బూతుకూతలు"నుగూడఁ దానిలో

వ్రాసి తమ యప్పటి యసామాన్యపాండిత్యమును వెల్లడించిరి! అందలి రెండురత్నముల నిం దుదాహరించుచున్నాము.

2- రత్నము.

“బీజంబులూడ్చి ముకుద్రాళ్ల గట్టిన వృషభంబులును, విత్తులు దిగిచి యగాడీ పిచాడేలుగట్టిన గుఱ్ఱంబులును, ఆలానమున బంధించి అంకుశమునకు దెచ్చిన యేనుఁగులును కొన్ని కార్యములకు మనకె ట్లావశ్యకములై యున్నవో, అట్లే కామంబులడంచి కొని కనిపెంచుటలులేని స్త్రీలును గొన్ని గృహకృత్యంబులకు మనకుఁ గావలసియున్నా రనుట నిక్కము. వేయివరహాలైనను విధవ తోఁబుట్టువునకు సమానముగాదను పూర్వోక్తినిక్కమే.

3- రత్నము.

“ఎన్ని కాపురములకు విధవలు నిర్వాహకురాండ్రైయున్నారో మన మెరుఁగమా? సువాసినులుమాత్రమే కలయిండ్లలో విధవల యక్కర యెంతఁ గానుంచున్నదో చూడుండీ. లోకములోనుండు వారందఱును సువాసినులై యుండిరేని పరాధీను లయినవారిని యెవరిని పిలిచి మన అక్కర తీర్చుకోఁగలము. అట్టి అక్కరలలో కొన్ని పురుషులచేత సాధ్యములయినను కొన్ని స్త్రీలే చేయవలసియున్నవి. జీతము లిచ్చి పురుషులను బెట్టి చేయించుకో చాలనివారే యనేకులున్నారు. వారల కందరికి తలలు జెడి యిండ్లఁబడియున్న విధవలే గతియగుట సామాన్యముగా జరుగుచున్నదే కాని క్రొత్తగా చెప్పునదికాదు.” ఈవిధముగా వారు పదునాఱుయుక్తుల వ్రాసి “ఈ చెప్పఁబడిన హేతువులేకాదు. విచారించిన నిక లక్షహేతువు లున్న”వని వ్రాసియున్నారఁట! పంతులవారు దీనినిఁ బ్రచురించుచు “ఇటువంటి హేతువులనులక్షకాదు. శతలక్షలనైనవారు చూపఁగల సమర్థు లనుటకు సందేహములేదు” అని వ్రాసియున్నారు. (వివేకవర్ధని పిబ్రెవరు 1880.) స్త్రీ పునర్వివాహములనుగూర్చి 1897-98లోఁ గూడ నిషేధించు నుపన్యాసములు ప్రచురమగుచున్నప్పుడు 1880 ప్రాంతములలోఁ గ్రొత్తగానిది ఈభాగములందు విమర్శనకు వచ్చినప్పు డెట్లుండునో మేము వివరింపవలసిన దేమున్నది. ఈవిధముగా నుభయపక్షములవారును పోరాడుచున్న సమయమునందు 1881 వ సంవత్సరము మార్చి నెలలో శ్రీ శంకరాచార్యులవారు రాజమహేంద్రవరము విచ్చేసిరి. విజ్ఞాపనానుసారముగా స్త్రీ పునర్వివాహము శాస్త్రసమ్మత మగునోకాదో విచారించుటకై పై నెలలో నొక యాదివారమునాఁడు రాజమహేంద్రవరము నందలి విజయనగరము మహారాజువారి బాలికా పాఠశాలయం దొక సభ జరిగినది. “వాదమును వినవలెనను కుతూహలముతో వందలకొలఁది

జను లక్కడకువచ్చిరి. శ్రీ శంకరాచార్య స్వాములవారు తమకుఁ బ్రతినిధిగా నద్దేపల్లి కృష్ణశాస్త్రిలవారి నాసభకంపిరి. విధాయకవాదు లప్పుడు స్త్రీ పునర్వివాహమును గూర్చి యిదివరకు జరిగిన వాద ప్రతివాదములను తెలిపి, స్త్రీ పునర్వివాహము శాస్త్రనిషిద్ధమనిచూపుటకు ఒక్కవాక్యమును వేదమునుండి చూపఁగలరాయని వారి నడుగుటయేకాక తమవాదమున కుపబలముగా నయిదారు స్త్రీపునర్వివాహ సమ్మతము లగు శ్రుతివాక్యములనుగూడఁ జదివిరి. శ్రుతిప్రమాణములను జూపకున్నను నిషేధవాదులు మాత్రము విధాయకవాదులు చదివినవానికి వేఱర్థము లున్నవని చెప్పిరి; వానికి మఱి యొకయర్థమును చెప్పుటకు లేశముగాని వీలులేదని జూపి విధాయకవాదులు వారు చెప్పిన యర్థమును శాస్త్రసిద్ధముగా పూర్వపక్షము చేసిరి. అంతట స్వాములవారి ప్రతినిధులగు శ్రీ కృష్ణశాస్త్రిలవారు “వాదముతో నంతఁగా ప్రయోజనము లేదనియు, నుభయపక్షములవారికినిఁ దగిన యుక్తులుండుననియు, మనశాస్త్రముల కే ప్రకారముగా గావలసిన నాప్రకారముగా నే యర్థము తీయవచ్చుననియు, స్వాములవారు బహుజనుల యిష్టానుసారముగా నడువవలసినవారు గనుక బహుజనులు చేరి స్త్రీ పునర్వివాహము తమ కిష్టమని సంఘవిజ్ఞాపనము వ్రాసికొన్నచో వా రాలోచింతురనియు, శాస్త్ర మెట్లున్నను పూర్వకాలములయందు సహితము దేశకాలానుగుణ్యముగా నిబంధనల నేర్పఱచుకొనుచుండుట కలదనియు, బహుజనాభిప్రాయమును బట్టియు, దేశమునకుఁ గలుగుచున్న నష్టమునుబట్టియు, నాలోచించి ప్రస్తుతకాలమునకుఁ దగినట్లుగా నిప్పుడు క్రొత్తనిబంధనముల నేర్పఱచుకొనుట కేయాక్షేపమును లేదనియు సెలవిచ్చిరి.” (వివేకవర్ధని మార్చి 1881.)

ప్రస్తుతము వాడుకలో లేనియాచారమును గ్రొత్తగా గొనివచ్చినప్పుడు తదుపలంబకులు కొద్దిగా నుందురని యెఱిఁగి యుండుటచేతనే, కృష్ణశాస్త్రులవారు సంఘమంతయును గలిసి విజ్ఞాపనము నంపవలసినదని చెప్పియుందురు. ఇదియే నిశ్చయమైన యెడల కృష్ణశాస్త్రిలవారి బుద్ధివిశేషమును మనము శ్లాఘించవలసియుండును. కాలము ననుసరించి మార్పులు చేయవలసినదని వారు చెప్పిన దాని కనుగుణ్యముగా 1897వ సంవత్సరము మెయి నెలయందేలూరులో సంఘసంస్కరణ సభ జరిగినప్పుడు పంతులవా రగ్రాసనాధిపత్యము వహించియుండఁగా చాతుర్వర్ణములలోని శాఖాభేదములను నాచారమును బాటింపక కలిపి వేయఁబడవలసినదని వేయిమంది జనులయెదుట తాముగా వివరించుట సంతోషసూచకముగదా. ఈసభవలనను విష్ణు శాస్త్రిలవారి సభలవలనను విద్యాసాగరుని చట్టమువలనను స్త్రీపునర్వివాహము లెంతవరకు శాస్త్ర[illegible]ములో చదువరులే గ్రహింపఁగలరు.

ఇదిగాయైన యించుమించు ఆఱువారములకుఁ గాకినాడయం దొకవిద్వత్సభ జరిగినది. కాకినాడ హిందూస్కూలులో నీయాచారము శాస్త్రసమ్మతమని యొకయుపన్యాసము జరుగఁగా నక్కడి కొందరు పండితులు తమకు వారము దినములు గడువిచ్చిన యెడల నందలి సంగతులను బూర్వపక్షము చేసెదమని సెలవిచ్చిరి. మొట్టమొదట హిందూపాఠశాలలో సభ జరుగునని తెలియఁ జేయఁబడిన తరువాతఁ బండితులు దేవాలయమునకేకాని పాఠశాలకు రామని చెప్పినందున, విష్ణ్వాలయములో సభ జరిగినది. ఆహ్వానపత్రానుసారముగా పలువురు పాఠశాలకుఁ బోయియు సభజరుగు చోటు తెలియనందున వెడలి పోవలసినవారైరి. తరువాత పండితులు తమఖండనము నారంభించి పూర్వముచేసిన యుపన్యాసములో నున్నవియు లేనివియుఁ గలిపి యొకగ్రంథము నారంభించిరి. వేదార్థవిచారము ముగియునప్పటికే నాడు ప్రొద్దు గ్రుంకినది. తరువాత మఱునా డుదయమున స్మృతిభాగము నారంభించిరి. గ్రంథము పూర్తియైన తరువాత విధాయకవాదులు దానికిచెప్పు నుత్తరము వినుట కిదివరకే నిశ్చయింపఁబడినను నిషేధవాదులు తమఖండన గ్రంథము ముగిసినమీఁదట "విధాయకవాదులు మఱేమియుఁ జెప్పఁగూడదని వాదింప మొదలుపెట్టిరి. కాని వారిమాట చెల్లనందున మధ్యాహ్నము జరుగఁబోవు సభకు రామనిచెప్పి వారందఱును వెడలిపోయిరి. ఈసభ జరగినస్థలము దేవునిమండపమగుటచేత విశాలముగా లేక వచ్చినకొలఁది మందికయినను మిక్కిలి యిఱుకుగా నుండెను. మఱల మధ్యాహ్నము సభకూడినపిమ్మట స్త్రీపునర్వివాహవిధాయకవాదులు తమపక్షమును స్థాపించుకొనుటకయి యుపన్యసింపఁ బోవుచుండఁగా బ్రహ్మశ్రీమల్లాది అచ్చన్నశాస్త్రిగారను నొకమహాపురుషు లక్కడకువిజయము చేసి సభాధ్యక్షులతో తమన్యాయైకదృష్టి వెల్లడియగునట్లుగా కొంతధర్మోపన్యాసము చేసి, మధ్యవర్తిలేక వాదప్రతివాదములయొక్క బలాబలములు తేలి సిద్ధాంత మేర్పడదనియు, నుభయపక్షములతోను జేరక భగవన్ముఖమునుజూచి నిష్పక్షపాతముగా న్యాయమును తెలుపుటకు సమర్థులయిన తాము మాధ్యస్థ్యముచేయుట కంగీకరించెదమనియు, సభలోనున్న వారందఱికిని భ్రమపుట్టునట్లు కొన్ని తేనెమాటలను జెప్పిరి." ప్రతిపక్షుల యెదుట విధాయకవాదు లుపన్యసింపవలెనని యెంచివారినిఁ బిలుచుటకై శాస్త్రులవారు వర్తమానమునంపిరి. వారువచ్చిన తరువాత విధాయకవాదులు శ్రుతివాదముయొక్క అర్థవివరణముచేయఁగా "శాస్త్రులవారు నిష్పాక్షికమయిన తమయభిప్రాయమును జదువుటకై రొండిని పెట్టుకొని తెచ్చిన కాగితమును పయికిఁ దీసి మడతవిప్పి నిషేధవాదుల కనుకూలముగా తమ యాశయమును జదువ నారంభించిరి. * * * అప్పుడు ప్రతిపక్షులు తా మేమో చెప్పరాఁగా నుపన్యాసము ముగియువఱకును జెప్పఁగూడదని సభాధ్యక్షులు వారిని వారించిరి. అంతట ప్రతిపక్షులు తాము చెప్పినదెల్లను వినెదమని వర్తమానము

చేసి వచ్చినతరువాత నిట్లు చేయుట తగునాయని యడుగఁగా, సభాధ్యక్షులు తాము పిలిపింప లేదనియు, శాస్త్రిగారే తాను మధ్యవర్తిగానుండి న్యాయము తీర్చెదనని తనంతనేవచ్చి మీకు వర్తమానము పంపెననియుఁ జెప్పిరి. అప్పుడు రామశాస్త్రిగారు తాను సభలోనుండి విననని లేచిపోయెను. ఆయనవెంటనే ఓగిరాల జగన్నాథముగారును మఱి యిద్దఱు ముగ్గురును లేచి వెళ్ళిరి. తాను చేసిన మోసముచేత సభలో నుండలేక శాస్త్రులుగారును సంధ్యాసమయమయినదని మిషపెట్టి లేచిపోయెను. రామశాస్త్రిగారు వెళ్ళునప్పుడు కనుసైగ చేసియు స్పష్టముగాఁ జెప్పియు బ్రాహ్మణుల నందఱిని పిలువఁగా తమపక్షముతోఁ జేరిన పదిమందిమాత్రము లేచివెళ్ళిరి. ఆపదిమందియుఁ గొంత దూరము వెళ్ళి యల్లరి చేయవలెనను నుద్దేశముతో మఱల దేవాలయమునకువచ్చి గుమ్మము వద్ద త్రోపులాట కారంభించిరి. అక్కడ కావలియున్న యారక్షకభటులు వారిని కొందఱిని లోపలికివచ్చి యల్లరి చేయకుండ నిలిపిరి. ఇంతలో చీఁకటి పడ్డందునను, గుమ్మమువద్ద నల్లరి జరగ నారంభించినందునను (?) నాటి కుపన్యాసము ముగియకుండఁగనే సభ చాలింపఁబడినది." (వివేకవర్ధని మెయి 1881).

పైని ప్రచురింపఁబడిన దానినిఁబట్టి స్త్రీపునర్వివాహము లెట్లుగా నీరాజధానియం దప్పు డంగీకరింపఁబడినవో చదువరులు గ్రహింపఁగలరు. అంతటి శత్రుత్వమును మూలకుఁ ద్రోయించి సామాన్యముగా సర్వజనులచేత నది యంగీకరింపఁబడునట్లు చేసిన పంతులవారి శక్తి యెట్టిదోకదా! కొన్ని కొన్నిచోట్ల పంతులవారినిఁ గొట్టవలెనని కూడఁ గొందఱు దుర్మార్గులు ప్రయత్నించిరఁట! పైని వివరించిన సభ యట్టిది కాఁబోలదని మాయభిప్రాయము. సత్యము సర్వేశ్వరుని కెఱుక.

ప్రపంచమునందు సాధారణముగా దాముజెప్పుదానినిఁ జేయఁజాలువారు మాత్ర మత్యల్పసంఖ్యాకులైయుందురు. ఒకఆంగ్లేయకవి ఈకారణముచేతనే నేనుజెప్పినది చేయుము. నేనుచేయునదిమాత్రము చేయవలదు అని వ్రాసియున్నాఁడు పంతుల వారికిని నీరాజధానిలోని యితరు లనేకులకును గల ముఖ్య తారతమ్య మీవిషయమున సులభముగా తెలియవచ్చును. స్త్రీపునర్వివాహము లవశ్యకర్తవ్యములని యుపన్యసింపఁజాలు నుద్దండులగు వక్తలను బదివేలమంది నీ నిముషమున నిక్కడ నిలుపవచ్చునుగాని, ధైర్యసాహసములతో నీకార్యములను నడుప సాహసించినవా రాయనఁగాక మఱి యొకరు ఈ యుత్తరసర్కారులలో లేరు. కూడనున్నవా రందఱును వెనుదీయక యింటికొక్కొక్కవివాహమును జరిపినను అన్యాయముగా తమభర్తలను బోఁగొట్టుకొన్న యనాథశతములకు మఱల పసపు కుంకుమలనిచ్చి యుద్ధరించిన ఫలము దక్కియుం

డును. చెప్పువారందఱును జేసినయెడల వారి కేవిధములగు చిక్కులును లేకయేయుండును ఒక్కరేనైన యెడల కష్టముగాని పదిమందియుఁ జేరినప్పుడు చిక్కేమి ? లోకనిందయంటిరా సత్కార్యము చేయునెడ వేయిమందివారి యిండ్లకడ నవ్వుకొన్నను సంఘీభూతులగు మిమ్ముల నేమి చేయఁగలరు ?

పంతులవారికి మొట్టమొదట నీవిధముగా చిక్కులు వచ్చినతరువాత మనవారివలె మాటలతో సరిపుచ్చక యాయవకార్యములనుగూడ జరుపవలె నని ప్రయత్నించెను. ఆకాలమునందుఁ గృష్ణాజిల్లాలోని యొకానొకరు తమ బాలికకు వివాహము చేసెదమని చెప్పిరి. బహుకష్టములఁ బడి యర్ధరాత్రమున బాలిక తల్లి సహాయమున నా బాలికను గొని వచ్చి రాజమహేంద్రవరమున పంతులవారిచే నియుక్తులైనమిత్రు లామె నాయన కడకుఁ దెచ్చిరి. ఇదియే చెన్నపురిరాజధానిలోని మొదటి గొప్పపునర్వివాహము. వితంతు వొకతె వివాహము చేసికొనుటకయి వచ్చిన దనఁగానే యాయూరిలోని ప్రజ లందఱును నబ్బురవోయి యామెను జూచుటకయి గుంపులుగుంపులుగా బయలు దేఱిరి. ఆతరువాత పురజనులు వంటబ్రాహ్మణులను రానీయమనియు, నక్కడికి వెళ్ళినవారి కందఱికి వెలి వేసెద మనియుఁ బెక్కువిధముల బెదరించి తమచేత నైనంత వఱకు కార్యవిఘాతము గలిగింపఁ జూచిరి, ఎంతవిపత్తు వచ్చినను వెనుక దీయక పంతులవారు సమయమునకు రామకృష్ణయ్యగారంపిన వేయురూపాయిలసహాయమువలనను వివాహమును జరిగింపఁ బ్రయత్నించిరి. ఆకాలమున నాయూర నేకళాశాలయందు విద్య నభ్యసించుచున్న గోగులపాటి శ్రీరాములుగారను నాయన తా మీకన్యకను వివాహమాడ నిశ్చయించిరి.

అంతట 1881 వ సంవత్సరము డిసెంబరు నెల వచ్చెను. ఆనెల పదియవతేదిని రాత్రి యెప్పుడు తెల్లవారునా యని విధాయకవాదు లత్యాత్రముతో నెదురుచూచుచుండిరి. పవిత్రమయిన తమ సంఘమునం దుదయముకాఁగానే వారియభిప్రాయము ప్రకారముగా నొకయకార్యము జరుగఁబోవుచున్నందున యారాత్రియే నిషేధవాదులకుఁ బోటుగా నుండెను. ఎప్పుడు తెల్లవాఱునా యని యెదురు చూచుచున్న విధాయకవాదుల కారాత్రి యెంతకును దెల్లవార దయ్యెను. పదిగంటలు లెక్కపెట్టుచుండఁగనే నిషేధవాదులకుఁ బదునొకండవ గంటకూడ విన వచ్చుచుండెను. రాత్రి యంతయునుగూడఁ బంతులవారియింట పెండ్లి పనులు జరుగుచునేయుండెను. ఉండఁగా నుండఁగా నంతట నూతన వధూమణి కీశ్వరుఁ డనుగ్రహించిన తిలకమో యనునట్లు ప్రాగ్భాగమునందు దేదీప్యమానముగా వేఁగుచుక్క వెలుంగ నారంభించెను. బొమ్మల పెండ్లివలె చేసిన యా వివాహాడంబరము వివాహము కాదని నేడు స్వచ్ఛమగు వివా

హమున కీశ్వరుఁ డంపిన వందిగాయకసందోహ జయజయనినాదములు నా శుకపికాదివిహంగములు మధురనిస్వనములు సేయుచుండెను. నిషేధవాదుల యాశలు దిగఁ జాఱినకొలఁదిని మింట నక్షత్రములును దిగఁ జాఱసాగెను. వివాహకాలము సమీపించుచున్నది రండో యని లోకములఁ గూక లిడుట కీశ్వరుఁ డంపిన ధర్మభటనికాయమో యనునట్లు లోకానందకరముగా కమ్మతెమ్మెరలు విరికమ్మలతో సంచరింపసాగెను. క్రమక్రమముగా స్త్రీపునర్వివాహసదాచారమీభూమిని నాఁటి యజ్ఞానమును బో నడుచు ననుటకుఁ దార్కాణముగా మెల్లమెల్లన నిశాంధకారమును దొలఁగ సాఁగెను. అంతట నీవివాహములవలన నజ్ఞానతమము తనసస్మృతిచే నశించునని విధాయకవాదుల కీశ్వరుఁడు జూపిన పసిఁడిపతాకనా దేదీప్యమానమై సూర్యబింబంబు పొడసూపె. మలయపవనునివలన నీశుభవర్తమానమును విని స్థావరములుకూడ నానందించెనాఁ బద్మములు వికసించి యామెముఖపద్మమున కూడిగములు సేయఁ జొచ్చెను.

అంతట హిందూసంఘదురాచారదుర్గము నొకమూలనుండి భేదించి వైచు 11వ డిసంబరు ప్రవేశించెను. సదాచారప్రతిష్ఠాపనమున కాలవాల మైన యీసుదినమున రాజమహేంద్రవర మంతయు నీవార్తతోఁ బొరలుకొనుచుండెను. ఆదినముతోనే హిందూవితంతుసుందరుల కొందలము లడఁగించు ధర్మాత్ముని పేరు రాజమహేంద్రవరమునఁ బ్రతివానినోటను నుచ్చరింపఁబడుచుండెను. చీకిపోయినసంఘమును మఱలఁ గట్టి బఱుపఁ బ్రయత్నించిన యీరాజధానిలోని దేశాభిమానుల కెల్ల నుత్తమోత్తమ మైనదిన మదియే. అజ్ఞానమును బో నడఁచి సుజ్ఞానమును బ్రతిష్ఠించి, లోకమునందలి యంధకారము నంతను మ్రింగి వైచి వితంతువివాహములకుఁ దొలిపంట నిచ్చిన దిన మదియే. తమకు హితమును గోరుచున్నను నది ప్రియము కాలేదని యెంచి ఆచారవివశులయి యీకార్యమును దూషించుచున్న జనసమాజము క్రూరవాక్కుల సత్వమును దెలియఁజాలిన దీదినమే. అట్టి యీ 1881వ సంవత్సరము డిసంబరు నెల పదునొకండవ తారీఖున మంగళాయమానముగా సమస్తగీతవాద్యములతో శుభప్రదముగాఁ జరుపఁబడిన యీకల్యాణమునందు నిత్యసువాసినులే లేనియెడల నిది మఱియును నుత్తమమయి యుండియుండవచ్చును. ఈవివాహము జరిగిన కొద్దిదినములకే మఱియొకవివాహము జరిగినది. మూఁడవవివాహమునందుఁ బ్రతిపక్షులు తప్పుసాక్ష్యము లిచ్చుట కైనను జంకలేదఁట. ఈవిధముగా నొకటివెనుక నొకటిగా పెక్కువివాహములను జరిపి శ్రీవీరేశలింగము పంతులవారు కార్యకారి యగు నొకసమాజమును జెన్నపురియందుగూడ స్థాపించుటయేకాక 1898వ యేట నొకవితంతుపోషగృహమునుగూడ నిర్మించుట యాయన యాచరణదీక్షకు సాక్ష్యముగదా!

స్త్రీపునర్వివాహములయందు బాలురు చేసినసహాయమునుగూర్చి యొకయించుక చెప్పవలసి యున్నది. రాజమహేంద్రవరమున నీవిషయకము లగుప్రసంగము లారంభమైనతరువాత పంతులవారిని పెక్కుస్థలములయందుఁ గంటికి ఱెప్పవలెఁ గాఁచినవారు బాలకులు. వివాహసమయమునఁ బల్లకిపై ఱాళ్ళురువ్వినను, ఇంట నల్లరి చేయఁబోయినను, నిషేధవాదు లెంతటి ద్రోహములను దలపెట్టినను గూడ వారివలనఁ బంతులవారి కెట్టియాపదయును రాకుండఁ గాఁచినవారు బాలురు. వితంతువు లున్నచోటులకుఁ బోయి, వారితో మాటలాడియుఁ గొనివచ్చియు, వారికి సర్వవిధములఁ దోడుపడినవారు బాలురు. సర్వకార్యములందును వారు చేసినసహాయము పంతులవారి జయమునకుఁ జాలమట్టుకు సహకారి యైనది. ఇప్పటికాలమునఁగూడ బాలు రిట్టిదీక్షవహించిరేని దేశము బాగుపడుటకు సందేహ మేమి?

ఈసంగతి ముగియుపూర్వమే సంతోషకరమును ఘోరవిచారకరమును నగు నొకవార్తకూడఁ దెలియఁజేయవలసియున్నది. కాకినాడలోని వర్తకు లగు శ్రీ పైడా రామకృష్ణయ్యగారు ముప్పదివేలరూపాయిల నిచ్చెద మని వాగ్దానము చేసిరికదా? ఆ విధముగా నాయన వితంతువివాహములకును, తద్దంపతులపోషణమునకును నిరువదివేలరూపాయల నిచ్చినతరువాత నకాలమునం దాయనకు మరణము సంభవించెను. మరణకాలమునందును నాయనవితంతువులను మఱచిపోక చాలకాలమునుండి రాజమహేంద్రవరమున డిస్ట్రిక్టు మునసబుగానుండి ఈకార్యమునకుఁ దోడు చూపిన వైశ్యకులాగ్రణి యగు నాత్మూరి లక్ష్మీనరసింహము (యిప్పుడు సోమయాజుల; గారినిఁ బిలిచి, యాయనపరముగా పదివేలరూపాయిలు నొసఁగి వానిపైవడ్డిని ఈవివాహాదులకుఁ గర్చుపెట్టుటకు మరణశాసనమును వ్రాసిరి. అట్టిసహాయుని కంకితముగా వితంతుకష్టములను దెలుపు నొకచిన్నగ్రంథమును పాడి వెంకటస్వామిగారు కృతి యిచ్చుట కేమి యద్భుతము. రామకృష్ణయ్యగారే బ్రదికియున్నయెడల నింకను నీవివాహముల కెట్టిప్రోత్సాహము నిచ్చునోకదా? రామకృష్ణయ్యగారి మరణశాసన మీదిగువను దెలిఁగింపఁబడినది. చదువరులు దీనినిఁబట్టి యాయనదీక్ష నెఱుఁగఁ గలరు.

"పైడా చలమయ్యకుమారుఁడ నైన కాకినాడపురవాసుఁడ నగు రామకృష్ణయ్య అనే నేను రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దర్ గారిచే మూఁడవమార్చి 1886వ సంవత్సరమున చేయఁబడిన మొత్తము పదివేలరూపాయల కిమ్మతు గల రెండుహుండీలను మీపరము చేసి, ఆధనమునకు మీరు స్త్రీపునర్వివాహప్రవర్తకసమాజము తరఫున ట్రస్టీగానుండవలెనని కోరుచున్నాను. ఆసొమ్ముమీఁది వడ్డీని మీరు, పునర్వివాహములకు, అట్టివివాహితులలో భర్తలకు, విధవలకు, పిల్లలకు, పోషణకొఱకు వినియోగించవలసినది. ఒక్కదమ్మిడి నైనను అసలునుండి వెచ్చింపరాదు. ఇంకా దీనిని పునర్వివాహాభివృద్ధికై మీబుద్ధికొలఁది వినియోగించి మీతదనంతరముగూడఁ జిలకాల మిది జరుగునట్లు చేయవలెనని మిమ్ములను కోరుచున్నాను." మా భాషాంతరీకరణము తొందరగా వ్రాసిన దగుటచేఁ దప్పు లుండవచ్చును. కావున నింగ్లీషునుగూడ నిందుక్రింద వ్రాయుచున్నాము.

"I Pyda Ramakrishnayya, son of Pyda Chelamayya, do hereby entrust you with two Hundees executed by Rajah Venkatadri Apparao Bahadur garu, on the 3rd March 1886 to the value of Rs 10,000 (Rupees ten thousand only) and request you to act as trustee for the Widow Marriage Association, so that, you may use the interest to be realised from the above sum in the support of remarried widows and their husbands and their children, and for bringing about widow marriages; but not a single pie should be spent from the principal. I further request that you should do this business to the best of your ability and discretion for the improvement of the Widow marriage cause and that you should make such arrangement that the object might be carried on in perpetuity ever after your demise.

18th March 1886,
Cocanada.

(Here there is the signature of
P. RAMAKRISHNAYYA.)

(Copied from the report of the Widow marriage Association, Rajahmundry.)

ఈవిధముగా చెన్నపురిరాజధానియం దివి జరుగ నారంభించినవి. తరువాత దక్షిణాదిని మదరాసున దక్క మఱియెక్కడను లేకున్నను నుత్తరాదినిమాత్రము వంగదేశమునఁ దక్క యెల్లెడలను నివి యందందుఁ జరుగుచున్నవి. పాంచాలదేశమునను బొంబాయియందును మఱియు నెక్కుడుగా నున్నవి. పంజాబున నార్యసమాజికులవలన దివానుశాంతారాంప్రముఖు లిట్టిపనికిఁ బూనినందున నిది చక్కఁగా నక్కడ వృద్ధినందుచున్నది. "అగ్రవర్ణపు హిందూస్త్రీ" యనుపేర సంఘసంస్కరణసమాజముల కమూల్యధన మగు నొకగ్రంథమును రచించినపండితరామాబాయి సరస్వతి యనునామె శారదాసదనమని వితంతుగృహ మొకటి నిర్మించియున్నది. అట్లే వంగమున బాబూ శశిపాదబ్యానర్జీగారు వే ఱొకవితంతుగృహమును నిర్మించియున్నారు. బ్రాహ్మసామాజికులలో నిష్టమునుబట్టి వంగదేశమున నీవివాహము లాచారముగాఁ జరుపఁబడుచున్నవి. పూనాసతారా మొదలగుచోట్లగూడ పెక్కుపనులు జరుగుచున్నవి. ఎట్లయినను చెన్నపురిరాజధానినిఁబట్టి చూచినయెడల నంతగా నాచరణదీక్ష కానిపించదు. అందుచే

నిది యెన్నాళ్ళకు ఆచారముగా నెలకొనునో చెప్పఁజాలము. ఆచరణము లేని హేతువుచే నేయుపద్రవము వచ్చినను మహాత్ములు తొలఁగిపోవుదురు. కావున నింకను నివి యింతకాలమునకు నాఁటుకొనునని మేముదృఢముగాఁ జెప్పఁజాలము. అయినను నీవిధముగనే దేశ మున్నయెడల నిఁక నొకశతాబ్దమునాఁటి కిది బాగుగా దేశమున నాఁటుకొని యప్రయత్నముగా ఫలముల నిచ్చునని చెప్పఁగలము. ఓవితంతువులారా! మీరుగూడ నీప్రయత్నములకుఁ దోడు సూపి నిలిచితిరేని తప్పక మీకష్టములు గట్టెక్కును. మీకష్టము లీశ్వరకృతములు కావు. ఆయన దయామూర్తి. సౌఖ్యముల ననుభవించుటకుఁ గాకున్న మీ కాయన కామాదులను దయచేయకనే పోవును. స్త్రీజన్మము పురుషుని కుపకారమున కయి గాని, లేనియెడల మిమ్ముల నీశ్వరుఁడు సృజింపకయే పోవును. కావున నిశ్చలమతులై ఈశ్వరునిఁ బ్రార్థింపుఁడు. ఆయన మిమ్ములను దప్పక రక్షించును. అప్పుడే మందారమంజరియు రాజమహేంద్రవరములో పదమూఁడుసంవత్సరముల ప్రాయము గలయొకబాలవిధవ పునర్వివాహమును చేసికొనుట కొప్పుకొనఁగా బంధువు లాచిన్నదానికి క్షురకర్మ చేయించి రనియు, వివాహమాడుట కంగీకరించిన పురుషునకు దేహశుద్ధి కావింపఁబడిన దనియు నాలింపఁ జాలదు. అప్పుడే గుంటూరులోని పూర్వాచారపరాయణుఁడును స్త్రీపునర్వివాహిత లందఱును దుష్ప్రవర్తన కలవారే యనియు, భర్తలకు జాడ్యములు కలిగించినవా రనియు శ్రీ సన్మార్గబోధినీ పత్రికకు అసత్యప్రలాపముల నంపఁ బోఁడు. ఓపరమదయాకరుఁడా! బాలవితంతువులను సంరక్షించుటకు నీయదియ భారము. నీచేత సృజింపఁబడిన నీసేవకురాండ్రకు అన్యాయముగా వచ్చిన యీమహదాపదనుదొలఁగించి వారలనుగాఁచి రక్షింపుమా!

ఆఱవ ప్రకరణము.

నీతివిషయములు.

వల్లభాచార్యుఁడు.

సాధారణముగా జ్వరబాధితులకు జ్వరము తగ్గినవెనుకగాని శరీరములోని బలహీనత తెలియదు. అంతవఱకునుగూడ సంధిపట్టి ఇంట నిలువక శరవేగముతోఁ బరువు లెత్తుచు, అఱచుచు, పదిమందిమనుష్యులు వచ్చి పట్టుకొన్నను వారిపట్టును విదిలించుపాటి బలమును జూపువాఁడుగూడ నాజ్వరము తగ్గఁగానే డస్సిపోయి, మూలుగుట కైన శక్తి లేక పడిపోవుచుండును. ఘుళఘుళారావములతో శ్రవణభీషణములై, జ్వాలావారము లాకాశమార్గము నంటుచున్నవో యనునట్లు ప్రజ్వలించుచు, గ్రీష్మకాలమున గృహములను దగ్ధము చేయునప్పుడు అట్టిగృహయజమానుల కైనను మంచియాలో

చనలు తోఁచవు. గజేంద్రుని కష్టమును విన్నప్పుడు మీఱరాని తొందరతో కృష్ణుఁడు సిరి కైననుఁ జెప్పక, శంఖచక్రములను ధరింపక ఏపరివారము నైనను జీఱక వాహనము నైనను బూన్పకయే వెఱ్ఱివానిగతి సంచరించినట్లు పోతనామాత్యుఁడు తనయాంధ్రభాగవతమున వ్రాసియున్నాఁడు. ప్రాణాంతములగు దురాచారములు 'మనది' అని మనము చెప్పుకొనఁ జాలిన 'మనహిందూసంఘమునం దున్నకాలములో అల్పములగునితర దురాచారములు మన కెట్లు గోచరింపఁ గలవు? దినదినగండము వెయ్యేళ్ళ ఆయువు, అని మన స్త్రీలు అనుకొనుచుండుటకు ముఖ్యకారణ మిదియేగదా. నరాంతకు లగు విప్రాధముల నిర్ణీత దురాచారములు చల్లని హూణప్రభుత్వము కలిమివలన అడఁపఁబడఁగానే ఇతరదురాచారములనుగూర్చి తలపోయుటకును, తొలఁగింపఁ బ్రయత్నించుటకును అవకాశము చిక్కినది. అట్టిదురాచారములలో మొట్టమొదటిది వితంతు పునరుద్వాహవిషయిక మయినదని మూఁడవప్రకరణమునందు వ్రాసియున్నాము. మాకుఁ దెలిసినంతవఱకు మొట్టమొదట నారంభింపఁబడిన దీ విషయ మైనదే యైనను, ప్రాముఖ్యతయందు నీతివిషయములు మొదటివిగా నెన్నఁదగి యున్నవి.

నూరుసంవత్సరములక్రిందట హిందూసంఘము బలవన్మరణాది దురాచారములతో నెట్లు చెడిపోయి యుండెనో హిందూమతమును నట్లే నీతివిరహితమై యెన్నరాని తుచ్ఛప్రవర్తనల నామోదించుచుండెను. అందును ఇప్పటి మనభక్తులకును, దివ్యజ్ఞానులకును నద్వితీయ పరమపురుషుఁ డైన శ్రీకృష్ణభగవానుల ముఖ్యారాధనము కలచోట్ల నీతిసంగతి పచ్చి బూతుగా నుండెను. హిందువుల దేవతలుసహితము నీతిమాలినవారై అప్సరస్త్రీలను అంకుటాండ్రతో సిగ్గు లజ్జలు లేక బాహాటముగా వ్యభిచరించినట్లు పురాణకారులు విచిత్రవర్ణనలు చేసి కీర్తి గాంచుచుండిరి. మూర్తిత్రితయమని యూరూరఁ బూజలు గాంచు బ్రహ్మ విష్ణుమహేశ్వరులుఁగూడ నసత్యవ్యభిచారాది పాపపంకిలులై యున్నట్లు చెప్పఁబడుచుండెను. పురాణశ్రవణ మనుపేర చంద్రుఁడు గురుపత్నీద్రోహి యనియు, ఇంద్రుఁడు అహల్యా జారి యనియు, నిట్టివ్యభిచారవాక్యములను వినుట కాకాలమున వంశోన్నత లగు స్త్రీల కైనను సిగ్గు లేకుండెను. పురాణములలోని మూఁడేసిముక్క లెంతసేపు వినమని ఘోషించు దురాలాపప్రియు లగుమానవసింహుల సంతతోపయోగార్థమై కుచకచ సంభోగాది వర్ణనాపవిత్రము లగుతారాశశాంకములును, అహల్యాసంక్రందనములును, విరచింపఁబడి యింటింటను వృద్ధులను బాలురను జేయుమాత్రలై యుండెను. ఇంతటితో తమనీతి చాలదని కొందఱు మహానీయులు వశ్యౌషధములతోను మంత్రములతోను—నిండినకొక్కోక మనుకళాశాస్త్రమును వారివారిభాషలలోనికి మార్చి, శ్రీకృష్ణార్పణముగా నింటింటను దానిని వ్యాపింపఁజేసిరి. నీతిమాలిన ఈరీతిపుస్తకములే నిరాతంకముగా నెల్లహిందువులకు నాహారపా

నీయములై యతిప్రియముగా నుండెను. మఱికొందఱు హిందువులు దృష్టిదోష మను నెపము నొకదానినిఁ గల్పించుకొని వస్త్రహీనముగా హిందూస్త్రీల విగ్రహములను దేవాలయములపై నిర్మించి, తమదేశపుస్త్రీల మానప్రాణములపై తమకుఁ గలయుదార గౌరవమును వెల్లడించికొనిరి. అంతటితోఁ దృప్తినొందక మఱికొందఱు పాపిష్ఠి పిశాచములు స్త్రీపురుషవిగ్రహములను కళారహస్యముల నేర్పున నిర్మించి, హిందూమతమునకును తద్దైవములకును నూతనకీర్తిని ఘటించి తరించిరి. ఇట్టితుచ్ఛవిగ్రహములు గల కొన్నియాలయములు దేవతానిర్మితము లనికూడ గౌరవింపఁబడి, నిజముగా దేవతలే యెన్నఁడైన నుండిరేని వారినీతి ఆచారము మొదలగువాని దుష్కీర్తికి శిలాశాసనములై యున్నవి. అంతటితోను తృప్తిఁ జెందక మమకారవివర్జితులగు మఱికొందఱు భక్తులు ఈశ్వరభక్తిచే నాత్మపుత్రికలను దేవతార్పితము చేసి, వారిచేత స్వామికి కైంకర్యమును జేయించుచుండిరి. ఈవిధముగా దేవదాసీత్వము వహించి వారెంతభక్తితో స్వామి కూడిగములు చేసిననుఁగూడ, నాతఁడు వారికామాదిషడ్గుణముల హరింపఁ జేయక ఘృతశర్కరాద్యాహారవస్తుమిశ్రితప్రసాదముల నవ్వారిగా నొసఁగి యరిగుణములను వృద్ధి చేయించుటచేఁ గొన్నాళ్ళకు వారందఱు వ్యభిచారిణులై యిప్పటి మనభాగ్యవంతులకుఁ బెక్కండ్రకు యిలువేలుపు లగుచున్నారు. ప్రప్రథమమున నీదేవదాసీత్వము నందినవారు గౌరవార్హులై మాతృరీతుగాఁ బూజింపఁబడుచు, నల్పనేరములకుఁగూడ నతికఠినముగా దండింపఁబడినను, కాలము పోనుపోను యెల్లయాచారములకువలెనే దీనికిని మొదటియభిప్రాయము మాఱిపోవుటచే, వీరు శృంగారరసావతారులగు కృష్ణకుమార పూజకుల గౌరవముల కర్హులు కావలసివచ్చినది. వ్యభిచారవృత్తిచే జీవనము చేయు నీఱంకుటాండ్రే తమకుగృహదైవతములైనట్లుగా మాటలాడువారికీ యిరువదవ శతాబ్దమునందే సిగ్గు లేనప్పుడు పూర్వకాలములో నెట్లుండునో మేము వివరింపఁ బని లేదు. మతము పేరిట వ్యభిచారములు జరుగునట్లే త్రాఁగుడులుగూడ కొంతకాలమున కందం దారంభించినది. ఋగ్వేదములో నొకమండలమంతయు సోమలతాపాన మాహాత్మ్యమునకు వినియోగింపఁబడినది. తరువాత క్రమముగా సురాపానాదులుగూడ మనలో నారంభమైనవి. వేదవిద్యాపారగులైన మహర్షులు సహితము నిట్టి పానమును మానకుండిరి. బృహస్పతికుమారుని చంపి, కాల్చి యాబూడిదను గల్లుతోఁ జేర్చి శుక్రాచార్యునికి దాహమిచ్చుటను, నది మొదలు బ్రాహ్మణు లెవ్వరు మధుపానము చేయఁగూడదని శపించుటను పురాణపఠనాకుతూహలులైన మనవారలెల్లరును ఎఱిఁగియే యుందురు. నీతిమాలిన వామాచారమతస్థులవంటి మఱి కొందఱు త్రాఁగుడునుగూడ మతముయొక్క ముఖ్యాంగముగాఁ దీసికొని నూతనమతములనుగూడఁ గల్పించుకొనిరి. తొల్లియొక్క బ్రాహ్మణుఁడు నడియెండవేళ ప్రయాణము చేయుచు పిపాసాపీడితుఁడై మార్గమధ్యమున

నాలుగుద్వారములుగల యొకయింటినిఁజూచి, యచటికరిగి వేశ్యామాంసాది సంసేవనములలో నేదేనియొక్కటి చేయకున్న దాహమీయఁబడదని విని తుట్టతుదకు మధుపానమున్నిటికంటె తక్కువపాతకమైనదని భ్రమించి, దానినిఁ ద్రావి మైకముచే నొడలు తెలియక మొదట తాను విసర్జించిన మాంసభక్షణము వేశ్యాసంపర్కము మొదలగు వానికిఁగూడఁ బాల్పడెననుకథ నూతనమైనదిగాదు. అయినను మధుపానముమాత్రమే కాక యితర దురాచారములనుగూడఁ గొంతకాలమునకు మతసిద్ధాంతములుగా మార్చి కొందఱు కృష్ణావతారులు నూతనమతములను సృజించుచువచ్చిరి. హిందూమతమంత యుత్కృష్టతరమైనమతము వే ఱొక్కటిలేదని గంభీరోపన్యాసములు చేయు మతోద్ధారకు లందఱును దమమతములోని వల్లభాచార్యకులజుల యాచారములను, దద్గురువులగు కృష్ణావతారుల నీతివర్తనములనుగూడ హిందూమత మనుపేరఁ నెట్లు సహింపఁ గలిగిరో తెలియకున్నది. వేయేల? మతమే హిందువులను దేవదాసీజనమునకు దాసానుదాసులనుగాఁ జేసినది. మతమే బూతుబొమ్మలకును ఆముష్మిక పూజనాస్థలములకును పుస్తెముడివెట్టినది. మతమే హిందువులకును అసత్యమునకుఁ జుట్టఱికము గొనివచ్చినది * మతమే త్రాఁగుడులకు దారిచూపినది. తుట్టతుదకు మతమేకొన్ని తెగల హిందువుల స్త్రీలను దమగురువులతోడి జారత్వదోషమునకుఁ బురికొల్పుట పరమపవిత్రముగా నెంచి వారలను నిజమైన కృష్ణావతారులను జేసినది.

ఇట్టి నరపశువులకుఁగూడ నయోగ్యమగు వల్లభాచార్యమతమును స్థాపించినవాఁడు వల్లభాచార్యుఁడు ఈతఁడు 1479వ సంవత్సరమునందు లక్ష్మణభట్టను నొకత్రిలింగ బ్రాహ్మణునకు ద్వితీయపుత్రుఁడై శ్రీకృష్ణుని యపరావతారముగా జన్మించెను! ఈతని జన్మభూమి చంపారణ్యము. ఈతఁడు తన యాఱవయేట నారాయణభట్టను నొక బ్రాహ్మణునివద్ద విద్యారంభము చేసి, శ్రీకృష్ణావతారుఁడే యగుటవలన నాలుగుమాసములలోనే సమస్తవిద్యలను నామూలాగ్రముగా గ్రహించి, తండ్రిమరణానంతరమునఁ దన తల్లి యనుజ్ఞనుగొని పన్నెండవయేట నదివఱకే తాను నిర్ధారణము చేసికొన్న మతసిద్ధాంతములను వ్యాపింపఁజేయుటకై స్వస్థానమగుగోకులమునుండి బయలువెడలెను. తరువాత నితఁడు పోయిన చోటనెల్ల విజయమునందుచు, విజయనగర సంస్థానాధీశుఁడగు కృష్ణరాయనిపండితమండలిని ఓడించి, యచటి వైష్ణవులకు గురువై ఆచార్యబిరుదము నందెను అంతటినుండియు వల్లభాచార్యుఁ డనునామముతో నతఁడు దేశసంచారమును జేయుచు, శ్రీకృష్ణుఁడు తనకు నిజరూపముతోఁ బ్రత్యక్షమై బాలకృష్ణారాధన

---

*గీ. వారిజాక్షులందు వైవాహికములందుఁ। బ్రాణవిత్తమానభంగమందుఁ
జకితగోకులాగ్ర జన్మరక్షణమందు। బొంకవచ్చు నఘము పొంద దధిప.

భాగవతము.

ఘును నెలకొల్పుమని నియమించిన నాటినుండియు, నాయారాధనమునకై పాటుపడుచుండెను. తరువాత భాగవతమును బ్రమాణగ్రంథముగా స్వీకరించి, ఈతఁడు భాగవతభాష్యమును వ్రాసి విమతవాదములను ఖండించుచువచ్చెను. ఈతఁడు కొంతకాలమునకు పిమ్మట సంసారమోదితుఁడై వారణాసీనగరమునందు శ్రీమహాలక్ష్మినిఁ బరిణయమై యిఱువురు పుత్త్రులనుగూడఁ గాంచియున్నాఁడు.

ఎల్లమతగురువులవలె నీతఁడు విరాగియై బోధింపక, శ్రీకృష్ణుని లీలల నన్నింటినిఁ గాంచి, తదవతారమగు తనయందుఁగూడఁ గృష్ణాంశమును గొంతభాగము చూపియున్నాఁడు. ఇప్పటి మన యంతరర్థవేదులగు మహనీయులు శ్రీకృష్ణుని దుష్టచర్యల కెట్టియర్థములను దీసి సమర్థించినను, వీరికంటెనుఁ దెలివితక్కువవాఁడే యగు వీరిపూర్వుఁ డొక్కఁడుమాత్ర మాయర్థములను గ్రహింప లేక స్వభాష్యములనుగూడ వ్రాసి నూతన మతప్రతిష్ఠనే చేసియున్నాఁడు. అయినను వల్లభాచార్యమతమును స్థాపించుటలో నాతనికి దురూహ లేమియు లేవు. అతని కాలమునం దామతములో వినరాని దురాచారములును బ్రబలియుండలేదు. ముక్తికిని మనశ్శుద్ధికిని వైరాగ్యము ప్రధానముగాదనియు, గురుశిష్యు లిరువురును దిగంబరులుగాక అమూల్యవస్త్రాభరణాలంకృతులై సరాగులై యిష్టాహారులై ప్రాపంచిక సుఖముల ననుభవింపవచ్చుననియు, ఏకాంత సేవకంటె జనసంఘముతోఁ గలిసి పూజించుటయే ధర్మవిహితమనియుమాత్ర మాతఁడు బోధించెను. కాని అధర్మానుష్ఠానమునకు యుక్తములగు బీజములన్నియు పై సిద్ధాంతములందే యణఁగియుండుటచే నానాట నామతమున కిట్టి దుర్గతిఁ బట్టినది. వల్లభాచార్యుని మరణకాలమునాటి కాతనికి 84 గురు శిష్యులుమాత్రమే యున్నను, తఱువాతి గురువును వల్లభాచార్యుని ద్వితీయపుత్త్రుఁడునునగు విఠలనాథుని మరణకాలమునాటి కిం దించుమించుగా 250 మంది శిష్యజనముండిరి. విఠలనాథుని మరణానంతరమున నాతని యేడ్గురు పుత్త్రులును చీలిపోయి 7 పీఠముల కధీశ్వరులై మహారాజులను నామములను వహించి నిరంతర భోగాయత్త చిత్తులైరి. నానాఁటికి మతవ్యాప్తి కానుకాను మహారాజులసంఖ్య వృద్ధియై 1865వ సంవత్సరము నాఁటికి ఇంచుమించుగా డెబ్బదిమందిని భోగపురుషులను జేసినది. దుర్మదాంధులై, నీతివిరహితులై ఘోరపాపాత్ములైన ఈమహారాజులు శ్రీకృష్ణుఁడు గోపికామానహారియైనట్లె తాము శిష్యస్త్రీమానహారులై తాము పోయిన ప్రతిచోటను బీఠమును బడక గదినిఁ గూడ విచారించుకొనుచుండిరి. అక్కటా! నీతి కిరవగుమతమున కెంతటి దుస్థితిఁ బట్టినది! మూఢపశువు లగు శిష్యజనములు మహారాజులయొక్క స్పర్శగౌరవము నందిన స్త్రీజనములను బరమపవిత్రతతోఁ జూచుచు, ఎవ్వని భార్య అట్టివ్యభిచార

గౌరవము నందెనో ఆతఁడు తనకులము తరతరములవరకు తరించెనని యుత్సహించుచుండెను. అంతటితో సరిపోక యీదుష్టమహారాజులు ఆత్మకు దారాపుత్త్రికాది భేదములు లేవని సమర్థించి వేదాంతవాక్యములను వ్రాయుచు, గుర్వర్పణము చేయక ఏధనమునుగాని (భార్యాదులనుసహా) శిష్యు లనుభవింపరాదనికూడ చెప్పుటకు సాహసించిరి. వీరివిషయమై యొకానొకగ్రంథమునం దిట్లు చెప్పఁబడినది.

“శీతాకాలములో కాల్యములఁ దీర్చుటకు గుడితలుపులు రాత్రి నాలుగుగంటలకు తీయఁబడును. అప్పటికే విస్తారసంఖ్యలుగా వచ్చు స్త్రీలతో రతిరహస్యముల మాట్లాడి కార్యము జరుపుకొనుట కది ముఖ్యసమయము.........ఈమహారాజ మతావలంబులైన భట్టియాలు, బనియాలు, సోహనులు, ముల్తానీలు, సేవకులను పేరఁ బరగుదురు...... తమగేహములందు ప్రత్యేకముగా పూజలు జరుగునప్పుడే యందగత్తెలైన స్త్రీలు దర్శనార్థము రాఁగా వారిమీఁద భగ్గుండను (గులాల్) చల్లి చేతిలో చేతిని వైచి పట్టుకొని అత్తలు మొదలగువారి యురములపై వానిని రాచి, మహారాజులు తమవాంఛ యేమానినియం దున్నదో తెలియఁ జేసి నాఁటిదిన మాసుందరితో ఇష్టోపభోగములఁ దేలుచుందురు ....మధ్యాహ్నము రెండుగంటలకు జరుగు ఉద్ధాపనసమయమునకు వైష్ణవనారీరత్నములు, వారి సుతలు జనానాఖానాలో మహారాణుల(మహారాజులభార్యల) సందర్శించుటకు వస్తారు. ఆ వచ్చినవారిలో కొందఱు ఫలాహారములను, రజతపాత్రములో క్షీరమును, ఇతరపదార్థములను గొని మహారాజుల శయ్యాగృహమునకుఁ బోవుదురు. వారిలో నదృష్టవంతులగువారు మహారాజుల నఖక్షతదంతక్షతములకు లోనయి పూర్వముకన్న పావనదేహులయి మఱలివత్తురు. తమశిష్యులతో వెలుపల మహారాజులు మాటలాడుచుండఁగా సుదతీరత్న మెవ్వతెయైన వచ్చినచో, వెంటనే వారు జనానాఖానాలోనికిఁ బోయి, యామె సమర్పించు కానుకలం బరిగ్రహించి విధ్యుక్తమైనకర్మల నామెతో ననుష్ఠించి పంపివేతురు.........వారు (=మహారాజులు) ఉమియు తాంబూలమును శిష్యు లందఱును మఱల నములుచు దానిని పోగుచేసి దాఁచుకొని పంచిపెట్టుదురు.”* ఓ హిందూమతాభిమానులారా! మతము పేరిట బూతుబొమ్మలను సహితము దేవాలయములపైఁ జిత్రించి సహించు పుణ్యాత్ములారా! మతగురువులు సహిత మెట్టిదుర్మార్గములు చేయఁ జొచ్చిరో విచారింపుఁడు. వ్యభిచార మొక్కటియే యీమహారాజులలోని దుర్గుణము గాదు. ఇంచుమించుగా నేఁబది యేండ్లక్రిందట నొక మహారాజు ఒకకృష్ణవిగ్రహమును దొంగిలించినందుకై శిక్షింపఁబడెను.

*హిందూమతాచారవిషయకోపన్యాసములు.—*Mr. D. V. S. Pracasa Rao, B.,A.*

ఈవిధముగా నీమహారాజులు నీచకృత్యములనొనరించుచు, నందఱును జేరి "దాస్యపత్రము" లను పేర కొన్నిపత్రములను వ్రాసి తమకులస్థులందఱు వానిప్రకారము నడువవలెనని నిర్బంధింపఁ జొచ్చిరి. ఇట్లు వీరి ప్రభ చక్కఁగా సాగుచున్నకాలములో 1832వ సంవత్సరమున జూలై 25వ తేదిని కురుసేనదాసముల్జీ యను నొకధీరాత్మఁడుదయించెను. చిన్నతనముననే ఈతనితల్లి చనిపోవుటచేతను, ఈతని తండ్రి వేఱొకకాంతను పెండ్లియాడుటచేతను కురుసేనదాసముల్జీ యొకబంధువురాలిపోషణములోనుండి విద్యాభ్యాసము చేసెను. చిన్ననాఁటినుండియు సంఘసంస్కరణాభిమానము గల యీతఁడింకను తనవిద్యార్థిదశలో నుండఁగానే గుజరాతీ జ్ఞానప్రసాదకమండలము వారు స్త్రీపునర్వివాహముపై మంచి యుపన్యాసము వ్రాయువారికి నూటయేఁబదిరూపాయల బహుమానము నిచ్చెద మని ప్రకటించిరి. కురుసేనదాసముల్జీ తనయభిప్రాయములను వెల్లడించుట కదియే తగినసమయ మని యావిషయమై వ్రాయ నారంభించెను. కొన్నిపుటలను వ్రాసినవెనుక నొకనాఁ డాతనికిఁ దెలియకుండ దుష్టుఁ డెవ్వఁడో ఆపత్రములను గొనిపోయి యాతని బంధువురాలికిఁ జూపించెను. ఆమె దురాచారస్థాపనార్థమై యంతటి పట్టుదల గల మతద్రోహికి తాను సహాయము చేయుచుంటిని గదా యని దుఃఖించి కురుసేనదాసముల్జీని తనయింటినుండి వెడలఁగొట్టెను. నిరాధారుఁడై అట్లు ఇల్లు వెడలి కురుసేనదాసముల్జీ తనయభిప్రాయములు మాఱిపోయిన వని చెప్పినందున తనకుఁ గలుగులాభముల నెఱిఁగియునుగూడ నట్టిదుష్పథములపొంతఁ బోక సంఘసంస్కరణాభిమానముతో గోకులదాస తెజ్‌పాల్ గారి పాఠశాలకుఁ ప్రధానోపాధ్యాయుఁడుగాఁ బ్రవేశించెను. కొంతకాలము వార్తాపత్రికలకు వివిధవిషయములను వ్రాయుచు, నీతఁడు తనదేశములోని వృత్తాంతపత్రికలను బాగు చేయఁదలఁచి 'సత్యప్రకాశ' యను సంస్కారపత్రిక నొకదానిని స్థాపించెను. స్థాపించి యాతఁడు హిందూసంఘములోని దురాచారముల నన్నిటిని వెల్లడించుచు, మహారాజుల దుష్కృత్యములను బహిరంగము చేయుచు, నిరాతంకముగాఁ గలము సాగించి ఎల్లదురాచారములను బయలుపుచ్చి, హిందూసంఘముయొక్క నీచస్థితినిఁ దెలియఁబఱిచి దేశమంతను నల్లకల్లోలము చేయుచున్న యాదినములలో మహారాజు లీతని ధాటికి వెఱచి, మాఱుమాటాడలేక లంచములు మొదలగువాని నిచ్చెదమని లాలించియుఁ బ్రయోజనముగానక దుఃఖింపసాగిరి. తమగుట్టు నంతను బయలుపఱిచి, నిరంకుశముగా పని చేయు నీధర్మశూరుని వంచుటకు తుచ్ఛములగు మహారాజుల లంచపంచము లెట్లు సాధనము లగును? ఈ ప్రయత్నములు సాగకపోవుటచే నీమహారాజు లందఱును జేరి యాతని బహిష్కరింపఁ బూనిరి. తత్పూర్వమే దాస్యపత్ర మొక్కటి ప్రచురింపఁబడినది. 1859వ సంవత్సరము జనవరు నెలలోఁ బ్రకటింపఁబడిన యాదాస్యపత్రమునందు వైష్ణవు లెవ్వరును

మహారాజులను దొరతనమువారి న్యాయసభలకుఁ బిలుపింపఁగూడదనియు, కులమువా రందఱును నెంతధనము నైనను గర్చుపెట్టి దొరతనమువారిచే నట్టిచట్టము నొకదానినిఁ జేయింపవలెననియు, నీచట్టము చేయులోపల నేకులజుఁడు గాని మహారాజులను న్యాయసభల కెక్కించునేని, దాని నాపుటకయి కులమువా రెంతసొమ్ము నైనను గూడ నిచ్చి యాపవలెననియు, ఏవైష్ణవుఁ డైనను మహారాజులకు వ్యతిరేకముగా వ్రాయునేని వానిని బహిష్కరింపవలెననియు, వ్రాయఁబడి యుండెను. తనకులమువారి నందఱిని నీతిమాలిన మతగురువుల కట్లు బానిసలనుగాఁ జేయుచున్న పైపత్రమును జూచి కురుసేనదాసముల్జీ యది నిర్బంధబానిసత్వమని నిరాకరించి తనపత్రికయందుఁ గఠినముగా ఖండించెను. మహారాజు లీతనిని బహిష్కరించుటకు సాహసింపలేకపోయిరి.

ఇట్లుండఁగా 1860వ సంవత్సరమున సూరతుపట్టణమునుండి యొకమహారాజు బొంబాయినగరమునకు వచ్చి కురుసేనదాసముల్జీతో వాదము చేసెను. చేసి తానా సంస్కర్త ప్రశ్నములకు సరియైన యుత్తరముల నొసఁగలేక కోపోద్దీపితుఁడై ముల్జీని మతద్రోహి యనియు, దుష్టుఁ డనియు దూషింపసాగెను. ఇందుకు సమాధానముగా 1860వ సంవత్సరము అక్టోబరు 21వ తేదిని కురుసేనదాసముల్జీ వేదములనుండియుఁ బురాణముల నుండియు ప్రబలప్రమాణములను జూపి, మహారాజుల మతము వేదవిరుద్ధ మైనదనియు నిందిత మైనదనియు ఋజువు చేసి ఈతనివంటి మహారాజులును వారియనువర్తులగు నితర గురువులును నీతి లేనివా రనియు, సిగ్గుమాలినవా రనియు, గూఢప్రవర్తనులనియు, నతిదుష్టు లనియు దృష్టాంతములను జూపెను. పై మహారా జేమియు నెఱుఁగనివానివలెఁ గొంతకాల ముండి 1861వ సంవత్సరము మే నెల 14వ తేదిని సత్యప్రకాశికాధిపతి పైనను ముద్రాయంత్రాధిపతి పైనను మాననష్టమున కభియోగమును దెచ్చెను. దీనికిఁ బ్రత్యుత్తరముగా కురుసేనదాసముల్జీ తాను నేరస్థుఁడను కాననియు, తనవ్రాఁతలలో మాననష్టమును సూచించుట కేదియు లేదనియు, నావ్యాసములోని ప్రత్యక్షరమునుగూడ సత్యమనియు మఱల వ్రాసెను. అంతటితో నూరకొనక యావ్యాసములోనే కురుసేనదాసముల్జీ మహారాజుల ప్రమాణగ్రంథములలో వ్యభిచారసహితమగు నర్చనలను గూర్చియున్న దనియు, సాధారణముగా మహారాజు లెల్లఱును వ్యభిచారులనియు, సూరతుపురముననుండు పై మహారాజును నట్టివాఁడే యనియుఁగూడ నిర్భయముగా వ్రాసియున్నాఁడు.

అంతట భట్టియాకులస్థు లందఱును ముల్జీయొక్క ధర్మప్రవర్తనమును శ్లాఘింపనేరక, యాతనికి శత్రువులై, ఎవ్వరును నాతని[illegible]లుగా నుండఁగూడదని తీర్మానించుకొనుట కొకసభను జేసిరి. మహారాజులకు వ్యతిరిక్తముగా నెవ్వరును పలుకఁ

గూడదనిచేసిన వారి తీర్మానమునుగూర్చి విని, కురుసేనదాసముల్జీ వారు తనపై కుట్రచేయుచున్నారని యొకయభియోగమును దెచ్చెను. ఇది చక్కఁగా ఋజువగుటచే, ఈ కార్యమును బూనినవారిలో నిరువురికి వేయేసిరూపాయిలును ఎనమండ్రు మనుష్యులకు ఏనూరుచొప్పునను నపరాధములు విధింపఁబడెను. కురుసేనదాసు ఈవ్యవహారానంతరమున న్యాయసభనుండి వచ్చునప్పుడు దుష్టులు పెక్కండ్రు ఆయనమీఁదికి రాసాగిరి. తుట్టతుదకు రక్షకభటుల సహాయమువలన ఉతఁడింటికిఁ జేరఁగలిగెను.

ఇది యైనతరువాత మహారాజు నభియోగము తీర్పునకు వచ్చెను. ఉన్నతన్యాయసభవారే ఈవిచారణమునకుఁ బూనుకొనిరి. మహారాజుల దుష్టచర్యలనుగూర్చి సాక్ష్యమిచ్చుటకై పెక్కండ్రు కురుసేనదాసముల్జీ పక్షమునకు వచ్చిరి. ఇంచుమించుగాఁ బదిలక్షలరూపాయిలకుపైన ధర్మకార్యములకు వినియోగించిన మహాభాగ్యవంతుఁడును, సాంగ్లేయప్రభుదత్తబిరుదాంకుఁడునునైన సర్ మంగల్ దాస్ నత్తూభాయి అనునాయనకూడ ముల్జీపక్షమున సాక్షియై నిలిచి, మహారాజుల దుష్టచర్యలనుగూర్చి వాఙ్మూలము నిచ్చెను. ఈవ్యాజ్యమును విచారించుటకు నలుబది దినములు పట్టినది. న్యాయాధిపతులలో నొకరు "మంగల్ దాసు నంతటి మహాప్రసిద్ధుఁడు సహితము కులమువారి దూషణలకు వెఱువక వచ్చి సాక్ష్యము చెప్పుట సాధారణవిషయములలోఁ గలుగనేరదనియు, నాతని సాక్ష్యమువలన మహారాజుల దుష్టచర్యలు మితిమీఱినవని యెంచవచ్చుననియు చెప్పియున్నారు. ఈతీర్పునందు మహారాజులకుఁ బ్రతీకారమిచ్చుటకు బదులుగా, వారియభియోగమును గొట్టివైచి, ఉన్నతన్యాయసభలోని ప్రధానన్యాయాధికారి కురుసేనదాసముల్జీ ధైర్యసాహసములను ఆతఁడు తనసంఘమునకుఁ జేసిన యుపకారమును శ్లాఘించుచు తీర్పును వ్రాసెను. అంతటితో మహారాజుల ప్రభ యణఁగిపోయి పైకి వచ్చుటకు సాహసింప లేకపోయిరి.

తరువాత కురుసేనదాసముల్జీ దూదివర్తకము చేసి నష్టపడి, 1874వ సంవత్సరమున ఇంగ్లాండునుండి తిరిగి వచ్చెను. మహారాజు లాతనిని బహిష్కరించిరిగాని, యాతని కేమియుఁ గష్టము కలుగలేదు. తనవ్యాజ్యమువలన ఐరోపియను లందఱి యొక్కయు మెప్పును గాంచిన ఈతనిని శ్లాఘించి, కష్టసమయమునందు అప్పటి బొంబాయి గవర్నరుగారగు సర్ బార్టిల్ ఫ్రియర్ గారీతనిని కత్తియవాడిదేశములోని యొకస్వదేశరాజ్యములో కార్యనిర్వాహకునిగా నియమించెను. సుప్రసిద్ధులగు నీతనినిగూర్చి సర్ రిచర్డు టెంపిల్ గారు మిగుల గౌరవముగా వ్రాసియున్నారు. మఱియు 1875వ సంవత్సరమున నీతఁడు చనిపోయినప్పుడు బొంబాయిదొరతనమువారీతని మరణమునకు దుఃఖించుచు నీవిషయమును గెజటులోఁ బ్రకటించుటచే నది సంస్తవనీయమై యున్నది.

ఈవిషయమును ముగించుటకు పూర్వమే శ్రీకృష్ణుని చరితమునుగూర్చి కొంతవఱకుఁ జెప్పవలసి యున్నది. గోపికలు మునులనిగాని, కృష్ణునిచర్యలు మనుష్యాతీతము లనిగాని, భాగవతగాథ లవయవార్థవిరహితములు అంతరర్థద్యోతకములు ననిగాని, ఎందఱెన్నెన్ని చెప్పినను నిశ్చయముగా కృష్ణపూజనము పోవువఱకును మనమతములలో నీతివృద్ధి నందఁజాలదు. కృష్ణునిపేరనే బూతుపుస్తకములును, తుచ్ఛపుబొమ్మలును, దుట్టతుదకు రుద్రసాంప్రదాయుల మహారాజమతములును నుద్భవించినవిగాని, వేఱుకారణమువలనఁ గావు. బహుకాలపరిశోధనానంతరమున వ్రాసిన మా వాక్యములను బరిశీలించి యిప్పటి కృష్ణపూజకుల యుపన్యాసములకును, కృష్ణపూజనమువలన మేము ప్రత్యేకముగా వ్రాయవలసి వచ్చిన యీయధ్యాయములోని చరిత్రమునకును గలసంబంధములను విచారించి మనవారు నీతిమార్గము నవలంబింతురు గాక.

ఏడవ ప్రకరణము.

నీతివిషయములు.

దొరతనమువారి చట్టములు.

హిందూదేశ మీవిధముగా దురాచారములపాలై పూర్వాచారపరాయణులను స్వాత్మపుత్రుల విచిత్రవాదముల బలిమికలిమినిఁ దనయవినీతికి బహిరంగముగాఁ బ్రతిమలను స్థాపించి కొంతకాలము విజృంభించినతరువాత 1849వ సంవత్సరము వచ్చినది. అంతకుఁ గొంతకాలముక్రిందటనే ఇండియాదేశపు శిక్షాస్మృతినిఁ గూర్చి ప్రయత్నములు జరుగుచుండెను. ఈస్మృతి ప్రతినేరమునకును శిక్షను విధించుచు నీతికి భంగదాయకములగు కార్యములను వలయునంతవఱకు నిరుత్సాహపఱచుచున్నను ఈప్రకరణమునందు మేము ముఖ్యముగా మూఁడువిషయములనుగూర్చి మాత్రమే చర్చింపఁదలఁచి యున్నాము. వారకాంతలను గూర్చియు, బూతుబొమ్మలనుగూర్చియు, నట్టిపుస్తకములను గూర్చియునే మేము విచారింపవలసి యున్నది.

వారకాంతలవలన హిందూదేశమునకుఁ గలుగుచున్న నష్టముల నీగ్రంథమునఁ బ్రత్యేకముగా వివరించుటకు మాకు తావుచాలదు. అయినను వ్యభిచారమే ఈశ్వరుఁడు తమ కేర్పఱిచినవృత్తియని విఱ్ఱవీఁగి నీతిమాలిన పాపాత్ములతో సంచరించెడి వీరిచర్యలు బుద్ధిహీనులకుమాత్రమే సంతోషజనకములుగా నుండునని మా యభిప్రాయము. చిర

కాలమునుండి వారనారులను బ్రోత్సాహపఱుచుట మనదేశమువారి యభిప్రాయమై యున్నది. ఈజాతి యెన్నఁడుత్పన్నమైనదో నిర్ధారణముచేయ వీలులేదుగాని, ఋగ్వేద కాలములోఁ నిట్టివా రున్నట్లు పొడజూపదు. ప్రాచీనమగు ప్రతిదేవాలయములోను ఈ వారకాంత లుండుటచేతను, వీరలలోఁ గొందఱు ముందుగా నీశ్వరార్పితలై తరువాత మానవనాయకులకు నాయకీమణులగుచుండిరని వినుచుండుటచేతను గ్రీసు మొదలగుచోట్ల వెస్టాల్‌వర్జినులు (Vestal virgins) అనుపేర స్త్రీలు కొందఱు పూర్వకాలములో దేవాలయములలో నివసించియుండుటచేతను, ఇప్పటికిని పూనా మొదలగుచోట్ల మురళీలనుపేర బాలికలు ఖండోబా అను దేవునికి వివాహము చేయఁబడి, వేశ్యావృత్తితో జీవించుచుండుటచేతను, ఇట్టి మ్రొక్కుబళ్ళు హిందువులకు సహజమని చూపుటకు మనకు వలయునన్ని యితరాచారము లుండుటచేతను, పూర్వప్రకరణములో మేము చెప్పినరీతినే మొదట బాలికలు భక్తిపరతంత్రులగు తండ్రులచే ఈశ్వర సేవనార్థమై యర్పింపఁబడిరనియు, నందుచేతనే "దేవదాసీ" అను శబ్దములోని యవయవార్థము వారియందు సార్థకమైనదనియు, నానాఁటికి వారు ప్రకృతమున మనదేశములోని కొందఱు వితంతువులవలెనే రహస్యముగా గూఢవర్తనలను జేయుచు, అంతకంతకు బరిదెగి పదిమందిచేరి యొకశాఖయై, నీతిమంతులగు నప్పటి యితరమానవుల దూషణలకుఁ బాత్రులైరనియు, అందుచేతనే పురాతన స్మృత్యాదులయందు వేశ్యలంతఁగా నిరసింపఁబడిరనియు, నానాఁటికి వీరిసంఖ్యవృద్ధియై, అంతకంతకు మహాసంస్థానములను సహితము గుల్లచేసి, కోటానుకోట్లసంసారములను గూలఁద్రోసి, పాపపుగూడు భుజించుచున్నారనియు, నిదియే వీరిజాతికిఁ సరియైన యుత్పత్తికారణము కాఁబోలుననియు మే మూహించుచున్నాము. రంభాద్యప్సరల కులమువారమని వీరు చెప్పుకొనుదానిలో మనుష్యాతీతమగు గుణముండుటచే నమ్మఁదగినదికాదు. రంభా సంభోగమని మన ముసలిసోమయాజు లెంతయల్లాడినను, రంభయును నొక అంకుటాలేగాని పరమపతివ్రతగాదు. ఒకవేళ వాదసౌకర్యార్థమా రంభయును నొకమాన్యస్త్రీయేయని యొప్పుకొన్నను, స్వర్గాధిపతియైన ఇంద్రునంత (=గొప్ప) వానిచెట్టఁ బట్టుటచేతను, గొప్పవారితప్పులను సహితమును ఒప్పులుగా నెంచి, వారిని శ్లాఘించుచు ఆశ్రయించుట హిందువుల కొకసనాతనాచారమగుటచేతను, అంతటితో సరిపోక, యిట్టి యకార్యములను మంచివనుటకై 'సమర్థికోదోషనహి' అనికూడ మనవారు చెప్పఁగలిగియుండుటచేతను అకార్యములవలన గౌరవమునందిన రంభవంటి వారికులములోనివారమని వీరు చెప్పుకొనుటలో నాయభిప్రాయమునకు భంగమురాక, రంభయును నిట్టికాంతలలో నొక్కతెయనియే స్థాపించుచున్నది. దుష్కృత్యములవలన దేవాలయములనుండి వెడల నడపఁబడి నిరాధారలైయుండు వీరికి "రూపజీవికలనియు, 'వారస్త్రీ'లనియు 'గణిక' లనియు, నామములున్నట్లమరసింహుఁడు చెప్పుట నాయూహను గొంతవఱకు స్థిరపఱుచుచున్నది.

తొలుదొలుత నీవేశ్యాకాంతలు జనులచే ద్వేషింపఁబడినను నానాటికి వీరు తమచేష్టలవలన జనులను మోహింపఁ జేయనేర్చిరి. తరువాత సుప్రసిద్ధులగు కాళిదాసాది శృంగారభూషణుల యద్వితీయ కవితాధారవలన నీవారవనితాసంఘ మెక్కింతఁ దెప్పిరిలి శృంగారరసమున కాటపట్టై సరసులకిరవైనది. నాటినుండియునుగూడ మనదేశములోని కవులందఱికిని వేశ్యాసంపర్క మనునొకగుణము నారోపించుట యాచారమైనది. కాళిదాసునివలె మన శ్రీనాథుఁడును, తెనాలి రామకృష్ణుఁడును, కూచిమంచి తిమ్మనామాత్యుఁడును దుట్టతుదకు కృష్ణరాయలునుగూడ వేశ్యలవలపుల కాస్పదులైనట్లు కథలును, బద్యములును బెక్కులున్నవి. అట్లుండియును గొన్నిదినములకుఁ బూర్వమువఱకునుగూడ నెవ్వరో నీచులుగాక, తక్కినవారు "అర్ధరాత్రమునందు ముసుఁగు వేసికొని దొంగతనముగాపోయి వేగకమునుపే తిరిగివచ్చుచుండిరి." మఱి కొంతకాలమున కీగుట్టునుబోయి కొందఱు నీతిమంతులు వీరికి నృత్యపాఠశాలల నేర్పఱిచి, తమనామములను సార్థకముచేయుచు, "వెంకయ్యగారిమేళ"మనియు "జోగయ్యగారిమేళమ"నియు అంకుటాండ్రగుంపులకుఁ దమనామములను జేర్చుచుండిరి. ఆప్రతిష్ఠకుఁ దగినట్లే లంజగుంపులును పతివ్రతాశిరోమణులై "మాపంతులుగారి సమ్మతిలేక మేము మేళమునకు రామ"ని చెప్పుచుండిరి. ఈకార్యములును జాలక ఇప్పుడు కొందఱు మహనీయులు లేచి సిగ్గు లజ్జలులేక, వ్యభిచార వర్తనలగు వారకాంతలవృత్తి హిందూసంఘమున కుపయుక్తమైనదనియు సర్వజనాదరణము నందవలసినదనియును గూడఁ జెప్పసాగిరి.

వేశ్యాకాంతలను ఆహ్వానముచేయువారు వారికిఁ జూపు గౌరవ మమితమైనది. పంజాబుదేశమునందు వారు సర్వజనాదరణీయులు. పశ్చిమోత్తరరాష్ట్రములలో వారు రాజపుత్రికలు. మనదేశమునందుఁ బూర్ణిమ పండువెన్నెలలో సహితము పెండ్లివారు వారికి రెండుకాగడాలనిచ్చి పంపుచుందురు. కొన్నిభాగములలో హాస్యము లను పేర వారు దక్షిణపూర్వముగా తాంబూల మిచ్చువాఁడు కూరుచుండుమని చెప్పిన వాని తొడపై కూరుచుందురు.

ఈ విధముగా వీరు చరించుచున్నప్పుడు హిందూదేశీయు లెల్లఱును నూరకొనియుండలేదు. కొందఱు మహనీయులు లేచి నిలువఁబడి యీదురాచారమున కాస్పదులైనవారిని బాగు చేయుఁడని బోధించుటయు, భోగకాంతలను జూడమని పత్రికలపై సంతకము చేయించుటయు నిట్టికృత్యములు జరుగుచునే యున్నవి. హిందూదేశమునందిప్పు డించుమించుగా నిట్టివారు కొన్నివేలమందివఱకు నున్నను వారు చేయుపని

మాత్ర మంతగా నుపయుక్త మైనది కాదు. చిరకాలమునుండి హిందూదేశములో నాఁటుకొనియున్న యీదురాచారము కోటానుకోట్ల ప్రజలలో నలుగురు చూడకున్నంత మాత్రముచేత నే యాగిపోవునదిగాక, యితరుల యాదరణమునకుఁ బాత్రమై యెప్పటికినిఁ జెడక నే యుండును. అందువలన మేము చూడమని కండ్లు మూసికొన్నంతమాత్రముచేతఁగాని, దొరతనమువారి కిట్టిమేళములు గలచోటికి పోవలదని వ్రాసినంత నేకాని యీదురాచారము తొలఁగి పోదు. అందుచేత మనము వారిసంఖ్యనుండియే కొందఱిని తగ్గించుచు రావలెను. వృక్షము వృక్షముగా నే పెరుగుచున్నప్పుడు అది యున్నంతకాలమును నష్టము కలుగుచు నే యుండుటచే వీలగునంతవఱకు వారిసంఖ్యను తగ్గించుట యుత్తమమై యున్నది. చేతగానివారు చూడకుండుట యుత్తమ మే యైనను, సమర్థులగు వారందఱును జేరి మూలధనమును గొంతఁ జేర్చి తమబాలికలకు వివాహము చేయ నెంచెడి వేశ్యాంగనలను స్వగృహమునుండి వెలుపఱిచి విద్య చెప్పించి వివాహములు చేయుటచేతను, తమదుర్వృత్తిని మాన నెంచెడివారలకు జీవనోపాధి నేర్పఱిచి, వారి మూలముగ వారికులములోని యితరులకు బోధ చేయించుటవలనను, తగినమనోదార్ఢ్యముకలవారు వారియిండ్లకే పోయి ధర్మోపదేశములు చేసి వృత్తి మాన్పించుటవలనను, నిట్టి కార్యములవలనఁ గలుగు ప్రయోజన మే నిజముగా లాభకారి యగును.

ఈవిషయ మటుండఁగా వేశ్యాంగనలలో నింకొక దురాచార మున్నది. పేదలగువారును గొంద ఱితరులును దమబాలికలను వేశ్యాంగనల కమ్మి జీవించుచున్నారు. ఈదురాచారము నాపుటకయి ఇండియాదేశపు శిక్షాస్మృతిలో నొకచట్టమున్నను నది నిరర్థకమై యున్నది. కరువులు వచ్చునప్పుడును, గూఢవర్తనులై వితంతువులు స్త్రీశిశువులను గనునప్పుడును, వేశ్యాసంతానము వృద్ధినందుటయు, అప్పుడప్పుడు నిఱుపేదలు తమశిశువులను పోషింపలేక వీరి కప్పగించుటయు నెల్లఱకుఁ దెలిసియేయున్నది. ప్రతికరువునందును నిట్టి వారిసంఖ్యావృద్ధియైనను దొరతనమువారు తగినంత కట్టుదిట్టములు చేయఁజాలకపోవుట విచారకరమైయున్నది. వేలకొలఁది శిశువు లట్లు పెంపఁబడుచున్నట్లు పెక్కువార్తాపత్రికలు ఘోషించియున్నవి. కలకత్తాలో డిప్యూటీపోలీసు కమీషనరుగారగు లాంబర్టు దొరవా రొకసారి యొకరాజకార్య విషయమునందు "సత్కీర్తిగల వేశ్యాగృహములలో నిట్టి బాలికలు పెక్కండ్రు నీచవృత్తికై పెనుపఁబడుచుండుటను నే నెఱుఁగుదును. అయినను వా రిందుకొఱకే పెనుపఁబడుచున్నారని సాక్ష్యమును దెచ్చుట వీలు కాకపోవుటచే నేమియుఁ జేయుటకు వీలు లేకున్నది" అని చెప్పియున్నారు. వేశ్యాకాంతలు ప్రత్యేకముగా మనుష్యుల నేర్పఱిచి ఊళ్ళవెంబడి త్రిప్పి బాలికలను గొనుచున్నను, ప్రభుత్వమువా రీవిషయమును గనుఁగొనలేకయు, ఒకవేళ నెఱిఁగియున్నను పనిచేయలేకయు, ఊరకుండుట విచార

కరమై యున్నది. వందలాది సంవత్సరములు మహమ్మదీయ ప్రభుత్వమునకు లోఁబడి చెడి ఇప్పుడే కన్నులు తెఱచిన మనకు మనప్రభుత్వమువారు నీతివిషయములో చాలినంత పని చేయఁ జాలక ఇంచుమించుగా నిరర్థకమగు చట్టమును జేసినప్పు డేమి లాభ ముండును? ఈవిషయమును దీర్ఘముగా యోచించి ప్రభుత్వమువారు ఈక్రింది చట్టములను జేసినయెడల నీతికిని కీర్తికినిఁ గూడనిది మూలాధారము కాఁగలదు. మేము యుక్తమని భావించెడు చట్టము లేవనఁగా.

I. ప్రతిభోగకాంతయు తనకుటుంబమునఁ బుట్టిన 16 సంవత్సరముల లోపు వయస్సుగల బాలికల జన్మదినములుగల బుజుపత్రికలను పట్టణపారిశుద్ధ్యసంఘము వారివద్దనుండి గాని, చిన్నగ్రామములలో గ్రామాధికారివద్దనుండి గాని పొంది అధికారులకుఁ గోరినప్పుడెల్ల దానినిఁ జూపుచుండవలెను. మఱియు నట్టి ప్రతిబుజుపత్రములోను పురిటిదినములలో పనిచేసిన మంత్రసాని సంతకముగాని నిశానీగాని పైని చెప్పిన అధికారి యెదుట చేయఁబడవలెను.

II. ఏ భోగకాంతయును 16 సంవత్సరముల లోపు బాలికల నెవ్వరినిఁగాని పెంచుకొనరాదు. అట్లు తనస్వాధీనములోనికిఁ దెచ్చుకొను నేని, అట్టిబాలికల పోషకుల యనుజ్ఞాపత్రమును గొని, దత్తస్వీకారము చేసికొనుటకు పూర్వమే, యాబాలికకు జీవితకాల మంతయు స్వతంత్రజీవనము చేసికొనుటకు చాలినంత స్థిరచరాస్థులను రిజస్టరు చేయించి యుంచవలెను.


III. తనస్వాధీనము లోనున్న ఏ బాలికవిషయములోనైనను భోగకాంతపై పత్రములలో వలయువానినిఁ జూపలేదేని, అట్టిబాలిక అక్రమముగాఁ గొని రాఁబడినదని గ్రహించి తగువిచారణచేసి, భోగకాంతకు న్యాయముగా చెందవలసినదని తోఁచినయెడల నామెకుఁగాని, లేనియెడల బాలిక తల్లిదండ్రులకుఁగాని, వారును గానరాకేని భోగకాంతలుగాక, వారిని చేరఁదీసి పెంచెడి యితరులెవ్వరికేనిగాని (దొరతనమువారు సహా) గాని, యాబాలిక నిప్పించి వేయవలెను.

IV. వారకాంతలకుఁ దమపుత్రికలను దత్తముచేయు ప్రతివాఁడును నామెకుఁ బైరీతి వ్రాతమూలము నిచ్చుటయేకాక, ఆమెవద్దనుండి ఆకన్యకను నీతిమాలినవిషయములలోఁ బెట్టుటకు దత్తము చేసికొనుట లేదనియు, కన్యకకు 16 ఏండ్లు వచ్చువఱకును నామె నీతివిషయములు చెడకుండ తాను బాధ్యురాలుగా నుండుననియు, 16 ఏండ్లతరువాత నైనను నిర్బంధమువలన వేశ్యావృత్తిలోఁ బ్రవేశింపఁ బెట్టఁబడదని నమ్మకము చూపుటకై యామె స్వతంత్ర జీవనమునకు వలయునిట్టిట్టి వసతిని ఇప్పుడే రిజిస్టరుచేయించి ఇచ్చి మఱియు దత్తస్వీకారము చేసికొనుచున్నా ననియు, వ్రాసియీయవలెను.

V. దత్తస్వీకారసమయమునందు ప్రతిబాలికపోషకుఁడు వయోనిర్ధారణము చేయు బుజుపత్రిక నొకదానిని ప్రభుత్వము వారి రికార్డులనుండిగాని, డాక్టరు వద్దనుండిగాని తెచ్చి యీయవలెను.

ఏదేని యొకగ్రంథములో వ్రాసినంత మాత్రముచేత దొరతనమువా రిట్టిచట్టములను జేయుదురని భావించుటయసంభవమగుటచే పై వానికింకను జేర్పవలసిన ఆస్తిని రప్పించుకొనుటను గూర్చినట్టియు శిక్షలను గూర్చినట్టియు రెండుమూడు విధులను విడిచిపెట్టుచున్నాను. పైరీతిచట్టమే యొక్కటి యున్నయెడలభోగకాంత లన్యాయముగా బాలికలను గొని తెచ్చుకొనుటయు, బలాత్కారముగా వారిని తమనీచవృత్తిలోఁ బ్రవేశపెట్టుటయు నుండకుండుటయేకాక ప్రకృతమున బుజువులేమిచే నేమియుఁజేయఁ జాలకున్నామను లాంబర్టు దొరవారి పలుకులవంటి పలుకుల కెడముండదు. ఐరోపాఖండమునందు బానిసత్వమును బోనడుపుట కెన్నిప్రయత్నములనో చేసిన యుత్తమమగు క్రైస్తవప్రభుత్వము హిందూదేశములో బానిసత్వమున కంటెను నీచమగు నీతిరహితమయిన యీమాటల కందరాని పశుకార్యమును బోనడఁపలేక, తగినచట్టములను జేయక యూరకుండుటకంటె దుఃఖకరమైన పని వేఱొక్కటిలేదు.

ఇది యైనవెనుక బూతుపుస్తకములను గూర్చియించుక చెప్పవలసి యున్నది. ముఖ్యముగా హిందూదేశములోని ప్రతిప్రబంధమునందును కుచకచ సంభోగవర్ణన లుండియే యున్నవి. ఆదికావ్య మగు శ్రీమద్వాల్మీకిరామాయణము మొదలు నేఁటివఱకును హిందూగ్రంథములలోఁ గొద్దిగనో గొప్పగనో యీవర్ణనములు లేకుండఁ బోలేదు. కాళిదాసాదుల ప్రహసననాటకములును, ఇతరకవుల కొక్కోకము మొదలగు గ్రంథములును బ్రతివానికిని వినికిడివలన నైనఁ దెలిసియుండును. తరువాతతరువాత కావ్యలక్షణము లేర్పడినవెంటనే భాష లన్నియు బూతుల బుంగలైనవి. వేయేల? ఒక విదేశీయుఁడు కొన్ని దేశభాషాపరీక్షాగ్రంథములలో బాలుర కిచ్చుటకు దుష్పదములు లేని యొక్కపద్యము నైనను గనఁజాలకపోయితి నని వ్రాసియున్నాఁడు. పనికిమాలిన చంద్రరేఖావిలాపములను గవిచౌడప్పశతకములను నటుంచి సామాన్యగ్రంథములను జూతమన్నను నందును నిట్టివర్ణనలు లేకపోలేదు. లోకములోని స్త్రీలను సోదరీప్రాయులనుగాఁ జూడఁ గలవాఁ డొక్కఁడును గ్రంథకారుఁడు కాలేకపోవుట కావ్యలక్షణముల లోపముగాని వేఱొక్కటి గాదు. ప్రతికావ్యమునందును స్త్రీలయెడఁ గొన్నిగుణములతోఁ బ్రవర్తింపఁగలవారే నాయకులుగా నుండవలయు ననియు, వారికి స్త్రీలను జేర్చుటకు విటపీఠమర్దకవిదూషకాదులు సహాయపడుదు రనియు నిట్టిలక్షణములతో నాయకుల నేర్పఱిచి యున్నారు. ఇఁక స్త్రీలవిషయమునకు వచ్చునప్పటికి లక్షణకారులకుఁ బిచ్చిపట్టినది. స్వీయాన్యాసామాన్యాదిభాగములవలనను, ముగ్ధామధ్యాప్రౌఢాదివిభాగములవలనను నాయకినాయకునియెడల చూపు సిగ్గు కోపము మొదలగువానిని బట్టియు 384 విభాగములను జేసి యున్నారు. ఈ ప్రక్కపుటలోనిపటమువలన నాయికా భేదములను దెలియవచ్చును.



ఇందు ఒక్కొరొక్కరే స్వాధీనభర్తృక, వాసకసజ్జిక మొదలగు ఎనిమిది భేదములు కలవారు. దానివలన మొత్తము సంఖ్య 128. వీరు మరల ఉత్తమ మధ్యమాధమాఖ్యలుగలవారు. కావున మొత్తముసంఖ్య 384.

ఇట్లు మూడువందల యెనుబదినాలుగు భేదములుగల నాయకీమణులలో నొక్కొ క్కతెనుగూర్చి రతి విరహము మొదలగువానిని సిగ్గుమాలి కవులు వర్ణింపవలసి వచ్చుట మనవారు స్వవాక్యగౌరవములేక యితరుల యభిప్రాయములకు బానిసలై యుండుటవలనఁ గలిగినది.

ఈవిధముగా హిందూదేశమునందు పనికిమాలిన గ్రంథములు వృద్ధియగుచుండుటచే ప్రభుత్వమువారు వానికొఱకై ఇండియాదేశపు శిక్షాస్మృతిలో నొకవిధిని చేయవలసివచ్చినది. ముద్రింపఁబడిన ప్రతిగ్రంథమును రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ అనువారికి పంపించుట విధియై యున్నను, కొందఱు తమగ్రంథములపై ముద్రాక్షరశాలపేరునైనను వేయక రహస్యముగా గ్రంథము ప్రచురమును జేయసాగిరి. కొంతకాలమునకు వెనుక పండిత శివనాథశాస్త్రిలవారు కలకత్తాలో నీవిషయమై యుపన్యాస మిచ్చినప్పుడు మిక్కిలి సంక్షోభము కలిగినది. ఫ్రాన్సుదేశస్థులు వ్రాసినపనికిమాలిననవలలు బొంబాయినుండి అమ్మఁబడినప్పుడు దొరతనమువారు వానినిఁ బట్టుకొని పనిచేసియున్నారు. అట్టినవలలకు మరాఠీభాషాంతరీకరణములు చేసినప్పుడు బొంబాయి పూనా అహమదాబాదునగరములలో వానినిఁ బట్టికొని పాడఁ చేయించిరి. కలకత్తానగరమునం దిట్టి గ్రంథములు హెచ్చు మీఱినప్పుడు ఇంగ్లాండు అమెరికాదేశీయులవలెనే అక్కడి వారును నిట్టిగ్రంథములను నిర్మూలము చేయుటకయి 1873వ సంవత్సరమున నొకసమాజము నేర్పఱచికొనిరి. కాని యది కొలఁదికాలములోనే మృతినందెను. మనయాంధ్రగ్రంథములలో తారాశశాంకవిజయము వీధినాటకము మొదలగు పాడుపుస్తకము లింకను బ్రకటింపఁబడుచున్నను ప్రభుత్వమువారు తగిన శ్రద్ధను దీసికొనుట లేదు.

ఇఁక బూతుబొమ్మలకు మితమే లేదు. ప్రభుత్వమువారిచట్ట మెట్లున్నను బెజవాడ, గుంటూరు, కాకినాడ మున్నగుచోట్ల నిట్టిబొమ్మలు చాలవఱకున్నవి. మతమునకు సంబంధించిన బూతునకు దొరతనమువా రంగీకరించినను వీని కంగీకరింపరు. నిద్రించుచున్న రక్షకభటు లింకనైనను లేచి వీనినిఁగూర్చి పని చేయుట విధియయి యున్నది.

ఉన్నతదశయం దున్న పురుషులుగూడ బూతుమాటల నాడుటకు సందేహించుట లేదు. పాంచాలదేశమునందు హోలీపండుగ మొదలగు పుణ్యసమయములలో పండ్రెండేండ్లకు మించినట్టియు ఇరువదేండ్లకు మించనట్టియు బాలికలు గుంపులుగుంపులుగాఁ జేరి బండబూతులతోఁ బాటలు పాడుచు నర్ధరాత్రమునందు నగుల కేగుదురు. హోలీపండుగయందు జరుగుదురాచారములు చెప్పరానివై యున్నను మతముపేరిట నవి జరుగుచునే యున్నవి. ఒకసారి కలకత్తానగరమున నొకశూద్రుఁడు బూతు

లాడినప్పుడు ఐరోపియనుఁ డొకరక్షకభటుని కానేరస్థునిఁ జూపఁగా వాఁ డది యాచారమే యని ప్రత్యుత్తర మచ్చెను.

ఈ విషయములనుగూర్చి పశ్చిమహిందూదేశములోని క్రైస్తవోపాధ్యాయులు కొంద అప్పటి బొంబాయి గవర్నరుగారగు రే ప్రభువుగారికి విజ్ఞాపనము నంపికొని శిక్షాస్మృతిలో 294 సెక్షనును మార్పఁ డని వేడిరిగాని యది యంత ప్రయోజనకారిగా లేదు. అట్లే 1886వ సంవత్సరమున కలకత్తాలోని హిందూదేశీయక్రైస్తవసమాజమువారు వేశ్యాగృహములలోని కొనిదురాచారముల నాపుటకయి వంగదేశపు లెప్టినెంటు గవర్నరుగారి కొకవిజ్ఞాపన మంపుకొనిరి. పోలీసు ఆక్టులోని కొన్నిమార్పులను గోరిన వీరివిజ్ఞాపనము కొంతవఱకు సార్థక మైనది.

హిందూసంఘ మీవిధముగా నింకను నీతివిషయములయందు వృద్ధినందనేరక మతమనుపేర దుర్నీతికి మూలకమైయున్నది. ఎంతకాలము మనవా రిట్టివానిని సహించియూరకుందురో అంతకాలమును వారి కభివృద్ధి రానేరదు. కాలిపోయిన ఇంటినివలె నొక్కొకదానినే మనము మఱల మఱల నమర్పవలసివచ్చినది. దాఁచుటకైనను వీలుగాని మన యవినీతులను నడివీధుల కెక్కించి బరుల యాక్షేపములకు మన మాస్పదుల మగుచున్నాము. నిజముగా మనస్థితి యెట్లున్నను, పైకి శిలాశాసనములవలెనుండు వీనినిఁబట్టియే మనకీర్తి విశదమగుచున్నది. ఇంతకంటెను మన హీనదశకు ప్రబల దృష్టాంతము లక్కఱలేదు. కావున హిందూమతాభిమాను లెల్లఱును ముందుగా నీదురాచారమును బోనడఁపవలెను. సుజ్ఞానప్రదమగు విద్యయు, ధనమును, మనోదార్ఢ్యమును, శక్తియుఁ గలిగియున్నను, వాగాడంబరములకు దాఁటిన దేశాభిమాన మించుకయు లేకపోవుటచే మనదేశస్థులు దుర్గతిపాలయియున్నారు. నిజముగా దేశక్షేమము నభిలషించిన మానవుఁ డొక్కఁడైనను నుండెనేని, వాఁడు పైదురాచారముల నాపవలెను. లేదా త్వరలో హిందూసంఘమునకు వినాశకాలము సంభవించునని మే మూహించుచున్నాము. ఇంచుకేనియు జ్ఞానముకలవారు పైవానిని సహింపలేక క్రమక్రమముగా చీలిపోవచ్చును. ఏనాఁడు వ్యభిచారజీవికలును, బూతుబొమ్మలును మతముపేరిట నభివృద్ధినందక నిలుపవలసివచ్చునో, ఏనాఁడు హిందువులు బూతుమాటలనాడ నొల్లక, మతముపేరిట పనికిమాలిన గ్రంథములను బూజింపకుందురో, ఎప్పుడు మనవారు తెలివిగలిగి పరుల యాలోచనలకు బానిసత్వము వహింపక, స్వబుద్ధికిఁగూడ గౌరవము నీయఁ గలుగుదురో, ఆనాఁడే హిందూదేశమున కుచ్చదశయారంభమగును. అంతవఱకు చీలిపోయెడి కొందఱికిఁ దప్ప తక్కినవారికి వృద్ధికలుగనేరదు.

ఎనిమిదవ ప్రకరణము.

వివాహములు.

హిందూదేశమునందుఁ బూర్వకాలములో అతిబాల్యవివాహములుగాని, కన్యాశుల్కములుగాని లేవని మొదటిప్రకరణమునందే మేము చెప్పియున్నాము. ఆకాలమునందు ఉపనయనకాలమునుండియు బాలుఁడు గురుశుశ్రూష యొనర్చుచు చిరకాలము విద్యాభ్యాసముచేసి, తరువాతఁ గొంతకాలము దేశాటనము చేయుచుండెను. అందువలన నాదినములలోఁ బసిబాలురకు వివాహములు లేవు. బాలికలును నాదినములలో యజ్ఞోపవీతధారణముచేసి వేదాభ్యాసనములను గాయత్రీజపములను ఆచరించుచునందు జీవితకాలమంతయు నవివాహితలుగానే యుండుచువచ్చిరి. స్కాందపురాణములోని తటాకయను కన్యకచరిత్రమును దెలిసినవారును బ్రకృతపు టార్యసామాజికుల యాచారముల నెఱిఁగినవారును నీవిషయమున నిస్సందేహులై యుండవచ్చును. మనుస్మృతికాలమునందు మనవారిలో నతిబాల్యవివాహములేవు. రజస్వలానంతరముననే బాలిక వివాహితకావలెననియు, రజస్వలయైన తరువాత బాలికకుఁ దండ్రివివాహముచేయక యూరకుండు నేని, మూఁడుసంవత్సరములవఱకు వేచియుండి పిమ్మట నామె తనకిచ్చవచ్చినవరుని వివాహమాడవచ్చుననియు నందుస్పష్టముగాఁ జెప్పఁబడియున్నది. వేదముల తొలికాలములో హిందువులకు జాతిభేదములు లేనందున శాఖాభేదములు లేకనే వివాహములు జరుగుచువచ్చినవి. తరువాత మనువుకాలమున జాతిభేదము లేర్పడిన పిమ్మటఁగూడ అగ్రజాతి పురుషులు స్వజాతివారినేకాక తమకుఁ దక్కువజాతివారినిఁగూడ వివాహమాడ వచ్చునని శాసనముండెను. విక్రమార్కుని జననక్రమము నెఱిఁగినవారి కీయర్థము మిక్కిలి సుబోధ్యముగానుండును. తరువాతఁ గొంతకాలమునకు హీనజాతితోడి వివాహములును, నన్యోన్య ప్రతిభోజనములును గట్టుపడినవి. మొదటనున్న యాచారములను గొట్టివైచినందుననే హిందువులలో ననేకములగు శాఖాభేదములు గలిగి, నాలుగువర్ణములను మాటపోయినది. అప్పటికిని పసికూనల వివాహము లారంభము కాలేదు. పరాశరస్మృతి ఎప్పుడు వ్రాయఁబడినదో తెలియదుగాని, యది మహమ్మదీయాగమమునకుఁ దరువాతనే వ్రాయఁబడెనేని మనవారిలో నతిబాల్యవివాహములకుఁ గారణము వెదుక నక్కఱలేకుండనే దొరుకఁగలదు. ఏకారణమువలన నతిబాల్యవివాహము లుత్పన్నమైనను నవియొక్క బ్రహ్మవైశ్యులను బాధించుచున్నవి. అందును సర్వత్ర యీయాచారము వ్యాపించియుండలేదు. నేటికినిఁగూడ శంకరాచార్యుని జన్మకులమైన నంబూద్రి బ్రాహ్మణవంశమునందు స్త్రీలు రజస్వలలౌదురని మనవారివలె భయపడి వివాహముచేయరు. వారిదేశములో పెద్దకుమారుఁ

డొక్కఁడే వివాహార్హుఁడగుటచే నాతనికిమాత్రమే వివాహమగును. ఈయాచారమనుసరించినట్లుగా ప్రతి స్త్రీకిని వివాహముచేయుట యసంభవమగుటచేఁ గొందఱు కన్యకలుగానే నూఱేండ్లను బ్రదికి మృతినందుదురు. ఉత్తర హిందూస్థానములోని కాయస్థబ్రాహ్మణకుటుంబములలో నెక్కడనో సకృత్తుగాతప్ప పండ్రెండేండ్లకు మించని బాలికలకు వివాహముచేయరు. ఒక్కటే ప్రమాణగ్రంథముగల మనదేశములోఁగూడ నీవిధముగా పరాశరస్మృతి వర్తింపకున్నది. ఇందువలన నంబూద్రిపాదులును కాయస్థులును ధర్మాతిక్రమణము చేయుచున్నారని మనము చెప్పలేము.

వివాహమునందు మితి మీఱినవ్యయము చేయు దురాచారము నవలంబించుట రాజపుత్రులలో శిశుహత్యలకుఁ గారణమైనదని ఇదివఱకే వ్రాసియున్నాము. అతిబాల్యవివాహములవలనఁ గలుగుచున్న యనర్థములనుజూచి యూరకుండనోర్లక చిరకాలమునకు వెనుకనే హిందూ దేశీయులలోఁ బెక్కండ్రీ యాచారమునకు వ్యతిరిక్తముగాఁ బ్రవర్తింపసాగిరి. వాక్యశూరుల నిరర్థకవచనము లెట్లున్నను నీవిషయములో మీఱి చరించిన ప్రథమకాంతామణి మాకుఁ దెలిసినంతవఱకు పండిత రామాభాయిసరస్వతి. ఆమె తరువాత నందంచుఁ బెక్కండ్రు స్త్రీపురుషులట్లు చేయఁజొచ్చిరిగాని బహిష్కారపత్రముల వలని భయమింకను మనవారినుండి తొలఁగి పోకుండుటచే నీవిషయమున నంతగాఁ బనిజరుగలేదు. అక్కడక్కడ నీకార్యములను జేసినవారు పెక్కండ్రున్నను గుమిగూడి పనిచేసినవారు మిగుల తక్కువమంది. బ్రహ్మసమాజ మతస్థులు శ్రీకేశవచంద్రబ్రహ్మానందుల వారి యాదరణమునందున్న కాలములో నామహనీయుఁడు పాటుపడి పదునాలుగు సంవత్సరములకు మించని బాలికకు వివాహము చేయఁగూడదని శాసనమును చేయించెను. ఆర్యసామాజికులును ఋగ్వేదకాలములోలేని యీదురాచారము ప్రమాణసిద్ధముగాదని తెగడియున్నారు. కాని వివాహములను గూర్చియెందఱెన్ని వాదములాడినను ముఖ్యముగా పనిచేసిన వారుబొంబాయి రాజధానిలోని చింతామణి నారాయణభట్టుగారు. రావుబహదూరుబిరుదాంకితుఁడగునీమహనీయుఁడు స్త్రీల విద్యకును సౌఖ్యమునకును ప్రాణమునకును సంతానమునకును గూడఁ బెక్కువిధముల ననర్థదాయకమైన యీదురాచారమును ఉంచుట కంటె హేయమగుపని విద్యావంతునికి వేఱొక్కటి లేదని తెలిసి, స్వకుటుంబమునందే తనయుద్యమముల నాచరణమునకుఁ దేఁబూనెను. బాలిక రజస్వలయైన యెడలగంగా ప్రవేశము కావలెనని జనులు తన్నెంత బెదిరించినను వానికాతఁడు లొంగలేదు. ఒక్కొకప్పుడాతఁ డాక్షేపములకు సహితము పాత్రుఁడగుచుండెను. మాటలు గాలికిపోవుననియుఁ దనచర్యమాత్రము దేశాభివృద్ధిదాయక మగుననియుఁ దెలిసి యాతఁడీవిషయమును బలువురకు బోధింప నారంభించెను. సామాన్యులగు నితర సంస్కర్తలకును నీతనికినిఁ గొన్ని భేదములున్నందున వీరిచర్యలనుగూర్చి ఇంచుక ప్రస్తావించెదము.

శ్రీ రావుబహద్దరు చింతామణి నారాయణభట్టుగారు బ్రాహ్మణవంశజులు. వీరి తల్లిగారు చిన్ననాఁటినుండియు కొన్నియాహారవస్తువులను దినమని పట్టుదలతోఁ బనిసేయుచుండిరి. కాశీ మొదలగు పుణ్యక్షేత్రములకుఁ బోవువారు కొన్నియాహారవస్తువులను వదలునట్లే వీరును వ్రతముపట్టి ఎట్టిసమయములను వానిని నెగ్గించుకొనుచుండిరి. చిన్నతనమందు తమతల్లిగారి యనుజ్ఞవలన చింతామణి నారాయణభట్టుగారును కొన్నికొన్నివ్రతములను జరుపవలసివచ్చుచుండెను. కొందఱు స్త్రీలు మరణకాలమునందుఁగూడఁ దమవ్రతమును విడువక, ‘‘నేను అట్టివస్తువును తినరాదు’’ అని చెప్పుచుండుట పలుమాఱు నారాయణభట్టుగారి యనుభవములోనికి వచ్చెను. ఇట్టిపట్టుదలను జూచుటయు, తామును వ్రతచర్యలను జేయుచుండుటయు నెఱిఁగియుండుటచే, ఈవిధముగనే పట్టుదలతోఁ బని చేయుటవలన ఎల్లకార్యములను జరుపవచ్చునని నారాయణభట్టుగారు తెలిసికొనిరి.

1870వ సంవత్సరమున పూనానగరమునందు స్త్రీపునర్వివాహములవిషయమై శంకరాచార్యులయెదుట వాదప్రతివాదములు జరిగినప్పుడు నారాయణభట్టుగారు క్రమముగా నాసభలకుఁ బోవుచుండిరి. అప్పటి కాయన విద్యార్థిదశయందే యున్నను, సంస్కృతభాషా పరిచయము వలన నాసభలోని విషయము లవగాహనమగుటచే, నారాయణభట్టుగారు స్త్రీపునర్వివాహ ప్రవర్తకుల పక్షమునకుఁ దిరిగిరి.

కాని ఈయన ముఖ్యముగా పట్టుదలతోఁ బనిచేసినది అతిబాల్య వివాహముల నాపుటకొఱకు. బొంబాయిలోని స్త్రీపునర్వివాహ ప్రవర్తక సంఘమువారి సభ్యుఁడుగానున్నప్పుడీయన, వారందఱును అతిబాల్య వివాహముల నాపుటకై పనిచేసి, సంఘముపేరు గూడఁ దదనుగుణముగా మార్చుట మంచిదని చెప్పినను వారందు కంగీకరింపలేదు.

తరువాత చింతామణి నారాయణభట్టుగారు అతిబాల్య వివాహాంకురములను నశింపఁజేయుటకై యత్నములను జేయసాఁగిరి. తమచిన్ననాఁటి యనుభవమువలన పసిపిల్లలకుఁ బెండ్లిచేయమని వ్రతము రీతిగా వ్యాపింపఁజేయుట కితఁ డుద్దేశించెను. ఈయభిప్రాయముల నామోదించు వారట్టి నిర్ధారణములు కల పత్రికలపై చేవ్రాలుచేసి కార్యదీక్షతో నుండుట యుత్తమమని సూచింపఁబడుచుండెను. దీనివలన సంఘ సంస్కరణ వ్యాప్తికి నూతన మార్గమొక్కటి ఏర్పడెను. చింతామణి భట్టుగారును తమయభిప్రాయములను వ్యాపింపఁ జేయుటకై అందందుఁ దిరిగి యుపన్యాసముల నిచ్చుచుండిరి. అతిబాల్య వివాహములను జేయమని మనస్ఫూర్తిగా చెప్పువారి చేత ఈయన యట్టి వ్రాతమూలములగు పత్రికలపై చేవ్రాలు చేయించి కొనుచుండెను.

స్త్రీపునర్వివాహ ప్రవర్తక సంఘమువారు తమ సమాజము పేరు మార్చుమనియు, వేఱొక సమాజము నట్టిపేరుతో స్థాపించుట యుత్తమమనియు సూచించిన తరువాత నారాయణభట్టుగారు సంఘములోని ప్రముఖులను జేర్చి యట్టి సమాజము నుంచుటకై ప్రయత్నములను జేసెను. కాని ఈయనమాటల నెవ్వరును విన్న వారుగారు. దానివలన తనపట్టుదలను మాని యూరకొనక చింతామణి నారాయణ భట్టుగారు తమ మిత్రులలోఁ రాఁగలిగినంత మందిని చేర్చి యొక సమాజమును స్థాపించుకొనిరి. తమ బాలికలకు పదునాలుగేండ్లకుఁ బూర్వమును బాలురకు పదునెనిమిది యేండ్లకుఁ బూర్వమును వివాహము చేయరాదని యాయన చెప్పినపుడు సభికులలో నలుగు రైదుగురు మాత్రమే వీరితో నేకీభవింపఁ జాలిరి. ఇది యొక వ్రతమువలె చెల్లునట్లు చేయుటవలని లాభము లనుభవము వలన నెఱిఁగి యుండటచే అది మొదలు పోయిన చోటనెల్లను ఈయన ఉపసభల నేర్పఱిచి తమయభిప్రాయములను వెల్లడించుచుండిరి. సమయము వచ్చినప్పుడెల్ల పోఁగొట్టుకొనక ఈశ్వరునిపై భారము వైచి పని చేయ నారంభింపఁగానే ఈయనను సమీపబంధువులుగూడ ద్వేషింపసాగిరి. కాని ఈకష్టములు మాత్ర మంతవిశేషమయినవిగావు. బంధువులును, నితరులును వచ్చి తమ్ము ప్రశ్నించినప్పుడు, తా మట్లు ఒట్టుపెట్టుకొంటి మనియు, దానిని మీఱరాదనియుఁ జెప్పుచుండుటచే నెవ్వరును వారి నేమియు ననలేక యూరకొనుచుండిరి. కొందఱుమాత్రము ‘ముందుగా నాలోచించియే యట్టియొట్టిడుకొన్న మిక్కిలి బాగుగా నుండు’నని చెప్పుచువచ్చిరిగాని యంతకంటె నెక్కుడు కష్టములు రాలేదు. ఒకనాఁడు చింతామణి నారాయణభట్టుగారి చుట్టమొక్కరు తమగృహప్రవేశసమయమునందు భోగస్త్రీల నాడింపుమనియు చెప్పిరి. ఆబంధువునందు విశేషగౌరవము గలవీరు తాము భోగకాంతలనుజూడ మని యొట్టుపెట్టుకొనుటచే పోయి చూచుటకు వీలులేదని ప్రత్యుత్తరమిచ్చిరి. ‘‘మనదేవాలయములయందుఁగూడ భోగకాంత లుండఁగా నంతసందేహమేమ’’ని వారు మఱల ప్రశ్నించిరి. ప్రార్థనాసామాజికుఁడ నగుటచే నేనట్లు చేయవలయునని యాయన బదులు చెప్పెను. అట్లయినయెడల నిఁక భోగకాంతల నుంచకుండుట మీకు శ్రేయస్కర మని వారు చెప్పిరి.

ఈవిధముగా ఒట్టుపెట్టుకొన్న వెనుక నారాయణభట్టుగారి కుమార్తెకు ఆచారముప్రకారముగా పెండ్లి చేయవలసిన ఈడు వచ్చెను. నారాయణభట్టుగారు దీక్షాపరతంత్రులై వివాహము చేయక యామెకు విద్య చెప్పించుచు తాము చెప్పిన ఈడు వఱకును ఆమె నుంచిరి. బంధువులును, మిత్రులును, దేశీయులునుగూడ ఈయనకు ప్రతిజ్ఞాభంగము చేయ సమకట్టిరిగాని ప్రయోజనము లేకపోయెను. ఈవిధముగా పెండ్లి నాపియుంచుటవలన వివాహకాలము నాటికి నారాయణభట్టుగారి కుమార్తె ప్రవేశపరీ

ష్టియందుఁ గృతార్థురా లాయెను. కన్యక యెదిగినతరువాత తగినవరులు దొరుకరను లోకోక్తికి వ్యతిరేకముగా, నారాయణభట్టుగారి కుమార్తెకు సుప్రసిద్ధులైన వాసుదేవ పరాంజపిగారి ప్రథమపుత్రుఁడు వరుఁ డయ్యెను. ఈతఁ డిప్పుడు సీమలో న్యాయ వాది పరీక్షకుఁ జదువుచున్నాఁడు. వివాహమునాఁటి కీతనివయస్సు 22 ఏండ్లు. 1896వ సంవత్సరమున ఈవివాహము జరిగినతరువాత యస్- వి- పరాంజపి అను నొకరు పదునాలుగేండ్లవయస్సు గల తమచెలియలికి వివాహము చేసిరి.

మధ్యరాష్ట్రములందుమాత్రమే ఈవిధముగా ప్రయత్నములు జరుగుచున్నను, తక్కినచోట్ల రజస్వలానంతరమున బ్రాహ్మణవివాహము లంతగా జరుగుట లేదు. చిరకాలమునుండి సీమకుఁ బోవుచు వచ్చుచున్న హిందూజనసముదాయముతో నిండిన వంగదేశమునను 10, 12 ఏండ్లు దాఁటిన అవివాహితలగు బ్రాహ్మణకన్యకలు లేరు. కాని ఆదేశమునందుమాత్రము విదేశాయాతస్వజనసముదాయము పోరు బలిమిని 10 ఏండ్లలోపు బాలికలకు వివాహము చేయుటలేదు.

ఈవిధముగా నతిబాల్యవివాహములు కొన్నిచోట్ల జరగకున్నను మఱికొన్ని చోట్ల విచ్చలవిడి పెచ్చుమీఱి యుండుటచే మైసూరు దొరతనమువారు 8 ఏండ్ల లోపు బాలికలకు వివాహము చేయరాదని యొకశాసనమును చేసిరి. 1895వ సంవత్సరము ఏప్రిల్ నెలలో యీచట్టములులోనికి వచ్చినతరువాత మైసూరుదేశములోని 8 జిల్లాలలోను గలిపి 51 వివాహములు శాసనవిరుద్ధముగా జరిగినవి. అందు 123 మంది శిక్ష నందియున్నారు. వారిలో 60 మందికి పదిరూపాయలలోపు జుల్మానాయును, 45, గురికి పదిరూపాయల కెక్కుడుజుల్మానాయును, 18 మందికి కారాగృహవాసమును విధింపఁబడెను. ఈ 51 వివాహములలో 5 ఏండ్లకు లోపున నున్న బాలికల సంఖ్య 15. 5 ఏండ్లకు మించిన వధువులసంఖ్య 37. పదునాలుగేండ్లకు లోపువరులసంఖ్య 15. 50 ఏండ్లకు మించినవరులు లేనేలేరు. మతగురువులును, దేశపరిపాలకులును, వారిసంఘములలోని సభ్యులును, దేశీయులలోని పెక్కండ్రును నీచట్టమున కంగీకరించుటచే మైసూరుదేశమునం దీదురాచారము తొలఁగినట్లు మన మూహింపవచ్చును. కాలక్రమమున నాదేశమువారు ఈ యీడును ఎక్కువ చేయుట కుద్దేశింపనియెడల మాత్ర మీచట్టము నిరర్థకము. కొందఱు దొంగతనముగా బ్రిటీషుదొరతనమువారిదేశములకు వచ్చి, స్వదేశశాసనాతిక్రమణము చేసికొని తిరిగి వెడలిపోవుచుండుట సంభవించుచున్నందున మైసూరుదొరతనమువారిశాసనము సర్వజనులను గట్టుపాటులోనుంచుటలేదు. అందువలనఁ గలుగునష్టము స్వల్పమే యయినను, మైసూరుదొరతనమువారు ఆంగ్లేయ ప్రభుత్వమువారితో యోచించి, ఈయభ్యంతరమునుగూడఁ దొలఁగించినయెడల విశేషముగా లాభించును. చెన్నపురిరాజధానియందు జంబులింగము మొదలియారుగారును,

రత్నసభాపతిపిళ్ళగారును తీసికొని వచ్చిన శాసనములను ప్రభుత్వమువా రంగీకరింపకుండుట బహువిచారకరమును దేశమునకునష్టదాయకమునుగూడ నగును. 1901జనాభా లెక్కల ప్రకారముగా మనరాజధానిలో నుండు నెనిమిదేండ్లలోపు బాలవితంతువులలో విస్తారసంఖ్యయు, 8—11 ఏండ్లమధ్యనుండు బాలవితంతువులలోఁ గొందఱును, మనప్రభుత్వమువారి శాసనమే యుండునేని, నిరంతర హిందూవైధవ్యమహాదుఃఖము ననుభవింపకయే యుందురుగదా. దొరతనమువా రేమియుఁ బని చేయరాదనియు, హిందువులే స్వసంఘమును బాగు చేసికొనఁజాలుదురనియు, విజ్ఞాపనముల నంపి యింతమందిబాలికలను వైధవ్యదేవత కప్పగించిన మనహిందూముఖ్యు లిప్పుడు=ఏ మూలమూలల ముఖము దాఁచుకొని యున్నారో?

తొ మ్మి ద వ ప్ర క ర ణ ము.

వి వా హ ము లు.

కులీనులు—మళయాళీలు.

వివాహవిషయము లందు హిందూసంఘమున కపకీర్తి ఘటింపఁజాలు బ్రాహ్మణశాఖలలోఁ బ్రథమగణ్యమైనది కులీనశాఖ. ఈబ్రాహ్మణులు వంగదేశమునందు నివసించుచుందురు. వీరియందున్న దురాచారము బహుభార్యాత్వము. ఆదికాలమునందు హిందూసంఘాచారముల ననుసరించియే వీరియందు వివాహములుజరిగి యున్నను, నానాట బ్రాహ్మణసంఘమునందే కొన్నిమార్పులు గలుగఁ జొచ్చెను. అప్పుడు కులీనులనియు, శ్రోత్రియులనియు,వంశజులనియు మూడుముఖ్యవిభాగము లేర్పడెను. అందు కులీనులు రాజానుగ్రహపాత్రులై కడు భాగ్యవంతులై యుండిరి. వంశజులు మిక్కిలి తక్కువగా పరిగణింపఁబడు చుండిరి. ఉన్నతదశయందున్న కులీనులు సాధారణముగా తమ శాఖనుండియే వివాహములు చేసికొనినను, నట్టివారితోడి బంధుత్వమువలనఁ దాము గౌరవనీయులై రాజానుగ్రహము పడయవచ్చునని తలఁచి మధ్యస్థితియందున్న శ్రోత్రియులు తమ బాలికలను విశేష వరదక్షిణల నిచ్చునెపమున వారితో సంబంధములు చేసికొను చుండిరి. దీనివలన గొప్పగొప్ప కులీనుల కొక కులీనభార్యయు, నొక శ్రోత్రియభార్యయు లభించి యుండుటచే వారిలో బహుభార్యాత్వము సిద్ధించినది. ఆకాలమునందు కులీనులు రాజులు తమ కొసంగు నగ్రహారాదికముల వలన

సుఖజీవనములను జేయుచుండిరి. ఉన్నత స్థితియందుండుటచేఁ గులీనులును దమ బాలికలను స్వవర్ణమునందుండు వారికే యిచ్చి వివాహములను జేయుచుండిరి. అయినను శ్రోత్రియులు ఈవిధముగాఁ గూడఁ గులీనులతో దాంపత్యగౌరవము నందుటకై యెక్కువగా కన్యాశుల్కముల నిచ్చి వారి బాలికలను గొనుచుండిరి. ఇంచుమించుగా నెనిమిదివందల సంవత్సరములకుఁ బూర్వము దేశపాలకుఁడుగానున్న బెలాల్ సేనను నతఁడు వీనికి ముఖ్యకారకుఁడై విశేషముగాఁ బ్రోత్సాహము నిచ్చెను. తరువాతఁ గొంతకాలమునకుఁ గులీనులలో శాఖాభేదములు బయలుదేరినవి. కులీనుఁడెవ్వఁడైన ఏదైన గొప్ప నేరమునుగాని, కులమునకు గౌరవహీనమగు నితర కార్యమునుగాని చేసినయెడల నాతఁడును నతనితోడి సంబంధ బాంధవ్యములుగలవారును నొక మెల(=శాఖగా) చీలవలసివచ్చుచుండెను. కాని యెల్లశాఖలవారికిని అన్యోన్య వివాహములుమాత్రము నిరాంతకముగా జరుగుచుండెను. ఇట్లుండఁగా నించుమించు నిన్నూరుసంవత్సరములకుఁ బూర్వము దేవీభారఘటకుఁడను సంస్కృత విద్యాప్రవీణుఁడగు నొకకులీనబ్రాహ్మణుఁడు బయలుదేరి కులీనులు శ్రోత్రియకన్యలను, కులీనులుకాని యున్నతబ్రాహ్మణ కన్యలను వివాహమాడుట గౌరవనీయమనియు, వంశజకన్యలను వివాహమాడు కులీనుఁడు (సకుటుంబముగా గాక యొక్కఁడు) మాత్రమే కులమును బోఁగొట్టుకొనుననియు, అన్యబ్రాహ్మణులు కులీనకన్యలను వివాహమాడుట మిక్కిలి గౌరవనీయమనియు, కులీనులలో నన్యోన్యశాఖావివాహములుకూడవనియు, ఒక్క మెలలోనైనను తల్లియొక్క తాతవంక ఐదుతరములకు దాఁటని బాలురకే బాలికల నీయవలెననియు శాసించెను. నిరుపమాన మహాప్రజ్ఞయు, సామర్థ్యమును గలవాఁడగుటచే దేవీభారఘటకుఁ డీకార్యములను సాధించి, జన్మపారంపర్యముగా వచ్చునట్లు చేసినందున కులీనులలో వరదక్షిణలును, బహుభార్యాత్వమును గన్యాశుల్కమును స్థిరదురాచారములై నిలువవలసివచ్చెను. గౌరవమునకై ఘటకనిర్ణీతములగు శాఖలనుండి వధువులను, వరులను నాయాసంఘములవారు కోరుకొనునప్పుడు అట్టి వారి తలిదండ్రులు స్వలాభమునందకుండఁ బరులకుఁ దమబిడ్డలనిచ్చి వారికి గౌరవమును సమకూర్పరుగదా. అందువలన నీక శుల్కము లారంభమగుట కభ్యంతరమేమి? నానాట నీయాచారము ప్రబలుచుండుటచే మొన్న మొన్న జరిగిన కొన్ని వివాహములలోఁ దమబాలురకువచ్చియుఁ గాని రెండింగ్లీషు ముక్కలువచ్చినవను పేర యొక్కొక్కరి కైదువేలరూపాయలవఱకునుగూడ వరశుల్కము లనుగ్రహించినారు. కాని ఇది యింతటితో సరిపోలేదు. ఒక కులీనుని ఇంటఁబుట్టిన బాలికలందఱును వారి తల్లివంక పురుషులలో 5 తరములకు దాఁటనివారిని వివాహము చేసికొనవలసియుండుటచే, నలుగురు అప్పచెలియండ్రకు ఒక్కొకరికి నలుగురేసి పుత్రికలున్నయెడల అందఱును ఆ ఐదుతరములకులోపలనే యున్న

మగవారలను వివాహమాడవలసి వచ్చుచుండెను. ఇట్లు రానురాను రెండుమూడుతరములగు నప్పటికి, ఎప్పటికిని ఏకవంశమే యగుటచే కన్యలకు వరుఁడు దొరుకక తల క్రిందు కావలసివచ్చుచుండెను. ఈకష్టమునకుఁ దోడుగా అగ్రబ్రాహ్మణులును, శ్రోత్రియులును, వంశజులును ధనమిచ్చి కులీనవరులనుగొని తమబాలికలకు వివాహములుచేసి గౌరవమునందుచుండిరి. వంశజ కన్యలను వివాహమాడినవాఁడు కులహీనుఁడుగా నెగడఁబడుటచే కులీనులలోని వరులసంఖ్య ఇంకను తగ్గుచుండెను. ఈవిధముగా తరముల కష్టమువలనను, పురుషుల కరువువలనను, ఒక్కొకప్పుడు వయోభేదము లేక ఒక గొప్పకుటుంబములోని యప్పచెలియండ్రెల్లను దొంబదేండ్లవానికి వివాహము చేయఁబడుచుండిరి. ఒక్కొకప్పుడు వరులే దొరుకక కొందఱు యావజ్జీవమును అవివాహలుగానే యుండవలసివచ్చుచుండెను. పురుషులు దొరకమిచే ఉండఁగా నుండఁగా మఱియొకప్పుడు తరమునకు సరిపడిన యొకపురుష శిశువుజన్మించెనా వెంటనే వానికి చనిపోవుచున్న నూఱేళ్ళ కన్నెయవ్వమొదలు ఏడాది ఆఁడుపిల్లవఱకునుగూడ భార్యలగుచుండిరి. పురుషుల తలిదండ్రులును ఇట్టి వివాహములందుఁ దమకు సంతృప్తిగా ధనమును స్వీకరింపక వివాహములు చేయకుండిరి. ఒక్కొకప్పుడొక్కొక కులీనుఁడు 300మంది భార్యలనుగూడఁ బాణిగ్రహణము చేయుచుండెను.

ఈవిధముగా కులీనబ్రాహ్మణులలో వివాహములు జరుగుచున్నందున నష్టము లంతకుమించియుండెను. బహుభార్యలను గలిగియున్నవాఁడు తనసతు లందఱితోడను నిష్టుఁడుగానుండక ఎవ్వారు తనకు ధనమిత్తురో వారిని గౌరవించుచుండెను. తక్కిన వారు భర్తయుండఁగనే వైధవ్యము ననుభవించుచుఁ బుట్టింటఁబడియుండుచు వచ్చిరి. ఏభార్య తనకు ధనమిచ్చునో ఆభార్యతోడనే యాదినమున కులీనభర్త కాపురము చేయుచుండెను. తమకూఁతుల పెండ్లివలననే పిత్రార్జితముల నమ్ముకొన్న తండ్రులు వరులకు దినదినమును అరణములనుగూడఁ దెచ్చి పెట్టలేక యూరకొనుచుండిరి. కులీన బ్రాహ్మణకన్యలలో నీవిధముగా వ్యభిచారములును, భ్రూణహత్యలును, శిశుహత్యలును, లేచిపోవుటలును సంభవించుచుండెను. నీతిగల కొందఱు స్త్రీలుమాత్రము అకార్యముల కొడిగట్టలేక ఆత్మహత్యలనే చేసికొనుచుండిరి. కులీనబ్రాహ్మణగృహములన్ని వారకాంతాగృహప్రాయములైయుండెను. వేయేల? అట్టి స్థితియందు ఎన్ని నీచకార్యములు జరుగవలెనో అన్నియు నీ కులీనులయందు సంపూర్ణముగా సార్థకమయ్యెను.

ఇట్లుండఁగా 1854 వ సంవత్సరప్రాంతములం దొక కులీనకాంత విద్యాసాగరుని వద్దకివచ్చి, తా నాతని గురునిభార్య యనియు, నాతఁడు ధనముకొనక తనమొగము చూడకున్నాఁడనియు, తాను తనసోదరుని ఇంటఁ గొంతకాలమున్నను నాతఁడు తన్ను పోషింపలేక వెడలనడిపెననియు చెప్పికొనెను. విద్యాసాగరుఁడు తనగురువుతో నీవిష

యమునుగూర్చి ముచ్చటించెనుగాని యాతఁడు ధనాశాపాతకుఁడై యూరకుండెను. ఇది పనిగాదని విద్యాసాగరుఁడాకాంతను, నామెతల్లిని తాను ధనమిచ్చిపోషించుచు 1855వ సంవత్సరము డిశంబరునెల 27వ తేదీని పెక్కండ్రు మహారాజులచేతను, జమీదార్ల చేతను నితరులచేతను సంతకము చేయఁబడిన బహుభార్యా నిషేధతాపాదియగు నొక చట్టమును దొరతనము వారి సన్నిధికంపి దానిని శాసనముగాఁ జేయుఁడనికోరెను. విద్యాసాగరుని మిత్రుఁడును, వంగదేశమున కప్పటి లెప్టెనెంటు గవర్నరుననగు సర్-సెసిల్ బీడన్ అను నాయన పైదానికెంతయు హర్షించి దానిని శాసనముగా జేయించుట కుద్యుక్తుఁడైయుండెను. ఇంతలో 1856వ సంవత్సరమున సిపాయల అల్లరి తటస్థించెను. విద్యాసాగరుని స్త్రీ పునర్వివాహశాసనమును, నూతనముగాఁ దెచ్చిన ఈచట్టమునుగూడ నిందుకుఁ గారణములేయని కొందఱు చెప్పఁబూనిరి. అందువలన నిది శాసనము కాకనేపోయెను. అయినను విద్యాసాగరుఁడంతటితో ప్రయత్నము విడువక 1862వ సంవత్సరమునఁ దనమిత్రుఁడగు రాజాదేవనారాయణసింగు చట్ట నిర్మాణసభ కెన్నికొనఁబడినప్పు డాయనవలనఁ గార్యమును సాధింపఁ జూచెనుగాని, యాయన త్వరలోనే తనపదవిని విడిచిపెట్టినందున ఈప్రయత్నమును గొనసాగలేదు. ఈరెండు యత్నములును నిష్ఫలములైన వెనుక, 1871వ సంవత్సరమున కులీనవివాహముల శాస్త్రీయములనియు, దానివలన బహునష్టములు కలవనియు, సూచింపుచు నొకగ్రంథమును వ్రాసెను. దానివలన దేశమునందు విశేషముగా సంక్షోభము జరిగెను. అంతటితో నూరకొనక యామఱుసటి యేటనే విద్యాసాగరుఁడు బహుభార్యాత్వమునుగూర్చిన తనద్వితీయగ్రంథమును బ్రకటించెను.

అయినను కులీనబ్రాహ్మణవివాహ దురాచారముల నాపుటకు ముఖ్యముగాఁ బ్రయత్నించిన మహామహుఁడు విక్రమపుర నివాసియగు రాసవిహారముఖోపాధ్యాయి. భంగకులీనశాఖ సంజనితుఁడగు నీతనికిఁ జిన్ననాఁడే పెద్దలు పదుఁనలుగురు భార్యలను గట్టిపెట్టిరి. ముఖోపాధ్యాయి కులీన బ్రాహ్మణులలోని ఈదురాచారములను జూడలేక వీని నెట్లయినఁ బోనడఁప వలెనని ప్రయత్నింప సాగెను. దేవీభారఘటకునికిఁ బూర్వమునందు మెలల కన్యోన్య సంబంధ ముండుటయు, అట్టి సంబంధ మిప్పుడు లేక పోవుటయే కులీనులలోని యీదుష్టాచారములకుఁ గారణమగుటయు నీతఁడు నిజముగాఁ గనిపెట్టి, అన్యోన్య శాఖా వివాహములను జేయుటకై పనిచేసెను. కాని ఉద్యోగమునం దుండుటచే నీతని కోరిక చక్కఁగా సఫలీకృతము కాలేదు. ఏకార్యమునైనను బూనుకొన్న యెడల తదేకనిష్టతో ఉండవలెననియు, మనస్సు నన్యకార్యములకొఱకు వినియోగించుట వలనఁ దన ప్రథమ సంకల్పమునకు యావచ్ఛక్తిని ధారపోసి స్వేప్సితమును సిద్ధింపఁ జేయుట యసాధ్యమనియు నీతఁడు తలపోసి తన

యుద్యోగమును వదలివేసెను. పరోపకార విషయములందు లగ్నమైన మనస్సు ఇతర విషయములపై నిలువఁ జాలదుగదా. ఈవిధముగా రాసవిహార ముఖోపాధ్యాయి తన యుద్యోగము వదలిన వెనుక కులీనవివాహములను గూర్చి బోధించుటకై యూరూరఁ దిరుగసాగెను. పోయిన చోటనెల్లను ఉపన్యాసముల నొసఁగుచు, దీనినిఁ గూర్చి పత్రికలను, గ్రంథములను వ్రాసి ఉచితముగా నెల్లఱకుఁ బంచిపెట్టుచు, నప్పుడప్పు కులీనవివాహాచారములపై జనులకు విరక్తికలుగు రీతిగాఁ దానురచించిన గీతములను బాడుచు, ఎన్నికష్టములకైనను ఓర్చి ఈమహామహుఁడు తన జీవితకాలములో నించుమించుగా 100 అన్యోన్యశాఖా వివాహములను జేయఁజాలెను. కాని ఇది యొకగొప్ప గాదు. రాసవిహార ముఖోపాధ్యాయియొక్క ప్రయత్నముల వలన కులీన సంఘమంతయు నూతన జీవమును సంపాదించుకొని యాయన నెలకొల్పిన యాచారములను సర్వజనసమ్మతము చేయుచున్నది. కేవల శిష్టాచారపరాయణులు గూడ కార్యవాదులగుటకు సాహసింప లేకున్నను హృదయపూర్వకముగా నిట్టి వివాహముల నామోదించుచున్నారు. ఈయన 1897సం॥ రమున చనిపోయిన వెనుక ఫరిదపుర (Faridpur) వద్ద అంగ్రామనుపట్టణమున నివసించు ఆదిత్యచంద్రబంధోపాధ్యాయి యనువారు తా మిదివఱకే పూనుకొనిన ఈకార్యమునకై యినుమడించిన శ్రద్ధతోఁ బనిచేయుచు, లౌకికములగు నితరవృత్తుల నన్నిటిని వదలియున్నారు. కులీనులును దమ దుస్థితినిఁ దెలిసికొని అందందు సమాజములనుగూడ స్థాపించికొని తమలోని దురాచారములను బోనడఁప యత్నించుచున్నారు. బారిసాల ధర్మరక్షిణీసభయను పేరుగలయం దొకసమాజము 1896వ సంవత్సరమున కులీనులలోని శాఖాభేదములను మాన్పఁడనియు, కన్యాశుల్కమును, వరశుల్కమును, శాస్త్రనిషిద్ధమగు నంతవఱకు బహుభార్యాత్వమును నిషేధింపుఁడనియు దొరతనమువారి కొక విజ్ఞాపనమునుగూడ నంపియున్నది.

కాని మళయాళలలోని వివాహాచారములను జూచినప్పుడు కులీనులలోనివి యంత వింతగాఁ గానఁబడవు. కులీనాచారములు నడుమవచ్చినవిగాని, మళయాళీల యాచారములు అనాది సిద్ధములుగా నెగడఁబడుచున్నవి.

చెన్నపురిలోని చిత్రవస్తుప్రదర్శనశాలను జూచినవారందఱును అందలి మళయాళదేశపు కొందఱు స్త్రీల ప్రతిమలను వీక్షించియేయుందురు. శరీరముయొక్క క్రిందిభాగమునకు మాత్రమే అడ్డముగా నొకబట్టను గట్టుకొని యూర్ధ్వభాగమున కే చాటును లేక సంచరించుట వీరిలోఁ గొందఱి యాచారమైయున్నది. ఈ జాతివారిలో పురుషుల ప్రసక్తి ఏమియులేకయే స్త్రీలుదాయమున కర్తలగుదురు. స్థిరచరమురూప

కమగు ద్రవ్యమంతయుఁ దల్లి వంక పుత్రికలకువచ్చునుగాని పురుషులకు రాదు. ఆదేశము నందు కుటుంబములకు 'తార్వాడు' లని పేరు. ప్రతి తార్వాడునందును నొకతల్లియు, నామె సోదరులును నామె బిడ్డలును జేరియుందురు. గొప్పగొప్ప తార్వాడులలో నేక స్త్రీవంశజులైన పెక్కండ్రుతల్లులు వారిపుత్రపుత్రికాదులతో నివసించుచు, గృహములోని 'కారణవానుఁ' డను పేరుగల తమ మేనమామతోను, అధికారయోగ్యురాలైన యొక స్త్రీ క్రిందను నుందురు.

వీరిలో తల్లులవంక కుమార్తెలు ఆ స్తికి వారసులగుదురుగాని తండ్రియొక్కయుఁ బుత్రులయొక్కయు జోక్యమే లేదు. ఈవిధమైన వీరియాచారమును 'మురుమక్కత్తాయ' మని యచటివారు వ్యవహింతురు. వీరి స్త్రీలకుఁ బూర్వకాలమునందు ఏకభర్తృత్వములేక తమ కిష్టమువచ్చినవారితోఁ గలియుచుండుటచే స్త్రీలనుబట్టియే యీదేశపునాయరులు తీయరులు మొదలగు వారిలో వారసత్త్వమునకుఁ గారణమైనది. పూర్వమొకకాలమునందు వీరిదేశము సముద్రమునఁ గలిసిపోయి యుండినప్పుడు భగవంతుఁడైన పరశురాముఁడు దీనిని సముద్రమునుండి బైటికిఁ దీసి యచటివారి కీయాచారములను దయచేసె ననియు నందుచే నివిదేవదత్తము లనియు నచటివారెంత చెప్పినను ప్రాచీన ప్రపంచచరిత్రమునుబట్టి విచారింపఁ బూనుదుమేని వీరిసంఘము వివాహాచారము లంతగాఁ బ్రబలియుండని యాదికాలమునాఁడే ఏర్పఱుపఁబడినదని మనము సులభముగాఁ దెలిసికొనవచ్చును. తండ్రి ఎవ్వరో తెలియనిరీతిగా బహుభర్తలను గలిగియున్న స్త్రీకి శిశుజననమగునప్పుడు దానివంశమును దల్లినిఁబట్టియే నిర్ధారణము చేయవలసివచ్చును గదా. ప్రకృతమున మనలో నాచారముగా వివాహమును బితృపుత్రుల సంబంధమును విచారించినప్పుడు పై విషయమునం దించుక సందేహము పొడమవచ్చును గాని మళయాళీలయాచారములను దెలియవలసివచ్చినప్పు డీవిషయములను మనమావలకు నెట్టవలయును. స్త్రీలుమాత్రమె వంశనిర్ధారణమునకు స్థిరబాంధవ్యమును జూపుటయు, బురుషులు ప్రతితరమునకునుగూడఁ జీలిపోవుటయు, ఒక్కఁడే భర్తను గలిగియుండుటయు నాఁటియాచారము కాకపోవుటయు స్త్రీలస్వాతంత్రమునకుఁ గారణములైయున్నవి. కాని ఇది ఒక్కమళయాళీలలోని చిత్రమే కాదు. పూర్వకాలపు లిషియనులు తమతల్లులచే నామకరణమునంది, స్త్రీల వరుసనే తరములను లెక్కించుకొనుచుండిరి. ఎట్రుస్కనుల గోరీలపైన వంశవృక్షములు స్త్రీలను బట్టియే వ్రాయఁబడినట్లు లబ్బకుదొరవారు వ్రాయుచున్నారు. ప్రాచీనకాలపు జనులలో మేనమామలును తండ్రులును గూడ పిల్లలను బ్రేమించుచుండెడివారనియు, అందు మేనమామప్రేమయే పవిత్రముగాఁగూడ నెగడఁబడి యుండెననియు నొకచోట వ్రాయఁబడినది. పూర్వకాలపు

పిక్టులను వారిశాఖలో క్రీ.శ. ఎనిమిదవశతాబ్దమువఱకును పుత్రు లెవ్వరును తండ్రి సొత్తునకు వారసులైనట్లు వివరింపఁబడి యుండలేదు. వివాహము లేక యిష్టమువచ్చినంత మంది భర్తలతో విహరించుచుండెడు మళయాళీలలో స్త్రీలవంకనే వారసత్వమును ప్రాముఖ్యతయు వచ్చుచుండుట సహజముగానే యున్నది.

ఇదిగాక మళయాళీలలో ఆదినుండియునుగూడ వివాహములున్నట్లు గానఁబడదు. ఈవిషయమై పని చేసిన కొందఱివి ఆదికాలమునుండియుఁగూడ వారిలో లేవని సిద్ధాంతీకరించినారు. కాలికట్టు రాజులగు సామొదరీలలో మేనల్లుడు వారసుఁడగుచుండుటకుఁ గారణము పురాతనమునుండియుఁ దండ్రివంక పుత్రుఁడు హక్కుగలవాఁడుగాఁ బరిగణింపఁబడకుండుటయేయని వారే చెప్పియున్నారు.

ఇప్పటికిని మళయాళములోని ప్రధానపాలకుల యాచారములను జూచితిమేని పురాతనకాలమునందును వారిలో వివాహాచారము లేదని స్పష్టపడఁగలదు. కోవిలోక్కము లనఁబడు గౌరవకుటుంబములలోని స్త్రీలు వివాహాది విధులేమియు నక్కఱలేకుండనే నంబూద్రిబ్రాహ్మణులతో విహరించుచు, ఇచ్చవచ్చినప్పుడెల్ల తమ కుటుంబాధికారి యగురాజు ననుజ్ఞను గొని వారిని మార్చుకొనుచుండవచ్చును. గొప్పకుటుంబములందే పురాతనాచారములు పీటలుపట్టి వదలకుండునుగాన, ఎల్లఱకును సామాన్యమగు నీయాచార మతిపురాతనమైనదనియు, నప్పటిసంఘములో వివాహములు లేవనియు నిర్ణయింప నవకాశము కలుగుచున్నది. అట్లే 825వ సంవత్సరము ఆగష్టు 26వ తేదిని శ్రీశంకరాచార్యులవారు కేరళ అనాచారము అనుపేర ఆదేశాచారములలో 64 టిని వ్రాసినట్లు కొందఱు చెప్పుచున్నారు. అందు 59వది నంబూద్రిబ్రాహ్మణులలోఁ బ్రథమపుత్రుఁడుమాత్రమే వివాహార్హుఁడుగా నున్నట్లు చెప్పఁబడియున్నది. శంకరాచార్యులే వీనిని వ్రాసినవార్త సత్యమేని 1100 ఏండ్లక్రిందటఁగూడ నంబూద్రి బ్రాహ్మణులు నాయరు స్త్రీలతోఁ జరించుచున్నట్లు స్పష్టము కాఁగలదు. అట్లే కేరళమాహాత్మ్యమనియు, కేరళోపత్తియనియు వారిలో రెండుగ్రంథము లున్నవి. పూర్వాచారపరాయణులచేఁ గడుగౌరవింపఁబడు నీగ్రంథములలో మొదటిది సంస్కృతభాషలో వ్రాయఁబడినది. "ఒక్క స్త్రీతో ముగ్గురునలుగురు భోగింపవచ్చును" అని యందున్నది. ఇంచుమించుగా నూటయేఁబది ఏండ్లక్రిందట వ్రాయఁబడినట్లు ఊహింపవలసిన రెండవగ్రంథము మళయాళభాషలో నున్నది. అందును నిట్టివిషయములే యున్నవి. మొదటిగ్రంథములోనే వేఱొకచోట 'మధ్యదేశమునందు గంధర్వులందువలెనే ఒక్క స్త్రీకి ఒక్కఁడే పురుషుఁడు. దేవతలలో స్త్రీలు దినమున కొక్కొకమనుష్యునితో నుండవచ్చును' అని వ్రాయఁబడియున్నది. ఈగ్రంథము లిప్పటివారిచే మొన్నమొన్ననే

వ్రాయఁబడిన ట్లూహించినను గూడ ఆదేశమునందు మొదటినుండియును వివాహాచారము ప్రబలియుండలేదని విస్పష్టమగును. షేకుజిన్నుడ్డీ యను నొకమహమ్మదీయుఁడు, 16వ శతాబ్దమునందు ప్రతినాయరుస్త్రీయును ఇద్దఱు మొదలు నలుగురువఱకును బురుషులను గలిగియున్నట్లును, నీపురుషులలో నన్యోన్యవైరము లెక్కడనోగాని లేనట్లును, మహమ్మదీయుఁడు తనభార్యలకు కాలము నెట్లు పంచిపెట్టునో అట్లే యీస్త్రీలును తమ పురుషులకు వీలునుబట్టి కాలము లేర్పఱుచుచుండిరనియు వ్రాసియున్నాఁడు. 1727వ సంవత్సరమున హామిల్టన్ అను నొకదొర తన తూర్పు ఇండియాచరిత్రమునందు ఒక్కస్త్రీ 12 గురు కంటె ఎక్కుడుమంది భర్తలను ఏకకాలమునందుఁ గలిగియుండరాదనియు, వారందఱును అన్యోన్యవైషమ్యములు లేక వంతులవరుసను ఆమెతోఁ గ్రీడించుచు, తమతమసమయములం దామెకుఁ గావలసినపదార్థములను గూర్చుచుందు రనియు వ్రాసియున్నాఁడు. ఇట్టిదృష్టాంతములు విశేషముగా నుండుటవలన మళయాళీలలో వివాహములు ఆదినుండియు లేనేలేవని మనము నిర్ణయించుకోవచ్చును. ఈరీతి సంఘమునందు వివాహాచారము క్రొత్తగా వచ్చునేని అది మనవివాహములవలె ఒక్కసారిగానే కాక, కొంతకాలము వారివారి బహుభర్తృత్వమువలెనే యుండి, తరువాత తరువాత వృద్ధి కావలసియుండును. ఆకస్మికాభివృద్ధి ఎక్కడనో కాని కాదనుటకుఁ బ్రపంచచరిత్ర మంతయుఁ బ్రబల దృష్టాంతము. కాఁబట్టి మళయాళీలలో ఏకాలమునందైన వారి పూర్వాచారమున కతిదూరముగా నుండని వివాహము లున్నట్లు మనకుఁ దెలియునేని, అవియే మొట్టమొదటి వివాహప్రయత్నములని మన మూహింపవచ్చును. ఉఁపాంపోరుక్కా (=వంతునకు వేచియుండుట) యనియు, వీడరంకైరుగా (=యింటికి వచ్చుట) యనియు, కిడక్కూరా (=చేరియుండుట) యనియు, నీ మూఁడువివాహములును మళయాళీలలోని ఈస్థితికి సాక్ష్యములై నిలిచి యున్నవి. మొదటిరీతి వివాహములు వారిపూర్వాచారమునే బోలియున్నవి. పురుషులే తమకాంతయింటికి వంతుల వెంబడిఁ బోవుచుండుట యందలియాచారము. రెండవరీతి పెండ్లియందు స్త్రీలు తమభర్తలు తమకు బట్టలు కట్టఁబెట్టువఱకును వారియిండ్లకుఁ బోరు. పాలఘాటుతాలుకాలో ముఖ్యముగావ్యాపించియున్న యీరీతివివాహములలో, వధువు కుటుంబములోని ముఖ్యకాంత అందఱి యెదుటను, "ఈ బాలుఁడు ఆఱుమాసములవఱకు ఈ చిన్నదానితో ఉండవచ్చును" అని చెప్పును. అప్పు డక్కడ నున్నవా రందఱును అట్లే కానిమ్ము అని చెప్పుదురు. ఇవి కాక ఉత్తరమళయాళములోని తీయరులలో మఱియొకరీతి వివాహాచార మున్నది. వరుఁడు వివాహసమయమున వధువుకుటుంబములోని ముఖ్యస్త్రీకి కాణ మను పేర కొంతధనము నిచ్చును. దీనివలన వధువా ధనమునకు

తాకట్టు పెట్టఁబడినట్లును, ఆమెవంకవా రాధనమును దిరిగివరున కిచ్చునప్పు డామె మఱల వారిస్వాధీన మగునట్లును నిర్ణయింపవలసి యున్నది. ఈ యూహయే నిజమనుటకు దృష్టాంతముగా నీమధ్య నొకవరుఁడు తగినంతకారణము లేకుండనే వధువు తన్ను విడనాడి పోయినందున, తనకాణమును దనకు తిరిగి యిప్పించవలసినదని యొకవ్యాజమునుగూడఁ దెచ్చినాఁడు. న్యాయాధికారి యెదుట ఈయుక్తి చాలనందున ఈకేసు కొట్టివేయఁబడినను, దేశజనుల యభిప్రాయములకును, నీవివాహముల యుద్దేశమునకును నిది యొక ప్రబలసాక్ష్యమై యున్నది. ఇప్పటికినిఁగూడ, ఒకరివెనుక నొకఁడుగా భిన్నకాలములం దేకకాంత పేఱుపేఱు భర్తలను గలిగియుండునాచారము, కొంఁదికాలము క్రిందనే మళయాళీలలో వివాహాచారము కొనిరాఁబడినదనుటకు దృష్టాంతముగా నున్నది. ఇప్పటికిని వలువనాడు పొన్నానితాలూకాలలోని పురుషులవంకనే దాయము నందుచున్న వడ్రంగులు, కమ్మరులు మొదలగువారిలో పెక్కండ్రు సోదరు లొక్క కాంతనే వివాహమాడుచుందురు. మనదేశములో పాంచాలి కైదుగురు భర్తలును, తార కిద్దఱును నీవిధముగా నుండుటనుఁబట్టి చూచినయెడల హిందూదేశ మంతలోఁ గూడ వివాహాచారములు మళయాళమునందువలెనే యాచరణమునకు వచ్చినట్లు తప్పక తెలియఁ గలదు. వేదమునందుఁగూడ నొక్కచోట శిశువు జననమునకుఁ దల్లి ముఖ్యకారణమా తండ్రియా యనుపృచ్ఛ గలుగుటయు, తత్వజ్ఞానాదికమునుగూర్చిన శిశువు తెలివియంతయుమాత్రము దండ్రివల్లనే వచ్చిన ట్లుత్తర మొసఁగఁ బడుటయు నంతకుఁ బూర్వ మొక్కనాఁడు స్త్రీలవంకనే దాయముగూడ వచ్చు స్థితిలో హిందూదేశ మున్నట్లు మనకుఁ దెలుపుడు చేయుచున్నది. అట్టిచరిత్రాతీతములైన యాతొలి దినములలోనే నాయరులువచ్చి మళయాళదేశమునందుఁ బ్రవేశించి నాఁటినుండియుఁగూడ నంతగా నభివృద్ధినందక, కొండదేశ మగుటచే నితరులతో సంబంధము లేనివారై హిందూదేశపు పురాతనాచారములకు ఇప్పటికిని సాక్షులై 'స్థిరోభవ వరదోభవ' అనురీతి నున్నట్లు మనము సులభముగాఁ దెలిసికొని, బాలురచదువు హిందూదేశచరిత్రములోని రెండవ విషయములో మొట్టమొదటి కాపురస్థులను విషయమున నాయరు లేల చేర్పఁబడిరో స్పష్టపఱుచుకొనుచున్నాము. ఈ కారణమువలననే ఆదేశమునందు తరువాతఁ బ్రవేశించిన ఆర్యులతెగలోని కొద్దిమంది బ్రాహ్మణులవలన ఈవివాహము లేకుండు నాచారముత్పన్నమైనదని చెప్పువారి సిద్ధాంతమును మేము నమ్మలేకున్నాము.

ఏవిషయము లెట్లున్నను మళయాళములోని వివాహములలో 6 ముఖ్యమైనవి. అవి వరుసగా (1) పొడమూరి, (2) వీడరంకైరుగ, (3) ఉఁపాంపోరుక్కా, (4) సంబంధము, (5) కిడక్కూరా, (6) మంగళము అను నామములను గలిగియున్నవి.

అందు మొదటిమూఁడును ఉత్తరమళయాళమునందును, 4వది దక్షిణమళయాళమునందును, 5వది పాలఘాటు తాలూకాయందును జరుగుచుండును. ఆఱవది ఉత్తరమళయాళములోని తీయరులలో జరుగుచున్నది. ఆచారమునుబట్టి వీనిలో నేదేని యొకవివాహము సాధారణముగా శోభనదినమునకుఁ బూర్వమున జరుగుచుండును. పొడుమూరి వివాహమునందు వరుఁడు వధువున కొకవస్త్రమును కట్నముగా నిచ్చును. వీడరం కైరుగయందు పొడుమూరి కట్నమునందువలెను వధువత్తవారింటికిఁ బోరాదు. ఈ రీతి వివాహములలో సాధారణముగా స్త్రీ గర్భిణియయిన తఱువాత వరుఁ డామెను దన యింటికిఁ గొనిపోవుచుండును. వీడరం కైరుగకును ఉపాంపోరుక్కాకును అంతఁగా భేదములేదు. మంగళమునందు కాణము చెల్లింపఁబడును. సంబంధమునకును పొడుమూరికిని అంతగా భేదములేదు; కాని కొన్నిచోట్ల వస్త్రము నిచ్చుటకు బదు లొక తాంబూలమును ఒసఁగుచుందురు. కిడక్కూరానుగూర్చి యిదివరకే చెప్పఁబడినది.

సామాన్యజనులలో నందం దీరీతివివాహములు జరుగుచున్నను, కోవిలొక్కములలో నిందొక్కటియుఁ గానరాదు. అధికారోన్నతులగు వీరి శాఖలో కొన్నిచోట్ల 'వేళి' యనియుఁ, గొన్నిచోట్ల 'కల్యాణ'మనియుఁ బిలువఁబడు నొకతంతు విశేషవ్యయముతో జరుపఁబడుచుండును. ఉత్తరమలబారులోని కోవిలొక్కములలో కోవిలతంబిరానును (ప్రధానుఁడును) సామోదరీన్ (Zomorin) గారి కుటుంబమునందు క్రన్‌గనూరు రాజాగారి కుటుంబములో నొక్కఁడును, వధువు మెడలో నొకబంగారు పతకమును గట్టుచుందురు. వధువుల కిది ఋతుమతులుకాక పూర్వమే జరుగుచుండును. కాని ఈముడివలన భార్యాభర్తృత్వ మెంతమాత్రమును ఏర్పడదు. ఆమె ఋతుమతియైన తఱువాత ఇష్టమున్నయెడల కోవిల్ తంబిరాన్ గాని ముడివేసిన యితరుఁడుగాని ఆమెతో నుండవచ్చును; కాని లేనియెడల ఏవైదికపుతంతును ఎవ్వరిసమాధానమును నక్కఱ లేకుండనే ఆమె తనయిచ్చవచ్చిన నంబూద్రిబ్రాహ్మణుని చెట్టఁ బట్టును. వానిని మాఱ్చునప్పుడుమాత్ర మామె తన కారణవానుఁడైన తనకుటుంబములోని ప్రధానరాజు ననుజ్ఞను బొందుచుండవలెను.

సామాన్యజనులలో ఆఱువిధములైన వివాహము లున్నట్లు ఇదివఱకు వ్రాసియున్నాముగదా. కాని అవి సకృతుగామాత్రమే జరుపఁబడుచున్నవి. మళయాళదేశమంతటను నాయరులచేతను, మరుమక్కత్తాయము తీయరులచేతను తప్పక జరుపఁబడుచుండు నామకవివాహ మొక్కటికలదు. దీనినే తాలికట్టు కల్యాణమని వాడుచుందురు. ఋతుమతికాక పూర్వము కన్య కీవివాహము జరుపఁబడనియెడల ఆమె కులహీనురాలగును. దీనియందు ముఖ్యముగా పుస్తెముడిపెట్టఁ బడును. ఈవివాహమయి

నప్పటి నుండియు ఆమె 'అమ్మ' అనుపదముతోఁ బిలువఁబడుట కర్హురాలగును. ఈపెండ్లి నాలుగుదినములును అయిన తఱువాత ఆమె యథేచ్ఛముగా తన పుస్తెను త్రెంచి వేయవచ్చును. కాని దక్షిణమళయాళములోని కొన్ని భాగములలో నిది నిజమైన వివాహమని ఎంచఁబడుటచే నచ్చటివారు పెండ్లినాలవనాఁడు కచ్చైయని పిలువఁబడు నాచారము ననుసరించిన వస్త్రము నొకదానిని చింపివైచి వివాహసంబంధమును విఁగొట్టినవెనుకనే పుస్తెలను త్రెంచివేయ సాహసింతురు. ఈవివాహములందు 'మానవాలన్' అని పిలువఁబడు పుస్తెముడివేసినవానికి కాంతపై ఏహక్కును లేదు. ఉత్తరమళయాళమునందు బ్రాహ్మణులే ఈముడి వేయుదురు. అప్పుడీపెండ్లికూఁతురువా రతఁడుపడ్డ కష్టమునకుఁగాను కొంచెము దక్షిణనిచ్చి ఆతనిని సాగనంపుదురు. దక్షిణమళయాళమునందు సమానకులజుఁడైన 'ఏనాంగన్' అనువాఁడు ఈముడిని వేయుచుండును. ఇందువల్ల వారిలో వివాహము చేయించు 'ఏనాంగన్' కుటుంబము లుత్పన్నమైనవి. మరుమక్కత్తాయము తీయరులలో మునుపొక మంగలిదానిచే పెండ్లికి పుస్తెలను గట్టించెడువారు; కాని ఈమధ్య కొందఱు సంస్కర్తలు బయలుదేరి ఈ యాచారమపలక్షణమని కొట్టివేయించిరి. వీరిలో ప్రధానుఁడును, అప్పుడక్కడి డిప్యూటీకలక్టరునునగు కానరాన్ అనువారు తమసంస్కరణము నింకను వృద్ధిపఱచి, కన్యనీయఁ దలఁచినవరునిచేతనో, అతని సోదరిచేతనో ముడిపెట్టించు నాచారమును గొనివచ్చిరి. ఇట్టి సంస్కర్తలవలననేగదా పూర్వము వారిస్థితిలోనేయున్న మనసంఘమును ఇప్పటి దశకువచ్చినది. మనకన్నయున్నతదశయందున్న వారికి మనయాచారములు హీనముగానున్నట్లు కానవచ్చుచుండఁగా, మనమును మళయాళీల యాచారములను హీనమైనవని భావించుట సంఘసంస్కరణము సర్వకాల సర్వావస్థలయందును జరుగవలెననియు, అభివృద్ధికి అంతము లేదనియు, సంపూర్ణత్వ మొక్క ఈశ్వరునికేగాని మానవులకు కాదనియు వేయినోళ్ళ ఘోషించుచు, సంస్కరణమే వలదనువారు లోకాభివృద్ధికరములగు మార్గముల నెఱుఁగనివారై, మాకు వివాహములు వలదనుమళయాళీలవంటివారితోఁ జేరినవారగుదురని బోధించుచున్నదిగదా. మళయాళీలలో ఈవిధముగా తాలికట్టు కల్యాణము కేవల నామకమగుటచే, కొన్నికుటుంబములవారు చేరి తమలోని బాలికల కొక్కలగ్నముననే యొక్కచోట వివాహము చేయుచుందురు. అప్పుడు పుస్తెకట్టువాఁడు అందఱికినిఁ గూడ ముడివేసి తనకట్నములను గొనిపోవుచుండును. మఱియొకప్పుడు పెండ్లికాని యప్పసెల్లెండ్ర కందఱకును ఒక్కమాఱే వివాహము జరుగును. ఒకసారి తల్లికి పుస్తెకట్టినవాఁడే మఱియొకసారి కూఁతురునకుఁ గూడ సూత్రధారణముచేయును. ఈరీతినామక వివాహము కాకపూర్వ మెవ్వరుగాని

మొదటచెప్పిన ఆఱువివాహములలో దేనినిఁగాని చేసికొన నర్హులుగారు. తాలికట్టు కల్యాణమైన వెనుక 'అమ్మ' పెండ్లి యక్కఱలేకనే యిచ్ఛావిహారములు చేయవచ్చును.

ఈ విధముగా వారిలో వివాహాచారము లెట్లున్నను, హీనజాతులను వివాహమాడుట నిషేధమైయున్నది. ఏకశాఖలోనైనను ఉత్తరమళయాళములోనివారు దక్షిణమళయాళములోని వారిని వివాహమాడరాదు. దక్షిణమళయాళములోనివారు మాత్రము ఉత్తరమళయాళము వారిని వివాహమాడుట మిక్కిలి గౌరవనీయమని తలఁచుచుందురు. ఈ రెండుభాగములకును నడుమనున్న కోరపుఝ్ఝనదిని దాఁటుట ఉత్తరమళయాళము వారు పాతక మనిపించుకొనును. ఇందుకు సరియైన కారణ మిది యొక్కటియేయని నిర్ధారణముచేయ వీలు లేదు. కాని పెక్కువిషయములలో నిరుతెగలవారికినిఁగల ఆచారభేదములే యిట్టి నిషేధముల కాస్పదములగుచున్నవి. ఉత్తరమళయాళములోని స్త్రీలు దక్షిణమళయాళపు పురుషులను వివాహమాడరాదని ఆదేశపురాజునే విశేషముగా ప్రేమించి తనయందలి భక్తిగౌరవములను విడనాడుదు రన్నభయముచే కోళాత్రి లేక చిరక్కాల్ రాజులలో నొక్కరీశాసనమును గల్పించినట్లు కొందఱు చెప్పుచున్నారు. కాని స్త్రీల కొక్కరికే నిషేధమేర్పఱుచు నీవిషయమంతగా నాదరణీయముగాదు. దక్షిణమళయాళమువలె కాక ఉత్తరమళయాళమునందు బహుభర్తృత్వము మిక్కిలి తక్కువగుటచేత, తమ సదాచారమును గాపాడుకొనుటకుఁ గొందఱీ నిషేధమును గొనివచ్చిన ట్లొకనమ్మకముగలదు. కేరళమాహాత్మ్యమునందును ఉత్తరదేశములో ఒక్కస్త్రీకి ఒకఁడే భర్తయను వాక్యమును, ఈయభిప్రాయమును ఏకీభవించుటచే ఈయూహ కొంతవఱకు సరియైనను గావచ్చును. కోరపుఝ్ఝనదియందు పడవ నడుపువారు మాపిళ్ళలగుటచే, వారిని సమీపించు మహాపాతకమున కోడిగట్టలేక ఈ నిషేధమును గొనివచ్చిరని కొందఱు తలఁచుచున్నారు. దక్షిణ మళయాళమునందలి కొందఱు తీయరులు ఇళువారులను హీనజాతివారిని వివాహ మాడుచుండుటచే, సంకరమైన ఏపాడు వంశముతో సంబంధము కలుగునో యన్న భయముచే ఉత్తర మళయాళమువా రీ నిషేధమును దెచ్చిరని కొందఱు నమ్ముచున్నారు. తా మెక్కువ ఆచారవంతులమనియు దక్షిణమళయాళమువా రిట్టి వారు కారనియు నందుచే వారు సంబంధబాంధవ్యముల కనర్హులనియుఁ గొందఱు తలఁచుచున్నారు. ఇవి నంబూద్రీలచే నొకవేళ తేఁబడినను తేఁబడవచ్చును. మళయాళపు బ్రాహ్మణులలో ప్రథమపుత్రుఁ డొక్కఁడే వివాహార్హుఁ డగుచున్నాఁడు. మిగిలిన పురుషు

లందఱును పూర్వుల కంటె నెక్కుడు బుద్ధిమంతులు కాక పోవుటచే, సనాతనసదాచారమును మీఱుట పాపమని తెలిసి, నాయరు కాంతలతో బహిరంగముగా ఇచ్ఛావిహారములను జేయుచుందురు. వివాహమాడు ప్రథమపుత్రులలో నైనను బహుభార్యాత్వము లేనందున, ఆదేశపు స్త్రీలలోఁ జాలమంది అవివాహితలుగానే దినములు గడపుదురు. అయినను వారియందు వ్యభిచారాది పాపములు లేవనియు, ఎవ్వతెయైన నట్టి యకార్యములను జరిగించెనేని యామె యింటినుండి వెడలఁ ద్రోయఁబడుననియు నాదేశస్థులలోఁ గొందఱినుండి మేము వినియున్నాము. ఇది ఎంతవఱకు సత్యమో యింకను దెలియ వలసి యున్నది గాని, అట్లువెడల నడుపునప్పుడు మాత్రము నంబూద్రీలలోఁ జేరని యితర బ్రాహ్మణు నొక్కనిని ధర్మకర్తను జేయుదురఁట.

మళయాళదేశపు టాచారములు మిక్కిలి వింతగా నెన్నఁబడు చుండుటచే సాధ్యమగునంతవఱకు విరళముగా నీవిషయమును వ్రాసియున్నాము. కాని ఇంకను అధికముగా వ్రాయుటకీ చిన్న గ్రంథమునందు మాకు తావుచాలదు. మళయాళమునందు పురుషులే లేరనియు, గాలికే బిడ్డలు పుట్టుదురనియుఁ జెప్పునట్టియుఁ మహామంత్రవేత్తలై మళయాళ మంత్రసిద్ధివలన, మనదేశపు పురుషులచ్చటికిఁ బోఁగానే వారిని వశ్యముచేసికొని, మఱల నింటికి రానీయరని చెప్పునట్టియు మనవారి మాటలలో మొదటి దెంతవఱకసత్యమో, రెండవది ఎంతవఱకు నిజము కానోపునో మీకే స్పష్టము కాఁగలదు.

మళయాళములోని నాయరులలో నీవిధముగా వివాహాచారము లుండుటచే, సరియైన వివాహములను గొనిరావలెనని యందందుఁ బ్రయత్నములు జరుగుచునే వచ్చినవి. వానిలో ముఖ్యమైనది ఘనతవహించిన శంకరనాయరుగారిది. 1890వ సంవత్సరప్రాంతములందు వీరు మళయాళములో నొకవిధమగు వివాహమును గొనివచ్చుటకయి చట్టనిర్మాణసభలో నొకబిల్లును దీసికొని వచ్చినప్పు డాదేశమందంతటను మీఱరాని సంక్షోభము జరిగెను. ఇంచుమించుగా 2000ఏండ్లనుండియు, నేవిధమైన యభివృద్ధిని అంతగా నందక ఇచ్ఛావిహారములు జరుప నేర్చిన కాంతామణుల కీవివాహప్రయత్నములు హృదయశూలములై అప్పుడే వర్ణసంకరము కలుగునా యనునట్లు తోఁచెను. బ్రహ్మసమాజమువారి చట్టముయొక్కయు పారసీవారియొక్కయు వివాహసంబంధమును విడఁగొట్టుటకుఁగూడ ననువైన నిబంధనలతో దీనినిఁ దెచ్చినప్పుడు సంకరత్వమును గూర్చిన భయము వారికి మఱియు నెక్కుడయ్యెను. ఇట్లుండఁగా 1891వ సంవత్సరము 4 మెయి తేదీని ప్రభుత్వమువా రీవివాహవిషయమును చక్కఁగా యోచించి తమ యభిప్రాయమును దెలుపుటకయి యొకయుపసంఘము నేర్పఱిచిరి. ఈయుపసంఘము

వారు అప్పటి హైకోర్టు జడ్జిగానుండి, హిందూదేశీయులలో విశేష విఖ్యాతి గాంచిన సర్-టి. ముత్తుసామిఅయ్యరు కే. సి. యస్. ఐ. గారి యాజమాన్యము క్రింద అనేకవిషయములనుగూర్చి పరిశీలనచేసి, అచ్చటచ్చటి గొప్పవారి యభిప్రాయములను సంపాదించి, పెక్కండ్రు సాక్షులను విమర్శించి, ప్రభుత్వమువారీ విషయమున నొకచట్టమును జేయవలసినదేయనియు, అయినను దేశకాలాదులనుబట్టి శంకరునాయరుగారి నిబంధనలందుఁ గొన్నిమార్పులు కావలయుననియుఁ బ్రత్యుత్తర మంపిరి. అయినను 1897 దాఁటువఱకును అదిచట్టమే కాలేదు. తుట్టతుదకది చట్టమైనప్పుడు దానిలోవిశేషముగా మార్పులు చేయఁబడెను. ఈమార్పులవలన అతిబాల్యవివాహములను జరుపవచ్చును. ఇది శంకరనాయరుగారి మతముగాదని వారు మొదట తెచ్చిన బిల్లువల్ల ఊహింపవలసియున్నది. ప్రకృతమున నేర్పఱుపఁబడిన చట్టము వలన పురుషుఁడు తనలోపముచే స్త్రీని విడనాడునేని, ఆమెకుఁ గొంత భరణము నీయవలసియుండఁగా, స్త్రీ తన యిచ్చవచ్చినట్లు గొప్పవాఁడో అంపగాఁడో దొరికినాఁడని, ఉన్నభర్తను విడిచి పెట్టునేని ఆమెకు ధనసంబంధమైన చిక్కులేమియు లేవు. నిర్ణీతస్థలమున రిజిస్టరు కాఁబడక ఇతరప్రదేశములం దట్లుకాఁబడిన వివాహములు సరియైనవిగా పరిగణింపఁబడవు. భార్య చనిపోవునప్పు డామెఆస్థి పిల్లలకు వచ్చునుగాని, పిల్లలులేని సమయములోఁ భర్త కది చెల్లుటకు వలయు సదుపాయము లేమియులేవు. బ్రాహ్మణుఁడు నాయరు కాంతను బెండ్లియాడవచ్చును. ఇట్లు వివాహము జరుగునేని యాతనిభార్య అందఱి భార్యలవలెను దనయింటికివచ్చి, అత్త మామలతోఁగూడ మెలఁగుచు, పచనముచేయుచు, ఏకవంశసంజాతయగు భార్యచేయఁగల పనులనుఁ జేయవలనుపడదుగదా. ఈవిధముగా ప్రభుత్వమువా రంగీకరించిన చట్టమునం దిట్టి నిబంధనలు కొన్నియున్నను కాలక్రమమున నివి తొలఁగింపఁబడవచ్చును.

మొట్టమొదట శంకరనాయరుగారీ చట్టమును దెచ్చినప్పుడు చదువుకొన్న మళయాళీలలోఁ జాలమంది దానికామోదించియున్నను, దొరతనమువారు దాని నామోదించిన తఱువాతమాత్రము వివాహము లంతగా కాలేదు. అయిన కొద్ది వివాహములైనను అంతగా సఫలీకృతములైనట్లుతోఁచదు.

హిందూదేశములోని విచిత్రములగు వివాహాచారములను దెలుపుటకై ఉత్తర హిందూదేశము నందలి కులీనులను, దక్షిణ హిందూదేశమునందలి మళయాళీలనుగూర్చి యింతవఱకుఁ జెప్పియున్నాము. ఇంతవఱకునుగూడ మనవారికి వివాహమనఁగా నెట్టిదో తెలియదు. వివాహ సంబంధములను గ్రహించుపాటి యౌన్నత్యమునకు పెక్కండ్రు విద్యాధికులుగూడ రాలేదు. ఆచారపిశాచమే ఈవిషయమునఁగూడ

మనవారిని వేధించుచున్నది. పెండ్లియైనందున విధిలేక ప్రేమను మనవారు తెచ్చిపెట్టుకొనుచున్నారుగాని, ప్రేమ యున్నందున విడువలేక భార్యాభర్తలగుట లేదు. దాని యదృష్టము బాగుగ నున్న దాని కడుపే ఫలింపరాదా యనువారే యెల్లెడల గానవత్తురు గదా. కడుపు ఫలించుటయే పెండ్లి యగుటకు ప్రధానోద్దేశము గాఁబోలు! ఇది వట్టి తప్పు. పెండ్లియొక్క ముఖ్యోద్దేశము ఏకవిధములగు హావభావచేష్టలు గలవారు చేరియుండి, ఒకరికొకరెల్లవిషయములలోను సహాయులయి, ఒండొరులలోపములను దిద్దుకొనుచు, సహాయము చేయువారు లేమిచే, తనయొక్కని బుద్ధివలననే పని చేయు భర్తకు సహాయురాలై, ఆతనికి తోఁచనిచోట్ల తానును సహాయము చేయుచు, ఇంత పొట్టకు తిని ఎన్నఁడో ఒకనాఁడు చచ్చిపోవుటకుఁ గాక, జన్మమెత్తినందుకుఁగాను దనచేతనైన మహాకార్యములను గొన్నిటినిఁ జేసి, జనులస్థితిని వృద్ధిపఱుచుటకుఁగాని, బిడ్డల నూరక 'కనివేయుట'కుఁ గాదు. మనయుత్తమ ప్రబంధకారుల కయిన నీబుద్ధి తోఁచలేదు. వారయినను భార్యాభర్తలశరీరవర్ణమును, గోటును నీటును భాగ్యమునే వర్ణింతురుగాని యన్నిటికిని ముఖ్యమైన గుణమును వర్ణించరు. పందొమ్మిదవ శతాబ్దాంతమున కయిన ఆంధ్రభాషలో నిజమైన యిట్టిప్రేమను దెలుపుచు, పై పన్నె చిన్నెల కులికిపడని ప్రబంధమొక్కటియయిన రచింపఁబడునేమోయని మేము చాలవఱకుఁ జూచితిమిగాని, అట్టిదొక్కటియు మాకుఁ గానరా లేదు. నవనాగరికులచే వ్రాయఁబడిన కొన్నిగద్యకావ్యములలోను ఒక్కనాటకములోనుమాత్రమే మా కీగుణ మక్కడక్కడఁ గానవచ్చినదిగాని, అందైనను భార్యాభర్త లొండొరుల వరించుటలో తమ తమ మనోవృత్తులను వానిదార్ఢ్యములను బరిశీలించికొన్నట్లు కానరాదు. మహాప్రబంధములలో నొక్కటి యగు మనుచరిత్రమునందుఁ జెప్పఁబడిన ఈక్రిందిపద్యములో రీతి పురుషులు దొరకుటయును ప్రభావతీప్రద్యుమ్నములోని తరువాతి పద్యము రీతి వరులు దొరకుటయునే యలభ్యయోగమై, అత్యుత్తమమైనదిగా మనవారు భావించుచున్నారు. తుట్టతుదకా నిర్ణయము నైన వధూవరులకు విడిచిపెట్టినయెడల, యావజ్జీవమును బడియుండవలసినవారముగదా యన్నభయమువలన, ఎంత చదువుకొనినవారయినను కొంచెము మంచిసంబంధముతే తెచ్చుకొనవచ్చునుగాని, ఆవిషయమునఁగూడ గ్రహచారదోషమో యనునట్లు తల్లిదండ్రులు అడ్డము వచ్చి తనకు లాభకారి యగునట్టిగాని, తమప్రేమల కొప్పగుఁ దగునట్టిగాని యొకరికిఁ గట్టిపెట్టి ‘ప్రేమింపుఁడు. ప్రేమింపుఁడు’ అని నిర్బంధింతురు. దొరతనమువారయినను చట్టమును జేయక మనల నిట్లు విడిచిపెట్టుట మిక్కిలి సంతాపకరమై యుండుటచే, మనకార్యసంస్కర్తలు

వారికష్టములను వారే పడవలని యున్నది. మేము వెనుక సూచించినపద్యముల నిందు క్రింద నుదాహరించుచున్నాము.

ఉ. చొక్కపుఁ బ్రాయముల్ మిగుల సోయగముల్ గలప్రాణనాయకుం
డెక్కుడువశ్యతన్ రతుల నేకడఁ దేర్చి సమేల మొప్పఁగా
నక్కున గారవించి ముద మందఁగఁ జేయని యింతి దైనయో
చక్కఁదనంబ దేమిటికి ? జవ్వన మేటికి ? భాగ్య మేటికిన్ ?

మనుచరిత్రము.

శా. ప్రద్యుమ్నుండు ప్రభావతీ రుచిరరూప బ్రహ్మముల్ హంసయో
షిద్యాఖ్యార్థధురీణ వాగుపనిషత్సిద్ధాంతమార్గానుసా
రోద్యత్ప్రజ్ఞను బల్మఱున్ మనన సంయుక్తంబు గావించుచున్
హృద్యంబై యది యంతకంతకలరన్ నిల్పెం గడుంజిత్తముల్.

ప్రభావతీప్రద్యుమ్నము.

పదియవ ప్రకరణము.

విద్య.

'చతుష్పాదజంతువులకుఁగూడ జ్ఞాన మున్నయెడల జంతుస్వర్గమునం దన్నియుఁ దమవలెనే (మేలైన) గడ్డిని మేయుచు, నరసమూహమునకు వశమై వారిపనుల కుపయోగించుచుండు' నని తలఁచునట్లు గ్జనాఫన్ అను నొకగ్రీసుదేశీయుఁడు వ్రాసియున్నాఁడు. జనులకు జ్ఞానము లేనప్పుడు వారి యభిప్రాయములును వానికిఁ దగియే యుండును. సేతువు మొదలు హిమాచలమువఱకే ప్రపంచ మున్నదనియు, అంతర్వేది కావల ఊళ్ళే లేవనియు, తమమతమే మత మనియు, తమదేశాచారములే ఉత్కృష్టాచారము లనియు, తక్కినవా రందఱును మ్లేచ్ఛు లనియు,—భావించుచున్న కాలములో హిందూదేశములో నరబలులే దేవతాప్రీతిసాధకములును, సహగమనములే మోక్షదాయకములును, హేయాచారములే పవిత్రతాపాదకములును ఏల కాకుండ నేర్చును? ఇట్టి యజ్ఞానాంధకారములో కన్నుకన్నుఁ గానక మనదేశీయులు ప్రపంచ మంతయు నొకకలవంటిదే యనియు, సత్యమైన దిం దొక్కటియు లేదనియు పలవరించుచు ఒడలెఱుఁగక నిద్రించుచున్నసమయములో నీచీఁకటికి మఱికొంతతోడుగా మహమ్మదీయప్రభుత్వ మనునొక పెద్దతుపాను వచ్చినది. అప్పుడే యొకరాత్రి యారంభించినది. మనదేశమునందు సాధారణముగా 12 గంటలకు మించిన రాత్రి ఎప్పుడును లేదని మన

వారు చెప్పుచుందురుగాని అది యెంతమాత్రమును సత్యమయినది గాదు. లోకవిరుద్ధముగా ఈరాత్రి 700 సంవత్సరములకాలమువఱకు వ్యాపించి, ఆ ఘోరాంధకారమునందు రెండవకంటికిఁ దెలియకుండ హిందూసంఘమునంతను జీకాకుపఱచి పాడుచేసి, నామమాత్రావసిష్టముగా విడిచిపెట్టినది. అప్పటికప్పుడే వర్తకమునకయి వచ్చియున్న యాంగ్లేయులు మెల్లఁగా మనదేశమునందుఁ బాదుకొని, విశేషభాగమున కధీశు లయిరి. మనదేశస్థులను బాగు చేయుటకయి వారితోఁ గొనివచ్చిన ముఖ్యసాధనములు 2. అందు మొదటిది ఆంగ్లేయభాష; రెండవది పశ్చిమదేశపు నాగరికత. భగవంతునిచేఁ బంపఁబడిన దూతికలవలె నీరెండును మనదేశమునకు వచ్చి మనవారలను నిద్దురనుండియు కలలనుండియు లేపుటకుఁ బ్రయత్నింపఁగానే అందందు మీఱరానిసంక్షోభములు బయలుదేరినవి. 'ఆంగ్లేయప్రభుత్వమను బాలసూర్యోదయమిప్పుడే యయినది. ఇది నిద్రింప సమయముగాదు' అని విద్యామహాదేవత యొకమూలనుండి శ్రావ్యముగా మేలుకొలుపులను బాడ మొదలు వెట్టినది. 700 ఏండ్లు నిద్రయందుఁ గడపినప్పుడు తక్షణమే సంపూర్ణస్మృతి తెచ్చుకొని మేల్కనుట కష్టము గదా. కొందఱు బద్ధకు లందుచేతనే యింకను నిద్రనుండి లేవలేక యేమో పలవరింతలను జెప్పుచున్నారు

జనాభిప్రాయ మెట్లున్నను నీహూణప్రభుత్వమే నిశ్చయముగా మనవారిని నిద్రనుండి లేపుచున్నదని మేము భావించుచున్నాము. దేశాచారములను తమచక్కని కలలలోని కృత్యముల కడ్డము వచ్చి నిద్రను బోఁగొట్టినప్పు డెంతవారి కయినను కోపము సహజముగా వచ్చుచుండును. అందుచేత నూతనజ్ఞానమువలని ఫలముగా సంఘసంస్కర్తలు బయలుదేరినప్పుడు పూర్వాచారపరాయణులు వారిని దూషించి యావలకుఁ ద్రోసి మఱల తమకల కవ్వలిభాగమును గనఁబోవుట సహజముగానే యున్నది. మనమతాచారములతో నేజోక్యమును గలుగఁ జేసికొనకనే హూణులు మనలను బాలింపుచున్నను, విద్యావిషయికములగు వారి ప్రయత్నములుమాత్రము మనస్థితిని మనకుఁ జూపి బాగు పఱచికొమ్మని బోధించుచున్నవి.

మొట్టమొదట ఆంగ్లేయులతోడి వర్తకసంబంధములు గలవారే ఇంగ్లీషువిద్య నభ్యసించుచుండిరి. అప్పుడు వారికి చదువను వ్రాయను మాటలాడనుమాత్రమే తెలిసి యుండెను. తరువాత మఱికొంతకాలమునకు ఆంగ్లేయులు మనదేశమునందు స్థిరపడిన పిమ్మట, మనవారికి కొన్నికొన్ని యుద్యోగముల నిచ్చుచుండెడివారు. ఆసమయమునందు డొరాజియో మొదలగు దొరలును ఇతరక్రైస్తవమతబోధకులును పాటుపడి హిందువులకు ఆంగ్లేయభాషను నేర్పుచుండిరి. కారే, వార్డు, మార్షమన్ మొదలగు క్రైస్తవమతబోధకులవలన వంగదేశమునందు విద్య విశేషముగా వ్యాపించినది.

పందొమ్మిదవశతాబ్దాదియందు హూణవిద్య మనదేశమునం దెట్లున్నను, తరువాత

హూణ హిందూమండల పరిపాలకులుగా వచ్చిన లార్డువిలియం బెంటింకుగారి కాలము వఱకును నీవిషయమై ప్రభుత్వమువారు జోక్యము కలుగఁ జేసికొనలేదు. అయినను నంతకుఁ బూర్వమున మనదేశములో నింగ్లీషు నేర్పు పాఠశాలలు లేకపోలేదు. ఇంగ్లీషు భాషను నేర్చినవా రాకాలములో నత్యల్పసంఖ్యాకులై యుండిరి.

శ్రీరాజారామమోహనరాయలువారు, కేశవచంద్ర బ్రహ్మానందుల తాతగారగు రామకమలసేనులవారు మొదలగువా రప్పటివారిలో సుప్రసిద్ధులు. ఉద్యోగవిషయమునందు రామకమలసేనులవా రాకాలమునందుఁ బ్రభుత్వమువారివద్దనుండి 3000 రూపాయల మాసవేతనమును గొనుచుండిరి. అయినను హిందువుల కింగ్లీషుభాష నేర్పి వారి నింకను నెక్కుడుగా దొరతనమువారు తమకొలువు నుంచుటకయి నిశ్చయించినందున, హిందూదేశోద్ధారకుఁడగు బెంటింకు ప్రభువు పాఠశాలలలో నింగ్లీషుభాషనుగూడ నేర్పవలసినదిగాఁ దీర్మానించెను. హిందూదేశీయులు తమస్థితినిఁ దాము తెలిసికొనునట్లు చేసినది హూణవిద్యయే. ఇదియే మనదేశోద్ధరణమున కాదికారణము.

అప్పుడు విద్యాభాగమంతయు నొక విద్యాధికారిచేతి క్రింద నుండుచువచ్చెను. నేర్పఁబడు విద్యయైనను నంత యుత్కృష్టతరమైనదిగా నుండియుండలేదు. చక్కని భాషతో వ్రాయను మాటలాడను మాత్రమే యుద్యోగస్థులకుఁ గావలసినవని తలఁచి వాని కింకను గొద్దిపాటిచరిత్రా భూగోళగణితాదులను గలిపి యాకాలమున విద్యను నేర్పుచుండిరి. తఱువాత మఱి కొంతకాలమునకు చేతిపనులను వృత్తులను అంతర్భాగములుగాఁ గొనితెచ్చి తగురీతిని వానియందు వలసినమార్పుల నన్నిటినిఁ జేయుచు వచ్చినను, పందొమ్మిదవ శతాబ్దాంతమునకైనను నవి సర్వజనాదరణీయములు కాలేదు. నేటికినిఁగూడ వృత్తుల నభ్యసించుట హీనముగా హిందువులు పరిగణించుచున్నారు.

బెంటింకుగా రీవిధమున హిందూదేశమునందు నాటిన విద్యాలత 1840 వ సంవత్సరప్రాంతములవఱకును నెట్లో జీవించియుండఁగా అప్పుడు ఎలింబరో ప్రభువుగారు దానినిఁ జక్కఁగా వృద్ధిపఱిచిరి. తఱువాత నిది క్రమముగా నెల్లెడలను బ్రాఁకి లార్డుహార్డింజికాలము నాటికి సత్ఫలముల నీయసాగినది. ఈయనకాలము నుండియే హిందువులు విశేషముగా దొరతనమువారి యుద్యోగములందుఁ బ్రవేశపెట్టఁబడుచున్నారు.

మొట్టమొదట దొరతనమువారు హూణవిద్యను బాలురకు నేర్ప మొదలుపెట్టినప్పుడు హిందూదేశీయులు దానికిని నంగీకరింపలేదు. దేశోద్ధారకములైన ఏ కార్యములకు వా రడ్డుపెట్టకుండ నిలిచినారు? హిందూసంఘచరిత్రమునందు సహగమన మంతటి ఘోరాచారములు మొదలు విద్యవంటి యుత్తమఫల ప్రతిపాదకములగు విషయముల వఱకును ప్రతిదానికిని హిందువులు వలదనియే పోరాడుచువచ్చిరి. నేటికినిఁగూడఁ

ప్రతిసంస్కరణ మహాకార్యమునకును వారుప్రతిపక్షులై నిలువఁబడుచుండుట మంచిచెడ్డల నింకను నెఱుఁగఁ జాలక నేగదా. వేలవత్సరములనుండియు ఏ మార్పులను జేయక, ప్రతిమార్పునుగూడ మహాపాతకమని యెంచునట్టి సంఘమునందుఁ బుట్టిపెరుగుచుండుటచే ఆ యాచారముల బలిమి యొక్కసారిగా ఎన్నటికిని క్షీణింప నేరదు. అందువలన మార్పులనుఁ జేయువారిని యతియన్నప్రతి యని యెదుర్కొనుచుఁ బెనుభూతము లట్లు చూచుటవారికి సహజమైయున్నది. అందీయింగ్లీషు విద్యనెడ వారికాలమున మిక్కిలి యసూయకలుగుటకు వేఱుకారణములు కూడఁగలవు. ఇదివఱకు మహమ్మదీయులు మనదేశమును బాలించినప్పు డం దౌరంగజీబు, టిప్పుసుల్తాను మొదలగువారు బలవంతముగా జనులను దమమతములోఁ గలుపుకొనుచుండిరి. స్వమతమునం దధికాదరముగల మనదేశీయులును ఈ బెదురు మనస్సులోనుండుటచే, ఈ నూతన హూణప్రభుత్వమును నట్లే జనులను దమ క్రైస్తవమతములో నిర్బంధించి కలుపుకొనునని యూహించి యుందురని మేము నమ్ముచున్నాము. ఇదిగాక క్రైస్తవులయెడ మనవారి కంతగా నాదరణమును లేదు. మ్లేచ్ఛదేశీయులని వారి నిప్పటికిని మనలోని ఛాందసులు కొందఱు పలుకుచున్నారు. హిందూకులములలో మిక్కిలి నీచమగు మాలకులమువారి నీహూణులు వంటపనులకు నియమించుకొని, యించుకేని యసహ్యము లేకుండ వారిచేత సమస్తపదార్థములను దినుచుండుటచే, క్రైస్తవమతముపై మనవారికి మొదటినుండియు మాలకులమను నభిప్రాయము కలిగినది. ప్రభువులు స్వకులవ్యాప్తికై పనిచేయుదురన్న యనుమానమును, వారికులము మాలకులమన్న యొక యభిప్రాయమును హిందూదేశీయుల మనస్సులలో నాటియుండుటచే, దొరతనము వారు చేయు శాసనములలోఁ దమ కనుమానముగల ప్రతిదానికిని హిందువులు ప్రతికక్షులుగా నిలువఁబడుచువచ్చిరి. ఈ భ్రాంతివలననే మనప్రభుత్వమువారు తాము మతవిషయములలో జోక్యము కలుగఁజేసికొనమని వాగ్దానము చేయవలసివచ్చినది. అప్పటికిని మనవారి మనస్సులలోని ఈశంక పోలేదు. హిందూసంఘసంస్కారచరిత్రమునందు 'నిజమైనప్రభువ'ని చెప్పవలసిన బెంటింకు ప్రభువు మదరాసు గవర్నరుగా నున్నకాలములో సిపాయి లెవ్వరును బొట్టును కర్ణభూషణములను నుంచుకొనరాదనియు గడ్డములను గొరిగించుకొని, మీసముల నొకవిధముగా నొత్తుకొని, 'పాగా'లకు బదులుగా టోపీలను బెట్టుకొనవలెననియు శాసించినప్పుడీభయమే మనస్సున నిడికొని, సిపాయిలు తమయధికారులను జంపి, అల్లరిచేయ నారంభించిరి. అందువలన నప్పటి గవర్నరు జనరలుగారగు సర్ జార్జిబార్లో, కారే, వార్డ్, మార్ష్మను మున్నగు ప్రసిద్ధ క్రైస్తవ మతబోధకులను తమకార్యములను జేసికొనకుండ నాగుఁడని శాసింపవలసివచ్చినది. కొందఱు హిందూదేశచరిత్రకారులు, దొరతనమువారి పరిపాలనమునకును, ప్రభుత్వముతో నించుకేనియు జోక్యములేని యితరమనుష్యులు మతబోధచేయుటకును

నేమియు సంబంధము లేదనియు, సర్ జార్జి బార్లో 'పాదిరీల'ను మతబోధచేయవల దని యప్పటి కాజ్ఞాపించుట యతనికి సూక్ష్మబుద్ధి లేకపోవుటచేత నే యనియు నాక్షేపించియున్నారు. కాని ఈ యల్లరికంతకును గారకులైన హిందువులకుఁ దమప్రభువులు మతవ్యాప్తిని చేయనే యుద్దేశించియున్నారను నభిప్రాయముండుటచే, నల్లరిని శమింపఁజేయుట కప్పటి కాయాజ్ఞనొసఁగిన సర్ జార్జి బార్లో సూక్ష్మదృష్టితో హిందువులస్థితినిఁ జక్కఁగాఁ గనిపెట్టి యట్టిచట్టమును జేసెనని మే మూహించుటచే, నీచరిత్రకారులతో నేకీభవింపఁ జాలకున్నాము. అట్లే డాల్‌హౌసీప్రభువు కాలమునందు ధూమశకటములును వార్తాతంతులును నిర్మింపఁబడినప్పుడు హూణులు ఇండియాను గొలుసులతో నిశ్చయముగాఁ గట్టి పడవైచిరనిమనవారు యూహించిరి. కొవ్వుపూసిన తుపాకులుకమ కీయఁబడునన్నభ్రమయొకటి సిపాయలలోఁ గలుగఁగానే, హూణులు ఇండియాజనులను క్రైస్తవమతములోఁ గలిపి బలవంతముగా గోసూకరమాంసములను దినిపింతురని నిశ్చయించి, 1857 వ సంవత్సరములోని యల్లరికిఁ గారణభూతులైరి.

ఇట్టి యభిప్రాయములు హిందువులలోఁ బ్రబలియుండుటచే, మొట్టమొదట హూణవిద్య పాఠశాలలోనికిఁ గొనిరాఁబడి నప్పుడు మనవారి కది యిష్టముకాలేదు. మాలచదువు నేర్పి క్రైస్తవమతములో జనులను గలుపుటకే దొరతనమువారీపనినిఁ జేయుచున్నారని, యనేకులు నిశ్చయముగా నమ్మిరి. దీనికి సహాయముగా పాదిరుల పాఠశాలల్లో విద్యాభ్యాసముచేయుచు, వారి బోధనల యందలి నమ్మికచే నెవ్వఁడైన క్రైస్తవ మతప్రవిష్టుఁడాయెనా, అదిమొదలు కొన్ని మాసములవఱకు నాదేశమంతయు నుడికి పోవుచుండెను. ఉద్యోగములందలి యాసచే కొందఱు తమ బాలురకు హూణవిద్యను జెప్పించినను, వారుమడికట్టు కొన్నప్పు డామాలభాష నుచ్చరించుట లేదు. దొరలను సమీపించిన కొందఱుహిందువులు ఇండ్లకుఁ బోయిన తఱువాత ఆబట్టలను దడిపివైచి, స్నానముచేసి, క్రొత్తజందెములను ధరించుకొని యందందు దోషశాంతికై అష్టోత్తరశతగాయత్రీ జపమునైనఁ జేయవలసి వచ్చుచుండెను. కాని కాలక్రమమున నీహూణవిద్యపై హిందువులకుఁ గల యనుమానములడుగంటుచువచ్చినవి. ఇప్పటికిని ఇంగ్లీషు చదువుకొన్నవా రాచారము లేక యుందురని కొందఱు స్త్రీపురుషులు ఆంధ్రాది దేశములోఁ దలఁచుచున్నను, ఉద్యోగము లందలి యాసచే నెల్లవారును హూణవిద్యనే యభ్యసించు చున్నారు. తఱువాత నీ పందొమ్మిదవ శతాబ్దాంతము నాఁటికి పెండ్లికొడుకులను నిర్ణయించుకొనుటలో ఇంగ్లీషు విద్యబాగుగా వచ్చియుండుట కూడ నొక ముఖ్యలక్షణమగుట ఎంతయు సంతోషావహమై యున్నది.

జనాభిప్రాయమెట్లు మాఱినను, మొట్టమొదట దొరతనమువారు తెచ్చిన విద్య

అంతగా దేశాభివృద్ధికి కారకమైనదిగాదు. స్వోదర పోషణమునకే యనువగు రీతినున్న యాప్రథమదినముల నాఁటివిద్యకును ఇప్పటి విద్యకును జాలభేదమున్నది. జనులజ్ఞానమభివృద్ధికాకున్న యెడల దేశమును నభివృద్ధినందఁ జాలదు. జనులలోఁ జాలమంది సుజ్ఞానమును గలిగియున్న యెడల దేశమంతయును గూడ జ్ఞానవంతమగును. మత విషయికసిద్ధాంతములైనను, సంఘాచారము లైనను, దేశాభివృద్ధికరములగు నేప్రాపంచిక విషయములైనను, దినదినాభి గాంచుచున్నప్పుడే దేశమును జ్ఞానాధిక్యత నందుచున్నట్లు మనము తెలియఁగలము. మొట్టమొదట గ్రహణములను జూచినప్పుడవి రాహుకేతువుల వేధవలననే కలిగినవని మనము నమ్మవచ్చును. తఱువాత తఱువాత ప్రకృతిజ్ఞానము మనయందు వృద్ధియైన కొలఁదిని మనమే గణితాదుల ప్రకారముగా సర్వవిషయములను దెలిసికొనఁగలుగుదుము. అప్పుడు మనమొదటి యభిప్రాయములను జూచి మనమే నవ్వుకొని అవి పిచ్చి యూహలని కొట్టివేయఁగలము. ఇట్లేమనము పరిశీలించి, ప్రయత్న పూర్వకముగా నూతన జ్ఞానమును సంపాదించుకొని యభివృద్ధినందు కొలఁదిని మనమొదటి యభిప్రాయములుఁ జాలవఱకు అసత్యములైనవని మనకుఁ దెలియుచుండును. భూమి, వాయువు, కాంతి, మొదలగునవియే పంచభూతములనియు, వీని వలననే ప్రపంచోత్పత్తియైనదనియు నొకనాఁడు మనమూహించిన యెడల రసవాద జ్ఞాన మలవఱుచుకొని, ఈ ప్రపంచములోని ప్రతివస్తువును విభజించి చూచుకొలఁదిని మన ప్రథమాభిప్రాయములు సూర్యోదయానంతరమున మంచువలెఁ గ్రమక్రమముగా తొలఁగిపోవుచుండును. ఇట్టివిషయము లన్నిటియందును మనకు మనమే గురువుల మగుదుము. మొదటి యభిప్రాయములతో నుందమని ప్రయత్నించినను వానికి మనమనస్సే ప్రబలశత్రువగును. ప్రయత్నించినను మన మట్లుండలేము. ఏదేశమునందు పూర్వాభిప్రాయములు నూతనజ్ఞానము నెదుట మాఱుచుండునో ఆదేశము దినదినాభివృద్ధి నందుచుండునని మే మిదివఱకే వ్రాసియున్నాముగదా. అట్లు నూతనముగా సంపాదింపఁబడిన జ్ఞానములేని దేశములందు అభివృద్ధి యేమియులేక దేశము పూర్వస్థితియందే నిలిచియుండును. కొన్నిచోట్ల క్షీణత్వము వచ్చినను రావచ్చును. మనహిందూసంఘమును బూర్వకాలమునం గూడ నందిన యభివృద్ధి కనువగునట్లు మాఱ్పఁబడినది. తఱువాత కొందఱు ధర్మశాస్త్రజ్ఞులు బయలుదేరి అభివృద్ధి కంతము లేదనియు, సంపూర్ణత్వము మానవుల కలభ్యమనియుఁ దెలియలేక, సర్వవిషయములందును మాఱ్పులను నిషేధించిరి. వీరే హిందూదేశమున కరిష్టదేవతలు. వీరి ప్రభ హెచ్చిన దాదిగా హిందూదేశమునం దభివృద్ధికలుగనే లేదు. నాటినుండి నేటివఱకును గూడ మనము "స్థిగోభవ- వరదోభవ" యనురీతి నుండియున్నాము. కొన్నిచోట్ల క్షీణత్వమును గలిగినది.

ధర్మశాస్త్రకారు లిట్టి వచనములవలన మనము వృద్ధినందకుండఁ జేయుకాలము నాఁటికిఁ బ్రపంచములోని దేశము లన్నిఁటిలో హిందూదేశమే మిగుల నాగరికతగాంచి మిన్ను ముట్టియుండెను. కాని మన యభివృద్ధినిఁ గట్టివేయుటకుఁ ద్రాళ్ళను మనమే తెచ్చుకొన్న తఱువాతికాలములో నితరదేశము లూరకుండలేదు. అందు ముఖ్యముగా ఐరోపాఖండమునం దీ నూతనజ్ఞాన మభివృద్ధి కాసాగెను. ప్రపంచములోని దేశములను మొదలు చీమతలలోని కంటికిఁ గానఁబడని నలుసువఱకునుగూడ వారు పరీక్షించిన కొలఁదిని, నూతన విషయము లనేకములు వారికి బయలుపడసాగినవి. ఒక్కొక్కదానినే పరిశోధించిన కొలఁదిని సృష్టిమర్మము లనేకములు వారికి బట్టబయలైనవి. ఈ విధముగా బహుశతాబ్దములనుండి వారు చేయుచున్న పనులవలన వారికి కల్లు సముద్రములును, మేరువు పర్వతములును, పంచీకరణములును, జ్యోతిషములును, కోడికూఁతలును, రోఁకటి చప్పుడులును అడ్డమురాక నిజమైన భూగోళశాస్త్రములును, శారీరశాస్త్రములును—దప్పని సరిగా బయలుదేరి మనస్సునకు మనస్సే సాక్షిగా నమ్మించినవి. ఇందువలన వారు విశేషమగు నభివృద్ధినంది, మన హిందువులకంటె నత్యున్నతమైన స్థితిలో నున్నారు. సూర్యుని యెదుట దీపమువలె వారి యభివృద్ధియెదుట మన తొలికాలపు గొప్పఁదనము కానఁబడకయున్నది.

ఈవిషయములను జక్కఁగా యోచించి, హిందువులను వృద్ధిపఱుచుటకు వారి కిట్టి శాస్త్రవిద్యను నేర్పవలెననియు, అప్పుడు వారు తమకుఁ దామే యభివృద్ధి నందఁగలరనియుఁ దమంతట తామే మాఱ్పులవసరమని తెలిసికొని యాచరించునప్పుడు మత మడ్డము రాదనియు నెఱిఁగి 1861వ సంవత్సరమున నప్పటి హూణప్రభువులు మనదేశమునందు సర్వకళాశాలలను స్థాపించిరి. వీనిలోఁ గొప్పపరీక్షల నిచ్చువారు మంచి మంచియుద్యోగముల కర్హులగుచుండుటచే, ఈ యాశవలనఁ బెక్కండ్రిందలి పరీక్షలలోఁ దేరుచుండిరి. వీనివలన మనవారిలోఁ గొంతవఱకజ్ఞానము పోవుచున్నను నింకను వలసినంత యభివృద్ధి రాలేదు. ప్రకృతి శాస్త్రములు నేర్పఁబడుచున్నను నవి బాలురకు బండవల్లనలై యున్నవి. తాము గాశోధించుటకువసతిని మన బాలురకు సర్వకళాశాలలవారు కలుగఁజేయక, ఉపాధ్యాయుఁ డెద్దియో చేయుచుండఁగా నివ్వెఱఁబోయి చూచుటమాత్రమే బాలురపనియన్నట్లుంచియున్నారు. తాతాగా రీరీతివిద్యకంటె స్వయంశోధన ముత్తమమైనదని భావించినను, నందలి బాగోగు లిఱువదియవ శతాబ్దమునందుఁ దెలియఁదగియున్నది.

చరిత్ర మంతగా లేకపోయినను చరిత్రవిషయికము లగు పెక్కుధర్మములుగల పురుషవిద్య నటుంచి, ఇఁక హిందూదేశములోని స్త్రీవిద్యనుగూర్చి విచారింపవలసియున్నది. మనపురాతనగ్రంథములలో నొకచోట ‘అర్ధభార్యా మనుష్యాణాం భార్యా

శ్రేష్ఠతమంసఖః। భార్యామూలం త్రివర్గస్య భార్యామూలం తరీయసః॥” అని వ్రాయఁబడి యున్నది. స్త్రీలు పురుషులపై నింతటి స్వతంత్రము గలవారయి యుండునప్పుడు ఇంగ్లీషువిద్యవలన నొక్కపురుషులమనస్సులుమాత్రమే వికసించినయెడల, అట్టిరీతిజ్ఞానము నేదినిని నందక పూర్వాచారములతోనే కొట్టుకొనుచున్న స్త్రీలకును వారికిని చిత్తవృత్తు లొక్కటి గావు. అందువలనఁ బురుషుఁడు భార్యవలని సహాయము నంతగా నందకుండుటయే కాక తన మనోపుష్పమును ముఱల ముకుళింపఁజేయని యెడల వివాహశబ్దము నర్థమునే నిరర్థకము చేయవచ్చును. కొన్నికొన్ని విషయములలో నిఱువురును బరస్పరవిరోధులు గూడఁ గావలసివచ్చును. నిజమైన దేశాభివృద్ధికి స్త్రీపురుషు లిఱువురును నేకాభిప్రాయులై పనిచేయు టావశ్యక మగుటచేఁ గొందఱిట్టి సచ్చింతతో స్త్రీలకును విద్యను నేర్పఁదని బోధింపసాగిరి. అయినను 1850వ సంవత్సరమునకుఁ బూర్వ మిట్టివిద్యాభివృద్ధినందిన స్త్రీలసంఖ్య మిక్కిలి కొంచెము. క్రైస్తవమత వ్యాపకులును ప్రభుత్వమువారునుగూడ నీవిషయమై విశేషముగాఁ బని చేయసాగిరి. ఈవిధముగా స్త్రీవిద్యాభివృద్ధికై పనిచేసినవారిలో నగ్రగణ్యుఁడు పండిత ఈశ్వరచంద్ర విద్యారుఁడు. ఈతఁడు పాఠశాలలకు ఇన్స్పెక్టరుగా నున్నకాలములో వంగదేశములోని విద్యాధికారులును నక్కడి లెప్టనెంటు గవర్నరుగారునుగూడ నీతని బహువిధముల గౌరవించి స్త్రీలకుఁ బాఠశాలల నేర్పఱుపుమని పురికొల్పుచుండిరి. వారి యాజ్ఞానుసారముగా విద్యాసాగరుఁడును దాను పోయిన ముఖ్యప్రదేశము లన్నిటియందును స్త్రీపాఠశాలలనుస్థాపించుచు వచ్చెను. ఈతనిచే నానాఁడు స్థాపింపఁబడినపాఠశాలలుకొన్ని నేఁటివఱకు నిలిచి యున్నను, ఈతఁ డీవిధముగా నేర్పఱిచిన పాఠశాలలసంఖ్య మితిమీఱి యున్నప్పుడు దొరతనమువారు వాని నన్నిటినిఁ దాము భరింపవలసిన యవసరము లేదని చెప్పి కొన్నిటికి సహాయము చేయలేక పోయిరి. అప్పటి యధికారు లట్లు చెప్పినను విద్యాసాగరుఁడు వెనుకకుఁ దిరుగక, తనస్వధనమునుండియే యాపాఠశాలలను బోషింపుచుండెను. తాను తనయున్నతపదవిని మానినతరువాతఁ గూడ నీతఁ డప్పుడప్పు డాపాఠశాలలకుఁ బోయి యందలి బాలికల విద్యాభివృద్ధి నరసి, వారికి పండ్లు, మిఠాయి మొదలగు ఫలాహారములనుగూడ నొసఁగుచుండెడు వాఁడు. మనహిందూదేశమునందు స్త్రీ విద్యకుఁ బ్రసిద్ధిగాంచిన పాఠశాలలలో మిక్కిలి గొప్పదైన బెథ్యూను కాలేజిని స్థాపించినవారిలో నీతఁ డొకఁడు. బాలికలకు ఎం. ఏ., వఱకునుగూడఁ జెప్పు కలకత్తానగరములోని ఈ పాఠశాలనుండి హూణభాషలో గొప్పగొప్ప పరీక్షల నిచ్చిన మనదేశపు స్త్రీలసంఖ్య విశేషముగా నున్నది. కాని హిందువులలో నతిబాల్యవివాహ మాచార మగుటచే, క్రైస్తవబ్రహ్మసమాజాదివర్ణములలోని స్త్రీలును గొందఱు హిందూవితంతువులునుమాత్రమే ఈపాఠశాలవలని లాభము నందుచున్నారు. ఈ పాఠశాలలోని బాలికలకు భోజనవసతినిఁగూడ సమకూర్చుటకై అక్రోయిడీ యనునొక అం

గ్లేను స్త్రీయు, లేడీఫియరను మఱియొక కాంతయు విశేషముగా ప్రయత్నించిరి. మొట్ట మొదట వీరు ప్రత్యేకముగా నొకపాఠశాలను దానికి భోజనవసతినిఁ గూర్చినను, 1878వ సంవత్సరమున వీరిప్రయత్నములు సఫలము లయినవి. అప్పుడు చిన్నపాఠశాలగానున్న బెథ్యూను స్కూలుతో దీనినిఁ జేర్చి నాటినుండియు దొరతనమువారు దీనిని వృద్ధి చేయుచుండిరి. ప్రకృతమున నీ పాఠశాలలో 46 గురు స్త్రీలకుమాత్రమే భోజనవసతి యేర్పఱుపఁబడినది. వంగదేశమునందు విద్యాసాగరునివలెనే దక్షిణహిందూస్థానములో దొరతనమువారి ఇన్‌స్పెక్టర్లును బాలికాపాఠశాలల నందందు స్థాపించియున్నారు. అయినను ఉత్తర సర్కారులలో స్త్రీవిద్యావ్యాపకమునకయి పాటుపడినవారిలో ముఖ్యులు కార్మైకల్ దొరవారు. వీరు 1861వ సంవత్సరమున విశాఖపట్టణము జిల్లాలో కలెక్టరుగా నున్నకాలములో స్త్రీవిద్యనుగూర్చి యందందు ప్రయత్నములు జరుగుచుండెను. అంతకుఁ బూర్వము బోర్డు ఆఫ్ ఎగ్జామినర్సు కమిటీకి అధ్యక్షులుగా నుండి చెన్నపురి రాజధానిలో పురుషుల విద్యాభివృద్ధికై నూతనపరీక్షలను గొనివచ్చిన యీతఁడు స్త్రీవిద్యకుఁగూడ తనచేత నైనసహాయమును జేయఁబూని, తనతోడి సంబంధముగల మహారాజులను, రాజులను ఇట్టికార్యములకుఁ బురికొల్పుచుండెను. ఈవిధముగా నీయన ప్రోత్సాహమువలన శ్రీరాజాగొడే సూర్యారావుగారును, ఇప్పటి విజయనగరము పెద్ద మహారాణీగారి భర్తగారును నందందుఁ బెక్కుపాఠశాలలను స్థాపించిరి. రాజమహేంద్రవరమున నీకడపటివారిచే స్థాపింపఁబడిన పాఠశాలలోనే శ్రీ వీరేశలింగము పంతులువారు వితంతూద్వాహములను గూర్చిన తమప్రథమోపన్యాసము నిచ్చియున్నారు. కన్యాశుల్కముల నాపుటయందును, స్త్రీ పురుషుల విద్యాభివృద్ధికై పాటుపడుటయందును నీ మహారాజుతో సమానమైనవా రెవ్వరును నింతవఱకును నుత్తరసర్కారులలో లేరు. తరువాత కార్మైకల్ దొరవారు గంజాము జిల్లాకు కలెక్టరుగా నియమింపఁబడినకాలములో నందును స్త్రీవిద్యకై పాటుపడియున్నారు.

ఈ రీతిగా నందందుఁ బెక్కుపాఠశాలలు స్థాపింపఁబడినను వీనియందు నేర్పఁబడు విద్యమాత్ర మంతగా నుపయుక్త మైనది గాదు. చిన్నతనముననే బాలికలు బడి మానవలసి వచ్చుచుండుటచే వారి కింతకంటె నెక్కుడువిద్యను నేర్పు పాఠశాలలును నవసరము లేదు. అయినను క్రైస్తవసంఘమునం దిట్టి నిర్బంధములు లేమిచే వారు తమబాలికలకొఱకయి పలుచోట్ల ప్రవేశపరీక్షవఱకునుగూడఁ జెప్పుపాఠశాలలను గొన్నింటిని స్థాపించి యున్నారు. ఇందు చదువునేర్పువారు పురుషు లగుటను నందు క్రైస్తవు లొక్కరే చదువుకొనవలసి యుండుటను నవి జనసామాన్యమున కంతగా నుపకరించుట లేదు.

ఈ విషయములను గమనించి దక్షిణహిందూదేశమునందు మైసూరు దొరతనమువారును, తిరువాన్కూరు మహారాజావారును దమదేశములో నున్నతవిద్యను బాలికలకు నేర్పు పాఠశాలలను స్థాపించియున్నను, మైసూరిలోని దొక్కటియే పందొమ్మిదవ శతాబ్దాంతము నాఁటికిఁ గొందఱు స్త్రీలను ప్రథమశాస్త్రపరీక్షలోఁ గృతార్థత నందఁ జేసినది.

చెన్నపురిరాజధానిని వదలి బొంబాయిరాష్ట్రములకుఁ బోవుదుమేని అందు పండిత రామాభాయి, సరస్వతి డాక్టరు ఆనందభాయిజోష్యపి మొదలగు ప్రసిద్ధినందిన కాంతలు మనకుఁ గానవత్తురు. వీరిలో మొదటి స్త్రీ తరువాతఁ గ్రైస్తవమత ప్రవిష్ఠురాలయినది. అమెరికాదేశమునకుఁ బోయినను గేవల హిందువుగానే మఱల మనదేశమునకు వచ్చిన ఆనందభాయిజోష్యపి చరిత్రము నిందుఁ గ్రింద వ్రాయుచున్నాము:—

ప్రసిద్ధివహించిన యీ మహారాష్ట్రపు స్త్రీ క్రీస్తుశకము 1865 వ సంవత్సరమున జననమందెను. ఈమె అగ్రబ్రాహ్మణవర్ణపు కాంతామణి. ఈమె తల్లి గంగాభాయిజోష్యపి. తండ్రి గణపతిరావుఅమృతేశ్వరుఁడు. భర్త గోపాలరావు వినాయకజోష్యపి. మనవారియందలి యాచారముల ప్రకారముగా నీమెకుఁ దొమ్మిదవయేటనే వివాహముజరిగినది. ఈకాంతామణి వ్యక్తురాలై భర్తగృహముచేరిన నాటినుండియుఁగూడ మనస్సున విదేశమునందలియుపయుక్తములగు విద్యలనభ్యసింపవలెనని భావింపుచుండెను. తపాలకచ్చేరియం దుద్యోగమునందున్న యీమెభర్తయు నెల్లరవలెఁ గాక తనభార్యసదుద్యమములను బురికొల్పుచుండెను. ఈ విధముగా నానందభాయిజోష్యపి తనభర్తయింటవద్దనే యాతనికుల్లాసముగా కాలముగడుపుచు, దనమనోరథము నీడేర్చుకొనుట కెన్నఁడు తటియగునాయని విచారించుకొనుచుండెను. ఏకారణముచేతనో మనవారు సముద్రయానమును నిషేధించుచు, సముద్రముపై దేశక్షేమంకరకార్యసంఘటనకుఁ బరదేశములకుఁ బోయినయెడల, నట్టివారిని వెలివేయుచుందురు. అయినను నట్టిమతస్వాములు చేయఁబోవు వ్యవహారముల కించుకేనియు జంకక, తానుహిందూస్త్రీగావున హిందూమతమునే కడవరకు నిలుపుకొన నుత్సహించి యెన్నికష్టములు వచ్చినను జంకక యీవనితామణి తనపదునెనిమిదవయేఁట 1883వ సంవత్సరము యేప్రిలునెల యేడవతేదిని, కలకత్తానుండి వైద్యవిద్యాభ్యాసమునకై యమెరికా ఖండమునకుఁ బయలుదేరెను.

అట్లామె సురక్షితముగా వెడలి తాను బయలుదేరిన నలుబదియేడుదినముల నాఁటికి నమెరికాలోని న్యూయార్కుపట్టణమును బ్రవేశించి, యచటి వారిచే గౌరవింపఁబడి, యచటునుండి, పెన్సిల్వేనియాకుఁబోయి యచటి వైద్యశాస్త్రపాఠశాలలో యమ్. డి. పరీక్షకుఁ జదువ నారంభించెను. హిందూవనితగావున నామె యాదేశములోని తెల్లవారిచేత భుజింపనొల్లక యామె స్వయముగానే మతాచారముల ప్రకారముగాఁ బచనముచేసికొని భుజింపుచుండెను. ఈ పెన్సిల్వేనియా పాఠశాలకు బోర్డి

యను నామె ముఖ్యోపాధ్యాయురాలు. నల్లనిచీర యొకదానిని ధరించుకొని సురూపవతియగు నీకళావతి పాఠశాలాభవనమును జేరఁగనే బోడ్లీదొరసానిగారు సంతోషము నాపఁజాలక, ఆనందభాయి ననేకవిధముల గౌరవించెను. హిందూదేశము నుండి విదేశములకు విద్యాభ్యాసమునకుఁబోవు పురుషుల సంఖ్యయే యత్యల్పమగు నప్పుడు బ్రాహ్మణజాతినుండి పోవు స్త్రీలు మరియుఁ దక్కువగా నుందురుగదా. అట్టి వారిలో నమెరికాకుఁ బోయినవారిలో నీమెయే ప్రథమురాలు. తాను స్త్రీయయ్యును, విద్యకొరకై దూరదేశములకుఁబోయి, తదేకనిష్ఠతోఁ జదువుకొనుచున్న యీసద్గుణావతికిఁదోడై గౌరవింపనివా రెవ్వరుందురు? "నేను అమెరికాఖండమునకు హిందువుగా నేపోయి, హిందువుగానే మఱల నాదేశమునకువచ్చి, నావారిమధ్య మఱల హిందువుగానే జీవింతు" నని బయలుదేరక పూర్వమేజెప్పి యట్లే ప్రవర్తించిన యామె గౌరవమునకు వీసమంతయు భంగము రాలేదుగదా.

అమెరికాదేశమునందలి జను లప్పుడప్పు డీమెకడకువచ్చి, హిందూ దేశమునందలి మతాచారవిషయము లీమె నడుగుచుందురు. ఈమెయు నట్టివారికి శ్రావ్యముగా నెల్ల సంగతులను బోధించుచుండును. ఒక్కొక్కప్పు డీమెను మనదేశపు సంగతులను గూర్చి యుపన్యాసముల నీయుమని యడుగుచుందురు. మనదేశమునం దతిబాల్యవివాహము లాచారములగుటచేతను, తక్కిన యెల్లచోట్లను అమెరికాయందును గూడ స్త్రీవ్యక్తురాలైన వెనుక, తాను తన కిష్టుఁడగువరుని వివాహమాడుట ప్రసిద్ధాచారమగుటను, నీమె యతిబాల్యవివాహములు సర్వశ్రేయోదాయకములని యుపన్యసించినప్పు డా దేశీయు లద్భుతపడిరి.

ఈవిధముగా నామె మూడుసంవత్సరము లమెరికాఖండమునందు వైద్యవిద్యనభ్యసించి 1886 సంవత్సరమున యమ్. డి. పట్టము నందెను. యమ్. డి. పట్టమునందుటచే డాక్టరను బిరుదు నందిన శ్రీ డాక్టరు ఆనందభాయిజ్యోషిగారికి ఈ గౌరవమువలన ఫలమే లేకపోయెను. నూతనదేశమగుటచేత, నక్కడిజల మీమెతత్వమునకుసరిపడక, అమెరికాలోఁ బ్రవేశించినకొద్దిదినములకే, యీమెశరీరమునవ్యాధిప్రవేశించెను. వ్యాధిగ్రస్తురాలయ్యుఁగూడ నీమె కృతకృత్యురాలై యెల్లరచేతను సన్మానింపఁబడి యాసంవత్సరమే మరలఁదనజన్మస్థానమగు పూనాపట్టణమును బ్రవేశించి యావనితాలలామ తన తల్లిదండ్రుల నీక్షించెను.

డాక్టరు ఆనందభాయి జ్యోషిగారు మఱల హిందూదేశమునకువచ్చి నప్పు డీమెను దిరిగి కులమునఁ జేర్చుకొందురో వెలివేయుదురో యని పెక్కండ్రు భయపడిరిగాని, తుదకే భయమును లేకుండ నెల్లరు నీమెను గౌరవించి గృహమునకుఁ జేర్చినప్పుడు

జనుల సంతోషమలవికి మీఱియుండెను. హిందూదేశము చేరినతరువాత నానాఁటి కీమె శరీరమునందలి వ్యాధి ప్రబల నారంభించినది. తాను డాక్టరే యయ్యునుగూడ నీమె యీప్రబలమగు వ్యాధిని నివారించుకొనలేకపోయెను. ఎందఱెట్టియౌషధముల నొసఁగినను గూడ నీప్రథమ హిందూవిదేశవైద్యశాస్త్రజ్ఞురాలు తెఱపినిఁబడలేదు. ఈవిధముగా గొన్నాళ్ళు బాధపడి తుట్టతుదకు డాక్టరు ఆనందభాయి జ్యోషిగారు 1887 వ సంవత్సరము ఫిబ్రేవరు నెల 26 తేదిని లోకాంతరగతులైరి. దహనాత్పూర్వ మీమెభర్త యీమెయందలి ప్రేమాపాశముచే నీమె పఠమును దీయించికొనెను. మతధర్మముల ననుసరించి యీమెకుఁ గర్మసేయుటకు మతస్వాము లాక్షేపింతురని కొందఱు తలఁచిరిగాని, పూనాపట్టణములోని ప్రముఖులందరు నీమె శవమును వెంబడించి యథావిధికృత్యములను నెరవేర్పించిరి. కొంతకాలమువరకునుఁ బూనా మొదలగుచోట్ల పత్రికలన్నియు నీమె మరణమునకు విశేషముగా వగచినవి. ఇట్టిలలనామణి చావునకు దుఃఖింపనివా రెవ్వరుందురు.

1892వ సంవత్సరమున పంజాబుదేశమున దార్యసామాజికులు కన్యామహావిద్యాలయమను నొకబాలికాపాఠశాలను స్థాపించియున్నారు. మొట్టమొదట నిది యొకచిన్నబాలికాపాఠశాలగా నున్నను 1895వ సంవత్సరమున దీనిని కన్యామహావిద్యాలయసంఘమువారి కిచ్చివేసిరి. అప్పటి కీపాఠశాలయందు 7 తరగతులవఱకుండెను. ఇం దైదుగు రుపాధ్యాయినులును, యిద్దఱు పండితులును, ముగ్గురు నౌకరులును మాత్రమే గలరు. కేవలము స్త్రీలచేతనే చదువు చెప్పించుటచే దీనిలోనికిఁ బెక్కండ్రు తమ వయస్సు వచ్చిన బాలికలనుగూడఁ బంపుచుండిరి. ఇందు బాలికలకు భోజన మిడుటకయి 1895వ సంవత్సరము ఏప్రిల్ నెల 12వ తేదిని నొకగృహమును నిర్మించిరి. దీనిలోఁ బ్రతియేటను 19 మంది మొదలు 24 మందివఱకును బాలికలు నివసించుచుందురు. ఏబాలికగాని ఆశ్రమాధికారుల యనుమతిలేక యాశ్రమమును విడిచి చనరాదు. అనుజ్ఞను బొందినను ఎవ్వరో యొకరా బాలికతోఁగూడఁ బోవలసి యుండును. నెల 1కి ఆఱురూపాయలు చొప్పునఁ బ్రతిబాలికనుండియు నాశ్రమాధికారులు ధనమును దీసికొని దానితో వారికి భోజనమజ్జనాదులను వలయునెడ వైద్యచికిత్సనుగూడ నమర్చుదురు. ఈ యాశ్రమమునకు వచ్చెడియుత్తరము లన్నియు ముందుగా దీని యధ్యక్షురాలు పరీక్షించి మఱియు బాలికలకీయవచ్చును. ఆమెవద్దనుండియే ప్రతిబాలికయుఁ దనయుత్తరములను దీసికొనును.

ఇఁక నీ విద్యాలయము సంగతినిఁ జూచినయెడల నిది దినదినప్రవర్ధమాన మగుచున్నది. 1899వ సంవత్సరము నాఁటికి దీనికి 16,164 రూపాయలు మూలధనముండెను. ఇదియును నానాటి కభివృద్ధి గాంచుచున్నది. దీనికి 3,000 రూపాయలను

జందాలవలనఁ బోగుచేసి యొకభవనమును నిర్మించియున్నారు. ప్రకృతమున దీనిలోఁ బ్రవేశపరీక్షవఱకును జెప్పఁబడుచున్నది. ఈ పాఠశాలయందు 1897 వ సంవత్సరము మార్చి నెల నాఁటికి 99 బాలికలును, 1898 మార్చి నాఁటికి 134గురు బాలికలును, విద్యాభ్యాసము చేయుచుండిరి. శరీరారోగ్యముగూడ బాలికలకుఁ బ్రధానమైనదేయని యెంచి ఈపాఠశాలవారు వారిచేఁ గ్రమముతప్పక శరీరపరిశ్రమ చేయించుచుందురు. వంట,కుట్టు మొదలగుపనులుగూడ నిందు నేర్పఁబడును. ఇవిగాక వయసు ముదిరిన స్త్రీల కొక తరగతిని, తలిదండ్రులు లేని నిరాధారల కొకతరగతినిఁ బ్రత్యేకముగా నేర్పఱిచి వారివారి కుచితములగు విద్యలను నేర్పుచున్నారు. అన్యోన్యవైషమ్యలు లేక తల్లిబిడ్డలును, అత్తగోడండ్రును నీపాఠశాలకేగి చదువుకొనుచుందురు. చెన్నపురియందును కేవలము స్త్రీలే యుపాధ్యాయినులుగానున్న పాఠశాల యొక్కటియున్నను, నందు వయసు ముదిరిన స్త్రీలు చదువుకొనుటకు వలసిన సదుపాయములు లేవు. దొరతనమువారీపాఠశాలకు విశేషముగా ధనమును వెచ్చించుచున్నను, నిది యింకను జక్కఁబఱుపఁబడనియెడల వలసినంత యుపకారము ప్రజలకుఁ గలుగదు. హిందూదేశమునందు స్త్రీలలో వయసు ముదిరినవా రెక్కడకోగాని పాఠశాలలకుఁ బోరు. అట్టి వారికిఁ దగినంతఁ బ్రోత్సాహమును విద్యాసక్తినిఁ గలిగించుచు, వారిని బెదరఁగొట్టక చదువు నేర్పురీతి యుపాధ్యాయినులు పెక్కండ్రీ పాఠశాలయందు లేరని తెలియుచున్నది. ఇందలి నిజానిజము లింకను విచారణీయములగుటచే దొరతనమువారు చక్కఁగా విమర్శించి, ఈ పాఠశాలలోని యుపాధ్యాయిను లందఱును హిందూయువతుల కుచితరీతిని సద్విద్య నొసఁగఁగనట్టివా రనియు, ఎంతో మంచితనము గలిగి తమవద్ద చదువు నేర్చుకొను వారిమనస్సులను ఆకర్షింపఁ జేయు ప్రతిభాశాలినుల రనియు నిర్ధారణముచేసి, చెన్నపురి రాజధానిలోని ఈ పాఠశాలను జలాందరులోని కన్యామహావిద్యాలయముభాతిని సర్వజన గౌరవార్హమైనదై యుండునట్లు చేయవలసియున్నది. మన రాజధానికంతకును నిదియొక్కటియే పాఠశాలయైనను నిందుఁ బెద్దవాండ్రకుఁ జదువు నేర్పుటకు దొరతనమువారు నెల కొక ఏఁబదియఱువది రూపాయలను గర్చుచేసి, ఈపాఠశాలలో వసతి నేర్పఱిచి, ఇదియే యుత్తమపాఠశాల యనునట్లు చేయనేరమికి మిగులఁ జింతించుచున్నాము.

పశ్చిమోత్తరరాష్ట్రములందును, మధ్యరాష్ట్రములందును, నిజామువారి రాజ్యములందును స్త్రీవిద్య యంతగా వ్యాపించలేదు. సామాన్యముగా ఐదుబడులను గుణితమును మాత్రమే నేర్చినవారును, ఏ డెనిమిదేండ్లవఱకును మాత్రమే చదివినవారును నీదేశములో నున్నారు.

మొత్తముమీఁద హిందూదేశములో స్త్రీవిద్య యంతఁగాఁ బ్రబలియుండలేదు.

దొరతనమువారు పురుషవిద్యకై యందందుఁ బెద్దపాఠశాలలను స్థాపించినట్లే ఉపాధ్యాయినులనుంచి స్త్రీవిద్యకై పాఠశాలలను స్థాపింపక పోవుటయుఁ, గ్రైస్తవసంఘమువారును నీవిషయమున నట్లు చేయకుండుటయు, దేశీయు లింకను స్వయముగానే పాఠశాలలను స్థాపింపఁగలవారు కాకపోవుటయు నిందుకు ముఖ్యకారణములు. కొందఱు ప్రతి పెద్దపట్టణమునను స్త్రీల పాఠశాలయొక్కటియుండియే యున్నదని చెప్పఁజాలురుగాని యందుఁ బ్రవేశపరీక్షలకును, బ్రథమశాస్త్రపరీక్షలకును బాలికల నంపుటలేదు. స్త్రీలే యుపాధ్యాయినులుగానున్న పాఠశాలలు, స్థాపింపఁబడునేని అందుఁ జదువువారును దొడనే యమరియుందురు. హిందూదేశమును బాగుచేయుట కెంత యన్నియాలోచనములు చేసినను, ఇంటివద్ద గృహదేవతలువలదని వారించినప్పుడు కార్యములు జరుగనేరవు. వానివలననే హిందూసంఘ మింకను నభివృద్ధిగాంచకయున్నది. వారికిని విద్యవచ్చినయెడల దేశముతప్పక చక్కఁబడును. విద్య నేర్చుట పురుషులకైనను ఉద్యోగములు చేయుటకును నూళ్ళేలుటకును గాదు. పురుషులు దొరతనమువారిచ్చు నుద్యోగములమీఁదనే పడియుండుట గొప్పతప్పు. స్వయముగా నూతనవృత్తులను ఏర్పఱుచుకొనుటయుఁ, దమ రేపనికి సమర్థులో దానినే యవలంబించుటయు నత్యుత్తమమైనది. విద్యవలని ముఖ్యలాభము జ్ఞానము. దానిని సంపాదించుట స్త్రీపురుషుల కిరువురికిని నత్యావశ్యకము. ఈవిషయములను యోచించి, ఇరువదవ శతాబ్దమునందు హిందూదేశీయులు స్త్రీవిద్యాభివృద్ధికై తప్పక పాటుపడుదురని నమ్ముచున్నాము.

పదునొకండవ ప్రకరణము.

వివిధ విషయములు.

ఇంతవఱకును హిందూ దేశములోని గొప్పగొప్ప సంస్కరణములను గూర్చి వ్రాసియున్నాము. ఇక నీ ప్రకరణమునందుఁ జరిత్రమంతగా లేని చిన్నచిన్న సంస్కరణములనుగూర్చి వ్రాయుచున్నాము. ఈరీతి సంస్కరణములలోఁ జరిత్రావిషయమునందు ముఖ్యమైనదియు, నిరువదవ శతాబ్దమునందు హిందూదేశమునకు నిజమైన మేలు నొడఁగూర్ప వలసినదియు సముద్ర యానమును గూర్చినది. ఇంగ్లాండు మున్నగు దేశములకు విద్యాభ్యాసాదులకుఁ బోవుట శాస్త్రనిషిద్ధమనియు, సముద్రయానము కూడదనియు మనపూర్వాచారపరాయణులు వాదించుచుందురు. దేశకాలపాత్రముగా నాచారములను మార్చుకొన వలెననియు, పరిశోధించిన యినుమువలె నుత్కృష్ట

తనందియున్న వారివలని శిక్ష జనులను బాగుచేయుననియు,నందువలనవిద్యావాణిజ్యాదులలోఁ బ్రసిద్ధిగాంచిన దేశములకేగి యచ్చట నేర్చుకొనవలసిన విషయముల నభ్యసించి, ఔన్నత్యమునందుట మానవధర్మమనియు నవనాగరికుల ముఖ్యవాదము. తమచేతనున్న బహిష్కారమను నొక్క యాయుధము నే ప్రయోగించి పూర్వాచారపరాయణులు తమవారి సంఖ్యను తగ్గించుకొనుటయు, అందునకు జంకక నవనాగరికులు వేఱుపడి పోవుచుండుటయు హిందూదేశములోని గొప్ప సంస్కారణములకు ఫలమైయున్నది. ప్రకృత శతాబ్దమునందు దేశాచారములను వెఱువక అన్యదేశములకుఁ బోయినవారిలోఁ బ్రథముఁడు శ్రీరాజా రామ మోహనరాయలు. ఈయన యాదేశముననే మరణించిన సంగతి నీగ్రంథము రెండవ ప్రకరణమునఁ జెప్పియున్నాము. ఆయనతరువాత వంగదేశీయులలోఁ బెక్కండ్రు మాత్రమే యింగ్లాండునకుఁ బోవుచుండిరి. ఇండియన్ సివిల్ సర్వీసు పరీక్ష లొక్క యింగ్లాండునందే యుండుటచేతను, అందుఁ జేరువారు ఇండియాలో మిక్కిలి యున్నతపదవులకు నియమింపఁబడుచుండుటచేతను దేశాచారములను పాటింపక పెక్కండ్రు తమసుతుల నా దేశమున కంపుచుండిరి. సమస్త విద్యలకును నునికిపట్టైయున్న యాదేశమున కేగి జ్ఞానము సంపాదించు కొనుటకై తరువాత తరువాతఁ గొందఱు ప్రముఖులక్కడికిఁ బోవుచుండెడువారు. క్రమక్రమముగా నీయాచారము నలుగడల వ్యాపించి చెన్నపురి, బొంబాయి రాజధానులనుండి కూడఁ గొందఱు జనులు విదేశములకుఁ బోవునట్లు చేసినది. ప్రకృతమున హిందూదేశములో మిగుల గణ్యతగాంచిన సురేంద్రనాథబ్యానర్జీ, బోనర్జీ, బినయకృష్ణ, చంద్రవర్కారు మొదలగు మహనీయులీకాలమువారే. ఈవిధముగా సీమకేగి వచ్చుచుండు జనులను హిందువులు బహిష్కరింపఁ జూచుచు వచ్చిరిగాని, దేశలక్ష్మికిఁ దిలకాయమానులై యున్న యీ కార్యధురీణుల నట్టిచర్య లేమియు బాధింపలేక పోయెను. నానాట నిట్టివారిసంఖ్య మిక్కిలి వృద్ధియగుటయు, వీరే దేశములోని ప్రముఖులగుటయు గొన్నికొన్నిచోట్ల హిందువుల బహిష్కారములు నిరర్థకములైనవి. బంధుమిత్రు లెల్లఱును నిట్టివారి యిండ్లలో బాహాటముగా భోజనాదులను గావించుచుండిరి. మఱికొంతకాలము పోయినతరువాత నిప్పుడు వంగదేశమునం దీ బహిష్కారములు నామమాత్రావశిష్టము లైనవి.

ఇట్లుండఁగా 1870 వ సంవత్సరమున బ్రహ్మసమాజ మతస్థాపకుఁ డనఁజెప్పనొప్పు శ్రీకేశవచంద్ర బ్రహ్మానందులవారు మతవ్యాపనకై యింగ్లాండు దేశమునకుఁ బోవుట తటస్థించెను. శ్రీమన్ మహారాజ్ఞి విక్టోరియాచక్రవర్తినిగారు మొదలు ప్రతివారిచేతను అమితముగా గౌరవింపఁబడిన యీతఁడు తిరిగి తనదేశమునకు వచ్చినదాదిగా బ్రహ్మసమాజమునందు సముద్రయానము చేయుట యాచారమైనది.

నాటినుండియుఁ బ్రతివత్సరమును పెక్కండ్రా దేశమునకు విద్యాభ్యాసమునకుఁ బోవుచున్నారు.

వంగదేశముతరువాత నీవిషయమున బొంబాయిరాజధాని మిగులఁ బ్రసిద్ధిగాంచినది. ఈదేశమునుండి యింగ్లాండునకుఁ బోయినవారిలో సుప్రసిద్ధులు చంద్రవర్కారుగారు. ఇంచుమించుగా ముప్పదేండ్ల క్రిందట రావుసాహెబు మహీపతి రాంరూప్రాంగారు ఇంగ్లాండు దేశమునకుఁ బోయి వచ్చినప్పు డాదేశపు జనులు వారిని బహిష్కరించినను, 1898వ సంవత్సరమున ఆవంశమువాఁడే యగు కృష్ణరావు బోలోనాథుఁ డింగ్లాండు నుండివచ్చి నప్పుడు ప్రాయశ్చిత్తమైనను నక్కఱలేకయే తిరిగి స్వకులమునందు జేర్చుకొనఁబడెను. హిందువుల పుణ్యక్షేత్రమగు శ్రీనాసికాత్ర్యంబకమునందలి బ్రాహ్మణులు సముద్రయానము చేసినవారిని ప్రాయశ్చిత్తము చేసి తిరిగి కులమునందుఁ గలుపుకొన్నారు. స్వామి వివేకానంద ప్రభృతులవలె జైనమతమును బోధించుటకై అమెరికాకుఁ బోయిన వీరచరన్ గంధిని జైను లతిగౌరవముతో మన్నించి కులపవిత్రునిఁగా నెంచుచు నాతనిని రెండవసారికూడ నా దేశమున కంపియున్నారు. లోహనశాఖవారిలో నిట్టి యన్యదేశముల కేగినవారిని తిరిగి చేర్చుకొనుట కభ్యంతరము లేవియులేవు. ఇట్లున్నను బొంబాయిరాష్ట్రమునందు సంఘసంస్కరణ మీరీతిగానుండుట మిక్కిలి ముదావహమైనది. ఆదేశపు బ్రాహ్మణులు చెన్నరాజధానిలోని బ్రాహ్మణులవలెనే స్వచ్ఛాహారులై మనతోడి పంక్తిభోజనముల కర్హులగుచున్నారు. తక్కినవారిలో నొక్క మధ్యరాష్ట్రపువారిని విడిచినయెడల నెల్లఱును మత్స్యభుక్కులో, మాంసాహారులో యగుటచేత వారియం దీ సంస్కరణమున కంతగా నడ్డములు లేకున్నను నది యొక గొప్పలోనిది గాదుగాని, బొంబాయిరాజధానిలో నిది ప్రాయశ్చిత్తార్హమై యుండుట కొంతవఱకు మేలైయున్నది.

మధ్యరాష్ట్రములం దీ సంస్కరణ మంత యభివృద్ధినిఁ గాంచలేదు. నాగపూరులోని మిక్కిలి యాచారవంతుల కుటుంబములోనివాఁడగు గోపాలరావు జూటీ అను నాతఁడు సీమ కరిగినను, ఆతని మిత్రుఁ డొక్కఁ డా దేశమునుండి తిరిగివచ్చినప్పుడు నాసికాత్ర్యంబకములోని బ్రాహ్మణులచేతనే ప్రాయశ్చిత్తము నందవలసివచ్చినది. తరువాత 1898 వ సంవత్సరము జూన్ నెల సెలవులలో అతఁ డిండియాకు వచ్చినప్పుడు కొందఱు మిత్రు లాతనితో భోజనములను గావించిరి. అం దొక్కనిని నా దేశపు బ్రాహ్మణులు దేవాలయమునుండి తరిమివైచి, ఇట్టి వారు దేవతాగృహములు ప్రవేశింపరాదని యొకయభియోగమును దెచ్చిరి. కాని తుట్టతుదకు సంస్కరణ పక్షమువారే విజయముగాంచిరి. అట్లే 1897 వ సంవత్సరమున కుక్డీయను నొక బ్రాహ్మణుఁడు సీమనుండి తిరిగివచ్చెను. అప్పుడు నాగపురిలోని పండితు లాతఁడు ప్రాయ

శ్చిత్తార్హుఁడు కాఁడనియు, మఱల బ్రాహ్మణులలోఁ జేర్చుకొనఁబడ రాదనియు వాదములు చేసిరి. కాని దీనికి జంకక యాతని స్నేహితులలోఁ గొందఱాతనితో తేనీళ్ళను, ఫలాహారములను దీసికొని, తమనామములను బత్రికలలోఁ బ్రకటించిరి. అప్పుడు నాగపురి వారు వీరి నందఱిని బహిష్కారములు చేసినను, అట్టి బహిష్కారములకు జంకకయు వీరందఱును దమ తమ మిత్రులందఱిచేతను బహిష్కృతులుగా భావింపఁబడకయు, పంక్తిభోజనాదిసత్కారముల నందుచునేయున్నారు.

పాంచాలదేశమునం దార్యసామాజికులును, బ్రహ్మమతావలంబులును బట్టుదలతోఁ బనిచేయుచుండుటచే వారిలో నీ సంస్కరణమున కాతంకము లంతఁగాలేవు. అయినను వీరి ప్రోద్బలమువలన వీరి సంఘములోఁ జేరనివారుఁగూడ నీ సంస్కరణములను బాహాటముగా నాచరించుచున్నారు.

చెన్నపురి రాజధాని మాత్ర మీ విషయమున మిక్కిలి హీనదశయం దున్నది. అఱువలలోఁ గొందఱు బ్రాహ్మణులు సీమకేగియుఁ బ్రాయశ్చిత్తానంతరమునఁ దిరిగి బ్రాహ్మణులలోఁ జేర్పఁబడినను, తెలుఁగు వారిలో నింతవఱకును నట్టి యాత్రలు చేసిన బ్రాహ్మణులే కానరారు. దక్షిణమున మళయాళ దేశములో మాత్రము నలుగు రైదుగురు సీమకేగి విద్యల నభ్యసించివచ్చిరి. ఇంచుమించుగా నాలుగేండ్లక్రిందట నిద్దఱు సరస్వతీ బ్రాహ్మణులు సీమనుండి తిరిగి వచ్చినప్పుడు మతగురువులు వారికి వెలివేసినను, దానికి లెక్కచేయక విద్యాధికులందఱును వారితోఁ గలిసి భోజనాదుల నాచరించుచునే యున్నారు. తఱువాత 1898వ సంవత్సరముల రాఘవేంద్రరావు అనునాయన సీమలోఁ బ్రకృతి శాస్త్రములను వైద్యమును నేర్చుకొనివచ్చినప్పు డాకులములో వెనుక చంద్రవర్కరుగారు చేర్చుకొనఁబడుటను యోచించి కులమువా రేయభ్యంతరములు లేకుండనే వారినిఁ గలుపుకొనిరి.

ఈవిధముగా నింగ్లాండున కేగి వచ్చినవారి సంఖ్య మిక్కిలి తక్కువగా నున్నను వారిలోఁ జాలమంది మఱల హిందూసంఘమునఁ జేర్చుకొనఁబడుచునే యున్నారు. నానాఁట నట్టివారిసంఖ్య వృద్ధిగాంచుచుండుటచే, నిఁకఁ గొన్ని నాళ్లకు సముద్రయాననిషేధత్వము మనదేశీయుల నంతఁగాఁ బాధింపఁ బోదని చూపుట కీపూర్వచరిత్రమంతయు సాక్ష్యము నిచ్చుచున్నది.

ఈ విషయమును వదలి అన్యోన్యశాఖావివాహముల నాలోచించినయెడల దీని చరిత్ర మింకను దక్కువగానున్నది. వంగదేశమునందు రాసవిహారముకర్జీ మొదలగు వారిచర్యలనుగూర్చి యిదివరకే వ్రాసియున్నాము. మతముతో జోక్యముకల ఆర్య బ్రహ్మసమాజముల నటుంచినయెడల హిందూదేశములో నన్యోన్యశాఖావివాహము లంతగా జరుగలేదని చెప్పవలసియుండును. హిందూదేశములో స్త్రీపునర్వివాహములు

జరుగుచున్న ప్రతిచోటను అన్యోన్యశాఖావివాహములును జరుగుచునే యున్నవి. వీనినిఁగూర్చి పత్రిక లెంతశ్లాఘించినను, నవి యంతస్తుతిపాత్రములు కావు. వధూవరులేకకులమువారు వితంతూద్వాహములకు రాకపోవుటచే, 'తాంబూలార్థం అక్షతాం సమర్పయామి' యనునట్లు దొరికినవారికే కట్టిపెట్టుట బలవంతమైనది. ఇట్టిబలవంతమువలననే కొన్నికొన్నిశాఖలవారు ఇతరశాఖలవారితో దాంపత్యము నందవలసి వచ్చినది. కాయస్థకుటుంబముల కొన్నిటిలో వరాభావమును, గొన్నిటిలోఁ గన్యాభావమును వచ్చినప్పుడు చిరకాల బ్రహ్మచర్యమును సహింపలేక వా రన్యోన్యశాఖాబాంధవ్యములకుఁ బాల్పడవలసి వచ్చినది. అట్లే రాజపుత్రులలోఁగూడ నిట్టిబలాత్కారము వచ్చినట్లు రెండవప్రకరణమున వ్రాసియున్నాము. మిక్కిలి యల్పసంఖ్యాకులగు జనులుగల ప్రతియంతశ్శాఖలోను యిట్టి యభావములు సామాన్యమే యగుటచే నిప్పు డిప్పుడట్టిశాఖలు కలిసిపోవుచున్నవి. ఉన్న మూఁడువందలజనులలో రెండువందల యంతశ్శాఖ లుండునప్పు డవి యేల స్థిరముగా నిలువనేర్చును? ఇట్టిశాఖ లన్నియుఁ దమలో తామేవిధి లేక యీసంస్కరణమును జేసికొనుచున్నను జనసముదాయ మెక్కుడుగాఁ గల శాఖలలో నిట్టిబలాత్కారములు కానరావు. ఈశాఖలలో నెక్కడనో గుజరాతులో నొకవివాహమును మధ్యరాష్ట్రములలో నొకవివాహమును జరిగినయెడల నవి యంత సుప్రసిద్ధములని వివరించుటకు వీలును లేదు.

ఈ యంతశ్శాఖావివాహముల నటుంచి అన్యమతప్రవిష్టులను దిరిగి హిందూసంఘమునందుఁ జేర్చుకొనుటనుగూర్చి యోచించినయెడల హిందూదేశమున నీసంస్కరణము మొదలే జరుగలేదని చెప్పవలసి యుండును. దేశమున కొక్కటిగా హిందూదేశములో మొత్తమున నొక పదిపండ్రెండింటికంటె నెక్కుడుమంది తిరిగి స్వకులమున నీహిందూదేశములోఁ జేర్చుకొనఁబడలేదు. అట్లు చేర్చుకొనఁబడినచోట్లనైనను కులమువారు రెండుభాగములుగా విడిపోవలసి వచ్చినది. అయినను పాంచాలదేశములోని ఆర్యసామాజికులును, కలకత్తా, లాహూరు మొదలగు ప్రదేశముల నుండెడు బ్రహ్మసామాజికులును నిట్టివారిని తమతమకులములోఁ జేర్చుకొన్నారు. వీరిలో విశేషముగాఁ బనిచేయువా రార్యసామాజికులు. వీరు మహమ్మదీయక్రైస్తవాది మతములలోఁ గలిసినవారికిఁ బ్రాయశ్చిత్తములను జేసి తమసంఘమునందుఁ జేర్చుకొనుచుందురు. పాంచాలదేశమునం దొక్కసారి ఇన్నూరుమంది మహమ్మదీయమతప్రవిష్టులకు తమమతగ్రంథములను బంచిపెట్టి కొంతకాలము వారికి బోధచేసి వారిని తమసంఘములో వీరు చేర్చుకొనిరి. అప్పుడు దేశములో నపరిమితమైన సంక్షోభము జరిగినది. ఏమతములోఁ గలిసినవారైనను నీయార్యసామాజికులు నిరాతంకముగా వానినిఁ గలుపుకొనుచుండుటచే వీరు పనిచేయుచోట్ల క్రైస్తవాదిసంఘములలోఁ జేరినవారు స్థిరముగానుందురని పాదిరు లేమరియుండ వీలు లేకున్నది. అయినను నీరీతి సంస్కరణమువలనఁ గ్రైస్తవమతప్ర

విష్ణుఁడైన బ్రాహ్మణుఁడు తిరిగి బ్రాహ్మణుఁడు కాక అన్యమతస్థుఁడగుచుండుటచే నిది పూర్వకులమునే మఱలఁ గోరువారి కంతగా నుపయుక్తమైనది గాదు. మొత్తముమీఁద నార్యసామాజికులుమాత్రము ప్రతియేటను బెక్కండ్రుజనులను సర్వమతములనుండియుఁ దమసంఘములోని కాకర్షించుచున్నారు. ఇంతవఱ కించుమించు 2000 స్వదేశక్రైస్తవు లార్యసామాజికు లైరి.

ఇఁక వివాహశ్రాద్ధాదులయందలి యమితవ్యయముల విషయములో రాజపుత్రస్థానమునందు చాలవఱ కాపఁబడి యున్నవి. ఇందలి రాష్ట్రము లన్నియు వాల్టరీకృత రాజపుత్రహితకారిణీసభ యనుపేర నొకసమాజమును స్థాపించుకొని దాని నిబంధనలను మీఱక చరించుచున్నవి. అట్లే కాయస్థులును నొకసమాజము నేర్పఱిచి అం దిట్టివిధులను జేర్చివానికిఁ గట్టువడియున్నారు. ఇతరప్రదేశములో నెక్కడనో ఒక్కొకచోటమాత్రమే యమితవ్యయములు లేకుండ నున్నవి. బ్రహ్మసమాజము, ఆర్యసమాజము వీనిలో నీదురాచారము లేదు.

స్త్రీలను అంతఃపురములోనే యుంచుటనుగూర్చి విచారించినయెడల ఇది యొక సంస్కరణముగా వ్యాపింపఁ జేయువా రెవ్వరును లేరు. కార్యసంస్కర్తలభార్యలును, సీమ కేగి వచ్చినవారి కుటుంబములలోనివారును, విద్యాధిక్యత నందిన స్త్రీలును, ఆర్యబ్రహ్మసామాజికుల స్త్రీలునుమాత్రమే యీసంస్కరణమున కాధారులై యున్నారు. కేవలము నిందుకొఱకయి యింతవఱకు సంస్కర్త లెవ్వరును బయలుదేర లేదు. బొంబాయినగరమునందుమాత్రము కొందఱు స్త్రీలు తమభర్తల యనుమతిమీఁద నొకసమాజమును స్థాపించికొని యున్నారు. ఈసమాజపు సభల కొక్కొకప్పు డిన్నూరుమన్నూరుమంది స్త్రీలు వచ్చుచుందురు. ఇట్టిసమాజము లిండియాలో నొకటిరెండుకన్న నెక్కుడుగా లేవు. కాని ఈసంస్కరణముమాత్ర మంత జనాభిప్రాయవిరుద్ధముగా నుండుట లేదు. దీనికి మతవిషయికమైన చిక్కు లేమియు లేకపోవుటచేతను స్త్రీవిద్యానానాఁటి కభివృద్ధి గాంచుచుండుటను కొలఁదికాలములోనే స్త్రీలు మఱలఁ బ్రపంచము నెఱుఁగఁజాలుదురని నమ్ముచున్నాము.

నగలనుగూర్చిన సంస్కరణము కేవలము వాక్యరూపమైనది. అందైనను బట్టుదలగలవారు మిక్కిలి యరుదు. ప్రపంచ మంతలోను బ్రతియేటను ద్రవ్వఁబడుచుండు వెండి బంగారములలో మూఁడవపాలు ఇండియాకుఁ బంపఁబడుచున్నది. ఏఁబది ఏండ్ల క్రిందట ఇండియాకు సంవత్సరమునకు 2 కోట్లరూపాయల వెండిబంగారములు పంపఁబడుచుండెను. ఈసంఖ్య నానాఁటికి వృద్ధియగుటచేఁ బ్రకృతమునఁ బ్రతియేటను బది కోట్ల రూపాయల వెండిబంగారము లీదేశము చేరుచున్నవి. 1801 వ సంవత్సరము మొదలుకొని 1891 వఱకు లెక్కవేసి, యిండియానుంచి యావలకుఁ బోయిన ధనమునిందునుండి తీసివేసి చూడఁగా మనదేశమున 480 కోట్లు నిలువచేరినది. అందుకొంతభాగము మాత్రమే నిలువగా నున్నను, తక్కినది ఆభరణము క్రిందకు మాఱిపోయినది. ఇండియాయందు మొదటినుండియునున్న ఆభరణముల కీవిధముగా నించుమించు 200 కోట్ల రూపాయల నూతనాభరణములు వచ్చి చేరినవనియు, దీనిని సద్వినియోగము చేసినయెడల దొరతనమువారు ధనము కావలసినప్పుడు సీమనుండి అప్పు తీసికొనుట తటస్థింప నేరదనియు నొకదొర వ్రాయుచున్నాఁడు. ఈవిధముగా హిందూదేశమున ధనము వెచ్చింపఁబడుచున్నను పందొమ్మిదవశతాబ్దమునందు దీనినిఁ గూర్చి ప్రయత్నములే జరుగ లేదని చెప్పవచ్చును.

ఒకశాఖలోనివారు మఱియొకశాఖవారితో భోజనములు చేయుట మాత్రమీ శతాబ్దమునందు వృద్ధిగాంచినది. పూర్వము జనులు మిక్కిలి నైష్ఠికులుగా నుండుకాలములో నేకదేశములోని యంతశ్శాఖలలోసహిత మెక్కడనోగాని ప్రతిభోజనములు లేవు. ఇప్పుడు పాశ్చాత్యవిద్య ప్రబలిన కొలఁదిని బాలురు తా మున్నయూరు వదలి యన్యప్రదేశములందు అన్నసత్రములలో భోజనము చేయవలసి వచ్చుచుండుటచేతను, ఉద్యోగవశమున జనులు నిత్యప్రయాణములుజరుపవలసి యుంటను మునుపటి యాచారబలము చాలవఱకు నశించినది. ఇప్పుడెక్కడనో నైష్ఠికులును, వారిభార్యలును విధవలును దప్ప తక్కినవారు ఏకదేశపు బ్రాహ్మణులతో నేయభ్యంతరములును లేక నే భోజనములు చేయుచున్నారు.

వితంతువుల శిరోజములను గూర్చిన దురాచారము పందొమ్మిదవ శతాబ్దమునందు వాదసంస్కర్తలకే చెందినది. బహిష్కారభయమువలనను ఇంటిలోని వైదికకార్యములకు శిరోజములున్న వితంతువులు పచనాదులు చేయవలను గాకపోవుటను, గురుభయమును నాత్మలాభమును జేరి వితంతు శిరోజములతో నింకను బ్రబలయుద్ధ మాచరించుచున్నవి.

దేవస్థానముల పరిపాలన విషయములో నేమియు లాభకరములైన ప్రయత్నములు జరుగ లేదు. 1817వ సంవత్సరము 7 వ ఆక్టు ప్రకారముగా దొరతనమువారు దేవస్థానాదాయముల విషయములోఁ స్వయముగాఁ బనిచేయు చుండెడివారు. ఇట్లుండఁగా 1840 వసంవత్సరమునఁ గొందఱు క్రైస్తవమతబోధకుల యాక్షేపములవలన దొరతనమువారీ పరిపాలనమును విడిచిపెట్టిరి. ఇట్లుండఁగా 1863 వ సంవత్సరమున నంతఁగా బని చేయని చట్టమొక్కటి తేఁబడినది. అటుపిమ్మట మహాజనులు ధనాపహారణములను జేయ మొదలు పెట్టుటచే 1871 వసంవత్సరమున నిండియాగవర్న మెంటువారు ప్రదేశప్రభుత్వముల యభిప్రాయముల నడిగియున్నారు. అప్పుడు చెన్నపురి గవర్నమెంటువారాశాసనము నిరర్థకముగా నున్నదని తెలియఁజేసిరి. పిమ్మట 1879 వసంవత్సరమున

ఘనతవహించిన వంబాకం రామయ్యంగారొక చట్టమును దొరతనము వారికిఁ బంపవలసినదిగా వారుకోరియున్నారు. కాని దానివలన నంతలాభము కలుగలేదు. తరువాత ముత్తుసామిఅయ్యరుగారు చంచలరావుగారు ఇప్పుడు హైకోర్టు జడ్జీలుగానున్న సుబ్రహ్మణ్య అయ్యరుగారు భాష్యం అయ్యంగారు మొదలగు వారి యభిప్రాయములను ప్రభుత్వమువారు కోరియున్నారు. వీరు 1893 వ సంవత్సరమున తమయభిప్రాయములను బంపినను వాని పర్యవసానమంత లాభకారికాలేదు. ఇప్పటికిని హిందూదేశములోని పెక్కు దేవాలయముల ధనము అపహరింపఁబడుచున్నట్లును వానిస్థితియంత చక్కగా లేనట్లును ఇండియాలోని పలుచోట్లనుండి తెలియవచ్చుచున్నది.

పంచముల స్థితిని బాగుపఱచుటకును హిందూ సంఘసంస్కర్తలంతఁగాఁ బనిచేయలేదు. ప్రభుత్వమువారు మాత్రము వారియందు గరుణించి కొన్నికొన్నిచోట్ల వారికొఱకు పాఠశాలలను స్థాపించియున్నారు మహారులని పిలువఁబడు నొక శాఖవారును ఉత్తరయిండియాలోఁ బంచములవలెనే పరిగణింపఁ బడుచున్నారు. ఈహీనకులము వారిని నిజముగా నుద్ధరించినవి క్రైస్తవ సంఘములు. పాదిరిలు వీరిని తమమతమునఁ గలిపికొనియు, వీరలకొఱకుఁ బ్రత్యేకముగాఁ బాఠశాలల నేర్పఱచియు, వీరినే తమ వద్ద సేవకులనుగా నియోగించియు వృద్ధిచేయుచుండుటచే పూర్వకాలమునందు వీరిలో విశేషముగాఁ బ్రబలియున్న దొంగతనము త్రాఁగుడు మొదలగు దుర్గుణములు కొంతవఱకు తగ్గినవి. వీరికులము సంఖ్యయుఁ గ్రైస్తవ మతప్రవిష్టతవలనఁ జాలవఱకుఁ దగ్గిపోయినది. హిందూ సంస్కరణసమాజములలో బొంబాయి రాష్ట్రమునందొక్కటి మాత్రము వీరికొఱకు పాఠశాలల నేర్పరచియున్నది. ఈరీతిగా నించుక యభివృద్ధిగాంచినందున నిప్పుడు వీరు గొప్పగొప్ప పట్టణములో మునుపటివలె బ్రాహ్మణుల కరమైలుదూరముగా నుండక సామాన్యముగా వారిని సమీపించుచున్నారు. మఱికొంతకాలము నాటికి వీరిస్థితియింకను దప్పక యభివృద్ధిఁగాంచఁగలదు. కాని బహుశతాబ్దముల నుండి విద్యాసులులేకపడి యున్నవారగుటచే వీరు తక్కిన వర్ణములతో సమానమైనమేధాశక్తిని సంపాదించుటకింకను జాలకాలము పట్టును. వీరిస్థితియింకను నవసరమగు నంతచక్కఁగా బాగుపఱుపఁ బడుటలేదు.

ఇఁక యిండియాదేశములోని జాతిభేదములే హిందువుల హీనస్థితికి ముఖ్యకారణములనియు వానినిఁ దొలఁగింపవలెననియుఁ జెప్పువారు కొందఱున్నారు. వారిలోఁ గొందఱు వాదసంస్కారులే యయినను పెక్కండ్రు కార్యసంస్కారులై కూడ యున్నారు. వీరి సంస్కరణము నాగరీకతలో మించినట్లు దేశస్థులచేతను నామోదింపఁ బడుచున్నది. కాని హిందూదేశములో వీరు కులమునకు వెలుపురుగులుగాఁ బరిగణింపఁబడుచున్నారు. కులభేదవిచారమెంతమాత్రమును లేక ఆంగ్లేయస్త్రీని వివాహ

మాడిన యొకహిందువుఁడు తిరిగి తనపూర్వమతమునఁ జేర్చుకొనఁబడినను, నట్టి దృష్టాంతమది యొక్కటియేయైయున్నది. కులభేదములవలన హిందూసంఘమునకు నష్టశతములు సంభవించుచున్నవనియు, వానివలననే బహిష్కారమను దేశానర్థకారకమగు సాధనము హిందువులకుఁ జిక్కినదనియు, ఇది లేనియెడల పునర్వివాహము, సముద్రయానము, రజస్వలానంతరమున వివాహము మొదలగునెల్ల సంస్కరణములును నిండియాయందు నిరాతంకముగా జరుగఁగలవనియు, అందువల్ల దేశాభివృద్ధి కావలసియుండఁగా నీ జాతిభేదము అభివృద్ధినిఁ బోఁగొట్టి జనులను బాధఁజేయుచున్నదనియు, ఈజాతిభేదములైనను సనాతనాచారములుగాక మధ్యకాలమునందుఁ గల్పింపఁబడినవనియు, నివిగాక ఐహికాముష్మిక సుఖాదు లన్నిటిలోను మానవులు సమానులే కావున వారికి జాతిభేదము లున్నవనుట ఈశ్వరాజ్ఞలను గొట్టివేసి పాపముచేయుటయనియు నీ తెగవారు చెప్పుచుందురు. జాతిభేదములు వేదము లంగీకరించినవనియు, ఆచారమును నంగీకరించుచున్నదనియు రెండవ తెగవారు చెప్పుదురు. ఎవ్వరేది చెప్పినను శూద్రుఁడు చూచినంతమాత్రముననే తినుచున్నయన్నమును వదిలి, శూద్రస్పర్శమైనంతనే సచేలస్నానమును గాయత్రీజపమును జేయవలయునను రీతియాచారములలోఁ బుట్టి పెరిగినవారికి, శూద్రులకంటెను హీనులైన మాలమాదిగలచేత మాంసాహారము భుజించుట యనఁగానే మిక్కిలి కష్టముగా నుండకమానదు. ఈజాతిభేదములను ఆర్యసామాజికులు సహితము పాటించుచున్నారు; కాని అవి యాచరణమునం దంతగా బాధించు నట్లుండలేదు. శాకాహారులై వారి మతధర్మముల నంగీకరించు ప్రతివాఁడును వారికులమునఁ జేర్చుకొనఁబడుచుండుటచే వారికొకరీతిని జాతిభేదములు లేవనియే చెప్పవచ్చును. కాని ఈవిషయమున ముఖ్యముగాఁ బనిచేసినవారు బ్రహ్మసామాజికులు. వీరిలో శాకాహారము మంచిదేయైనను నిర్బంధమైనదికాదు. మఱియు నిం వెల్లమతములవారును జేరవచ్చును. వీరు ఐరోపియనులతోఁగూడ సహపంక్తిని భుజించుచుందురు. ఐనను నిది మతమునకు సంబంధించిన సంస్కరణమగుటచేతను, హిందువుల మతమునకును జాతిభేదములకును మొదటి మూఁడవస్థలలోను నత్యంతసంబంధ ముండుటవలనను, మనవారు జాతిభేదములు కూడవనఁగానే నిర్ఘాంతపడి ఇప్పుడే కలిపురుషుఁ డవతరించి విజృంభించుచున్నాఁడని చెప్పుచుందురు. ఇప్పుడు జాతిభేదములుకూడవన్నయెడ హిందూసంఘమే రీతిని చూచుచున్నదో, పూర్వము స్త్రీపునర్వివాహములుకూడు నన్నను నట్లే చూచుచుండెనని మనము భావింపవలసియున్నది. అయినను మతమునకుఁ జేరిన సంస్కరణములు స్థిరతరములైయుండును.

పండ్రెండవ ప్రకరణము.

ప్రకృతమున సంఘసంస్కరణము జరుగుచున్నవిధము.

ఇంతవఱకును హిందూదేశమునందలి యాయిభాగములలో నెఱపఁబడిన సంఘసంస్కరణకార్యములనుగూర్చి చెప్పియున్నాము. ఈప్రకరణమునందు వాని నంతను సామాన్యాంశములకు మార్చి ఒక్కొకరీతి సంస్కరణమునుగూర్చియు, నీనూఱేళ్ళచరిత్రమును మనకు బోధించువిషయములను వ్రాయుచున్నాము. రెండవప్రకరణమునందుఁ జెప్పఁబడిన సహగమనము, సిడులు మొదలగువానినిఁబట్టి చూచినను, లేక తరువాతి ప్రకరణములందు మేమువ్రాసిన స్త్రీపునర్వివాహాదులనుబట్టి చూచినను సంఘసంస్కరణ మెప్పుడును బుస్తకములవలననో, ఉపన్యాసములవలననో మొట్టమొదట నారంభమగునని తెలిసికొనవచ్చును. సాధారణముగా ప్రతి గొప్పసంస్కరణమునకును ఆదియందు అపరిమితమైన ప్రజాద్వేష ముండకతీఱదు. అయినను అట్టి ద్వేషములకుఁగాని, తఱువాత వచ్చెడు కష్టములకుఁగాని జంకక, నిజమైన సంస్కర్తలు, తాము పూనినపని మంచిదేయన్న ధైర్య మున్నయెడల, తమ యవ్వలి ప్రయత్నములను జేయుచుందురు. ఈవిషయమును బాటించునప్పుడే మన దేశోద్ధారకులైన రామమోహనరాయలు, విష్ణుశాస్త్రి, వీరేశలింగము పంతులువారు, కురుసేన దాసముజ్జీ మొదలగువారికిని, ఇతరులకునుగల భేదము మనకు విస్పష్టమగుచుండును. పూర్వకాలమునందు ఘనసంస్కర్తలై నిలిచిన జీససు, బుద్ధుఁడు మొదలగు మహనీయుల వంశక్రమమున నవతరించి దేశకాలానుగుణ్యముగా మనల నభివృద్ధిపఱుచు కార్యవాదులైన సంస్కర్తలు మొదటి తెగవారు. ఏదేశమునందు జన్మించినను, ఏకాలమునందుఁ బనిచేసినను, ఇట్టి వారి కులగోత్రము లెవ్వియైననుగూడ, వీరి నిజమైనవంశము జీససు, మొదలగువారికి సంబంధించినదేగాని, లోకదృష్టమైనదిగాదు. బుద్ధుని తండ్రియగు శుద్ధోదనుఁడు భిక్షాటనము చేయుచు సన్యాసి వేషముతో తన యింటికివచ్చిన ప్రియపుత్రునిచూచి 'నాయనా! సమస్తరాజ్యములను ఏలుచు ఎంతగౌరవముగా నుండవలసిన నాపుత్రుఁడవగు నీకీ నీచపు బిచ్చమేటికి? ఈరాజ్యమంతయును నీయది. వచ్చి సుఖముగా పాలించుకొమ్మ"ని చెప్పఁగా, బుద్ధుఁడు, "లోకము నంతను వృద్ధిపఱచి, వారి దుఃఖములను నిజముగా తొలఁగింపవలసి భారము నాది. ఇట్లే లోకపాలకులై యిదివఱకు దేశము నుద్ధరించిన ఆబుద్ధులే నా పితృ పితామహులు. జన్మపారంపర్యముగా నేను వారి సంతతివాఁడనై జన్మించితినిగాని, ఈలోక విషయములు బంధకములుగావు' అని ప్రత్యుత్తర మిచ్చెను. అట్లే జీససుతో నొకసారి 'ఇదె నీ తల్లివచ్చి పిలుచుచున్నది'

అని దగ్గర నున్నవారు చెప్పఁగా జీససు 'ఈలోకములో నాకు తల్లి యెవ్వరు. భగవంతుని సత్యరాజ్యవ్యాపనమునందుఁ బని చేయు నకలంకచరిత్రులే నాకుఁ దల్లిదండ్రులు' అని చెప్పియున్నాఁడు. ఏవంశమునందుఁ బుట్టినను, ఎవ్వారు తల్లిదండ్రు లైనను గూడ దేశోద్ధరణమునకయి పని చేయుచున్న మహానుభావులందఱును, పైరీతి సంస్కర్తల వంశమునందే జన్మించినవారు. అట్టివారితోడి సమానకులమునందుఁ బుట్టి దూషణభూషణతిరస్కారములను బాటింపక, తమ దేశమును వృద్ధిచేయవలెనన్నచింత నొక్కదానినే మనస్సున నిడుకొని ప్రాణమున కయినను దెగించెడు కార్యసంస్కర్తలనందఱిని సజాతీయసంస్కారులను సార్థకనామముతో నిచ్చోట నుదహరించి, వారిని గౌరవించుచున్నాము. ఎల్లసంస్కర్తలవలెనే తాము గ్రంథప్రచురమువలననో మాటలవలననో సంస్కరణము నారంభించియు, అల్పమైన స్వాభిమానము బలిమివలన దేశాభిమానము మాట మఱచిపోయి, పై వన్నెచిన్నెలనుమాత్రమే పాటించు సంస్కర్తలు జీససు, బుద్ధుఁడు మొదలగువారికంటె వేఱైనవంశమునందు జన్మించినవా రగుటచే, విజాతీయు లగుచున్నారు. మేకపోతు గాంభీర్యములును, ఉత్తరకుమారప్రజ్ఞలును గల ఈవిజాతీయసంస్కర్తలు మీసాలబువ్వలవలె నాలుగు సంస్కరణము ముక్కలను మైన నునిచికొని, జనులను భ్రమింపఁ జేయుచుందురు. ఇట్టివారు బహుసంఖ్యాకులయి యున్నారు. వీ రెల్లఱును సంఘసంస్కరణచరిత్రమునందు వివరింపఁబడుట కనర్హులయి గ్రూపు ఫొటోగ్రాఫులయందును, తీయనిమాటలయందునుమాత్రమే తమపేరును బైటఁ బెట్టుకొనుచుందురు. ఇట్టివారికి స్వవాక్యగౌరవమైనను నుండదు.

నిజమైన సంస్కర్తకు సంస్కరణము చేయువిషయమునందు సంపూర్ణాభిమానముండును. అతఁడు తనయభిమానాతిశయమువలన తనసంస్కరణవిషయముతో నభేద్యముగా నదుకుకొనిపోవును. పూవునుండి తావిని, సూర్యునినుండి కాంతిని, తుమ్మెదనుండి నలుపును విడదీసి వేఱువేఱుగా నుంచుట ఎట్లు దుస్సాధ్యమో, వీరిని సంస్కరణమునుండి విడఁదీయుటయు నట్లే దుసాధ్యమైనది. రబ్బరుచొక్కాయివంటి విజాతీయసంస్కర్తల యభిమానము, ప్రతివిషయమునకును ననువుగా సాగుచు, దినమున కొక కోటియభిప్రాయభేదములు కలిగినను వానికి సరిపడి నిలుకడ లేనిదయి ఏయెండ కాగొడుగు పట్టుచుండును. ఎప్పటికి ఏది ప్రస్తుతమో ఆమాటలను అప్పటికాడి, అన్యుల మనములను నొప్పింపక, తాము నొవ్వకఁ దప్పించుకొని తిరుగఁజాలుపథము నెఱిఁగినవారు విజాతీయసంస్కారులు. శతవిఘ్నములచేఁ గొట్టఁబడుచున్నవా రయ్యును, ధృతి, ఉన్నతి, ఉత్సాహము వీనిని విడువక, ప్రారంభించిన యర్థములను ఉజ్జగింపలేక ప్రజ్ఞానిధులై పని చేయు ధీరోత్తములు సజాతీయసంస్కారులు. నిజమైన ప్రేమమును, అభిమానమును కలవారు తమప్రేమాదుల కాస్పదమైన పదార్థము కష్టదశయం దుండఁగా

చూచి యూరకుండ నేరరు. అగ్నిమధ్యమునందు తప్తమగుచు తనవంక చేతులు చాచి యేడ్చుపుత్రుని చూచినప్పుడు తల్లి యూరకుండ నేరదు. భర్త చనిపోయిన ఘోరవార్త విన్నప్పుడు ఆదుఃఖమును వినలేక, అంతనే మెడలు వాల్చు పరమపతివ్రత మరణమే నిజమైన సహగమనముగాని, అంతటి కష్టవార్త విన్నప్పుడయినను చనిపోక, నిప్పులోఁ బడి బలవంతముగా చచ్చెడి స్త్రీ సహగమనము చేసినట్లెంచనే కూడదని బాణుఁడు తనకాదంబరియందు వ్రాసియున్నాఁడు. తన కంతటి బలవత్తరమయిన ప్రేమాభిమానములే సంఘమునం దుండునేని, సంస్కర్త ఇతరవిషయములను వేనినిఁ బాటింపక, దాని బాగుకొఱకే తనజీవితమును వినియోగించును. ఇష్ట మున్నప్పుడు మార్గములును దానితోడనే యుండునని యొకహూణదేశపు సామెత చెప్పుచున్నది.

ఈరీతి ప్రేమాభిమానములుగల సంస్కర్త లెక్కడనోగాని యుండరు. అందఱును మార్టినులూదరులే యగుదురేని, ఇఁక పదివేలసంవత్సరములకుముందు కానఁబడవలసిన యభివృద్ధు లన్నియు నేఁడే ప్రపంచమునకు ప్రాఁతపురాణములై యుండును. సంస్కరణముయొక్క యభివృద్ధి యెల్లప్పుడును అందలి సజాతీయసంస్కర్తల యభిమానబలము ననుసరించి యుండును. నిజమైన అభిమానమును, ఓర్పును, సత్యబలమునకుఁ దోడై యున్న ప్రతిచోటను విజయధ్వజము జనుల కుల్లాసకరముగా నాకసమునుండి వ్రేలాడుచుండును. అందు బుద్ధిబలముకూడ విశేషముగా నుండునప్పుడు ఇంటింటను జయజయధ్వనులు కోలాహలము చేయుట యొకవింత గాదు. హిందూదేశమునందలి ప్రకృతచరిత్రమునకు సంబంధించిన ఈశతాబ్దములో ప్రేమ, ఓర్పు, బుద్ధిబలము ఈమూడు ముఖ్యలక్షణములును సంపూర్ణముగాఁ గలవారు మాకు కొద్దిమందియే కానవచ్చుచున్నారు. ఇం దొక్కొకగుణము తగ్గినకొలఁదిని, సంస్కరణవ్యాప్తి కొంతకొంతవఱకు తగ్గుచుండును. దీనివలన సజాతీయసంస్కర్తలలోఁ గొందఱు బుద్ధిహీను లున్నారని మేము చెప్పవచ్చుట లేదు. నిరంకుశమైన ప్రజ్ఞ కలవారు కొద్దిమందియే యున్నారు. తక్కినవారు సామాన్యబుద్ధివైభవములు కలవారే.

ఈరీతి సంస్కర్తలందఱును ఒక్కొక్కరీతిని సంస్కరణమును జేసి, పందొమ్మిదవశతాబ్దమునందు హిందూదేశము నభివృద్ధి నందింపఁ బ్రయత్నించిరి. వారు చేసినప్రయత్నము లన్నియు 7 విధము లయినవి. అందుఁ బ్రతిదానికిఁగూడ నేదేని యొకలోపముండియే యున్నందున ఇదియే నియుక్తమయినమార్గమని చెప్పుటకు వీలు లేకున్నది. పందొమ్మిదవశతాబ్దమునందు హిందూదేశమున జరిగిన ఈయేడువిధములైన సంస్కారములలోను మేము చెప్పిన ఈక్రిందివరుసను ఒకదానికంటె నొక్కటి బలవత్తరమయినది. ఇది అన్నిశతాబ్దములకు సాధారణమైన సత్యము గాకపోయినను, పందొమ్మిదవశతాబ్దమునందు హిందూసంఘ మున్నరీతినే ఏసంఘమైన ఎచ్చటనైన నుండునేని, యందును

ఈయేడురీతుల సంస్కరణములును నీరీతి ఫలములనే తప్పక ఒసఁగు నన్నమాట శిలాక్షరమువంటిది. జరిగినచరిత్రమే దేశకాలభేదములేక, ఇతరవిషయము లన్నియు సమకూడునప్పుడు మఱలమఱల జరుగుచుండుట ప్రపంచచరిత్రము నెఱిఁగినవారి కందఱికిని విశదముగానే యున్నది.

హిందూదేశమునందు సంఘసంస్కరణమును జరుపవలెనని చేసినప్రయత్నములలో నతి పురాతనమయినదియు, మిక్కిలి నిరర్థకమయినదియు, శాస్త్రమును గూర్చినది. హిందూశాస్త్రములు ఇప్పటికాలపు కొన్నికొన్ని దురాచారముల నామోదించుటలేదు గావునను, నివికూడ వనుటకుఁ బ్రబలప్రమాణములు వానియందే యున్నవి గావునను, ధర్మశాస్త్రవిరుద్ధములయిన యీయాచారములను మానుఁడని కొందఱు సంస్కర్తలు జనులకు బోధింప మొదలుపెట్టిరి. ఈరీతివాదములవలన విద్యాసాగరుఁడు దయానందసరస్వతి, రామమోహనరాయలు మొదలగు మహనీయుల పేరులు బయిటికి వచ్చినను నిది సర్వజనాదరణము కాలేదు. దీనికి ముఖ్యకారణములు 2. అందు మొదటిది మనవారిశాస్త్రముల కెటు త్రిప్పిన నట్లే యర్థము వచ్చుచుండుట. ఒకవాక్యమునకే కూడుననియుఁ, గూడదనియుఁగూడ నర్థము చెప్పుటకు వీలు కలిగియుండుటచే, పండితులలోనే భిన్నాభిప్రాయము లుండుటకు వీలు చిక్కినది. ఒకవేళ గొప్పగొప్ప పండితులు రెండవవారియర్థమునందలి లోపములను జూపి, తమయర్థమునే సిద్ధాంతము చేసినను, అభిమానమును వీడలేక మనవారు సత్యమును విడిచిపెట్టుచున్నారు. రెండవది ఒకవేళ సంస్కర్తల యర్థమే సత్య మనుకొనుకొన్నను శ్రుతిస్మృతిపురాణములకంటె శిష్టాచారమే బలమయినదని ఆబాలవృద్ధముగా పూర్వాచారపరాయణు లందఱును నమ్ముచుండుట. ఆచారమే పరమప్రమాణమని చెప్పుచు, అభివృద్ధినిఁ గొట్టివైచి శాస్త్రప్రమాణములు పనికి రావనునప్పుడు మీరు ధర్మశాస్త్రముల యర్థమున కయి వేయియేండ్లు తలక్రిందయినను నేమిలాభ ముండును. సర్ జాన్ షోరు హిందూశాస్త్రవిరుద్ధములయిన శిశుహత్యలు జరుపఁబడరాదని బోధింపుమన్నను, రామమోహనుఁడు సహగమనము శాస్త్రవిరుద్ధమే యని బోధించినను గూడ లాభము లేకపోవుటకు ముఖ్యకారణము ధర్మశాస్త్రములనుబట్టి సంస్కరణము చేయవలెనను వారి ప్రయత్నములు మనదేశమునకుఁ దగియుండని వౌటచేత నేగదా. అట్లే విద్యాసాగరుఁడు స్త్రీపునర్వివాహములు శాస్త్రసమ్మతములని వ్రాసినదంతయు కార్యకారి కాకపోవుటచేతనుడ ; కొకనాఁడు "నాదేశీయులు శాస్త్రములచేఁ గట్టువడి యున్నారని నేను తలఁచిన దంతయుఁ గొప్పతప్పు." అని యనుకొనుచు నిరుత్సాహుఁ డగుటకుఁ గారణము మనవారికి శాస్త్రాదరణము నిండుసున్న యగుటచేత నేగదా. హిందూదేశమునందు శాస్త్రమే పరమప్రమాణమని తలఁచి సర్వజనాదరణీయముగా సంస్కరణము చేయనెంచుట

యసాధ్య మనుటకు కురుసేనదాసముఖ్జీవంటి యసామాన్యప్రజ్ఞావంతులపట్లు మనకుఁ బ్రబలదృష్టాంతములై నిలిచియున్నవి. మిక్కిలి క్రూరమయిన సహగమనదురాచారము నెడఁగూడ నది శిష్టాచారవిరుద్ధమని పోరిన చంద్రికాపత్రికాధిపతులవంటి మాననీయు లెందఱు లేరు?

ఒకవేళ శాస్త్రములే పరమప్రమాణములని యెంచి, జనాదరణమును బాటింపకయే యెవ్వరైన సంస్కరణమును నెఱపినను, వారు బహిష్కరింపఁ బడుచుండుట కర్థమేమి? హిందూధర్మవిరుద్ధమయిన కార్యమును జేసినవారు సంఘమునం దుండరాదని శాసించి, వారికార్యములను శాస్త్రవిహితములగు చర్యలనుగా భావింపకుండుటయే. దీనివలన ఎంతశాస్త్రమునుబట్టి వాదించిననుగూడ నాచరణసమయమునందది శాస్త్రమునకు సంబంధించుట లేదు. స్వతంత్రముగా నొకసంస్కరణకార్యమును జరిపిన నెట్లో, శాస్త్రసిద్ధమని వాదించి జరిపినను అట్లేయగుటచే హిందూమతగ్రంథముల ననుసరించి సంస్కరణమును జేయుటవలన నీనూఱేళ్ళలోను ఏమియు లాభము కలుగలేదని మీకు విశదమగును. ఈరీతి సంస్కరణ మన్నిటికంటెను నిరర్థకమైనది.

సంస్కరణమును జరుపుమార్గములలో రెండవది ఉపన్యాసములను జేసియు, గ్రంథములను వ్రాసియు, చిన్నచిన్నపత్రికలను బ్రకటించియుఁ బనిసేయుట. ఈవిధమైన సంస్కరణము ఈశతాబ్దము మొదటినుండియు జరుగుచునేయున్నది. సంస్కరణము ప్రతిచోటను ఈవిధముగానే ఆరంభింపఁబడునని మేము చాల సారులీగ్రంథమునందు వ్రాసియున్నాము. ఈవిధముగాఁ జేయుటవలనఁ గలుగు ముఖ్యలాభ మొక్కటిగలదు. సంస్కరణవిషయములు సర్వజనులకుఁ దెలుపుటకును, జనాభిప్రాయము క్రమక్రమముగా మార్చుటకును ఇవి తప్పక పనికివచ్చును. ఇట్టి యుద్దేశములతోనే అనేకులు పని చేయుచున్నారు. కాని ఈతెగవా రందఱును ఒక్కవిషయమును దమ మనస్సులలోఁ జొరనిచ్చుటలేదు. సంస్కరణమున కొందఱు జనులు సమ్మతించినను, తమ యుపన్యాసాదికము లెంత చక్కనివైనను, ఆచరణము లేకయవి సద్యఃఫలితములు కావు. ప్రపంచమంతయు యుక్తాయుక్తవివేచనము కలదిగాదు. అస్త్రశస్త్రము లెవ్వి లేకున్నను, ఉత్సాహమును బుట్టించుగుణముమాత్ర మొక్కటియున్నయెడల యాతఁడీప్రపంచమునంతను జయింపఁగలఁడు. జనసామాన్యము మంచిచెడ్డల నెఱిఁగి ఎప్పుడును తగువిమర్శనము చేయునదికాదు. గొప్పవక్తయొక్కఁడు వచ్చెనా, ఆతఁడు జనుల మనస్సులలోని ఇతర విషయముల నన్నిటినిఁ బాఱద్రోలి తాను చెప్పినదే నిజమనివారిచే నాక్షణమున కొప్పింపఁగలఁడు. ఉత్సాహముతోడను సంతోషముతోడను వారు ఇతరవిషయములను మఱచిపోయి ఒడలెఱుంగని వారివలె గొప్పగ్రంథకర్తలును వక్తలును ఉదహరించినదే మంచిదని యూహించుచుందురు. నే

డొకవిషయము మంచిదనివా రూహించిన మఱునాడు మఱియొక గొప్పవక్తవచ్చెనా, అతఁడును తనవద్ది వశీకరణమంత్రమువలన వారి యభిప్రాయములను మఱలింపఁగలఁడు. హిందూదేశమునందు సంస్కారపరులును నిషేధవాదులునుగూడఁ బ్రబలియున్న యీకాలములో సంస్కర్తలు వ్రాయుగ్రంథములును పత్రికలును, వారు చేయుమహోపన్యాసములును ఎక్కడనో బుద్ధిశాలురగు కొద్దిమందినితప్ప తక్కినవారిని నిలుకడగా తమపక్షమునం దుండునట్లు చేయలేవు. ఇందువలన జనుల మనస్సులలో నాటఁబడిన సంస్కారబీజములు చక్కగా పెరిగి స్థిరములుగాక ప్రతి పెద్దగాలికిని తలక్రిందై కొన్నిచోట్లఁ గొళ్ళగిలిపోవును. అందువలన జనాభిప్రాయములు నేడు సంస్కారపక్షమువంకనే యున్నవిగదాయని సంతోషింపరాదు. శ్రీరావు బహద్దరు వీరేశలింగము పంతులువారు రాజమహేంద్రవరములో నున్నకాలము నాటి జనాభిప్రాయము ఆయన యాయూరువదలిన రెండుమూడేండ్లలోనే ఎంతవఱకు మాఱినదో తెలిసినవారు, కార్యసంస్కారముకంటెను దక్కువైన వాక్యసంస్కారము జనులను స్థిరబుద్ధులనుగా నుంచునని భ్రమింపఁబోరు. ఈకారణములవలనను, హిందువులకు స్వభావగుణములైన అశ్రద్ధ స్వకార్యధురంధరత్వము మొదలగువానివలనను, ఈరీతి సంస్కారములు నిష్ఫలములై యున్నవి. వీనికి తోడుగా కార్యశూరత్వమును మాటనిలుకడను మనవారు కలిగియుందురేని, కార్యరూపమున జరిగినదంతయు జరిగినదేకావున వారి యుపన్యాసాదులవలన మాఱిన జనాభిప్రాయము కొంతవఱకు కార్యకారియై, నిజమైన సంస్కర్తలసంఖ్యను వృద్ధినొందించి, దేశమును గొంతవఱకు బాగుపఱుచును. ఎల్లకాలమును ఉపన్యాసములే యేని, కార్యము లెన్నటికోకాని జరుగ నేరవు.

మూడవ విధమైన సంస్కారము జనులచే ఒట్లు పెట్టించుకొని, పత్రికలపై సంతకము చేయించుట. మొదటి రెండురీతుల సంస్కరణమార్గములవలె నిది కార్యవిషయమున కేవల నిరర్థకము కాకపోయినను సార్థకమార్గములలో నిది మిక్కిలి తక్కువది. సంస్కరణచరిత్రమును మనము విమర్శించి చూచినకొలఁదిని హిందువులయందొక్క గొప్పలోపమున్నట్లు మనకు మాటికి మాటికిఁ గానవచ్చును. హిందూదేశీయుఁడనగు నేను, హిందువుల కందఱికినిఁగూడ నొక్కలోపమున్నదని వ్రేలెత్తిచూపుటచే జనులు నన్నభిమాన విరహితుఁడనని దూషింప వచ్చునుగాని, నామాటలలోని సత్యమునుమాత్రము వారలావలకు బోనడఁపలేరు. ఆత్మగౌరవవిరహితులైన మనవారు ఈదుర్గుణము తమయందున్నంతకాలమును అభివృద్ధి నందఁజాలరు. అందు ముఖ్యముగా నిది సంఘసంస్కర్తలకు ఏలోకముననుగూడ నుండఁగూడని గుణము. కష్టములువచ్చువఱకును సంస్కరణమే మంచిదనిచెప్పి, తరువాత తిరిగిపోవు వారొక్కశాఖవారు. సమయమువచ్చువఱకును సంఘసంస్కర్తలై తరువాత పూర్వనాగరికులగువా రొక్కశాఖ

వారు. కార్యములు కష్టములను నూహను మనస్సులో నిడికొని పైకి తమతోనే సంస్కరణదేవత భూమిమీఁద నవతరించి నట్లు మాటలాడువా రొకశాఖవారు. మేము మీతో నిలిచి చేయుసహాయ మింతింతకాదని తేనె మాటలాడుచు బలహీనులైన జనులను కార్యములోనికి దింపి ద్రోహముచేయువా రొక్కశాఖవారు. ఇట్లు శాఖాభేదము లెన్నియైనను జేయవచ్చునుగాని, ఈమాట యంటిమిగదా యని యైనశంకించి, పని చేయ మొదలుపెట్టుపాటి ఆత్మగౌరవముగలవారు ఎందును లేనే లేరని చెప్పవచ్చును. ఇది దేశీయులగుణమున కొక ప్రబలసాక్ష్యమై, హిందువులు సిగ్గుమాలినవారనికూడ మమ్ములను జెప్పుమని నిర్బంధించుచున్నది.

హిందువు లిట్టి గుణముకలవారని తెలిసినతరువాత ఒట్లుపెట్టించి వారిచే సంస్కరణము చేయింప నెంచుట ఏమి మంచిమార్గమగును? ఈరీతి సంస్కరణములకు దారి చూపినవారు రావుబహద్దరు చింతామణి నారాయణభట్టుగారు, స్త్రీలు శనివారవ్రతములును సూర్యదర్శనవ్రతములును జేయునట్లే పురుషులును సంస్కరణవ్రతములను జరుపఁగలరని యాయన ఎంతభ్రమించినను, కార్యమునం దిది చక్కఁగా నెఱవేఱ లేదు. స్త్రీలకు మతవిషయికములగు నమ్మకము లున్నందున, పరలోకమునందు ఏ యముఁడు నిశ్చయముగా దండించునో యను భయముచేతను, ఈసౌఖ్యము ననుభవింప వచ్చునుగదా యను నాశచేతను వారు వానిఁదప్పక యాచరించుదురుగాని, ఏభవిష్యోత్తరపురాణమునందును జెప్పఁబడని యీసంస్కరణవ్రతమునకుఁ బురుషు లెట్లు నిశ్చయమైన దాసులు కాఁగలరు? జ్ఞానాధిక్యమగు కొలఁదిని ఇట్టి వ్రతములయందు జనులకు నమ్మకము చెడుటయు, అంటిమిగదాయని ఆచరించుటకు వారియం దింకను ఆత్మగౌరవము అంకురింపకుండుటయు నీ సంస్కరణమార్గము విశేషఫలదాయి కాకపోవుటకు ముఖ్యకారణములు. చింతామణి నారాయణభట్టుగారి అతిబాల్యవివాహవ్రతములు ఆయన బ్రదికియుండఁగనే ఉల్లంఘింపఁబడినవి. అట్లే ఈరాజధానియందు భోగకాంతలనుగూర్చి పత్రికలపై చేవ్రాళ్లు చేసినవారును ఆత్మగౌరవము లేక హిందువుల మనిపించుకొన్నారు. ఇండియాలోని ప్రతిభాగమందును ఈపద్ధతి ఎవ్వరినో కొందఱిని కొంతకాలమువఱకు కట్టుబాటులో నుంచినదిగాని అందువలన ఏమియు విశేషమగు లాభము కలుగలేదు.

సంస్కరణపద్ధతులలో నాలుగవది సంఘములను సమాజములను ఏర్పఱిచి కార్యములను జరుపుట. ఆత్మగౌరవముకల అన్యదేశములం దిది కార్యకారిగా నున్నను, మనదేశ మింకను అట్టి స్థితికి రాలేదు. అయినను వీనివలనఁ గొంతపనిమాత్రము జరుగుచున్నది. దేశీయసాంఘికసభవంటి సభలవలనఁ గొందఱిలో ఉత్సాహము కలుగుచున్నది. కాని ఈసభవారిలో నొక్కగొప్పలోపము కలదు. ఈసభయందు ఆత్మ

గౌరవము తమకు లేదని తాము లోకమునకుఁ జేసి చూపిన సంస్కరణకార్యములవలననే వెల్లడించు వారినిమాటలాడ నిచ్చుట యొకగొప్ప అగౌరవముగా మేము భావించుచున్నాము. తమ చెమ్మటనుఊర్చి తాము మాటలాడుచున్న విషయములను స్థాపించుటకై పలుగాములబడి హిందూదేశోద్ధరణమునకు నిజమైనమార్గదర్శులందఱును మూలమూలల నణఁగియుండఁగా తగుదుమని నాలుగింగ్లీషుముక్కలను గోటుగా నీటుగా వాగనేర్చిన విగ్రహములచే నేవో నాలుగుపాడిముక్కలను జెప్పించి కార్యము సమాప్తిచేయుట ఈసభవారిలో నొక్కదురాచారమై యున్నది. కార్యసంస్కర్తలే ఈ సభయందు మాటలాడుగౌరవము నందఁగలవారని శాసించినచో, నందలి తీర్మానములకు నిజమైన గౌరవమును, దేశములోని ప్రతినిధుల కందఱకును దమ జీవితోద్యమములను దెలుపఁగలిగితిమిగదా యన్నసంతోషమువలన సంస్కర్తలకు నిజమైన ఉత్సాహమును, తమవలెనే కష్టములకోర్చి పనిచేయువారిని నలువురను జూచినందున అన్యోన్యమైత్రియు, ధైర్యమును, ఒండొరుల కష్టనష్టములను మాటలాడుకొనుటవలన ముందు తా మిట్లు పనిచేయవచ్చునని నిర్ణయించుట కనువగు నుపాయములును, జనుల కెల్లఱకును ఈసభయందలి గౌరవమును, ఈసభయందు మాటలాడ నెంచువారికిఁ గార్యదీక్షయును దప్పక గలుగును. లేనియెడల ఈసమాజమును నొక్కనాటి ముచ్చటదియై, ఊరువారి సొమ్ముతోఁ దమకడుపును నిండించుకొనుట కొక సాధనముగుటకంటె వేఱు లాభము నీయలేదు. ఇఁక మనదేశములోని తక్కిన సమాజముల విషయమై మేమంతగా చెప్పవలసినదిలేదు. కొన్నికొన్నిసమాజములు నేఁడుపుట్టి రేపే యంతరించుచుండుటచే, నవి యీచరిత్రమునందుఁ దెలుపఁబడఁదగినవికావు. ఇవికాక ప్రతిదేశీయసభాసంవత్సరచరిత్రమునందును దమపేరుల నచ్చొత్తించికొని గౌరవమునందు నూరులేక నూటయిరువది సమాజములలోఁ దొమ్మిదివంతులు వాక్యశూరత్వము కలవి. మిగిలినవానిలో రిజిస్టరు చేయఁబడిన వాల్టరీకృత రాజపుత్రసభవంటి కొన్ని సర్వసమాజములకును మార్గదర్శకములై తమదేశమున కింతింతనరాని యుపకారము చేయుచున్నవి. ఇట్టి సమాజములు నిజముగా గౌరవార్హములై వందనీయములగుచున్నవి. ఇవికాక మఱి కొన్నిసమాజములు తమ కధ్యక్షులగు కార్యసంస్కర్తలు కొందఱు చేయుపనులను తమపేరఁ బ్రకటించికొని యనర్హమైన గౌరవము నాపాదించుకొనుచున్నవి. ఏవిషయము లెట్లున్నను, కొద్దిసంఖ్యగలసమాజములలోనైన నిజమైన కార్యసంస్కర్తలుండుటచే, వీనివలనఁ గొంతపని జరుగుచునేయున్నది.

ఇదివఱకుఁ జెప్పఁబడిన నాలుగురీతుల సంస్కరణములలో మొదటిరెండును అధమపక్షములు. తరువాతిరెండును మధ్యమమార్గములు. ఉత్తమమార్గములగు మూటిలో మొదటిది సంఘసంస్కర్త తనచుట్టును గుమిగూడియున్న మాటనిలుకడలేని మానవసమూ

హాము యొక్క దూషణభూషణ తిరస్కారములను, అడియాసలగువారు పెట్టు ఆసలను బాటింపక, దేశక్షేమము నేయెదనెంచి, తన చేతనైనరీతిని కార్యములను జరుపుచుఁబోవుట. ఆచరణ విషయమునం దెవ్వరును మీఱరాని రెండవయుత్తమ విషయమున కింతకంటె నెక్కువ ప్రతిబంధకములే యుండుటచే, దానినే అయిదవయంశమునుగాఁ జేయుట మంచిదైనను, దానివలన జరుగు సంస్కరణము జనసముదాయమున కంతకును దప్పని సరియగుటవలన సంఖ్యనుబట్టి యోచించి దానిని ఆఱవవిషయముగానే యుంచుచున్నాము. సంస్కరణమార్గములలో నీ యైదవమార్గము ననుసరించువారు నిజమైన దేశాభిమానులై తమశక్తివంచన లేక పనిచేయు మాననీయులు. వీరిప్రయత్నము లన్నియు గాలికిఁ గొట్టుకొనిపోక స్థిరములై కొంతవఱకు దేశమును బాగుచేయును. ఇష్టమున్న ప్రతివారిచేతను వీరు కార్యములను జేయించుచు, చేసిన కొద్దిపనినైనను సార్థక మనిపింతురు. సజాతీయసంఘసంస్కర్తలను నామమును వహింప నర్హులైనవారిలో మొదటితెగవారు వీరే. నిజమైన అభిమానము, ధైర్యము మొదలగు గుణలతలకు వీరే ఆలవాలములు. హిందూదేశకాంత నెడ గౌరవనీయమగు సద్భావమును వహించి యామెను బోషించి యుద్ధరించు కులదీపకులగు సుపుత్రులువీరే. ఎవ్వరేమనుకొన్నను వానితోడిజోక్యమును గలుగఁజేసికొనక, తమమార్గమునఁ దాముపోవుచు తమప్రయత్నములను కార్యములం దనుసంధించి వీరు కృతకృత్యులగుదురు. ఈలోకమునందు జన్మించుట కేవలము పొట్టపోసికొనుటకుఁ గాదనియుఁ, బ్రతిమానవునికిని యలంఘ్యములైన బాధ్యతలు కొన్ని కలవనియు, మృత్యుదేవత వచ్చి మీఁదఁబడక మునుపే, స్థిరమైన యుపకారమును దమదేశమునకుఁ జేసి, తమజన్మము వ్యర్థము కాలేదుగదా యని సంతసింపవలసిన విధి యందఱికిని గలదనియు, వీరిచరిత్రములవలన మనము నేర్చుకొనవచ్చును. విద్యాసాగరుఁడు విష్ణుశాస్త్రి, వీరేశలింగము పంతులువారు, కురుసేనదాసముల్జీ, రాసవిహారముకర్జీ మొదలగు మాననీయు లీతెగలోనివారు.

కాని యీరీతి సంస్కరణములు కార్యమునుఁబట్టి సద్యఃఫలితములైనను, చిరకాలవ్యాప్తములు గావు. విద్యాసాగరుని యనంతరమున వంగదేశమునందు స్త్రీపునర్వివాహములమాటనే యెవ్వరును దలపెట్టుచుండుటలేదు. ఆదేశమునందు అవి యంతటితోనే యడుగంటినవి. విష్ణుశాస్త్రి తఱువాత యాతనినిఁ బోలిన మాననీయుఁ డొక్కఁడును మఱల ముంబయి (Bombay) రాష్ట్రమున నుదయించలేదు. కురుసేనదాసముల్జీ చనిపోయినవెనుక మహారాజమతావలంబుల దురాచారములను బోనడుపు సాహసికాగ్రగణ్యుఁడు రానేలేదు. రాసవిహారముకర్జీ తఱువాత కులీనులలో ఆదిత్యచంద్రబంధోపాధ్యాయు పని చేయుచున్నను అతఁ డింకను ముకర్జీ లేనిలోపము కానఁబడకుండునట్లు చేయలేదు. వీరేశలింగము పంతులువారి తఱువాత మనరాజధానిలో స్త్రీపున

ర్వివాహములను జేయువా రెవ్వ రన్నప్రశ్నమున కీవఱ కింకను సమాధానము రాలేదు. విచారించి చూడఁగా ఏండ్లు కలవారిలో నొక్కరును మాకుఁ గానఁబడుటలేదు. ఈ రీతిగా నీసంస్కర్తలు తమ జీవితకాలమునందుఁ గొంతసార్థకమగుపనినిఁ జేసినను, వారికిఁ దఱువాత వారిపను లాగి పడిపోవుచుండుటచే ఈరీతిచర్యవలన నొకరు విడిచిన పనిని ఆచారముగా నింకొకరు చేయవలసి యుండుట లేదు. స్థిరత్వము లేదన్న విషయము నావల నునిచినయెడల వీరిచర్య సార్థకముగానే యున్నదని హిందూసంఘసంస్కారచరిత్రమువలన మనము నేర్చుకొనవచ్చును.

సంస్కరణవిషయమునందు రెండవయుత్తమమార్గము దొరతనమువారు చట్టములను జేయుట. ప్రభువు లన్యకులస్థులగుటవలనను, చట్టములు జనులను నిర్బంధము చేయునుగావునను ఈరీతిగానే సంస్కరణము జరుగునేని పూర్వము హిందువులలో ఔరంగజీబును టిప్పు సుల్తానును బలవంతముగా మహమ్మదీయమతమును వ్యాపింపఁజేసిన రీతిగా ఆంగ్లేయులు క్రైస్తవాచారములను బవిత్రహిందూసంఘములోఁ జేర్చి ఎల్లఱను మాలలను జేయుచున్నారని మన సభాపతు లప్పుడు చెప్పఁజూతురు. క్రొవ్వుతో పూయఁబడిన తుపాకు లిచ్చినందుకే ఘోరమైన రాజద్రోహమును జేసినవారి సంఘమందు దొరతనమువారు సామాన్యసంఘవిషయములలో జోక్యము కలుగఁజేసికొనుట అంతయుత్తమమునుగాదు. అందువలన మనవా రింకను రాజద్రోహులేయని మేమనముగాని, మ్లేచ్ఛప్రభువులు హిందూమతవిషయములలో జోక్యము తీసికొనరాదనిచెప్పు గొప్పగొప్పవారి యభిప్రాయములను బాటింపవలసియున్నది. అయినను తాము మొదటఁ జేసిననిబంధనలనుబట్టి బహుజనాభిప్రాయమును బాటింపకుండ దొరతనమువారేజోక్యమును గలుగఁజేసికొన నుత్సహించియుండలేదు. కాని దొరతనమువారేవిధమైన జోక్యమును దీసికొనక నేయుండవలెనని మాయభిప్రాయముగాదు. హిందువులు ఆత్మగౌరవము లేనివారగుటచే సంస్కరణములను దమంతట తామే చేసికొనుకాలము వారి కింకను రాలేదు. ఈలోపమువలన హిందూదేశీయులలో నెంతమందియో నిరర్థకజీవనులై ప్రత్యక్ష యమబాధల ననుభవించుచు, ఇహలోకముననే నరకమును గండ్లచూచుచున్నారు. ఇట్టి మిక్కిలి కఠినములగు సమయములలో దొరతనమువారు తమశాసనములవలన కష్టజీవుల దుఃఖములను దొలఁగించి వారి నాదుకొనవలసియుండును. ప్రజాక్షేమమును బాటించి వాని కనువగుశాసనములను జేయుటయే రాజధర్మము. ఈకారణములవలన హిందువులలో ఆత్మగౌరవముగలిగి తమ్మును తామే బాగుచేసికొనువఱకును మన ప్రభుత్వమువారు మన సంఘాచారవిషయములందు కొంత స్వతంత్రత తీసికొనక తప్పదు. ఈ కారణములవలనే హిందూదేశజులమగు మన గన్నులు దెఱపించి, ఎల్లఱకును నిజమైన రక్షకులైన మనప్రభుత్వమువారు సహగమనములు, సిసులు మొదలగువానినిఁ గొట్టివేసి, స్త్రీపునర్వివాహితలకును అన్యమతావలంబులకును

గొన్ని నష్టములు లేకుండఁ జేసి, బ్రహ్మసమాజము వారి వివాహములను న్యాయమనిపించి, మళయాళీలలో వివాహాచారములను నూతనముగా స్థాపించి పనిచేయుట ఎవ్వరి కిష్టమున్నను, ఎవ్వరికి లేకున్నను, దేశమునకు మిగుల నుపయుక్తమైయున్నది. అట్లే హిందూ వైధవ్యక్రూరదేవతను బాటించి అతిబాల్యవివాహముల నాపుటయు, నీతినిఁ బాటించి భోగకాంతలతో కట్టుదిట్టములు లేని పెంపకముల నాపుటయు, నూతనముగా నిర్మింపఁబోవు దేవాలయాదులపై బూతుబొమ్మలు వేయకుండ ఆపుటయు, కులీనస్త్రీలదుఃఖములను జూచి వారిలో బహుభార్యాత్వమును బోఁగొట్టుటయు, నిట్టి విషయములందు ప్రభుత్వమువారు ఆచారవివశులైన జనుల యభిప్రాయములను జూడకయే కష్టజీవులను రక్షించి, వారిని దెప్పరిలు నట్లుచేయుట విధియైయున్నది. ఆంగ్లేయులు మన మతస్థులుకారనియు, హిందూసంఘమునందు మైసూరు దొరతనమువారివలె హిందువులే చట్టములుచేయవలెననియు మనవా రెంత వాదించినను, వాగాడంబరులు ఉత్తరకుమారసమాన ప్రజ్ఞావంతులుగాన 'అల్లోలక్ష్మణా' యని యేడ్చువారిపై దొరతనమువారైనను గరుణింపకున్నయెడల, ఈకష్టజీవుల నందఱిని ఒక్కసారి నఱికివేసి వారికష్టములను దొలఁగించిన పుణ్యమునునైనఁ బొందని మాసంఘమువారినిఁ బ్రార్థించుచున్నాము.

ఇఁక సంస్కరణమార్గములలో నుత్తమోత్తమమైన ఏడవమార్గమునుగూర్చి యించుక చెప్పవలసియున్నది. ఈమార్గము నవలంబించువారికి, ఐదవమార్గమునందువలె తఱువాత పనిచేయువారు లేరన్న దుఃఖముగాని, ఆఱవమార్గమునందువలె మ్లేచ్ఛప్రభువులు హిందువులయాచారములపై స్వతంత్రము వహింపరాదన్న యాక్షేపము గాని రానేరదు. స్థిరతరమై వంశపారంపర్యముగా సంస్కరణములు జరుగునట్లుచేయు ఈమార్గము పందొమ్మిదవ శతాబ్దమునందు ఆచరణములోనికి వచ్చి దానిఫలములను లోకమునకు వెల్లడించినది. మేలైన సంఘాచారములు గలవారినిఁ జేరుటకాని, లేక వలసిన సంస్కరముల నన్నిటినిఁ జేర్చి యొకనూతనసంఘమును సృష్టించి, యందుఁ జేరుటగాని ఈమార్గములోని ప్రధానవిషయము. ఈవాక్యమునుబట్టియే మాపాఠకులు మాయభిప్రాయమును గ్రహింపవచ్చును. క్రైస్తవమతప్రవిష్టతయు, ఆర్యబ్రహ్మసమాజాదిమతములలోఁ జేరుటయు నే ఈమార్గము బోధించుచుండును. హిందూసంఘమును అట్లే యుంచి సంస్కరింపవలెనుగాని అన్యమతప్రవిష్టతవలని సంస్కరణము సంస్కరణమే కాదని కొందఱు వాదింపఁ జూచుచున్నారు. ఈకారణములవలన మే మీవిషయమునందు క్రైస్తవమతమును దొలఁగించి వైచి, హిందూమతాంతర్భాగములైన ఆర్యబ్రహ్మసమాజములనుమాత్రమే ఇందుఁ జేర్చుచున్నాము. ఈసమాజము లిటీవలఱకే స్థాపింపఁబడి యున్నవిగాన 'మేలైన సంఘాచారములు గలవారిలోఁ జేరుటకాని' యను మాపదములకు క్రైస్తవమతమే యన్వయార్థమును దీసికొన నక్కఱలేదు. ఆర్యసమాజమువారికి ఋగ్వేద మనుస్మృతులు పరమప్రమాణములు గావునను, హిందూసంఘమునందు వలసిన మతసంఘసంస్కరణముల నన్నిటినిఁ జేర్చఁగానే బ్రహ్మసమాజ మగును గావునను ఈరెండును తప్పక హిందూమతాంతర్భాగములే యగుచున్నవి. ఒకవేళ సంస్కరణములు జరుగఁగానే యవి హిందూమతేతరము లగునని కొందఱు వాదింపఁ జూతురేని స్త్రీపునర్వివాహములు చేసినవారు సహితము బహిష్కరింపఁబడి హిందూమతేతరు లగుచున్నట్లే మఱి నాలుగుసంస్కరము లెక్కుడుగా నుండుటచే పయి సమాజములలోనివారిని హిందూమతేతరు లనుట యొకవింత గాదని చెప్పుచున్నాము.

మతము పేరిట సంఘసంస్కరణము జరుపఁబడదేని యది స్థిరముగా నుండదు. ఐదవరీతిసంస్కరణమువలని ఫలములను, ఆఱవ రీతిని సంస్కరణవిషయమున మేము చెప్పినవిషయములను, గ్రహించినవారు, వంశపారంపర్యముగా సంస్కరణవ్యాప్తి కావలె నన్నయెడల ప్రత్యేకసంఘము నే యట్టియాచారములతో ఏర్పాటు చేయవలయుననియు, సముద్రయానమువంటి కొద్దిపాటి సంస్కరణము చేయువాఁడుగూడ హిందూసంఘమునుండి కొన్నిచోట్ల బహిష్కరింపఁబడి, అన్యప్రవిష్టునిగతి నిలుచుచుండుటచే, హిందూసంఘాంతరితసంస్కరణములు అసాధ్యము లనియుఁ గ్రహింపవచ్చును. ఎట్లు సంస్కరణము చేసినను హిందూసంఘమునుండి వెలిబడుట తప్పని సరియగుటచే అన్ని సంస్కరణములను జేర్చి వేఱుసంఘమును స్థాపించుకొనవలసినదే గాని మఱియొక మార్గము లేదు. యుక్తములయిన మతధర్మములను జేర్చి, సంస్కరణవాదుల యాచారములనందు వలసినమార్పులతో మతాచారములనుగా జేసి కొనక పనిచేసినయెడల సంస్కర్త వెలిబడుటయు, విశేషముగా పని చేయలేక పోవుటయుఁ, దనవెనుక తనవంటి పని చేయువారు లేరని లోలోదుఃఖించుకొనుటయు ఫలములగును. మతముతో సంబంధించిన యాచారము లగుటచే నూతనసంఘమునం దివి జన్మపారంపర్యములై సంస్కర్తల కభీష్టము లొడఁగూర్చును. ఇంతియ కాక దొరతనమువారి చట్టములవలె నివి ప్రతివారిని నిర్బంధింప కుండుటచే, ఇష్టమున్నవారే యీరీతి సంఘమునందుఁ జేరుచుందురు. దీనివలన ఇష్టము లేనివారి కేయిబ్బందులును రావు. మఱియు నీవిధముగా విదేశయాత్రలును, స్త్రీవిద్యలును, స్వయంవ్యాపారములును ప్రబలిన కొలఁదిని హిందువులలోని సంఖ్య నానాటఁ దక్కువై యీసంఘమువార సంఖ్య ప్రబలసాగును. ఈవిధముగాఁ గొంతకాలమునాటికి ఈరీతిసంఘమే హిందూసంఘమై, ప్రాచీనసంఘముతో నేకీభూత మగును. అయినను నివి యన్నియు, నీటిలో గేదెను బెట్టి బేరమాడుట వంటివి. ఈనూతనమతములవారిలో హిందూసంస్కరణము పందొమ్మిదవశతాబ్దమునం దేరీతి జరిగినదో ముందుప్రకరణములయందు వివరించుచున్నాము.

పదుమూఁడవ ప్రకరణము.

మూర్తిసంఘీయులు.

సామాన్యసంస్కరణములను విడచి, మతవిషయికసంస్కరణములకు వచ్చునప్పుడు మనము ముందుగా మూర్తిసంఘీయులనుగూర్చి విచారింపవలసియుండును. ఈసంఘమువారు చేయుసంస్కరణము కేవల మతసాంబంధికమైనదిగాని, కేవలసంస్కరణరూపకమైనదిగాని కాదు. మతగురువులతోడి ఐక్యము వీరి కించుకేనియు లేదు. అట్లని వీరు నూతన సిద్ధాంతములప్రకారముగా నడచువారును గారు. సంస్కరణములనేకములను జేర్చి, వీరు సంఘీయులనుగొందఱిని వేఱుపఱిచి సిద్ధాంతభాగముల కేయాతంకమును లేకుండునట్లుగా నొకనూతనకులమును జేసియున్నారు. సిద్ధాంతములను మార్చివేయు మతసంస్కరణములకును దీనికిని నిట్టిభేద మున్నది. ఒకవేళ దీనిని సామాన్యసంస్కరణమని పిలుచుదమన్న అట్లును వీలు కాకుండురీతినివీరు తమసంఘమువారిని మూర్తికులజు లని చెప్పుచు, నందుఁ జేరు ప్రతివారును గొన్ని సంస్కరణములను నిర్బంధముగాఁ జేయవలసి వచ్చునట్లు విధుల నేర్పఱిచి యున్నారు. ఈవిధముగ నుండుటచే నిది సామాన్యసంస్కరణముల కొకయించుక యతిశయించినదై, కేవల మతసంస్కరణ మంతదూరముపఱకును బోక ఈరెంటినిఁ గలుపుచు మధ్యస్థితిని వహించి యున్నది. ఇట్టిమధ్యస్థితినిఁ జూపుటవలన నిది హిందూసంఘసంస్కరణచరిత్రమునందు ముఖ్యమయినదై సామాన్యసంస్కరణములనుండి మతవిషయికసంస్కరణములలోనికి దిగుట కొకమెట్టై యున్నది. ఇట్టిసంఘములోని జనులును నీరెండురీతుల సంస్కరణములలోను గల సామాన్యధర్మములను గలిగి యుందురని మనము బుద్ధిబలిమివలననే తెలియవచ్చును. అట్టినిరూపణమునకును ననువగునట్లే వీరికిఁ గలపట్టుదల, వీరి స్త్రీలసంస్కరణదీక్ష, ఇట్టిగుణములు ఈసంఘమువారిని సామాన్యసంస్కర్తలనుండి వేఱుపఱుచుచున్నవి. ఈసంఘమువారు, బొమ్మగానచెఱువు, చిత్రదుర్గము, రాయదుర్గము, గోనబాడి, చింతకుంటి, క్రొత్తపల్లి, కుందుర్పి, బొమ్మగొండనకెరె, సిద్ధపల్లి, సాలపల్లి అను ప్రదేశములలోఁ దమసంఘములను శాఖాసంఘములను స్థాపించుకొని, 'మూర్తికులము' వారనుపేర వీరు తమసంస్కరణములను నెఱపుకొనుచున్నారు.

పైని చెప్పిన ప్రదేశములలో మొదటి రెండుచోట్లను వెంకటరమణమూర్తిగారును, పై నారాయణమూర్తిగారును జేరియు, రాయదుర్గమునందు నారాయణమూర్తిగారును, దక్కినచోట్ల వరుసగా రామమూర్తిగారు, రామరాజుగారు, బాలనృసింహమూర్తిగారు, గురుమూర్తిగారు, హనుమంతరాజుగారు, రామరాజుగారు రామరాజు

గారు, అనువారలును బని చేయుచున్నారు. ఏకకులజులయి ఈవిధముగా మైసూరుసంస్థానమునను, బళ్లారి, అనంతపురము జిల్లాలలోను వీరు స్వసంఘములో సంస్కరణాభివృద్ధికిఁ బాటుపడుట శ్లాఘాపాత్రమై యున్నది.

మైసూరుసంస్థానమునం దుండు రాచవారును, చెన్నరాజధానిలోని కొన్నికొన్ని ప్రదేశములం దుండు సౌర లనెడువారును, భట్రాజులును, మూర్తిరాజులును నీమూర్తిసంఘీయులలోఁ జేరినవారు. వీరియధ్యక్షులు ఎల్లమరాజు నారాయణమూర్తిగారు. వీరిపేరనే ఇది మూర్తిసంఘమని పిలువఁబడుచున్నది. క్రీ. శ. 1889వ సంవత్సరమునుండి కొంతకాలమువఱకును విజ్ఞానవర్ధనీపత్రికను బ్రచురించిన వీరు సంఘసంస్కరణాభిమానులై, స్వసంఘాభివృద్ధికొఱకు 1892వ సంవత్సరము జనవరు నెలలో అనంతపురము జిల్లాలోని కుందుర్పి యనుగ్రామమునం దీమూర్తిసంఘమును స్థాపించిరి. ఈసంఘము స్థాపింపఁబడినదినములలో వీరికిఁ బ్రబలశత్రువులు పెక్కండ్రుండి యుండిరి. కాని సంస్కరణవిషయములకు విరోధు లుండుట సర్వసాధారణమేకదా. క్రిమినల్ నేరములు తెచ్చియు, విషప్రయోగములను జేయ నుంకించియు ననేకులు ప్రయత్నించినను గొంతకాలము గడచునప్పటి కీమూర్తిసంఘము క్రమముగా బాలారిష్టములను దాఁటినది. మొట్టమొదట నొకపల్లెటూరునందు స్థాపింపఁబడిన వీరిసంఘము తరువాత కల్యాణదుర్గమునకు మార్పఁబడినది. అందుండి ఇది ప్రకృతమున రాయదుర్గమునకు మార్పఁబడి యున్నది.

మనదేశమునందుఁ బ్రతిశాఖలోను అంతర్భాగము లున్నట్లే ఈమూర్తిజాతియందును మూర్తిరాజు లనియు, కనిరాజులనియు, భట్రాజు లనియు, సౌరు లనియు— కొన్ని తెగలు గలవు. ఆచారభేదములవలనఁ బరస్పరసంబంధబాంధవ్యములు లేక, అన్యోన్యకలహములతోఁ గాలము గడపుచున్నతమకులజులను బాగుచేయవలెనను నాశయముతో మొట్టమొదట నారాయణమూర్తిగారీసంఘమును స్థాపించిరి. ఈనాలుగంతర్భాగములను నొక్కటిగాఁ జేయవలెనని యెంచి ఈయన చేసినప్రయత్నములు కేవల వాక్యరూపములైనవి కావు. అంతశ్శాఖావివాహములను నెలకొల్పి వానివలన నాయాయియంతర్భాగముల నొక్కటేశాఖగాఁ జేయుట వీరి యుద్దేశము. అయినను సమాజస్థాపకులగు నారాయణమూర్తిగారు దక్క వేఱెవ్వరును మొట్టమొదట నట్టికార్యములకు సాహసింపఁజాలరైరి. సాహసించి పని చేయలేక, ప్రకృతపు టితరసంస్కరణసామాజికు లట్లే యీసంఘమువారును వాక్యశూరతను జూపునప్పుడు నారాయణమూర్తిగారి మనస్సెట్లుండునో మేము వివరింప నక్కఱలేదు. అందువలన నీకార్యసంస్కర్త తనకుటుంబమునందే మొట్టమొదట నన్యోన్యశాఖావివాహములను జేయఁ బూనెను. అప్పటి కీయనతమ్ముఁ డొక్కఁడవివాహితుఁడుగా నుండెను. అతనిని వేఱు

శాఖవారి కిచ్చి వివాహము చేయుట కీసంస్కర్తయు నిశ్చయించెను. కాని నారాయణమూర్తిగారి యన్నగారును, దల్లిగారును దీనికి సమ్మతింపనందున నీప్రయత్నము కొనసాగలేదు. తరువాత మఱికొంతకాలమునకు నారాయణమూర్తిగారి బావమఱిదికి వేఱుశాఖలోని కన్య నిచ్చి వివాహము చేయుటకుఁ బ్రయత్నములు జరుగ నారంభించెను. అప్పుడు వీరి కాతంకము లనేకములు కలిగినవి. నారాయణమూర్తిగారి యన్నగారే యీకార్యములకు సహింపలేక వీరిని విడువవలసి వచ్చెను. ఒకతెగవారింకొకతెగవారిని నీచవంశమువారినిగాఁ జూచుచుండుట వీరిలోని అన్యోన్యశాఖావివాహములకుఁ బ్రధానశత్రుకారణము. ఎన్నికష్టములు వచ్చినను సహించి తుట్టతుదకు మూర్తిగారీవివాహమును సాంగము గావించిరి. సంస్కరణములలో నిదివఱకు జరిగినరీతినే యిప్పుడును నీసంఘములోనివా రందఱును కార్యసంస్కరణమునకుఁ బ్రబలశత్రువులై మూర్తిసంఘమునుండి వెడలిపోయిరి. ఈవివాహమైనతోడనే మూర్తిసంఘము మూడుకుటుంబములతో నిలిచినదాయెను. అప్పుడు నారాయణమూర్తిగారు విజ్ఞానవర్ధనీసభికులలోఁ గొందఱిని మూర్తిసభికులలో నాంతరంగికసభికులను గొందఱినిఁ జేర్చి జాతిభేదమునుగూర్చియు, ఆచారమునుగూర్చియు నుపన్యసించి, శాఖాభేదములను వెగడి అన్యోన్యవివాహసంబంధములను గూర్చుకొనవలెనని చెప్పిరి. దీనికిఁ గొందఱామోదించిరి. వెంటనే వీరిదగ్గిరబంధువు లందఱును గార్యము చెడునని భావించి, మఱల మూర్తిసంఘమునకు మిత్రులైరి. అప్పుడు ప్రమాణపత్రికలు వ్రాయించుపద్ధతి ఏర్పడెను. అదిమొదలుకొని నాలుగంతర్భాగములవారికినిఁ గొన్ని పరస్పరవివాహములు జరుగ నారంభించెను. వీరిలో మూర్తి సంఘేతరులుగా నుండువా రొకతెగగాను, సంఘీయు లొకతెగగాను అయినను, కని వారును మూర్తివారును నిశ్శేషముగా నీసంఘమునందుఁ జేరి యొక్కశాఖయేయయిరి. భట్రాజులును, సౌరులును గొందఱిందుఁ జేరియున్నారు.

ఈవిధముగా నీనాలు గంతర్భాగములనుజేర్చి నారాయణమూర్తిగారు ఒక్కకులమో యనున ట్లొనరించిరి. ఈమూర్తి కులమునందు పట్టుదలగలవా రనేకులున్నారు. ఆంతరంగిక సభికులలోఁ గొందఱు తమ యిక్కట్టుల కోర్చికొని తల్లిదండ్రులను, అన్నదమ్ములను గూడఁ ద్యజింప వలసి వచ్చినది. కాని వీని యన్నిటి కంటెను శ్లాఘనీయమైన దొక్కటి గలదు. సాధారణముగా సంఘసంస్కరణములకు దూరగులై యజ్ఞానాంధకారములోఁ బడి కొట్టుకొను చుండుట హిందూ యువతులకు సామాన్యధర్మమైనను, నీ సంఘములో స్త్రీలు తమంతట తాముగా వచ్చి చేరి, తమ భర్తలకు మార్గదర్శకులై వారి నీ సంఘములోఁ జేర్చుచుండుట మిక్కిలి సంతోషకర మైనది. నిశ్చయముగా స్త్రీలు చేయఁబూనిన సంస్కరణములు తప్పక కొనసాగును. స్త్రీల బలమివలననే గదా, విద్యాగంధముగల పురుషులుగూడఁ దమయుత్కృ

ష్ట మనోభీష్టములను వెగనాడి, చిన్ననాఁటి సంస్కరణములను జేయుదమని యనుకొన్న యూహను బోనడఁచి, దురాచారపరాయణత్వమున కొడిగట్టుట. ఒక్క మన యాంధ్రదేశములోనే స్త్రీల బలిమివలన పసిప్రాయమునాఁటి సంస్కర్తలు వయసుకాలము నాఁడు నిరతాగ్నిహోత్రులయి వెలయుచుండఁగా నితర ప్రదేశముల స్థితి యంత కెక్కుడుగా నుండదు గదా! అట్టిస్థితిలో స్త్రీలే ముందునకు వచ్చి సంస్కరణము వలదని మాటలాడు తమభర్తల నీసంఘములోఁ జేరునట్లు చేయుట ఎంతటి మహాభాగ్యమో. ఈ విషయమునందు మూర్తిసంఘీయుల సంస్కరణములు హిందూదేశములోని స్త్రీల కొకసువార్తను బ్రకటించుచు, సంఘసంస్కరణమునకు బురుషుల బలిమియు స్త్రీల బలిమియుఁ గూడ నత్యంతావశ్యకము లన్న దొడ్డనీతి నొకదానిని నేర్పుచున్నవి. అత్తగోడండ్రలోఁ గడపటివా రొకప్పుడు సంస్కర్తలై మంచివలనఁ దమయత్తలనుగూడ సంస్కరణమార్గములకు దింపుచున్నారు. ఇంటివద్దఁ దలిదండ్రు లెంతవలదని వారించినను గొందఱు బాలురు కేవల సంస్కరణపరాయణులగుచున్నారు.

ఉన్న పూర్వాచారములను ద్యజించి, సంస్కరణాచారములను నెలకొల్పి, సంఘములోని యంతశ్శాఖలను నొక్కటిగాఁ జేసిన నప్పుడది నూతనమతమువంటిదే యగును. మతగురువులగు భట్టరాచార్యులవారు వీరిని బహిష్కరించిరో యనునట్లు ఈ సంఘములోఁ జేరని యితరులు వీరినిఁ జూచుచున్నను బహిష్కారపత్రికలు వీరికివెల్లడిగాయినట్లు తోఁచదు. మతగురువు లెట్లున్నను, ఈసంఘమువారుమాత్రము వారితోడి జోక్యమించుకేనియు లేకయే, తమతమ వైదికకార్యములను, సంస్కరణములను జేసికొనుచున్నారు. దీనివలన నిది మతాంతరసంస్కరణముగానే నెగడవలసియున్నది. దీని కనుగుణ్యముగా మామిత్రు లొక్కరు “గురువు లట్టియాజ్ఞ నిచ్చిరేని, గురువుగారికిఁ దిలోదకములు విడుచుటకు సభికులు సంసిద్ధులై యున్నార”ని వ్రాయుచున్నారు. ఈ కారణమువలనను మత సిద్ధాంత భాగమునందు నిజమైనమార్పులులేనందునను మతసంస్కరణమని పిలుచుట కంతగా ననువుపడని ఈ మతాంతరసంస్కరణమును మతవిషయికసంస్కరణములకు ముందు మేము చెప్పవలసి వచ్చినదిగదా. మూర్తిగారి యింట నొక శుభకార్యము జరిగినప్పుడు పురోహితులు తాము రామని చెప్పఁగా, నారాయణమూర్తిగా రంతియు చాలునని తమశుభకార్యములను మంత్ర రహితముగాఁ దామే నెఱవేర్చుకొని శుభాశుభకార్యముల కన్నిటికిఁ దమవిజ్ఞానవర్ధనీ సభికుల కా మార్గమునే చూపిరి. తరువాతఁ గొంతకాలమునకుఁ బురోహితులు హితులయినప్పుడు, మూర్తివారు కొందఱు తమ క్షత్రియసాంప్రదాయమునుబట్టి వేదోక్తవివాహకర్తలను గోరుకొని కొన్నివివాహము లట్లే జరిగించిరిగాని, నారాయణమూర్తిగారికట్టి స్వాభిమానము లేనట్లు తెలియుచున్నది.

ఈసంఘము వారిలో నందఱును మద్యమును మాంసాహారమును బరిత్యజింప వలెను. సభవారి యనుజ్ఞలేక యెవ్వరుగాని వివాహములనుజరిగించరాదు. క్షత్రియులలో నతిబాల్య వివాహాచారములు లేనందున బాలికకుఁ బదియేండ్లలోపునను బాలునకుఁ బదురెండేండ్లలోపునను వివాహము జరిగింపఁ గూడదన్న క్షత్రియసాంప్రదాయములగు వీరి సంఘవిధిని మాత్రము మఱి కొంతకాలము వఱకు హెచ్చించుట యుక్తమని నేము భావించుచున్నాము. వీరియందుఁ గన్యాశుల్కములును వరదక్షిణలును లేవు. భోగకాంతావిముఖతయు, స్త్రీవిద్యాభిరతియు రజస్వలా వివాహములును నీసంఘీయులలో నిషేధింపఁబడలేదు. ఆశౌచమునం దిరువది రూపాయలకెక్కుడు మొత్తమును గర్చుపెట్టరాదని యొకవిధిగలదు. శుభకార్యములు జరుగునప్పుడు వీలునుబట్టి యు సంఘమునకుఁ గొంతధనమును జెల్లింపవలసి యుండును. కాని యీరీతి సంస్కరణములంత బాధకమైనవిగావు.

ఎట్లున్నను నొకనూతనమత మట్లు వీరు గురువుల జోక్యములేకయే చేయుచున్న యీసంస్కరణముల కనుపగు కఠినసంస్కరణములనుగూడఁ గొన్నిటి నారంభించుట యుక్తమని తలఁచుచున్నాము. ఏకసంఘీయులుగానున్న వీరిలో స్త్రీపునర్వివాహములు మొదలగు కఠినసంస్కరణములు సహితము ఆదియందలి కష్టము లెట్లున్నను నిరాతంకముగా సాగఁ గలవు. బ్రాహ్మణులతోడి సంబంధబాంధవ్యములను జేసికొనవచ్చునని తీర్మానించిన వీరు తప్పక ధైర్యసాహసములు గలవారిని మేమూహించుచుండుటచే, ఇట్టివారిచేత నెట్టిసంస్కరణమైనను నిరాతంకముగా సాగఁ గలదు.

మూర్తిసంఘీయుల చరిత్రము కేవల మతవిషయికసంస్కరణములకును, సామాన్యసంస్కరణములకును మధ్యమునం దుండుటచే, నిది యీరెంటినిఁ గలుపుచున్నదని వెనుకనే చెప్పియున్నాముగదా. రాజపుత్రస్థానమునందలి వాల్టరీకృతరాజపుత్రహితకారిణీసభలోనిరీతి సంస్కరణములనే యీమూర్తిసంఘమువారును జేయుచున్నారు. సామాన్యసంస్కరణములను దాఁటి మతవిషయముల కించుక యెడమిచ్చిన యీప్రకరణము తరువాతఁ గేవలమతవిషయికసంస్కరములనుగూర్చి చెప్పఁబోవుచున్నాము. ముందు ప్రకరణమునం దార్యసమాజమతస్థాపకుఁ డగు శ్రీదయానందసరస్వతిస్వాములచరిత్రమునుగూర్చియు, నాయన స్థాపించిన యార్యసమాజమునుగూర్చియుఁ బ్రస్తావింపఁబడును.

పదునాలుగవ ప్రకరణము.

మతవిషయిక సంస్కరణములు.

దయానందసరస్వతి : ఆర్యసమాజము.

పందొమ్మిదవశతాబ్దమునందు హిందూదేశమున జరిగినరీతి సంస్కరణములలో నగ్రగణ్యమైనది మతవిషయములతో దీనినిఁ జేర్చి నూతనసంఘమును సృష్టించుటయని వెనుకటిప్రకరణమునందు వ్రాసియున్నాము. మతమనునది జనులకు ఆముష్మికవిషయములందు గాఢవిశ్వాసమును గలుగఁ జేయునుగాన, దీనిబలిమి యత్యుదారమైనది. మతముతో సంబంధముగల యాచారములు మీఱరానివై వానిని మార్ప యత్నించువారిని సాంఘికులకు బద్ధద్వేషులను జేయును. మతవిషయములే క్రీ.శ. 1100 ప్రాంతములందు క్రూసేడు లనఁబడు మహాయుద్ధములను క్రైస్తవులచేఁ జేయింప నారంభించినది. ఈయుద్ధములు కొన్ని వందలయేండ్లవఱకునుగూడ జరిగినవి. మతాచారములే మహమ్మదీయులను ఖడ్గహస్తులనుగాఁ జేసి స్వమతవ్యాపకమునందు వారి కపరిమితమైన ధైర్యోత్సాహములను నూల్కొల్పినవి. మతధర్మములే ఐరోపాయందు రాజాభిప్రాయముతో నేకీభవింపనివారినిఁ గ్రూరముగాఁ గాల్పించివేసినవి. 1900వ సంవత్సరమున నారంభింపఁబడిన చీనాయుద్ధమునకును ముఖ్యకారణములు మతవిషయములే. వీనివలననే మనహిందువులుగూడ నూతనాచారముల కింతటి ప్రబలవిద్వేషులై సంస్కర్తలను హింసపెట్టుచున్నారు. ఈవిధముగాఁ బ్రపంచచరిత్రమును విమర్శించినప్పుడు మతమునందలి నమ్మికగలవారు యెట్టికష్టములకైనను జంకక, లాటిమర్ మొదలగువారివలె ప్రాణముల కయినను దెగించి యుండుట మనకుఁ దెలియవచ్చును. నాగరికత అభివృద్ధిగాంచినకొలఁదిని వీనిలోని క్రూరత్వము తగ్గుచు వచ్చినను పట్టుదల మాత్ర మింతవఱకు నశించిన ట్లెందును దృష్టాంతములు గానఁబడవు. ఈకారణముల వలన హిందూసంఘమునుండి సత్కార్యాచరణ మహాపాతకమునకయి యావలకు నెట్టఁబడిన మాననీయు లెల్లఱును నొకసంఘముగాఁ జేరి, సంస్కరణవిషయములను మతాచారములనుగాఁ జేర్చినయెడలఁ గలుగులాభములు ప్రతివారికినిఁ గరతలామలకము లగును. సంఘసంస్కరణము నంతగాఁ బాటింపకున్నను, తనతరువాతివారలు దాని ననుసరించుట కనువగురీతిగా మతసంస్కరణము చేసిన దయానందసరస్వతీ స్వాములవా

రినిఁ గూర్చియు ఆర్యసమాజమును గూర్చియు నీప్రకరణమునందు మేము చెప్పఁబోవుచున్నాము.

ఆర్యసమాజమతస్థాపకుఁడైన యీమాననీయుఁడు క్రీ. శ. 1824 సంవత్సరమున కత్తియవాడిదేశములోని యొకయుదీచ్యబ్రాహ్మణకుటుంబమునందు జన్మించెను. చిన్ననాఁటినుండియు విద్యాభ్యాసమునం దాసక్తిగల యీతనికైదవయేటనే యక్షరాభ్యాసము చేసి తల్లిదండ్రులు విద్యను జెప్పించుచుండిరి. ఎనిమిదవయేట నుపనయనమయిన వెనుక యీతఁడు యజుర్వేదము, రుద్రాధ్యాయము మొదలగు గ్రంథముల నభ్యసించుచు, తనకు పదునాలుగేండ్లు వచ్చునాటి కప్పుడే యజుర్వేదమును, తక్కినవేదములలోని ముఖ్యభాగములను శబ్దరూపావళి, వ్యాకరణము మొదలగువానిని, కంఠోక్తిగా వల్లెవేయఁ గలిగెను. తనకుమారుని గొప్పజ్ఞానినిగాఁ జేయవలె నను తలంపుతో నీతని తండ్రియు నితనిని దేవాలయాదులకును బుణ్యక్షేత్రములను గొనిపోయి, యందలి మహిమలను దెలుపుచు శివుఁ డొక్కఁడే పూజార్హుఁ డని పలుమాఱు బోధించుచుండెను. ఎక్కడెక్కడ శివపురాణకాలక్షేపము జరగుచున్నను, అక్కడ నీపితృపుత్రు లిరువురును దప్పక భక్తితోఁ జేరియుండెడివారు.

ఇట్లుండఁగా నొకయేటి శివరాత్రినాఁ డీతనితండ్రి ఇతనిచే లింగపూజను జేయింప నుత్సహించి యుండెను. ఆచారముప్రకారముగా నాదినమున నుపవసించి, రాత్రి దేవాలయమునఁ బురాణకాలక్షేపముతో జాగరణము చేయవలసి యుండుటచే, పసివారల కీవ్రతాచరణ మేలనని తలఁచి యీతనితల్లి తనభర్తను వారింపఁ బూనెనుగాని, యందువలనఁ బ్రయోజనము లేకపోయెను. ఆదినమున నీతఁ డుపవసించి, రాత్రి రెండుజాములవఱకు అత్యంతభక్తితో జాగరణము చేయునప్పటికే గుడి యర్చకులును ఇతరభక్తులను గర్భగుడి వెడలివచ్చి యావల గుఱ్ఱులుకొట్టి నిద్రఁబోవుచుండిరి. ఆరాత్రి కునుకుపట్టినయెడల తనపుణ్యమంతయు వ్యర్థమైపోవునన్న భయముచే నీబాలుఁడుమాత్ర మప్పుడప్పుడు చన్నీళ్ళతోఁ గండ్లను దుడిచికొని నిద్ర నాపుకొనుచుండెను. ఇంతలో నీతనితండ్రిగూడ నిద్రపోయెను. ఆసమయమునం దాదేవాలయములో మేల్కొనియున్నవాఁ డీబాలుఁ డొక్కఁడే.

ఇట్లొంటిపాటునఁ గూరుచుండి యుండఁగా నాతనిమనస్సు పరిపరివిధములఁ బరిభ్రమింపఁ జొచ్చెను. "వృషభవాహనముతోఁగూడ నిచ్చోట నిలిచియున్న మానవనిర్మితమైన యీవిగ్రహము, క్షుత్పిపాసలను నిద్రావిహారములను గలిగి, ఢమరుకమును ప్రయోగించుచు జనులకు శాపములు పెట్టునట్లు మనపురాణములన్నిటియందును జెప్పఁబడిన కైలాసనాథుఁడును, దేవతాశ్రేష్ఠుఁడును, ఆదిమూర్తియు, నైన యాసాంబశివుఁడే కానేర్చునా? ఈమట్టివిగ్రహమే జీవచర్యలుగల యామహాపురుషుఁడా!" యని యాతఁ

డు విచారింపసాగెను. ఇట్టియభిప్రాయములనుండి మఱలలేక యాతఁడు వెంటనే తనతండ్రిని నిద్రలేపి, 'మన మిక్కడఁ జూచు నీవికారస్వరూపమును మతగ్రంథములలోని మహాదేవుఁడును నొక్కటియేనా' యని ప్రశ్నించెను. ఆకస్మికముగా నిట్లు తన్నడిగిన యీప్రశ్నమునకు విస్మయపడి నీవేల నన్నిప్రశ్నము నడుగుచున్నావని యాతనితండ్రి యడిగెను. "సర్వాంతర్యామియు, చేతనస్వరూపుఁడును నగు భగవంతుఁడును, ఎలుకపిల్లలు వచ్చి తనమీఁద ప్రాఁకి తనపవిత్రశరీరమును మైలఁబఱుచుచున్నను గూడ నించుకయిన నోరు మెదిలించి యది కూడ దని బోధింపక మొద్దువలె నిలిచియున్న యీవిగ్రహమును నొక్కటియే యనిసమాధానపఱుచుకొనుట నాకసాధ్యముగా నున్నద"ని యీ బాలుఁడు ప్రత్యుత్తర మిచ్చెను. తండ్రి ఏమో కొంత బోధింపఁబోయెనుగాని యది యీతనికిఁ దృప్తికరముగా లేదు. దీనియం దేదో యొకమోస మున్నదని యాతనికిఁ దోఁచెను. ఉదయమునుండియుఁ దిండి లేమిచేఁ గడుపులో మాడుచున్నందునను గడుబడలి యున్నందునను, ఆతఁడు భుజింపవలదని తనతండ్రి వారించుచున్నను వినక యింటికిఁబోయి కొంతఫలాహారమును జేసెను. ఇదియె యాతఁ డొనర్చిన ప్రథమసంస్కరణము.

మఱి రెండేండ్లలో నిఘంటువు, నిరుక్తము, పూర్వమీమాంస మొదలగువానినిఁ బూర్తి చేసి, యీతఁడు షోడశవర్షప్రాయుఁడై యున్నకాలములో నీతని చెల్లెలి కొకరాత్రియందాకస్మికముగా వ్యాధి సోఁకి నాలుగుగడియలకాలములో మరణమునందెను. ఆసాయంత్రమునఁ భోగకాంతల నృత్యము చూడఁబోయిన యీబాలుఁ డింటికి వచ్చునప్పటి కీవిషాదవార్త వినఁబడఁగానే యేమియుఁ దోఁచక 'ఈప్రపంచమునందు జీవించు నొక్కరుగాని మరణదేవతనుండి విముక్తులు కాలేరు. ఏక్షణముననో నేనును అట్లు చనిపోవుదును. మరణమునకు సంబంధించిన మానవసామాన్యమగు దుఃఖమునుండి విముక్తి నందఁగల ముక్తిసాధనమున కేనేమి చేయుదును" అని విచారింపఁ జొచ్చెను. ఇంతలో నీతని నధికముగా నాదరించుచుండెడు మేనమామ యొకఁడుగూడఁ జనిపోవుటచే నీతఁడు మఱియు విరక్తుఁడు గాఁ జొచ్చెను.

ఇంతలో నీతని తల్లిదండ్రు లీతనికి వివాహమును జేయఁబూనిరి. ఎట్లో వారిప్రయత్నములను గొంతకాలమువఱకాపి, చేరువనున్న యొకపండితునివద్ద మఱి కొన్నిశాస్త్రము లభ్యసించి, క్రీ.శ. 1846వ యేట వివాహము నిర్బంధముకాఁగా నొకనాఁ డర్ధరాత్రమున తప్పించుకొనుటకై యీతఁడు పాఱిపోయెను. రాజమార్గమును విడిచి, తన తండ్రి కావలివారు తన్నుఁ బట్టుకొననేరని త్రోవల నీతఁడు బోవుచుండఁగా మార్గమధ్యమునఁ గొందఱు విప్రోత్తము లెంతయిచ్చిన నంతపుణ్యమని చెప్పుచు నీతని శరీరముమీఁది మురుగులు, ఉంగరములు, మొలత్రాఁడు మొదలగు నాభరణముల నన్నిం

టినిఁ బ్రతిగ్రహణముచేసి యీతనికిఁ బుణ్యమును గట్టిపెట్టిరి. ఈబరువు వదలఁగానే యీతఁడు సాయాలియను నొకపట్టణమునకుఁబోయి, అచ్చట లాలాభగవత్ అను నొకసన్యాసి నాశ్రయించి, బ్రహ్మచర్యాశ్రమమును, కాషాయివస్త్రములను స్వీకరించి, శుద్ధచైతన్యుఁ డను నామమును వహించి అహమదాబాదు నగరప్రాంతములకుఁబోయెను. అచ్చట నీతని నెఱిఁగిన యొకవైరాగి యితనివేషమున కాశ్చర్యపడి మంచిమాటలతో నీతఁ డెక్కడకుఁ బోవుచున్నదియుఁ దెలిసికొని, వెంటనే యితని తండ్రి కుత్తరము వ్రాసెను. ఆలేఖ ననుసరించి యీతనితండ్రి తిన్నఁగా సిద్ధపురమునకువచ్చి, అందలి తన వైరాగిపుత్రునిఁగాంచెను. తనతండ్రి తన్నుచూడఁగానే శుద్ధచైతన్యుఁ డాతనిపాదములపైఁబడి నమస్కరించి, తనతప్పును క్షమింపుమని వేడుకొని, తా నింటికిఁ బ్రయాణము కాఁబోవుచుండఁగానే మీరునువచ్చినారని నాలుగిచ్చకపుముక్కలను జెప్పి, తిన్నఁగా యింటికిఁ బ్రయాణమాయెను. ఆదినముననే తెల్లవాఱుజామున మూడుగంటలకు పారావాఁడు నిద్రించుచుండఁగా నీబాలుఁడు మఱలఁ బాఱిపోయి, యొకదినమంతయు నొక మఱ్ఱిచెట్టులోఁ దాఁగుకొని, తఱువాత భద్రమైన యొకమార్గమున బరోడా నగరమునకుఁబోయి యక్కడ చేతనమఠమునం దద్వైతసిద్ధాంతము నామోదించెను. అక్కడనుండి చానోదకన్యాలి యనునొకప్రదేశమునకుఁబోయి యచ్చట నిజమైన యోగీశ్వరులనుగాంచి, అందు పరమానందపరమహంసులవారి శిష్యుఁడై వేదాంతసారము, వేదాంతపరిభాష మొదలగువాని నభ్యసించెను. తనజన్మనామముతో వ్యవహరింపఁబడునెడ తనయునికి మఱల తలిదండ్రులకుఁ దెలియవచ్చు నన్నభయముచేతను, ప్రకృతపుటాశ్రమమునఁ దానే పచనము చేసికొనవలసివచ్చుటచే విద్యాభంగము కలుగుచున్నందునను ఈతఁ డీకాలమునందు సన్యాసాశ్రమమును దీసికొనఁగోరెను. కాని కడుబాల్యుఁడగుటచే నెవ్వరును ఇందునకు సమ్మతించలేదు. ఇట్లుండఁగా నొకనాఁడు శృంగేరిమఠమునుండి యిద్దఱు దక్షిణపండితు లక్కడకువచ్చిరి. వారి నాశ్రయించి యీతఁడు దయానంద సరస్వతియను నామమును ధరించుకొని సన్యాసియయ్యెను. నాటినుండియు నతఁ డా నామముతోనే వ్యవహరింపఁబడుచున్నాఁడు. తనవారు తన్ను మఱల స్వగృహమునకుఁ గొనిపోవుదు రన్నభయముచే నీతఁడు తనమొదటిపేరును నెవ్వరికినిఁ దెలుపక తానువ్రాసిన తనచరిత్రమునఁగూడ నుదహరింపక యూరకుండుటచే దయానంద సరస్వతియాశ్రమస్వీకారమునకుఁ బూర్వమున నేమిపేరుకలిగియుండెనో, ఇతని తలిదండ్రు లెవ్వరో, ఇతని జన్మపుర మెద్దియో యెవ్వరికినిఁ దెలియదు.

ఈసమయమునందే దయానందసరస్వతికి యోగవిద్యాభ్యాసము చేయవలెనన్న తలం పొక్కటి కలిగినది. తోడనే వ్యాసాశ్రమమునకుఁబోయి యోగానందునివద్దఁ

గొంతయభ్యాసముచేసి, అటుదరలి ఛినోరులోని కృష్ణశాస్త్రివద్ద వ్యాకరణశాస్త్రమునందుఁ బూర్ణప్రజ్ఞనుపహించి, పిమ్మట ఇద్దఱు యోగులవలన నితరవిషయములను సేకరించికొని, ఇంకను దృప్తినందక, రాజపుత్రస్థానములోని ఆబుపర్వతములలో గొప్పగొప్ప యోగులు కొందఱున్నారని విని వారికడకుఁబోయి భవానగిరి కొండలలోవారిని దర్శించి శుశ్రూషచేసి యోగమును నితరశాస్త్రములనుఁగూడ గొంతవఱ కభ్యసించి, 1849వ సం॥రమున హరిద్వారములోని కంఖాట్ మెలలోఁ జేరెను. తఱువాత కొంతకాలము ఖాండారణ్యములో యోగాభ్యాసముచేసి, హృషీకేశమునకు వచ్చినప్పు డొకవింత జరిగినది.

ఆప్రదేశమునందుఁ బంచ మకార సేవకులగు కొందఱు తంత్రవాదులుగలరు. వారిలో నొకబ్రహ్మచారి యొకదినమున దయానందసరస్వతినిఁ దనయింటి భిక్షకాహ్వానము చేసెను. దయానందుఁడును దానినంగీకరించి యచ్చటికిఁబోయెను. ఈతఁ డా గృహము చేరుసరికి, త న్నాహ్వానము చేసిన బ్రహ్మచారివాకిట జంతువుల కండలను దఱుగుచుఁ గూరుచుండెను. ఇంటియందుఁ గొందఱుపండితులు వేఱువేఱువిధముల పచనము చేయఁబడినమాంసములను దమవద్ద నిడుకొని కూరుచుండిరి. ఆప్రదేశమునందు నిలువలేక దయానందసరస్వతి తన యాశ్రమమునకుబోయెను. తఱువాతతంత్రములు వీరి కాధారగ్రంథములని విని వానినిఁ జదివిచూచెనుగాని యందలి పంచమకారములును (మద్యమాంసమత్స్యాదులు) గడుహేయము లగుటచే నాతనికి వానియెడ నీచభావమే కలిగినది.

ఎంతమందివద్ద విద్య నభ్యసించినను నీతని కింకను తృప్తికలుగలేదు. ఆకారణమువలన నీతఁ డొకనాడు ఎక్కడనో కొందఱు మహర్షులున్నారని విని, కొండలను, అడవులను బాటింపక యొకదారినిఁబోయి, దారిలేని యొకఘోరకాంతారమునందు జిక్కుపడవలసివచ్చెను. మఱియొకసారి నర్మదానది పుట్టుచోటఁ గొందఱు మహర్షులు కలరని విని, అడవులలోను ముండ్లలోను బడి శరీరమంతయు గాయము లగుచున్నను, బుసలుకొట్టుచు పాములు తిరుగుచున్ననుగూడ జడియక యొక్కఁడుగా నక్కడకుఁ బ్రయాణముచేసి, ఎవ్వరునుబోవ సాహసింపని యాచోటికేగి అం దెవ్వరు నట్టివారు లేరని తెలిసికొనివచ్చియున్నాఁడు. వేఱొకసారి హిమవత్పర్వతప్రాంతములకుఁబోయి అలకనందనది పుట్టుచోటును గనిపెట్టి పైనఁగూడఁ బ్రయాణముచేసి బహుకష్టముల నందవలసివచ్చినది.

ఈవిధముగా నీతఁడు జ్ఞానమును, విద్యను సంపాదించుకొన్నతఱువాత యోగశాస్త్రమునందు దనకుఁగల కొన్నిసందేహము లెంతకును దీఱకుండుటచే, యోగగ్రంథ

ములను గేలఁగొని గంగానదీతటమునఁ బ్రయాణము చేయుచుండఁగా నక్కడ నొక శవము ప్రవాహవేగముచేఁ గొట్టుకొనిపోవుచుండెను. ప్రత్యక్షనిదర్శనములవలనఁ దన సందేహములను నివృత్తిచేసికొనవలెనను నుద్దేశముతో నీతఁడా శవమును గట్టునకు లాగి తన బ్రాహ్మణత్వమును బాటింపక దానినిఁ గోయనారంభించెను. తాను నిరంతరమును బారాయణము చేయుచున్న గ్రంథములందు నాడీచక్రాదులనుగూర్చియు, వాని వ్యాపకమునుగూర్చియు సంపూర్ణమునైన వర్ణనము లుండుటచే వాని నన్నింటిని, నీశవమునఁ జూడఁగానే తనసందేహప్రదేశములలోని విషయములు తెలిసి, తనకు దివ్యమైన యోగజ్ఞాన మలవడునని యీతఁ డుద్దేశించి, తలలోనిశాస్త్రమునకు సంబంధించినభాగమును, మెడను, గుండెలనుగోసి జాగ్రతగాఁ బరీక్షింపఁబోయెనుగాని, గ్రంథకారుల తత్త్వములకును, మానవులశరీరమునకు సంబంధము లేకపోవుటచే, నాపుస్తకములలోని విషయము లా మానవశరీరమునందుఁ గానరావయ్యెను. ఎంతపరీక్షించినను లాభము లేకపోవుటచే, ఈగ్రంథములన్నియు నసత్యకల్పనములని తెలిసి, ఇంతకాలము వ్యర్థముగా వీనియందు గాలముగడిపితినిగదా యని దుఃఖించుచు ఆగ్రంథములను జింపివైచి గంగానదిలో నూరఁద్రొక్కెను.

ఈతఁడీవిధముగా కుత్సితయోగములను దెగనాడి సంచరించుచున్న యాకాలములోనె మఱియొక వింతయైన సంగతిజరిగినది. చండలగిరిపట్టణప్రాంతములందుఁ బ్రసిద్ధమైన యొకశివాలయము గలదు. అందలి నందివిగ్రహము ప్రజలతో మాటలాడను, వారిచ్చు నైవేద్యములను భక్షింపను నేర్చియుండెను. ఈయాలయమున నీపెద్దనందికడ నొకనాఁ డీతఁడు సంచరించుచుండఁగా నందొకమనుష్యుఁడు డాగియున్నట్లు కానవచ్చెను. అప్పుడు చీఁకటిగానే యున్నను, ఈతఁడు భయపడక ఒకకన్నము గుండ ఆనందికడుపులోనికి చేతినిఁ జాచెను. అప్పుడందున్న మనుష్యుఁడు భయపడి పాఱిపోయెను. మిక్కిలి చలిగానున్నందున దయానందసరస్వతి యానందిపొట్టలో డాగి కూరుచుండెను. ఉదయమున నొకగొల్లది కొంతపులిపెరుగు నీతనికి నైవేద్యముగా నర్పించెను. తానుభంగుత్రాగుట కలవాటుపడినందున శరీరము నావహించియున్న మైకమా పులిపెరుగు మహాత్మ్యమువలనఁ బోఁగొట్టఁ బడుటచే నప్పుడు దయానందసరస్వతి యాచెడ్డయలవాటును పూర్ణముగా వదలిపెట్టుటకు నిశ్చయించెను.

ఈవిధముగా దేశసంచారమును జేసి సంస్కృతభాష కపరావతారమోయనునంతటి దివ్యజ్ఞానమును సంపాదించుకొని ఈమహనీయుఁడు పురాతనప్రమాణగ్రంథముల నన్నింటిని విమర్శించి, తుట్టతుదకు ఋగ్వేదమొక్కటియే యుత్తమప్రమాణమని సిద్ధాంతము చేసికొని తననూతన మతధర్మముల నన్నింటిని నిర్ధారణముచేసి, పూర్వమతములను విడువవలసినవాఁ డయ్యెను. ఇది దయానందసరస్వతి జీవితములోని ప్రథమావస్థ.

దీనితఱువాత నీతఁడు తనమతధర్మవ్యాప్తికై విశేషముగాఁ బనిచేసి, పూర్వ హిందూమతములను, క్రైస్తవ మహమ్మదీయమతములను ఖండించుచు, పండితులతో వాద ప్రతివాదములనుజేసి, వారలనోడించుచు, వివిధప్రదేశములందు సభలనుజేసెను. కాశీ, అలహాబాదు, లాహూరు మొదలగు ప్రదేశములందును ఇంకను నంతగా భూగోళశాస్త్రమునందుఁ బ్రసిద్ధినందని యితర ప్రదేశములను ఈతఁడుపన్యాసములను, వాదములను సలుపఁగా వేలకొలఁదిజను లీయన చుట్టును గుమిగూడి యీతనిమతము నవలంబింపఁజొచ్చిరి. విగ్రహార్చనము నిషిద్ధమయినదనియు, ఋగ్వేదమొక్కటియే ఈశ్వరదత్తమైన గ్రంథమనియు, దాని కితరులుచేసిన యర్థములు వేదనిఘంటువులకును, వ్యాకరణమునకు విరుద్ధముగా నున్నవనియు, యితర మతగ్రంథములన్నియు వేదవిరుద్ధములును కుత్సితకల్పితములుననియు నీతని ముఖ్యవాదము. ఋగ్వేదములోని సంఘమతాచారములే యీతని మతధర్మములు. దానికి విరుద్ధముగా నుండని మతగ్రంథము లేవేని యున్నయెడల యవియును నాదరణీయములే.

ఈరీతి బోధనలవలన దేశమంతయు నల్లకల్లోలమయ్యెను. పెక్కండ్రు మహాపండితులును, స్వమతములపైని యీతఁడు తెచ్చినయాక్షేపములను సమర్థించుకొననెంచు క్రైస్తవాదులును నీతనికిఁ బ్రతికక్షులై వాదములు జరుపనారంభించిరి. కాని యీతని మతవ్యాప్తికవి ఏవియు ప్రబలనిర్బంధములు కాలేదు. దాదాపు 20 సంవత్సరములు మతబోధకులుగానున్న కాలములో దయానందసరస్వతీస్వాములవా రొక్కనాఁడైనను వాదప్రతివాదములను జరుపకుండ నుండలేదు. ఈ విధముగా పండితసింహమై యీతఁడు మతవ్యాప్తిచేయుచున్న కాలములో, నితరపండితు లీతని ప్రతిభకును, ధాటికిని ఆఁగలేకఁ 1881 వ సం॥రము జనవరినెల 22 తేదిని దేశదేశములనుండి 300 వందల మంది శాస్త్రజ్ఞులను, 400 మంది గొప్పగొప్ప జమీందార్లను మహారాజులను, విఖ్యాతపురుషులను, నితరులను బిలిపించుకొని, యాసభకు దయానందసరస్వతీస్వామినిఁ బిలువకయే యీతఁడు చెప్పినవన్నియు నసత్యములని తీర్మానించికొని సంతోషించిరి. ఇట్టి యక్రమమైనతీర్మానమును హిందూదేశములోని స్త్రీపునర్వివాహాచారమున కాదిపురుషుఁడైన పండిత ఈశ్వరచంద్రవిద్యాసాగరుఁడుకూడ నామోదించుట కెంతయుఁ జింతించుచున్నాము. తమ కసత్యములుగాఁ దోఁచినవానిని గూడవని చెప్పుటలోఁ దప్పు లేకున్నను, పైరీతిసభ తీర్మానించినందున నవికూడవనిచెప్పుట యుక్తియుక్తముగాలేదు.

దయానందసరస్వతీస్వామి మతసిద్ధాంతములలో గొన్నిఁటి నిం దుదాహరింపనియెడల యీచరిత్ర మసంపూర్తిగా నుండునుగావున, వానిలోని ముఖ్యములయిన కొన్నిఁటిని క్లుప్తీకరించి యిందుక్రింద వివరించుచున్నాము.

2. భగవంతుఁ డొక్కఁడే పూజార్హుఁడు.
3. వేదములే నిజమైన జ్ఞానముగల గ్రంథములు.
5. మంచిచెడ్డలను విచారించి మొదటిదానినే చేయవలెను.
6. ఆర్యసమాజముయొక్క ముఖ్యోద్దేశము ప్రపంచమునకు మేలుచేయుట.
9. మాకాయుష్యము మా కారోగ్యమని యెవ్వరును బ్రవర్తింపరాదు.

కానిమాట లెప్పుడును చిరంజీవములుకానేరవు. అందువలన, దయానందసరస్వతి కవల వాగ్వాదములతోనే తనజీవనమును గడిపివేసినయెడల, ఆతని చదువును, జ్ఞానమును ఆతనితోడనే యంతరించునని భయపడి ఆర్యసామాజికు లాతనిని గ్రంథరచనకుఁ బురికొల్పిరి. ఇది యాయన జీవితములోని తృతీయావస్థ. ఒకముద్రాయంత్రమును కొందఱు వ్రాయువారిని ఆయనస్వాధీనమునం దుంచుటచే, దయానందసరస్వతి గ్రంథరచన కారంభించెను. ఆయన గ్రంథములు బహుసంఖ్యాకములై యున్నను వానిలో ముఖ్యమైనవి ఋగ్భాష్యమును, సత్యార్థప్రకాశికయు. ఈసమయముననే యీతఁడు పత్రికలలోఁ దనవాదములను ఖండించుచున్నవారి కుత్తరములనుగూడఁ బ్రకటించుచు వచ్చెను.

ఈతఁ డీవిధముగా గ్రంథరచనము చేయుచుండఁగా రాజపుత్రస్థానములోని, యుదయపురము మహారాజావా రీతనిని తమపురి కాహ్వానము చేసిరి. 1882వ సంవత్సరము ఆగష్టు నెల 11 తేదిని ఈయన యుదయపురములో నొకయుపన్యాసము చేసి, తరువాత నచ్చట పరోపకారిణీసభ యనునొకసంఘమును స్థాపించి, తరువాత షహపురి సంస్థానమునఁ గొన్నినాళ్ళు గడిపి, తిన్నఁగా జాడ్పూరు మహారాజావారి కోరికవలన నాప్రదేశమునకుఁ బోయెను. ఇక్కడనుండఁగనే ఈతని శరీరమునం దొకజాడ్యము ప్రవేశించినది. దానివలనఁ గొన్నాళ్ళు బాధపడి తుట్టతుద కీయన అబుపర్వతములందు 1883వ సం॥రము అక్టోబరు 30 తేది సాయంకాలమున ఈశ్వర సన్నిధానమున కరిగెను. ఈయనకు విరోధులు కొందఱు విషాహారమును బెట్టినందున మృతినందెనని మామిత్రులగు నార్యమతబోధకు లొక్కఁడు వ్రాయుచున్నారు.

ఈవిధముగా నూతన మతమొక్కటి స్థాపింపఁబడినప్పుడు తదవలంబకు లందఱును నందలి యాచారములను దప్పక యవలంబించుటచే, నవి జన్మపారంపర్యముగా వ్యాప్తములై యభివృద్ధిగాంచుచుండును. ఈరీతిసంఘాచారములే సంఘసంస్కర్తలయాచారములును నగునేని, వీరిలో సంఘసంస్కరణ మేతీరుననుండునో వివరింపవలెనా?

దయానందసరస్వతి ఎంతవిద్యావంతుఁడైనను, ఆయన వేదాచారములనుమాత్రమే పాటించెనుగాని, సంఘసంస్కరణమునుగూర్చి ప్రత్యేకముగా పనిచేయలేదు.

కాని యాయన స్థాపించిన నూతన సంఘమునందు సంఘ సంస్కరణమును గూర్చిన యాచారములు లేకపోలేదు. ఋగ్వేద కాలమునాటి యాచారము లన్నియు నందుఁ జేర్పఁబడియుండెను. దయానంద సరస్వతి కాలములో నార్యసమాజమువారు పదునైదేండ్లలోపు బాలికలకుఁ గాని 25 ఏండ్లలోపు పురుషులకుఁ గాని వివాహము జరుపఁగూడదని యాతఁడు సంస్కారవిధి చేసియుండెను. ఈతఁడే యిప్పుడు దేశమునం దెల్లకడలను నెల్ల మతముల వారిచేతను స్థాపింపఁబడుచున్న గోరక్షణసభలకాది కారణుఁడు. కాని యీతని కాలము నందార్యసామాజికుల సంఘమెట్లున్నను, ఈయన మృతినందిన తరువాత నందు నూతన సంస్కరణము లెన్నియేని యంకురించినవి.

దయానంద సరస్వతి బ్రహ్మక్షత్రియవైశ్యులను మాత్రమే యుపనయనార్హులనుగాఁ దనసంస్కార విధియందు శాసించినను నీతని తరువాతి వారు తమమతము భూజనుల కందఱకును గూడ ననుష్ఠింప నర్హమైనదానినిఁగాఁ జేసిరి. శూద్రుఁడైనను, మహమ్మదీయుఁడైనను క్రైస్తవుఁడైనను ఆర్యధర్మముల నంగీకరించు ప్రతిమానవుఁడును సంస్కారార్హుఁ డగుటచే, దయానంద సరస్వతి తరువాతివారు బ్రహ్మక్షత్రియ వైశ్యభేదమును గొట్టివైచి, స్త్రీపురుషభేదము లేక యెల్ల మతముల వారికిని నుపనయన సంస్కారమునుజేసి తమయందుఁ గలుపుకొనుచున్నారు. ఈకారణమువలన అన్యమత ప్రవిష్టులై తిరిగి స్వకులమునకు రాఁబోవువారికి ఆర్యసంఘము హిందూసంఘమువలె ప్రతిబంధములను గలుగఁ జేయుటలేదు. దేశవ్యవస్థలేక, ఆర్యాచారానుగమ్యులై నడచువారు ఆర్య సామాజికులే యగుటచే వారియందు సముద్రయాన నిషేధత్వము లేదు. మాంసభక్షణము చేయువారీ సంఘమునుండి వెలిఁద్రోయఁబడుదురు. దయానంద సరస్వతి కాలమునందే వీరిలో నతిబాల్యవివాహ దురాచారము పోయినది. తరువాత స్త్రీపునర్వివాహములుగూడ శాస్త్రసిద్ధములని శాసించి వీరు వానిని సంఘాచారములనుగా మార్చియున్నారు. కాని బలవంత మెక్కడను లేదు. వివాహమాడ నిష్టములేని స్త్రీలు తటాకమొదలగు పూర్వకాలపు స్త్రీలవలెనే చిరకాలబ్రహ్మచర్య వ్రతము ననుష్ఠింపవచ్చును. దయానంద సరస్వతియే యీసంఘమునందు త్రాఁగుడు మొదలగు దురాచారముల నన్నిటినిఁ గొట్టివైచియున్నాఁడు. ఈవిధముగా దయానంద సరస్వతి చనిపోయిన యీపదియేండ్ల కాలములోనే ఆర్య సంఘము పూర్ణముగా సంస్కరింపఁబడినది.

ఈసంఘము వారికిఁగల కార్యదీక్ష యపరిమితమైనది. 1875వ సంవత్సరముననే ఇదిస్థాపింపఁబడినను ఈస్వల్పకాలములోనే వీరు హిందూదేశములోని చాలభాగములోఁ బనిచేసి, పందొమ్మిదవ శతాబ్దాంతము నాటికి 500 సమాజములను స్థాపించియున్నారు. ఇవికాక ఐదు దేశీయసమాజములు కలవు. పాంచాలదేశమున కంతకును

లాహోరుపురమునను, పశ్చిమోత్తర రాష్ట్రములకును అయోధ్యకును మూరదాబాదునందును, రాజపుత్ర స్థానమున కమోఘ్యయందును, బంగళా బేహారరాష్ట్రములకు రంచియందును, బొంబాయికి బొంబాయి నగరమునందును గల యీసభలు విశేషముగా బనిచేయుచున్నవి. అన్నిటికంటె నెక్కుడుగా పాంచాలమునందుఁ బని జరుగుచున్నది. ఈయార్యుల బాలురకు విద్యాభ్యాసము చేయించుటకై, విశేషముగా కష్టపడి మునిషీరామ్అను నొక మహనీయుఁడు హరిద్వారమునందు గురుకులమను నొకపాఠశాలను స్థాపించియున్నాఁడు. జలాండరు గుర్జన్వాలా, లాహూరు, అమృతసరు, మొదలగు ప్రదేశములలో అత్యంతాభిమానులైన మహనీయులు పెక్కండ్రు పనిచేయుచున్నారు. ఈసంఘమువారు కష్టములకోర్చి ప్రాణములకైనను జంకక పూనికతో బనిచేయుచుండుటచేఁ గొందఱికి బలవంత మరణములు సంభవించినవి. అందు దయానంద సరస్వతీ స్వాములవారినిఁ గూర్చి యిదివఱకే వ్రాసియున్నాము. 1897వ సంవత్సరమున మార్చి నెల 6వ తేదిని దుర్మార్గుడైన మహమ్మదీయుఁ డొక్కఁడు పండిత లేఖారామును జంపివేసినప్పుడు ఆయన శవముతోఁగూడ 20,000మంది లాహూరు పట్టణమున శ్మశానము వఱకును వెంబడించి పోయి తమగౌరవోల్లాసములను జూపి యున్నారు.

తక్కిన సంస్కరణమార్గములకును, మతము పేరిట నీరీతిగా వ్యాప్తి జరుగుచున్న యీసంస్కరణమార్గమునకును గల భేదలాభములను బరిశీలించినప్పుడు మతము పేరిట సంస్కరణ మేరీతిని వ్యాపించుచున్నదో మనకు విశదము కాఁగలదు. ఆర్యమతము వ్యాపింపఁజేయుటయే వృత్తిగాఁ జేసికొని అందుకొఱకే పాటుచున్న మహనీయులు ప్రకృతమున మనయిండియాలో నలుబదిమంది యున్నారు.

ఈరీతిగాఁ బని చేయువారివలన ఆర్యమతమును దానితోఁగూడ సంఘసంస్కరణమును నభివృద్ధి గాంచుట కేమి లోపముండును. ఎక్కడెక్కడ ఆర్యసంఘములున్నవో అచ్చట నెల్ల సంఘసంస్కరణము మితిమీఱి జరుగుచున్నది. ఒకసారి 1892వ సంవత్సరమున నీయార్యసామాజికులు మహమ్మదీయమతమునందుఁ గలిసిన నూటయేఁబదిమంది హిందువులను తమమతమునందుఁ గలుపుకొనిరి. దానివలన నైన సంక్షోభ మెట్టిదైనను, లాభముమాత్రము విశేషమైనది. హిందూసంఘమునుండి యన్యమతములఁ జేరువారివలన నానాఁటికి మనవారిసంఖ్య తగ్గితగ్గి క్షీణదశకు వచ్చుచున్నదిగాని. మఱల వారినిఁ జేర్చుకొన్నయెడల నిట్టిరీతి నష్టములు రానేరవు గదా.

ఆర్యసమాజమువారి చరిత్రమును, వారిమతమునకును సంఘసంస్కరణమునకును గల యత్యంతసంబంధమును, వారివలన హిందూదేశమునకుఁ గలుగుచున్నలాభములను గూర్చి యీప్రకరణమునం దింతవఱకును జెప్పియున్నాము. ఆర్యమతస్థాపకుఁడు సంఘసంస్కరణమునుగూర్చి యెట్టి యభిప్రాయములను గలిగియున్నను, సంఘాభివృద్ధికిఁ బ్రతిబంధకములు కాని మతధర్మములనే యాతఁడు బోధించుచుండుటచే, నాతని తఱువాతివారు ఇంకను గొన్ని సంస్కరణములను జేసి, తమసంఘమును బాగుపఱుచుకొనజాలిరి. స్త్రీపునర్వివాహాదిసంస్కరణాచారము లన్నియు నార్యసామాజికులలోనే విశేషవ్యాప్తినిఁ గలిగియున్నవి. స్త్రీవిద్యాభివృద్ధికై కన్యామహావిద్యాలయ మను పేర హిందూదేశమునం దంతటను ప్రసిద్ధిగాంచిన బాలికాపాఠశాలను స్థాపించినవారీయార్యసామాజికులే. అది ‘లాలాదేశ్‌రాజ్’ అను నొకన్యాయవాదిగారి యాజమాన్యము క్రింద నున్నది. దీనరక్షకములగు కొన్ని సత్రములనుగూడ నీసంఘమువారు స్థాపించి, అందు తల్లిదండ్రులు లేనివారి కాహారాదుల నొసఁగుచున్నారు. అందు బరిలీ, లాహూరు అను ప్రదేశములలో నున్నవి మిక్కిలి పెద్దవి. ఇవిగాక వీరిచే స్థాపింపఁబడిన ప్రతికాలేజీయందును, హైస్కూలునందును ఈ దీనరక్షకప్రదేశములును, ఆర్యులకు భోజనశాలలునుగూడ నిర్మింపఁబడి యున్నవి.

ఈవిధముగా నార్యసమాజము దినదినాభివృద్ధిఁ గాంచుచు, సంఘసంస్కరణమున కాలవాలమై యున్నది. దక్షిణహిందూదేశమునందు ఉష్ణ మధిక మగుటచేతనో, ఇందలి జనులు కేవలస్వోదరపోషణాపరు లగుటచేతనో ఏసంస్కరణమును నభివృద్ధి గాంచకున్నను, ఉత్తరదేశమునం దివి మితిమీఱి ప్రబలుచున్నవి. ఆర్యసమాజమొక్కటియేకాక బ్రహ్మసమాజ మను నొకసంఘముకూడ మతము పేరిట సంఘసంస్కరణవ్యాప్తికిఁగూడ నాధారమైనదని యిదివఱకే వ్రాసియున్నాము. ఆర్యసామాజముకంటెనుగూడ నొకమెట్టుపై కెక్కి స్వమతమును స్థాపించుకొనియున్న యీబ్రహ్మసమాజము యొక్క సంఘచరిత్రాభివృద్ధులను ముందుప్రకరణమునందుఁ జెప్పఁబోవుచున్నాము.

పదునైదవ ప్రకరణము.

మతవిషయిక సంస్కరణములు.

బ్రహ్మసమాజము :—రామమోహనరాయలు.

సర్వవిధములగు సంఘసంస్కరణములను మతసంస్కరణములను నొక్కచోటఁ బోగుచేసి పెట్టినయెడల నది బ్రహ్మసమాజ మగునని పండ్రెండవ ప్రకరణమునందు మేము వ్రాసియున్నాము. పదునెనిమిదవ శతాబ్దమునందు శ్రీ రామమోహనరాయ

ఉదయమునం దున్నప్పటికి హిందూసంఘ మేరీతిగా వివిధ దురాచారముల పాలైయుండెనో హిందూమతమును నట్లే దుష్టసిద్ధాంతాదులకు లోఁబడి యుండెను. ఆకాలమున జను లందఱును మనల నందఱిని సృజించిన లోకేశ్వరుఁ డగు నానిరాకారుని యారాధనమును వదలి మట్టిబొమ్మలను బూజించుచుండిరి; దేవతాప్రీతికరములని యీదారుమచ్ఛిలాకారములకే నరబలులను నిలువు దోపుడులును నిచ్చుచుండిరి. అంతశ్శత్రుసంహారమువలననే మానవుఁ డకలంకుఁ డగునన్న సత్యమును వదలి కోపము, రోగము మొదలగు మోక్షదూరగము లగు నాతంకములను గలిగించు శివరాత్ర్యుపవాసములను జాంద్రాయణవ్రతములను, ఏకాదశీనిరాహారములను, మనవారు సేవింపసాగిరి. మతకర్తలు మొట్టమొదట నెట్టి యభిప్రాయములతోఁ దమకర్మసిద్ధాంతముల నేర్పఱచినను గాలము పోనుపోను వాని మొదటి యర్థములు నశించి మత మనునది కేవల డాంబికాచారములక్రిందను నిరర్థకక్రియలక్రిందను మాఱిపోయినది. వీసెడు గంధమును వీసెడు అక్షతలును మొగమునకుఁ బూసికొని యజ్ఞోపవీతచిహ్నమును ధరించి అర్థము తెలియని గాయత్రీమంత్రమును జపించువాఁడే నిష్ఠాపరుఁ డని హిందువులచే గౌరవింపఁబడు దుష్కాలమాసన్నమైన తరువాత హిందూమతముస్థితిని మేము వివరింపవలసిన దేమున్నది? అంత రింద్రియములను వశపఱచికొనుటయు నకలంకుఁడగు సత్యస్వరూపునియెడ భక్తి నలవఱుచుకొనుటయు—ననుగష్టతరములైన ఈ రెండుకార్యములే మోక్షదాయకములన్న పూర్వకాలపు మాటలను హానిగతి కప్పగించి, ఈశ్వర నామము నైనను దలఁచలేని పాపాత్ముఁడగు నజామిళునకుఁ జనిపోవుచు 'నారాయణ' యన్నంతనే మోక్షము వచ్చినదనియు, తులసిచెట్టునం దల్పాచమనము చేసినంతనే యొకమాలవానికి వైకుంఠము లభ్య మాయెననియు—నిట్టినీతిబీజములకును భక్తిబీజములకును వేఱుపురుగులగు దుష్టసిద్ధాంతములను గల్పించుకొనిన మనవారిబుద్ధి నేమని వర్ణింపను? మనస్సుమనస్సుగానే యభివృద్ధిలేక పడియుండఁగా ప్రపంచములోని పూవుల నన్నిటిని, (ఈశ్వరుని పూజల నావలకునెట్టి యచ్చోట విశ్వామిత్రసృష్టిగా నిలిచిన) యచేతనపదార్థముల కిచ్చినను బ్రయోజనములేదు. ఈశ్వరునిఁ బూజించుటకర్హమైనది సంపూర్ణభక్తిగంధముతో బరిమళించు మనఃపుష్ప మొక్కటియే. బుద్ధిపూర్వకముగా దాని నొసఁగలేక దాచిపెట్టుకొని బొమ్మలకుఁ బువ్వు లలంకరించినను దలవెంట్రుకలు మొక్కుకొన్నను పూజారిచేతిలో కనకవర్షము గురిపించినను నేమి లాభము? దయామయుఁడగు పరమేశ్వరుని కీసృష్టియే యాలయమన్నమాట మఱచిపోయి యాయనకు గాలియైనను జొరని గర్భగుడులను మనవారు నిర్మించిరి. నీతిరతులగు నిశ్చలభక్తుల హృదయపీఠమే ఈశ్వరుఁ డధివసించు పవిత్రపీఠ మన్నమాట మనవారిలో నడుగంటెను. ఈశ్వరప్రీతికరముగా బలిపెట్టవలసినవి అసత్యగర్వాదిక్రూర

మృగము లన్నవిషయమును గుర్తెఱుఁగక కటికవానికంటెను క్రూరులై బ్రాహ్మణులు నవరంధ్రములను మూయించి యజ్ఞపశువులను విశసించుచుండిరి. ఈశ్వరచిత్తమునే తనయత్నముగా మార్చువాఁడు నిజమైనయోగి యని తెలియక శారీరశాస్త్రవిరుద్ధమగు రేచకకుంభకపూరకక్రియయే యోగమని మనవారు భ్రమించుచుండిరి. ఈవిధముగా హిందువులు నిజమైన ముక్తిమార్గములను గనలేక యజ్ఞానవివశులై పెడత్రోవలఁ ద్రొక్కుచున్నప్పుడు నిజమైనజ్ఞానముగలవాఁ డెవ్వఁ డూరకుండ నేర్చును?

ఈరీతి మతాచారముల కనుగుణ్యముగా మనవారిలో దుష్టసిద్ధాంతములు సహితము కొన్ని ప్రబలసాగినవి. కాపాలికాది దుర్మతముల నావలనునిచి ఇప్పటి కొందఱిచే నుత్తమోత్తమముగా నెగడఁబడుచున్న యద్వైతమును జూచినను దాని మూలసిద్ధాంతమే మతమునకు గౌరవము నణఁపునదిగానున్నది. మానవుని శక్తిసామర్థ్యాదుల కన్నింటిని మొదలును దుదియునుగూడఁగలవు. సంపూర్ణత్వ మొక్కయీశ్వరునిదిగాని భ్రమప్రమాదవివశులగు మానవులకు ఏనాఁడును గలుగునదిగాదు. ఈశ్వరుని యనంతత్వమునంతటివిషయమును సహితము బాటింపక, సృష్టికర్తయు మానవుఁడును నొక్కటియే యని బోధించు మత మెంతమాత్రమును సత్యము కానేరదు. సర్వశక్తిత్వాదిలక్షణలక్షితుఁడగు నాలోకజనకుని భక్తివలన నెఱుఁగఁజాలిన మూఢుఁడుసహితము తానే సర్వేశ్వరుఁడని భావించుట మహాపచారమని తెలిసి చెంపలు వేసికొనును. అట్టియెడ నీప్రపంచమంతయు నొకకలయనియు, సర్వమును మిథ్యయనియు, దృష్టిగోచరములగు నీపదార్థము లెవ్వియు లేనే లేవనియుఁ బలుకుచు నేనే దేవుఁడనని విఱ్ఱవీగి నిజమైనభక్తిని పాపకార్యవిరక్తిని నలవఱుచుకొనక జీవితకాలము నంతను వ్యర్థముచేయుట హిందువులకు యుక్తమగునా?

హిందూమత మిట్టి యద్వైతసిద్ధాంతములతో నిండిపోయి, కష్టపడి మనస్సును లోఁగదీసి ఈశ్వరుని కర్పింపలేని వారి పైపైమెఱుఁగులవలనఁ బ్రయోజనము లేదని తెలియక యజ్ఞానాంధకారమునఁబడియున్న దినములలో 1775వ సంవత్సరమున హిందూదేశోద్ధారకుఁడగు మొట్టమొదటి సంస్కర్త జననము నందెను. ఈ రామమోహనరాయలచరిత్రమును మేము రెండవప్రకరణమునందే వ్రాసియున్నాము.

శ్రీరామమోహనరాయలు హిందూసంఘముపై రీతినుండుటను జూచి సహింపలేక దానియందు మార్పులను జేయనారంభించెను. ఈతఁడు మొట్టమొదట నిషేధించినది విగ్రహార్చనము. కృత్రిమాకారముల పూజనమునుండి పరమేశ్వరారాధనమునకు మానవుని మనస్సును మఱలించి యాతనికి బ్రహ్మానందమును రుచిచూపుటయే రామమోహనుని ప్రధానోద్దేశ్యము. ఋగ్వేదవందితుఁడగు నాపరాత్పరుని నారాధింపుఁడని యా

తఁడు జనులనుబలుమాఱు హెచ్చరింపుచువచ్చెను. పారసీ, గ్రీకు, హీబ్రూ, సంస్కృతము, ఇంగ్లీషు మున్నగుభాషల నన్నిటినిఁ బ్రత్యేకముగా నేర్చికొని యాయాయిభాషలలోని మూలమతగ్రంథములను సూక్ష్మబుద్ధితోఁ బరిశీలించి, ఈతఁడు సర్వమతముల వారికినిగూడ విగ్రహార్చనము కూడనిదే యని వ్రాసియున్నాఁడు.

రామమోహనుఁడు విగ్రహార్చనముకూడదని చెప్పఁగానే దిక్కుదిక్కులనుండి యాతని నెదిరించు శత్రువులు బయలుదేరిరి. కన్నకడుపనిగైన సహింపలేక యాతని తల్లిదండ్రులే యాతనిని గృహమునుండి రెండుసారు లావలకు గెంటివేసిరి. వంగదేశమునకు మిక్కిలి దూరముగానున్న చెన్నపురి మొదలుకొని ఇండియా యంతలోను నాతనిని దూషింపని పత్రికయే లేకపోయెను. ఇట్లుండఁగా జీససుబోధించిన పవిత్రమైన యారాధనమునకును క్రైస్తవసంఘీయుల ప్రకృతపుసిద్ధాంతములకును జాలవ్యత్యాసముండుటచే జీససుయొక్క మత మిట్టిహీనస్థితియందుండుటను సహింపలేక, ఈతఁడు క్రైస్తవాచారములనుగూడ ఖండింప నారంభించెను. హిందువు లందఱు దనకుశత్రువులైయున్నప్పుడు సహితము తనకు మిత్రులుగానున్న క్రైస్తవులు దీనివలన నీతనితో విరోధమును బెట్టికొనిరి. కాని యీతని యద్భుతధీగరిమ వారలను నిరంతరమును నిరుత్తరులను జేయుచుండెను.

ఈవిధముగా నీతఁ డొకమూలహిందువులతోను మఱియొకమూల క్రైస్తవులతోను వాదములను బెట్టుకొని, క్షీణదశయందున్న సత్యమతమహావృక్షములకు నూతనజీవమొసఁగి, పవిత్రమైన భక్తిని, నిజమైన యుపాసనమును నెలకొల్పఁ బ్రయత్నించుచున్న కాలములో రివరెండు డబ్లియు అడమ్ అనునొకదొర క్రైస్తవమతమును బోధించుటకై హిందూ దేశమునకు వచ్చెను. వచ్చి యందఱిత్రోవ నేపోక రామమోహనునిఁ గ్రైస్తవమత ప్రవిష్టునిఁజేయుట సార్థకమని తలఁచి యాతనితో వాద ప్రవాదములకు ఆడందొర డీకొనెను. తనయద్భుతశక్తివలన రామమోహనుఁడు ఆడందొరకు ఈశ్వరత్రితయము యుక్తికి విరుద్ధమనియు, మానవాంశములన్నియును గలిగిన జీససును దేవుఁడనుట తగదనియు, శిలువపై నాతఁడు కష్టపడినంతనే లోకములో పాపమంతకును శిక్షవచ్చినదని తలఁచుట బైబిలునకుఁగూడ విరుద్ధమనియు, నాతనికి నచ్చునట్లుబోధించెను. తాననుకొన్నవానికంటె వేయురెట్లెక్కుడు సత్యమును గ్రీస్తు సిద్ధాంతములందుఁ జూపి, వానియందున్న ధర్మబీజములను వెల్లడించి, జీససుయొక్క మానవాంశమును విశదీకరింపఁగానే ఆడమ్ దొరయొక్క త్రిత్వసిద్ధాంతములును, పాపశిక్షలును సూర్యోదయానంతరమున మంచుబిందువుల వలెవిడిపోయెను. జీససుసిద్ధాంతములను రామమోహనునియథార్థమురీతినిఁ బరిశీలించిన కొలఁదిని యాతనికిఁ దనతొల్లింటి దేవుని నిజమైన

యుత్కృష్టమానవత్వము తెల్లనయ్యెను. జీససుసిద్ధాంతములలో నిజమైన మతసత్యములిమిడియున్న వనియు, నవియే యను భవమువలన మానవునికి మోక్షసాధకము లగునవియు, వానినలవఱుచుకొనుటకు వలసినపాట్లు నన్నిటినిఁబడక, దూరదూరముగా నిలిచి, ఏవోనాలుగు సంగతులను నమ్మినంత మాత్రము చేత మోక్షము వచ్చుననుకొనుట వట్టికల్లయనియు ఆడము దొరకు విశదమయ్యెను. అనుభవమనురాతితో మనయాత్మలను నమూల్యరత్నములను నూరినూరి మెఱుఁగుపెట్టక, అంటియునంటని నాలుగు హోమకర్మలను జేసి, మూడుపురుషెళ్ల నీటిని సూర్యునివంకఁ బోసినంతనే మానవులకు మోక్షములొడఁ గూడునా? నిజమైన మతాచరణమువ్యర్థకర్మములతోఁ గూడినదిగాక, ప్రయత్నసాధ్యమై మహాకష్టతరమైన ఆత్మను నూరినూరి ఈశ్వరుని వంకకు మఱలించుట యను పనివలన సార్థకమగునదిగానున్నది. ఈసిద్ధాంతములనన్నిటిని విమర్శించిచూచి ఆడమ్‌దొర రామమోహనరాయని బోధనలకు లొంగిపోయి, తనపూర్వమతమును విడువవలసివచ్చెను. మొదటియాదామును యెహోవాదేవుఁడే స్వర్గమునుండి వెడల నడిపెననియు, ఈతఁడట్లుపడిపోయిన రెండవ యాదామనియు నితరక్రైస్తవమతబోధకు లీతనినిఁ గేలిచేయ నారంభించిరి.

అట్టివానికించు కేనియుజంకక ఈయాడందొర ఇండియాలో నేకేశ్వరోపాసకక్రైస్తవమతమును బోధించుటకొక సంఘము నేర్పఱిచెను. ఈసంఘమువారు క్రీస్తుదేవత్వమును నమ్మరు. ఇంతకుఁ బూర్వమునుండియుఁ బ్రార్థనారూపకమగు నొకసమాజమును స్థాపింపవలయునని రామమోహనుఁడుద్దేశించి యున్నను నది సాగలేదు. ఇప్పుడు ఆడందొర చేయుచున్న దానిని చూచిన తఱువాత రామమోహనుని కీయభిప్రాయము మఱియు బలపడెను. తోడనేయాతఁడు తనగృహమున నొకసభ నేర్పఱిచి దానియందు వారమున కొకసారి వేదమంత్రములను గొన్ని భగవత్కీర్తనలను జదివించుచుండెను. ఆతనిమిత్రులు కొందఱు మాత్రమేదాని సభలకు వచ్చుచుండెడి వారు గాని, సర్వజనోపయోగకరమగు సంఘమప్పటి కింకను స్థాపింపఁబడలేదు. బ్రహ్మమతావలంబులగు నిద్దఱు మిత్రులును రామమోహనుఁడును నతని కొమరులును మాత్రము ప్రతివారమును ఏకేశ్వరోపాసక క్రైస్తవమందిరములోని ప్రార్థనలకుఁ బోవుచుండెడివారు. ఇట్లుండఁగా నీరామమోహనుని మిత్రులిఱువురు ఒకనాఁడు రామమోహనునితో విదేశీయులప్రార్థనా సభలకుఁబోవుటకంటె స్వయముగా నొకసంఘమును స్థాపించుకొనుట యుత్తమమని సూచించిరి. రామమోహనుఁ డాసూచన ననుసరించి దానిని నాచరణమునకుఁ దెచ్చుటకై తనయింట నొకసభచేసెను. అప్పటి కాలమునందుఁ గలకత్తానగరములో సుప్రసిద్ధులైయున్న నలుగురు ఘను లీయభిప్రాయము

నామోదించి రామమోహానునికి వలసినంత సహాయమును జేసెదమని వాగ్దానముచేసిరి. వీరిలో ద్వారకనాథ టాగూరుగారిపేరు నిచట ముఖ్యముగాఁ దెలుపవలసియున్నది. తుట్టతుదకు 1828వ సంవత్సరమున భాద్రపదమాసములో నొకగృహము నద్దెకుఁ దీసికొని వీరు బ్రహ్మసమాజమనుపేర నొకప్రార్థనా గోష్ఠిని స్థాపించిరి. ఇదియే హిందూదేశములోని బ్రహ్మసమాజమునకుఁ బునాది. దీని సభలయం దిద్దఱు తెలుఁగు బ్రాహ్మణులు వేదములను, పండితరామచంద్ర విద్యావాగీశుఁ డుపనిషత్తులను జదువుచుండిరి. కొన్నిభగవత్కీర్తనలతో దీని సభలు ముగియుచుండెను. ప్రతిశనివారమును సాయంకాలమున నేడుగంటలకు దీనిసభల నారంభించి తొమ్మిదిగంటలగువఱకు దీనిని ముగించుచుండిరి. ఇట్లుండఁగా 1829వ సంవత్సరము జనవరునెల నాటికి రామమోహనుఁ డొకనూతనభవనమును గట్టించి అందా నెలలోనే మాఘశుద్ధ ఏకాదశినాఁడు బ్రహ్మసమాజమును బ్రతిష్ఠించెను. రామమోహానుని మతాభిప్రాయముల నన్నిటిని నాయన ఈమందిరమునకుఁ జేసిన విధులవలనఁ జక్కఁగాఁ దెలియవచ్చును. అందువలన నాయన దానశాసనములోని కొన్ని భాగముల నిందు క్రింద భాషాంతరీకరించుచున్నాము.

“శాశ్వతుఁడై స్థిరుఁడై సర్వాంతర్యామియై, ఈభువనములకన్నిటికిని సృష్టికర్తయై సర్వనియంతయై వెలయు నాదేవదేవుని నారాధించుటకును, నుతించుటకును, నీబ్రహ్మసమాజ ముద్దేశింపఁబడినదిగాని, ఏ యితరమనుష్యుఁడుగాని, జనసముదాయముగాని, వ్యవహరించుపేరు, అధికారము, లేక బిరుదునుగల యొకప్రత్యేకపుటాకారము లేక యాకారములనుగల యన్యదైవతముల నుపాసించుటకుఁగాదు. * * * క్రమముగాను బుద్ధిపూర్వకముగాను నియమముతోను భక్తితోను పరమేశ్వరు నుపాసించు నెల్లవారును, కులవివక్షత లేక యిచ్చటకు రావచ్చును. * * * కృత్రిమమైన ఏవిగ్రహమునుగాని, ప్రతిమనుగాని, మృత్శిలాదారునిర్మితమగు నేయాకారమునుగాని, పటమునుగాని, బొమ్మనుగాని, పోలికకుద్దేశింపఁబడిన ఏ వస్తువునుగాని, ఈ మందిరములోనికిని దీనికి సంబంధించిన చుట్టుప్రక్కల ప్రదేశములలోనికినిఁ గొనిరాఁగూడదు. ఈ మందిరభూములందు యజ్ఞములు హోమములు తర్పణములు మొదలగున వేవియు జరుపఁబడరాదు. ఆహారార్థమైకాని కొన్నిమతవిషయిక కర్మలకుఁగాని యిందేజీవజంతువును జంపఁబడరాదు. ఆకస్మికోపాయములు సంభవించినప్పుడు ప్రాణరక్షణార్థ మప్పటి కిక్కడ నాహారపానీయములను దీసికొనవచ్చునుగాని, యితర సమయములలో నిందాహారపానీయములు తీసికోరాదు. * * * ఈమందిరము నీశ్వరోపాసనా సమయమునందలి ఉపదేశప్రార్థనా భగవత్కీర్తనాదులలో దేనియందునుగూడ నితరమనుష్యులచేఁ బూజార్హమగు దైవతముగా భావింపఁబడ్డ, భావింపఁబడుచున్న, లేక భావింపఁబడఁగల ఏజీవవస్తువునుగాని నిర్జీవపదార్థమునుగాని దూషింపఁగూడదు; వానినిఁగూర్చి తేలఁబలుకఁగూడదు; నిష్ఠురోక్తు లాడఁగూడదు; ఉచ్చరించుట సహిత మిందు నిషేధింపఁబడినది. ఈమందిరమున నుపాసనార్థమై జరుపఁబడు నుపదేశములును బోధనలును, చర్చలును, ప్రార్థనలును, గీతములును, బ్రతిదియుఁగూడ లోకములకుఁ గర్తయు భర్తయునగు నాపరాత్పరుని ధ్యానమునకే యనుకూలించునవిగాను, ప్రేమ, నీతి, భక్తి, ఔదార్యము, పుణ్యాకారవిరతి వీనినిఁ గలిగించునవిగాను, సర్వమతములవారిని నేకీభావము నందింపఁ బ్రయత్నించునవిగాను ఉండవలెను.”

బ్రహ్మసమాజమతమునుగూర్చి యింతవఱకును వ్రాసినతఱువాత, నిఁక దీనియనంతర చరిత్రమునుగూర్చి ప్రస్తావింపవలసి యుండును. రామమోహనుని కాలమునందు బ్రహ్మసమాజ మింతకంటె నెక్కుడగు నభివృద్ధి నందలేదు. కాని యాసిద్ధాంతములే నానాఁటి కభివృద్ధిగాంచి బ్రహ్మసమాజము నొకనూతనమతమునుగాఁ జేసినవి. దీని యవ్వలిచరిత్రమును, ముందుప్రకరణమున విశదీకరించుచున్నాము.

పదునాఱవ ప్రకరణము.

బ్రహ్మసమాజము.

రామమోహానుని తఱువాతివారు.

ప్రత్యేకముగా నొకమతసంఘము నేర్పఱుపవలసియున్నయెడల కేవలసిద్ధాంతభాగమును మార్చినంతనే యదిసంపూర్తి నందదు. అందు ముఖ్యముగా హిందూదేశమునం దిది మిక్కిలిగా వర్తించును. అన్యోన్యభోజన ప్రతిభోజనవిషయములును వివాహశ్రాద్ధాచారములును, నితర లౌకిక వైదికకర్మలును భిన్నమతములవారికి తమతమ భేదమును జూపుచు వారిని వేఱువేఱు సంఘములకుఁ జెందియున్న వారినిగాఁ వేఱుపఱుచుట హిందువులలోని ద్వైతాద్వైతవిశిష్టాద్వైతాది సంఘముల తీఱు నెఱిఁగిన ప్రతివారికిని విశదముగానే యున్నది. జుట్టు బొట్టు కట్టు మడి, కర్మ, సిద్ధాంతము—వీని భేదము లన్నియు మతము ననుసరించియే యిండియాలో జరుగుచున్నవి. ఆదికాలమునందు వ్రాయఁబడిన ఋగ్వేదములోఁ బ్రపంచములోని మతోత్పత్తి కంతకును నాధారములయిన మతధర్మము లిమిడియున్నవి. ప్రథమప్రకరణములో మేము వివరించినరీతిగా సృష్ట్యాదిని పశుప్రాయుఁడై మానవుఁ డుదయించి, క్రమక్రమముగాఁ గొంతకాల మభివృద్ధినందిన తఱువాత, నాతని మతాభిప్రా

యములు వింతమైనవిగా నుండును. అప్పటికప్పుడే మానవుఁడు తాను విధేయతతో ననువర్తించి మెలఁగవలసిన తనకంటె నితరమగు నద్భుతశక్తులు ఈ లోకమును బాలించుచున్నవని తెలియఁ జాలును. తన కుపకరణములై ఆకలి మొదలగువానినుండి తన్నుఁ గాపాడుచున్న అన్న మొకదైవమై అన్నశ్రుతిని, తనకును దనపొలములకును నిరంతరోపకారకులైన వాయువు, అగ్ని, వరుణుఁడు మొదలగు భూతాత్మకులు వేఱుదైవతములయి వేఱు శ్రుతివాక్యములను వానిచేతఁ జదివింతురు. ఈ కాలమును దాఁటిపోయిన తరువాత ప్రపంచజ్ఞానము ముదిరినకొలఁదిని, భిన్నశక్తు లున్నవను నమ్మకము చెడిపోయి ఏకేశ్వరత్వమునకు మానవులు వచ్చుచుందురు. ఇదియే ఋగ్వేదము కడపటికాలము. ఈ రీతి మతచరిత్రమును గలిగియుండుటచేతను నిది మూఢదశయం దున్నమానవు లిట్టి రీతి నభివృద్ధి నందవలసి యుండునన్న మానవతత్త్వశాస్త్రము సిద్ధాంతమున కనుగుణ్యముగా నుండుటచేతను, మోక్షమూలరు(Max Muller) మొదలగువారు ఋగ్వేదమును బ్రపంచములోని గ్రంథము లన్నిటినిలో నతి పురాతనగ్రంథమునుగా గణించిరి. ఈ ఋగ్వేదము కాలమునందు హిందూసంఘ మేరీతి నున్నదో మొదటిప్రకరణమునందే వివరింపఁబడినది. అటుపిమ్మట హిందూమతమునకుఁగాని హిందూసంఘమునకుఁగాని యంతగా నభివృద్ధి కలుగలేదు. రానురాను క్షీణత్వమే హిందువులకు ముఖ్యలక్షణమైనది. ఈ విషయమును వ్రాయునప్పు డొక్కవిషయమును మనము మఱువఁగూడదు. పునరుద్ధారకులు (Revivalists) అను పేరఁ గొంద ఱందఱుఁ బ్రకృతపు హేయాచారాదులను విడిచి, యుత్తమోత్తమములైన ఋగ్వేదాదుల కాలములోని యాచారములను బునరుద్ధారణము చేయుటయే యుత్తమమార్గమని బోధించుచుందురు. ఈ రీతిసంస్కరణమును బండ్రెండవ ప్రకరణమున దాని యథాస్థానముననే మేము వ్రాసినను నిక్కడ నొక్కవిషయమును దెలుపవలసి యున్నది. నిజముగా వీరి సంస్కరణము లేనాఁటి కయినఁ గొనసాగునేని హిందూసంఘము కొన్ని సదాచారముల కాలవాలమైనను నభివృద్ధియందుమాత్రము నాఁటినుండి ఇప్పటి కాలమువఱకుఁ బ్రపంచమునకు లభ్యమైన ప్రపంచజ్ఞానము నావలకు నెట్టి, తెలిసియుఁ దెలియనిస్థితిలోను వేలకొలఁదియేండ్ల క్రిందటి జనుల పురాతనాచారముల నవలంబించియు వెనుకకు మఱలి పోవలసియుండును.

హిందూసంఘాచారములు ఋగ్వేదకాలమునుండి నేఁటివఱకు నెట్టెట్టిమార్పుల నందెనో మతమును నట్టిమార్పులనే యందినది. జనులు నీతి మొదలగువానిని విడిచి వ్యర్థకర్మలతోఁ గొట్టుకొనునప్పుడు బౌద్ధుఁ డుదయించి, పురాతనసంఘమతాచారములను జెల్లాచెదరు చేసి, దయాసత్యశౌచాన్వితమయ్యును ఈశ్వరపూజనములేని తన మతమును స్థాపించెను. మఱికొంతకాలమునకుఁ బ్రకృతిజ్ఞానము ముదిరినకొలఁదిని హిందువులు పరమేశ్వరారాధనమునకు మఱలఁ బురికొల్పఁబడిరి. అంతకుఁబూర్వ మొక

యద్భుతశక్తిగాను మిక్కిలి సత్కృతుగా నితరగుణములు కలదిగాను బరిగణింపఁబడుచున్న బ్రహ్మవస్తువునం దాకాలపు ప్రకృతిజ్ఞానాధిక్యమువలన జ్ఞానము మొదలగు మానవులతోడి సామాన్యలక్షణములు కానఁబడసాగెను. వెంటనే కొందఱు మానవునకు సంపూర్ణత్వము లేదని తెలియలేక, అనంతుఁడగు నీశ్వరుఁడును దల్లక్షణసూచకమగు మానవుఁడును నీసృష్టియును నేకవస్తువే యని భ్రమింపసాగిరి. అట్టిదృష్టితో చూచునప్పుడు ఈ ప్రపంచమును నందలివస్తువు లన్నియుఁగూడ సర్వేశ్వరమయములై, ఈశ్వరునియం దనుసంధింపఁబడుటచే వారిదృష్టినుండి ఈప్రపంచము మఱుఁగైనది. వారు ఈ ప్రపంచము మాయగా నిట్లున్నను దుదకా ఈశ్వరుఁడే యగునని కూడ నెంచిరి. ఎల్లెడల నాస్తికతరూపము వహించెనా యన్నట్లు వ్యాప్త మందియున్న బౌద్ధమతమును, జూడఁగానే పైరీతి భ్రమలవలన సమస్తమును బవిత్రమైన బ్రహ్మవస్తువే యనియు, ఈ ప్రపంచము మాయ యనియుఁ గన్నులారఁ జూచుచున్నవా రూరకొనఁ గలుగుదురా? అట్టివారిలో ముఖ్యుఁడగు శంకరుఁడు ముందుఁ దన యద్వైతమును స్థాపించి, బౌద్ధమతమును రూపు మాపెను. అప్పటికాలమున కది సరిపడి యున్నను, మఱి కొన్నిదినములు గడచునప్పటికి, 'తానే దేవుఁడనని పలుకుట' కొందఱికి ఘోరపాతకమని తోఁచినది. హిందూమత చరిత్రమునందుఁ దఱువాతిచరిత్రమంతయు నీయద్వైతసిద్ధాంతమును ఖండించుచు సత్యాసామీప్యతఁ గాంచిన యితర సిద్ధాంతములను గొనివచ్చుటతో నిండిపోయినది. రామానుజుఁడు, వాసుదేవాచార్యుఁడను నపరనామము గల మధ్వాచార్యుఁడు, చైతన్యుఁడు, మొదలగువారీకాలమువారిలో సుప్రసిద్ధులు. వీరు మతసంస్కరణములతోఁ బాటుగా క్షీణదశకువచ్చియున్న సంఘమును బాగుచేయుటకై యప్పటికి వారికి యుక్తములని తోఁచిన సంఘసంస్కరణములను సహితము చేయసాగిరి. వీ రందఱును దమపేర నూతనమతసంఘములను బ్రత్యేకముగా సృష్టించినవారు.

ఈ విషయములను దెలిసినమీఁదట రామమోహనుని చర్యలను విమర్శించిన యెడల నాతఁ డొకనూతనమతమును సృష్టించినట్లు చెప్పుటకు వలనుపడదు. పురుషవిద్యాభివృద్ధికిని సహగమనదురాచారము నాపుటకును దొరతనమువారి కీతఁడు తోడు చూపినను, నవి హిందూప్రపంచమున కంతకు లాభకారులైనవిగాని ఈతని యనుచరులకుమాత్రమే కాదు. రామమోహనుఁడు నూతన మతసిద్ధాంతములను బోధించి కొందఱిని దనయనుచరులనుగాఁ జేసినను, వారు నూతనసంఘమునందుఁ జేరినవారు కాలేదు. మతవిషయమునందు రామమోహనుఁడు చేసినపని యంతయుఁ దనరీతిగాఁ దన మిత్రులను గొందఱను నీశ్వరారాధనము చేయునట్లొనర్చుట. కాని ఈతని వ్రాఁతలును, బోధనలును, సర్వమైన యభివృద్ధి కనుకూలించు బీజములను గలిగి యుండెను.

ఈరీతిగా సంస్కరణముల జేయవలెననుటకు దృష్టాంతమై నిలుచుటయే ఈతనికి మేము ప్రాముఖ్యత నిచ్చుటకు ముఖ్యకారణము.

ప్రపంచములోని దేశము లన్నియు నంతగా నభివృద్ధి నందక వెనుకపడి యున్నప్పుడు ఐరోపాఖండము ప్రబల ప్రయత్నములవలన నద్వితీయమైన ప్రకృతిజ్ఞానము నలవఱచుకొని దానిప్రకారముగా దనసంఘమతాచారములను మాఱ్చుకొనియో మాఱ్చుకొనుచునో యున్నదని యెల్లఱకును దెలిసియే యున్నది. అట్టిదృష్టాంతములనే హిందువులును దీసికొని, వారిప్రకారముగానే నూతనజ్ఞానానుసారముగా హిందూమతమును సంఘమును మాఱ్చుకోవలెనను చక్కని యూహ రామమోహనుని బోధనాదులయం దిమిడి యున్నది. ఈయూహయే యుత్తమోత్తమమైనది గావునను, దీని ననుసరించి నూతనమార్గమును జూపినవాఁడు రామమోహనుఁడే కావునను నిజమైన హిందూదేశోద్ధారకులకు రామమోహనుఁ డాదిపురుషుఁ డైనాఁడు. కాని యాతఁడు పెక్కండ్ర నాకర్షించుకొని యొకనూతన మతసంఘమును స్థాపింపలేదు.

రామమోహనుని యనంతరమున చంద్రశేఖరదేవుఁడు మొదలగువారు కొంతకాలమువఱ కాతఁ డుపదేశించిన రీతినే ఈశ్వరారాధనముచేయుచు, బ్రహ్మసమాజమును బ్రాణములతో నిలుపుచు వచ్చిరి. వీరి యనంతరమున నత్యంతగౌరనీయులై మహర్షియను దివ్యపదమునకు సహితము తమభక్తివలన గౌరవమును దెచ్చువారై బహువృద్ధులై ఇప్పటికిని జీవించియున్న దేవేంద్రనాథఠాకురుగారు ఈపనికిఁ బూనుకొనిరి. బాల్యమునం దీయన నీతి నంతగాఁ బాటింపక విచ్చలవిడి చరింపుచుండఁగా నొక్కనాఁ డాకస్మికముగా నొకసృష్టిపదార్థమును వీక్షించుచున్నప్పు డీయన మనస్సుచివుక్కున మఱలిపోయి, తాను చూచుచున్న వస్తువువలన ద్యోతకమగుచున్న పరమేశ్వరుని లక్షణములను గూర్చియుఁ దనతొల్లింటి ప్రవర్తనముయొక్క హేయత్వమును గూర్చియు విచారింపఁ జొచ్చెను. తోడనే ఈతఁ డీశ్వరభక్తుఁడై సద్వర్తనుఁడై నాటినుండియు నఖండబ్రహ్మానందము ననుభవించుచు నుత్తమప్రవర్తన కాధారమో యనునట్లు చరించుచు, బ్రహ్మసమాజమునందుఁ బ్రవేశించిరి. ఈయన మహాభాగ్యశాలి. పూర్వము మహమ్మదీయులు ఇండియాను బాలించుచున్న కాలములో నెవ్వఁడో యొకమహమ్మదీయుఁడు బలవంతముగా వీరిప్రపితామహులలో నొక్కరిముక్కుకడ మాంసాహారమును బెట్టి వాసన చూపించినందున నాటినుండియు వీరివంశమువారు కులములో వెలివడి యుండిరి. కాని ఈయన బ్రాహ్మణవంశమునందు జనించినవాఁడే.

దేవేంద్రనాథఠాకురుగారి కాలమునాఁటికి బ్రహ్మసమాజ మంతగా నభివృద్ధి నందలేదు. అప్పటి కాసంఘమునందుఁ జేరినవారు కులహీనులుగాఁ బరిగణింపఁబడుచున్నను నిజమైన బ్రాహ్మసంఘమునన? లేనేలేదు.

ఇట్లుండఁగా 1839వ సంవత్సరమునందు శ్రీ కేశవచంద్రసేనులవా రుదయము నందిరి. వీరితాతగారగు రామకమలసేనులవారినిఁగూర్చి మేము విద్యనుగూర్చిన ప్రకరణమునందు వ్రాసియేయున్నాము. కేశవచంద్రసేనులవారికిఁ జిన్ననాటినుండియు మిక్కిలి హేయముగాఁ దోఁచినది నిర్బంధబానిసత్వము. తనస్వబుద్ధి తనకుండఁగాఁ బరబుద్ధిని నమ్మి యుక్తాయుక్తవివేచనము లేకుండఁ జరించుట ఈతనికి కష్టముగాఁ దోఁచుచుండెను. అందువలన నీతఁడు చిన్ననాటినుండియు, స్వతంత్రవర్తనుఁడై యుండెను. హిందూమతాచారాదుల బోధనలకును గేశవచంద్రుని స్వతంత్రబుద్ధికిని నిట్టియెడఁ దప్పక వైషమ్యములు కలుగును. మంచిచెడ్డల నెఱిఁగియున్నను, నీబుద్ధిని వినియోగింపక, మతగ్రంథకారుల బుద్ధిమీఁదనే నీసర్వమతవ్యాపారములను జరుపుకొని యుండుమని హిందూగ్రంథములు బోధించును. ఈశ్వరుఁడు నాకు జ్ఞానమును దయచేసియుండఁగా దానినిఁబట్టి యుక్తాయుక్తముల నెఱిఁగి, యుక్తములనే యనుష్ఠింపక, బానిసనై నాబుద్ధిఖడ్గము నేలద్రుప్పుపట్టునట్లు చేయవలెనని కేశవచంద్రసేనుఁ డనును. ఈవిధముగా నీతఁడు ఆత్మబుద్ధి స్సుఖంచైవ, అనుసత్యము ననుసరించి చిన్ననాటినుండియు స్వతంత్రవర్తన కలవాటుపడి యుదారమగు బుద్ధికలవాఁడై వెలుఁగందుచుండెను. అప్పటికే ఈతనిమనస్సున సంఘమతసంస్కరణములనుగూర్చిన యూహలుత్పన్నమయ్యెను. ఈతఁడు తనమిత్రులను నలువురను బోగుచేసికొని వారితోఁ గొన్నిసంఘములను స్థాపించికొనియుం దుపన్యాసాదికముల నొసఁగుచుండెడివాఁడు.

ఈవిధముగాఁ జరింపుచుండఁగా నొకనాఁ డీతఁడును నీతని మిత్రులును నొకయింటఁజేరి తాముచేసిన పుణ్యపాపములనుగూర్చి విచారింపఁజొచ్చిరి. ఆనాఁడందుఁ జేరియున్న ఈతనిమిత్రు లొక్కరొక్కరే తమతమపాపములను వెల్లడింపఁజొచ్చిరి. ఇంతటి ఘోరపాతకులమగు మనకుగతి యేమియని వారిలో నతి చింతాక్రాంతులై హోరుమని యేడువనివా రొక్కరునులేరు. దీనినిఁబట్టి మాగ్రంథపాఠకులు వారనన్యసాధారణములైన యకార్యసహస్రముల నొనర్చినవారని భావింపఁబోయెదరుసుఁడీ! అదికాదు. నిశ్చలబుద్ధితో మనమాత్మవిచారము చేయునప్పుడు ఎంత కొద్దిపాపమైనను నది వేయుఁగొండలపొడవై కానిపించి, పరిశుద్ధప్రవర్తనము లేని నరుఁడు నరుఁడు కాఁడని జనులకు బోధించును. కేశవచంద్రుని మిత్రులందఱును బాలురేయైనను, నీతనితోడి చెలిమివలన వారిహృదయములు యుక్తాయుక్తవిచారణము నెఱిఁగి పరిశుద్ధత నందుటకుఁ గారణమాయెను. ఈవిధముగా వారేడ్చుచు ననుతాపవహ్నిలోఁ దమపాపములను వ్రేల్చుచున్న యాశుభదినమున వారి కెప్పుడు సాయాహ్నమైనదియుఁగూడఁ దెలియలేదు. ఈవిధముగా మానవుఁడు తనదుర్బలత్వమువలన పాపకార్యముల కొడి

గట్టుచుండుట ననుభవపూర్వకముగా నెఱిఁగిన తఱువాత దమకు సహాయభూతుఁడుగా నుండుపరమేశ్వరుని బలమే తమ్ముఁ గాపాడునని తెలిసి, చేతనస్వరూపుఁడగు నీశ్వరుని నారాధించుచు, నచేతనవస్తుపూజనము నిరర్థకమని వీరందఱును దెలియఁజాలిరి. చూచువాని కీలోకమం దంతటను నిండి సర్వేశ్వరుఁడు ప్రకాశించుచుండఁగా, మూఢుఁడై కన్నుఁ దెఱువఁ బ్రయత్నింపక, మనలోకైక జనకునికి దూరముగా నిలిచిపడియుం డుట మనుష్యునికి ధర్మమగునా? లోకమునం దీశ్వరుఁ డున్నాఁడని నిర్ధారణముచేసి మనమనస్సుల కాతనిఁజూపు సత్యభక్తకృతములను గ్రంథాంతరమార్గము లనేకము లుండఁగా విగ్రహార్చనముతోనే ఈజీవనమును గడిపివైచి, చెడిపోవుట యుక్తమా? ఇంతకుఁ బూర్వమునుండియును గేశవచంద్రుఁ డీవిషయములను దలపోయుచుండెను. కాని మనస్సునకు మనస్సే సాక్ష్యముగా నీతఁ డీశ్వరప్రార్థనములను జరుపుట కొక పెద్దచిక్కు గలిగెను. తాను నిజముగా లోకేశ్వరునియం దెంతభక్తి గలిగియున్నను, నీతఁడు తన కనువగునట్లు ప్రార్థించుటను దనవారు చూచినయెడల పోరాడి, ఈతని నాక్షేపింతురు. అందువలన నీతఁడు రహస్యముగాఁ గొంతకాలమునుండి ప్రార్థనములను గావించుకొనుచుండెను, "ఈశ్వరోపాసనము చేయుము, తప్పక చేయుము. సత్యేశ్వరోపాసనము చేయ వేని నీకు వేఱుగతిలేదు" అని యాతని మనస్సాక్షినుండి ఘంటాపథముగా నెప్పుడును నొకశబ్దము మ్రోఁగుచుండెను. ఈరీతి భక్తుఁడై, ఈతఁడు జగదాధారుఁడగు నాతండ్రి నాకాధారుఁడైయుండఁగా వేఱుభయమేలననియు, నీతిస్వరూపుఁడగు నీశ్వరుని ననుకరించి నేనును నీతిగా నేయుందుననియు, శపథము చేసి తనమనస్సును వర్తనమును నీశ్వరునికేయిచ్చివేసి, యాతనికే దాసుఁడైయుండెను. ఆసమయముననే మేముపై నుదహరించిన యనుతాపమునుగూర్చిన మిత్రసంభాషణము జరిగినది.

అప్పటినుండియుఁ గేశవచంద్రసేనుఁడు వారినిఁజేర్చియొక ప్రార్థనాగోష్ఠిని స్థాపించియందు మతవిషయికములగు నుపదేశములనుజేయుచు, అనితరుఁడగు నాలోకేశ్వరునే యారాధింపుచు, దీరికగలయప్పుడెల్ల హూణభాషయందలి వేదాంతగ్రంథములను జదువుకొనుచు నభివృద్ధినందుచుండెను. ఈతనిసమాజమునకు దేవేంద్రనాథ ఠాకరుగారునప్పుడప్పుడు వచ్చుచుండెడివారు. ఈవిధముగాఁ గేశవచంద్రసేనునికిని, మహర్షి దేవేంద్రనాథ ఠాకరుగారికినిఁ బరిచయముగలిగెను. అన్యోన్య గౌరవాభిప్రాయములతో వీరుండిరి.

కేశవచంద్రసేనుని స్వతంత్రతయందలి యభిమానమునుగూర్చి యిదివఱకే వ్రాసియున్నాముగదా. ఈవిధముగా దేవేంద్రనాథ ఠాకరుగారితో నీతనికిఁ బరిచయము కలిగిన తఱువాత నీయుభయులును మిత్రులైరి. స్వతంత్రబుద్ధితో విచారించి దేవేంద్ర

నాథుని మతధర్మములు సత్యములైనవని కేశవచంద్రసేనుఁడు తెలిసికొనఁగానే రహస్యముగా నీతఁ డెప్పుడో ముందువెనుకలకు జంకక యాతనిసంఘమునందుఁ బ్రవేశించెను. ఆతరుణమునందు వీరిమతస్వాములు కలకత్తానగరమునకు వచ్చియుండిరి. ఆయనచేత కేశవచంద్రసేనునియింటిలోని పిన్నపెద్దలందఱును నుపదేశమును ముద్రధారణమును గావలసియుండెను. నిరర్థకములగు విగ్రహార్చకకర్మలకుఁ బోవుటకుఁ గేశవచంద్రసేనునికిష్టముకాలేదు. తనకిష్టములేదని తల్లితోనితఁడు చెప్పినను నదియంతగాఁ బ్రయోజనకారికాలేదు. పెద్దలందఱును దమమతస్వామిని యథావిధినర్చించిరి. పిమ్మట బాలురలో నొక్కరొక్కరేపోయి ముద్రధారణమును మంత్రోపదేశమును నందుచుండిరి. అంతట గేశవచంద్ర సేనులవారివంతువచ్చెను. యింటిలోని యందఱును బెద్దపులివలె భయదాయకుఁడై ఈతని యభిప్రాయములను చాయగా నెఱిఁగిన ఈతని పిన్నతండ్రివచ్చి 'నీవు గురూపదేశమునందుదువా అందవా?' అని కేశవచంద్ర సేను నడిగెను. నిశ్చలచిత్తుఁడై మహాధైర్యముతోనప్పటి భవిష్యత్సంస్కర్తయగు నీబాలుఁడు నిర్భయముగా "నేనందను" అనిప్రత్యుత్తరమిచ్చెను. ఈతనిసాహసమునెదుట మతిపోయినట్లై ఈతని పినతండ్రి మాఱుమాటాడనేరక వెడలిపోయెను. సంస్కర్తకుఁ బ్రధానములగు సత్యాదరణమును ధైర్యమునుజూపిన కేశవచంద్రసేనుని చరిత్రములోని ప్రథమ సంస్కరణ కార్యమిదియే.

ఈతఁడు బ్రహ్మసమాజమును జేరినతఱువాత నీతనిభక్తి శ్రద్ధాదులకందలి ప్రతివారును నాశ్చర్యపడుచుండిరి. కొలఁదికాలములోనే ఈతఁడు వారి కుపదేశకుఁడై బ్రహ్మానందుఁడను బిరుదమునందెను. ఈపదవి నందఁబోవుదినమున నతఁడు తనభార్యను గూడ నక్కడికిఁ గొనిపోవలెనని యుద్దేశించెనుగాని దానికి వీరి యింటిలోని యితరులెవ్వరు నంగీకరింపలేదు. ఎట్టివిపత్తులువచ్చినను లెక్కసేయక తనపట్టును నెగ్గించుకొనవలెనని కేశవచంద్రసేనుఁడు ప్రయత్నించెను. వంగదేశమునందాచారముగానున్న 'ఘోషా' పద్ధతినివదలి తనభార్య నొకసభకు కులహీనుని యింటికిఁ దీసికొనిపోవలెనని కేశవచంద్రసేనుఁ డెంచినప్పుడు ప్రాచీనాచారపరాయణులగు నాతనిపోషకులు సహింపనేర్తురా? కాని దేనికిని జంకక తుదకు రక్షకభటులసహాయమునైనఁ దీసికొని కేశవచంద్రుఁడు తనభార్యను గొనిపోనెంచెను. మహాభాగ్యవంతుల కుటుంబములోనివారగు వీరిగృహమొకతోటలో నుండెను. కేశవచంద్రసేనుని పట్టును విన్నపురజనులు యుక్తదినమున గుంపులుగుంపులుగా వచ్చి తెల్లవాఱువఱకు వీరితోఁటను నిండియుండిరి. ఎటువంకఁ జూచినను నిసుకఁ జల్లిన రాలకుండునట్లు జనసముదాయము క్రిక్కిరిసి యుండఁగా కేశవచంద్రుఁ డానాఁటి యుదయమునఁ దనప్రార్థనలను గావించుకొని, తనభార్య హస్తము నొకకేలఁ బట్టుకొని తిన్నఁగా నాగుంపుమధ్యనుండి వచ్చుచుండెను. ఈతని యూహలకు గర్భశత్రువులై విఘాతములను గలిగింపవలెనని వచ్చియున్న యాజనుల

లో నొక్కరును నాతనిని బ్రతిఘటింపలేక నిలిచిపోయిరి. ఇట్టిసమయములం దితరులను క్షణములో వశ్యము చేయు నిర్వచింపరాని యొక 'యది' యానిముషమున నీసంస్కర్త్రాగ్రణిముఖమున నుండెనని యాతని చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. శత్రువులనుసహితము లొంగఁజేయు ముఖవికాసముతో నెలుఁగెత్తి తెలుపుమని యాతఁ డాజ్ఞాపింపఁగానే, యదివఱకుఁ గేశవచంద్రుసేనుని పోక నాఁపుటకు వీధికవాటమును బంధింప నాజ్ఞ గొన్న ద్వారపాలకుఁ డాద్వారమును దెఱచివైచెను. ఆదినముననే కేశవచంద్రసేనుని మఱల నింటికి రావలదని యాతనివా రాతని కుత్తరమును వ్రాసిరి. అది మొదలు కొంతకాలమువఱకు దేవేంద్రనాథఠాకురు నింటనే కేశవచంద్రసేనుఁడు నివసించుచుండెను.

ఈవిధముగా చిన్ననాఁడే వికసింప నారంభించిన మతవిషయములు కాలము పోనుపోను కేశవచంద్రుని పెద్దయత్నములలోనికే దింపసాగెను. తాను గృహమునుండి వెలిఁబడుటకు మును పొకసంవత్సరము బలవంతమువలన నీతఁ డుద్యోగములోఁ బ్రవేశించినను దఱువాత యావజ్జీవమును మతవ్యాప్తికై వినియోగింప నెంచి యీతఁడుద్యోగమును మానివేసెను. దేవేంద్రనాథ ఠాకురుగారి యింటనీతఁడున్న కాలములో బ్రహ్మసమాజమునందుఁ గొన్నిక్రొత్తమార్పులు జరిగినవి. యజ్ఞోపవీతధారణమును నొకవిగ్రహార్చనము వంటిదేయనియు, హిందూసన్యాసులు సహితము దీనినిఁ బరిత్యజింతురనియు కేశవచంద్రసేను లాయనచేత నొప్పించి యాయనచే నీసూత్రమును దీయించివైచెను. మతమనునది ప్రకృతిజ్ఞానమభివృద్ధినందు కొలఁదిని దానికనువగురీతిగా నభివృద్ధి నందవలెనని యాతనియుద్దేశము. అందువలన నిట్టిప్రకృతిజ్ఞానమునకును నదిబోధించు సర్వేశ్వరుని లక్షణములు మనయుక్తకృత్యములు మొదలగువానికిని సాధనభూతములగు మానవాత్మ, ప్రకృతి ఈరెండే నిజముగా నీశ్వరుఁడు మానవాభివృద్ధికి వ్రాసియిచ్చిన గ్రంథములని యీతఁడు నమ్మెను. పరమేశ్వరుఁ డొసఁగు వేదము భేదముకలదిగాక సర్వజనులకును నొక్కతీరుననేయుండవలయుననియు, ప్రకృతమున దేవదత్తములుగాఁ దలఁపఁబడు బైబిలు, కొరాను, వేదము మున్నగునవి సామాన్యలక్షణములనుగాక యన్యోన్యవిరుద్ధధర్మములను గలిగి యావత్ప్రపంచమునకు సామాన్యముకాని భాషలలో వ్రాయఁబడియుండుటచే నవి యీశ్వరకృతములు కావనియు నీతఁ డూహించెను. మఱియును నేమతగ్రంథములోనైనను మానవాత్మకు సృష్టివిమర్శనమువలనఁ దెలియనివిషయములు బోధింపఁబడలేదు. దమకుఁగల ప్రకృతిజ్ఞానమునుబట్టి యప్పటి నరులలో బుద్ధిమంతులు కొందఱు సర్వమతగ్రంథములను వ్రాసియున్నారు. మానవబుద్ధి భ్రమప్రమాదజనితమైనది. అదిగాక నేటిదినమున పరమసత్యమని తలఁపబడిన సిద్ధాంతము ప్రకృతి జ్ఞానా

ధికృతనైనకొలఁదిని వట్టిదబ్బరగా మాఱిపోవచ్చును. అందువలననే మానవునికి యుక్తాయుక్తవిచక్షణజ్ఞాన మొసఁగఁబడినది. దీని ననుసరించి పురాతనగ్రంథములలోని సత్యాసత్యముల నరసి, సత్యము ననుష్ఠించువాఁడే సార్థకజీవనుఁడు. లేనివాఁడు ఆముష్మికచింతలేక తనజీవనమును వ్యర్థము చేసికొనుచున్నాఁడు. ఇందువలన వేదము మొదలగునవియే విశ్వాసార్హము లనియు నలంఘ్యములనియుఁ జెప్పుట సత్యమైనది కాదు.' ఈ విధముగా నూహించి కేశవచంద్రసేనుఁడు పురాతనగ్రంథముల ప్రామాణికతను నిరాకరించెను.

తోడనే బ్రహ్మసమాజపు సభికులయం దన్యోన్యవైషమ్యములు గలిగెను. బ్రహ్మసమాజమును క్రైస్తవమతములోఁ గలుప నుంకించుచున్నాఁడనియు, జాతిభేదములను బోఁగొట్ట నెంచుచున్నాఁడనియు, గేశవచంద్రసేనునిపై ననుమానములను బెట్టుకొని కొందఱు సమాజపుసభలకు సహితము రాక మానివేసిరి.

రామమోహనుఁ డైరోపాదేశపు ప్రకృతిజ్ఞానమును హిందూమతాచారములందుఁ జొప్పించి యాప్రకారముగాఁ దనతఱువాతివా రొనర్చుటకు వలయు బీజములను దన మతధర్మములం దిమిడ్చెను గదా. ఈ విధముగా నాతనికోర్కె కేశవచంద్రునియందు సఫలమైనది. అయినను తన మెడనుండి జందెమునైనను దీసివేయలేక యుంచికొనిన రామమోహనుఁడే కేశవచంద్రుని కాలమునాఁటికి బ్రతికియున్నయెడల నీతని సంస్కరణముల కాతఁ డామోదించునా? ఏది యెట్లున్నను దేవేంద్రనాథఠాకురుగారి యాజమాన్యముక్రింద బ్రహ్మసమాజమున్నంతకాలమును గేశవచంద్రసేనుని సంస్కరణము లామోదింపఁబడునట్లు తోఁచలేదు. ఇందువలనఁ గేశవచంద్ర బ్రహ్మానందులవారు దేవేంద్రనాథఠాకురుగారినుండి చీలిపోయి 1860వ సంవత్సరమున భరతవర్ష బ్రహ్మసమాజమును స్థాపించిరి.

ఇప్పుడు కేశవచంద్రసేనులు బ్రహ్మసమాజమును దొల్లింటివలె నుంచలేదు. విగ్రహార్చకకర్మ లన్నియుఁ గొట్టివేయఁబడినవి. జాతిభేదములు తొలఁగింపఁబడినవి. వేదాదులు, ప్రమాణగ్రంథములు కాలేదు. ప్రకృతిజన్యజ్ఞానమువలన నిరూపింపఁబడిన సిద్ధాంతములే సంఘమతసిద్ధాంతములైనవి. నూతనరీతిని వివాహాదికర్మ లీసంఘమునం దప్పుడు జరుగ నారంభించెను. రామమోహనుఁ డుద్దేశించినరీతి ప్రార్థనములే యుత్తమోత్తమములుగా నంగీకరింపఁబడెను. స్త్రీవిద్యకుఁ బ్రాముఖ్యతయు స్త్రీలకు స్వతంత్రతయు నీఁబడెను.

ఈ విధముగా భరతవర్ష బ్రహ్మసమాజమును స్థాపించినతఱువాతఁ గేశవచంద్రుఁడు స్వమతవ్యాప్తికై దేశసంచారము చేయసాగెను. అంతకు మునుపే దేశములోని పెక్కు

చోట్ల కొన్ని ప్రార్థనాసమాజములు స్థాపింపఁబడి పని చేయుచుండెను. కేశవచంద్రుఁ డా రాష్ట్రప్రదేశము లన్నింటికిని బోయి తా నేర్పఱచినమతమునుగూర్చి బోధింపసాగెను. హిందూదేశములో వక్తృత్వమునం దద్వితీయుఁడైన యాతని యుపన్యాసములను వినఁగానే ఎంతటివారును నీతనియభిప్రాయముల ననుసరించుచుండిరి. ఇట్టిసభలలో మిక్కిలి ముఖ్యమైనది మాంగీరుపట్టణమునఁ జరిగినది. అక్కడ నితని యుపన్యాసము విన్నవారు హిందువులలోని నమ్మకము చొప్పున ఏమహావిష్ణువో ధర్మస్థాపనార్థము తిరిగి యవతారమెత్తెనని భావించిరి. పామరజనులు దాసానుదాసులయి ఈతని పాదములపైఁ బడి 'స్వామీ! నాకేమిగతి?' యని మొఱలిడసాగిరి. ఒకటిరెండుదినము లగువఱకు కేశవచంద్రుఁడు భూమిపై బారెడెత్తునకు లేచుట, నీళ్ళపై నడుచుట ఇట్టి రీతి కృత్యములను సహితము చేసినట్లు ప్రవాదము లూరియందంతట నల్లుకొనసాగెనఁట. ప్రతిభక్తాగ్రగణ్యునిచరిత్రమును అస్వాభావికములగు చచ్చినవారిని బ్రతికించుట మొదలగు విషయములతో నిండియుండుట తమగౌరవమును దెలుపలేక ఈరీతిగా వ్యవహరించి ఈశ్వరత్వము నారోపించుటచేతనే గదా.

ఈ విధముగాఁ గేశవచంద్రసేనుఁడు వంగదేశమును, బొంబాయి, చెన్నపురి మొదలగు పట్టణములను దిరిగి యనేకులను దనమతము నవలంబించునట్లు చేసి, బ్రాహ్మసంఘము నొకదానిని నూతనముగా సృష్టించెను. ఈ విధముగా రామమోహనునిచేఁ దెలుపఁబడిన ధర్మములు కేశవచంద్రుని కాలమునాఁటికి నూతనమతప్రతిష్ఠాకారము లయినవి. ఇట్లు కొంతకాలము గడచినతరువాత 1870వ సంవత్సరమునందు కేశవచంద్రసేనుఁ డింగ్లాండుదేశమునకుఁ బ్రయాణమాయెను. ఆదేశమున నీతనిని శ్రీవిక్టోరియా మహారాజ్ఞి మొదలుకొని ప్రతివారును గౌరవించిరి. అందు శ్రీ రాణీ చక్రవర్తినిగారు కేశవచంద్రసేనునియందుఁ దమకుఁగల వాత్సల్యమును జూపుచుఁ గొన్నిగ్రంథములను దమ ప్రతిపటము (Photograph) లను నొసఁగుటయేకాక యాతనియొక్కయు నాతనిభార్యయొక్కయుఁ బ్రతిపటములనుగూడఁ గోరికొని తీసికొనిరి.

ఇంగ్లాండునకుఁ బోయి వచ్చినతరువాత కేశవచంద్రుని సంస్కారణదీక్ష వేఱొకరీతినిఁగూడ నభివృద్ధినందినది. ఇంతవఱకు నీతఁడు సంఘసంస్కరణమునకై యంతగాఁ బనిచేయలేదు. ఇంగ్లాండునందు స్త్రీపురుషులు సమానస్వాతంత్ర్యములతో నెల్లెడల సంచరించుచు బ్రపంచజ్ఞాన మలవఱచుకొనుటయు, నిండియాయందు స్త్రీలు కారాగృహము లనఁబడు నిండ్లలో బంధింపఁబడి ప్రపంచజ్ఞానశూన్యలుగాఁ జేయఁబడుటయు, నింగ్లాండునందు అతిబాల్యవివాహములును స్త్రీపునర్వివాహనిషే

ధములును లేకుండుటయు, నీదేశమున నవి యాచారమగుటయు, నింగ్లాండున స్త్రీవిద్యాభివృద్ధియగుటయు, నిండియాలో అక్షరము నేర్చిన స్త్రీ మహాపాతకిగాఁ బరిగణింపఁబడుటయు నిట్టివిషయము లనేకములు కేశవచంద్రుని హృదయమునకును నేత్రములకును స్పష్టముగాఁ గానవచ్చెను. తోడనే యాతఁడు హిందూదేశమునందు మిగుల విఖ్యాతిగాంచిన హిందూహూణవైద్యులకుఁ బెక్కండ్రకు స్త్రీలకు ఏ యీడునఁ బునస్సంధానముచేయుట యుక్తమో తెలుపుఁడని వ్రాసికొనెను. హిందూదేశపు శీతోష్ణస్థితిని, ఇందలిస్త్రీల లక్షణమును బరిశీలించి పెక్కండ్రు పదునాలవయేఁడునకుఁ బూర్వమున నదిజరుగఁగూడదని ప్రత్యుత్తరమంపిరి. కొందఱుమాత్రము పదునాలుగవయేటికిఁ బూర్వమేజరిగినయెడల నష్టము లనేకములు కలవని యభిప్రాయమిచ్చిరి. సాధ్యమగు నంతవఱకుఁ దక్కువ ఈడునే వేయనెంచి యాతఁడు పదునాలుగవయేఁడునకుఁ బూర్వమున నే స్త్రీకిగాని వివాహము జరుగఁగూడదని శాసించెను. ఇదిగాక బ్రహ్మసమాజమువారి వివాహములు మంత్రహోమాన్వితములైనవి కానందున నట్టి వివాహములు న్యాయసభలలో నంగీకరింపఁబడవు. అందువలన వారసత్వమునకు నష్టము లనేకములు గలుగును. ఈవిషయమును విమర్శించి కేశవచంద్రసేనుఁడు బ్రాహ్మల వివాహపుచట్టమును దొరతనమువారిచేఁ జేయించెను. దానివలన ఏ బ్రాహ్మఁడుగాని పదునాలుగేండ్లలోపు బాలికలకు బ్రాహ్మవివాహపద్ధతుల ననుసరించి వివాహముచేసినయెడల నదిసరియైన వివాహముగాఁ బరిగణింపఁబడదు. ఈచట్టమునకు లోపలనే కేశవచంద్రుఁడు పైనిచెప్పిన స్త్రీవిద్య వితంతువివాహము మొదలగు వాని నన్నిటిని బ్రాహ్మసంఘములోనికిఁ గొని వచ్చెను.

ఇట్లుండఁగాఁ గొంతకాలము నాటికి కేశవచంద్రసేనుని కుమార్తెకు వివాహము వచ్చినది. మిక్కిలి ఘనత వహించిన కుచిబేహారు మహారాజుగారు బ్రాహ్మమతావలంబులై యాకన్యను వివాహమాడఁ గోరిరి. కేశవచంద్రుఁడు తనకుమార్తెకు వివాహశాసనానుసారముగా సరియైనవయస్సు రానందున, నప్పుడు వివాహముచేయుట కీయకొనకున్నను, ప్రధానమని పేరు పెట్టి రాజనగరములోని కామెను గొనిపోయి బలవంతముగాఁ బెండ్లిచేసిరని యాతనిచరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. కొందఱు మంచి సంబంధము వచ్చినందున ఇష్టపడి కేశవచంద్రుఁడు తాను చేసినవిధిని తానే మీఱి చరించెనని భావించుచున్నారు. ఏది యెట్లున్నను గొంతకాలమునుండి కేశవచంద్రసేనునికి వ్యతిరిక్తముగా నుండెడి యొక కక్ష బ్రహ్మసమాజమునందే బయలుదేరెను. కేశవచంద్రుఁడు నానాఁటఁ గొంచె మధికారప్రాబల్యము కలవాఁడై తా నీశ్వరునిచేఁ బంపఁబడినదూతయైనట్లు భావించుచుండెను. తనవిషయమై యిట్టి యభిప్రాయములను

జనులుపడుట కనువగురీతి సిద్ధాంతముల నాతఁడు బోధించుచుండెను. నానాటికి బ్రహ్మసమాజమునందు కొన్ని విగ్రహార్చనమువంటి కర్మలుకూడ రాసాగెను. ఈవిధములగు కారణము లనేకము లేకీభవించుటచే, నీతని ప్రతికక్షులందఱును నీతనినుండి విడిపోయి స్వతంత్రముగా సాధారణబ్రహ్మసమాజమును స్థాపించుకొని, యీమతమును మఱల నుద్ధరించిరి. ఇప్పటికినిఁగూడ సాధారణబ్రహ్మసమాజమునకుఁ బ్రాణమై నిలిచియున్న పండిత శివనాథశాస్త్రి యెమ్మే గారీ ప్రతికక్షులలో నగ్రగణ్యులు. వీరివలననే క్షీణదశకు రావలసిన బ్రహ్మసమాజము మఱల బాగుపడినది.

ప్రతికక్షు లీవిధముగాఁ జీలిపోయినతఱువాత కేశవచంద్రబ్రహ్మానందులవారు నవవిధానబ్రహ్మసమాజమను పేర నిలిచియున్న తనసమాజమునందుఁ గొన్నిమార్పులను జేసెను. అందు ముఖ్యములైనవి హోమములను గొన్నివచ్చుటయు, ప్రాచీనభక్తాగ్రగణ్యులు నివసించినప్రదేశములకుఁ దీర్ఘయాత్రలకుఁ బోవుటయును.

ఈవిధముగాఁ బనిచేసి 1883వ సంవత్సరము జనవరు నెలలో శ్రీ కేశవచంద్ర బ్రహ్మానందులవారు బహుదినములనుండి తన్ను బాధించుచున్న యొకవ్యాధివలన నీలోకమును విడిచిపెట్టిరి. మరణబాధలనందుచున్నప్పుడుగూడ నీమహనీయుఁడు ఈశ్వర నామోచ్చారణము వినఁబడఁగానే సంతోషచిహ్నములను దనముఖమునఁ జూపుచుండెను. మరణమునందిన కొంతసేపటికి ఈతనిముఖమున నానందసూచకమో యనునట్టి నవ్వొక్కటి బయలుదేఱి యట్లే నిలిచినది.

కేశవచంద్రసేనునిఁగూర్చి హిందూదేశములో ననేకులు సదభిప్రాయముతో నున్నను, బ్రహ్మసమాజమువారిలోఁ గొందఱుమాత్ర మాతనికి నిజముగాఁ జూపవలసిన గౌరవమును జూపక చచ్చినవెనుకగూడఁ బగసాధించుచున్నారు. ప్రతిమానవుఁడును భ్రమప్రమాదవివశుఁడేయగుటచే గేశవచంద్రునియందును గొన్నిలోపము లున్నవని మేమును నొప్పుకొనుచున్నాము. అవి మిక్కిలి గొప్పలోపములైనను గానిండు. అప్పటికిని ఆతఁడు హిందూదేశమున కొనర్చినమేలు నిరుపమానమైనది. ఎవ్వాఁడు ప్రపంచములోని యితరాశల నన్నిటినిఁ దృణప్రాయముగాఁ ద్యజించి, ఈశ్వరాభిముఖుఁడై గట్టిపునాదినైనను లేక పడియున్న బ్రహ్మసమాజమునకుఁ బాటుపడి చెమ్మటలూర్చి నూతన మతసంఘనిర్మాణములను జేసెనో, యట్టి ప్రకృతకాలపు హిందూసంస్కర్త్రాగ్రేసరుని హీనభావముతో బ్రహ్మసమాజమువారే కొందఱు చూచుచుండుట ద్రోహమని మేము భావించుచున్నాము. ఇప్పటి బ్రహ్మసమాజములవా రంగీకరించినను నంగీకరింపకున్నను హిందూమతసంస్కర్తలలోఁ గేశవచంద్రసేనుని స్థానము మిక్కిలి

యౌన్నత్యమునంది యుండకమానదు. “నాయందలి ‘అహమ్’ అను పక్షి ఎక్కడికో ఎగిరిపోయినది. ‘నేను’ అనునది నాయందు లేదు. నాసమస్తమును ఈశ్వరునికే నే నిచ్చినాను. ఇఁక నే నాయనయాజ్ఞల ననుసరింపవలసిన దాసుఁడను” అను తన బోధనల ననుసరించిన యీమహామహుఁ డుత్తమమతకర్తలగు బుద్ధుఁడు, శంకరుఁడు మొదలగు వారితోఁ జేర్పఁబడవలసినవాఁడు. ఈతని బోధనలు వారిబోధనలకంటెఁ బవిత్రతరములైనవి. అందును యుక్తములనే మనము గ్రహింపవలెనని కేశవచంద్రులవారే చెప్పియున్నారు. ఇఁకనైనను హిందూదేశీయు లీమహనీయుని కుచిత గౌరవము నొసఁగుదురుగాక.

కేశవచంద్రసేనుని యనంతరమున ఆతనికి బంధువును జిన్ననాటినుండియు ననుచరుఁడునునగు బాబుప్రతాపచంద్రముజుందారను నాయన యాయన నవవిధానబ్రహ్మసమాజమునకైఁ బనిచేయుచున్నారు. అవ్వల సాధారణబ్రహ్మసమాజమువారును శివనాథశాస్త్రిగారి యాజమాన్యముక్రింద మతవ్యాప్తికై పనిచేయుచున్నారు. కాని కేశవచంద్రుని మరణము నాటినుండియుఁ దగిన నాయకుఁడు బ్రహ్మసమాజమునకు రానేలేదు. అశ్రద్ధ, స్వకార్యధురంధరత్వము మొదలగునవి బలిసినందున నీసంఘమువారు నలుగురును మతవ్యాప్తికై సహాయపడుటలేదు. పనిచేయ నుద్యమించువారు వలసిన ధనసహాయాదులు లేమిచే నూరకొనియున్నారు. ఈవిధముగా హిందూదేశములో బందొమ్మిదవ శతాబ్దాంతము నాటికి హిందూదేశములోని బ్రహ్మసమాజము లన్నియు నిద్దరవోవుచుండెను. కాని కేశవచంద్రుని ధీచతురతవలన నందు మంచి మంచిసంఘమతాచారములు నెలకొలుపఁబడుటచే నవి వంశపారంపర్యముగా వచ్చుచున్నవి. క్రొత్తవారు చేరుటకై వీరు పనిచేయకున్నను, నిందలి సత్యములు స్వయంబోధకములై కేశవచంద్రుని కలిమివలన, దాముగానే జనులనుదప్పక ఈసంఘమున కాకర్షించును. ఈసంఘ మెప్పుడును హిందూదేశములోని యుత్కృష్టసంఘ మతసంస్కరణముల కాకరమై క్రొత్తవారువచ్చి చేరినను జేరకున్నను దనలో నొకలోపమును గష్టమును లేకుండ నుండును. సర్వేశ్వరుఁ డిట్టి సంస్కరణములను నెఱపుటకు మన సంస్కర్తలకుఁ దోడైయుండునుగాక.

పదునేడవ ప్రకరణము.

హిందూసంఘసంస్కరణముయొక్క భావిస్థితి.

హిందూసంఘసంస్కారమునుగూర్చిన యిట్టిగ్రంథములందు హిందూసంఘసంస్కరణముయొక్క భావిస్థితినిఁగూర్చి యించుక తెలుపనియెడల నిది యసంపూర్తిగా నుండును. ఇదిగాక ప్రకృతమున నప్రయత్నముగా జరుగుచున్నమార్పులను విశదీకరించి చూతుమేని, ఈవిషయమునుగూర్చి వ్రాయుట యంతకష్టతరముగా సహితము తోఁచదు. చక్కఁగా విమర్శింపనేరక, పయిపై బాహాటముగా జరుగు విషయములను మాత్రమే పరిశీలించువారికి, భావిస్థితినిఁగూర్చి తెల్లము చేయలేనికార్యసంస్కర్తల మూఁడునాలుగుసంస్కరణకార్యములే గోచరించునుగాని, లోతునకు దిగి చూచువాఁడు మాత్రము ప్రకృతమున నిముషనిముషమునకును మనకుఁ దెలియకుండనే హిందూసంఘము యొక్క స్థితిని మార్చివేయుచున్న యత్యద్భుతశక్తులను జూచి యాశ్చర్యపడక మానఁడు. ప్రకృతకాలపు హిందూసంఘము పరోపకారశూన్యత స్వకార్యధురంధరత్వము దేశాభివృద్ధికరములగు కార్యములయెడ నశ్రద్ధ లేక యవివేకము మొదలగు గుణములనే సామాన్యముగా వెల్లడించుచున్నను, వీనియన్నిటికంటెను లోతుగా వానియందే హిందూసంఘమును గొలఁదికాలములో నైంద్రజాలికునివలెఁ దెలియకుండనే మార్చివైచు మహాశక్తి యణఁగి పని చేయుచున్నది. అతివిమర్శనమువలన నొక్కసంస్కరణమునుగూడఁ జొరనీయని పూర్వనాగరికాగ్రేసరులుసహితము ఈశక్తికి లోఁబడి యది త్రిప్పినట్లెల్లఁ దిరుగుచున్నారు. హిందూదేశోద్ధారకమగు నీమహాశక్తియే సంఘైక్యతకు ముఖ్యధర్మములగు సామాన్యభాష, సామాన్యమతము, సామాన్యనాగరికత యను నీమూఁటిని మనదేశమునకుఁ గొనివచ్చుటకుఁ బ్రయత్నించుచున్నది.

మనకన్నులను గప్పి దొంగవలె మనదేశపు పూర్వాచారములను మెల్లమెల్లన నెత్తుకొనిపోవుచున్న యీమహాశక్తికి జననీజనకు లాంగ్లేయవిద్యయు నాంగ్లేయులతోడి సంపర్కమును. ఒకటి హిందువులు పూర్వమే కాలమునాఁడును దెలిసియుండని ప్రకృతిశాస్త్రవిషయములన్నిటిని, సవిమర్శకముగా ప్రత్యక్షప్రమాణపూర్వకముగాఁ జెప్పి వారియజ్ఞానాంధకారమును రూపుమాపుచున్నది. రెండవది అట్టిజ్ఞానమునకును మనుష్యుని యాచరణమునకును గలసంబంధమును వస్తుపాఠమునందువలెఁ జూపి మనకు యుక్తధర్మములను బోధించుచున్నది. ఈరెంటి బలిమివలనను హిందువులలోని య

జ్ఞానము కొంతవఱకు నశించినది. ఉత్తమకార్యదీక్షగల మానవసంస్కర్తలకంటెను గూడ నధికమగు బలముతోను ఏయాతంకములును లేకుండను బని చేయుచున్న యీ రెంటిని యింకను లోతుగాఁ బరిశీలించి చూచినయెడల అందొక్కటొక్కటియే యిప్పటికాలపు టాచారములకును నేఁబదేండ్లక్రిందటి జనుల యాచారములకునుగలభేదమును జేయుటయం దెంతవఱకుత్తరవాదిత్వము వహించియున్నదో, ముందది యింక నేమి చేయనున్నదో విశదము కాఁగలదు.

మొట్టమొదట హూణవిద్య మనదేశమునకు వచ్చినప్పటి స్థితిని విద్యను గూర్చిన ప్రకరణమునం దిదివఱకే వ్రాసియున్నాము. విద్య ముందుగా మనకు భూమి గుండ్రము నున్నదని సకారణముగా బోధించి చెప్పినది. తోడనే మనవారికి పురాణములలోని కల్లుసముద్రములును, శాకద్వీపములును, నసత్యకల్పనలని తెలిసినది. హూణవిద్య గ్రహణములకు సరియయినకారణములను దెలిపినది. మనవారికి రాహుకేతువులవేధలును, విష్ణువుజగన్మోహనస్వరూపము నాఁటి సూర్యచంద్రుల నేత్రసంజ్ఞలును నసత్యములని తెలిసినవి. హూణవిద్య ఖగోళగణితమును బాలురకు నేర్పఁగానే నక్షత్రములు మహామునీశ్వరు లనియుఁ జంద్రుని భార్యలనియుఁ దెలుపు పురాణవాక్యములకుఁ జేటు మూడినది. శారీరశాస్త్రమును సంగ్రహముగా బాలురకు బోధింపఁగానే శిరస్సునందలి బ్రహ్మరంధ్రములును, నాభినుండి పైకి వ్యాపించు పాములును నిలువఁజోటులేక యదృశ్యము లయినవి. వేయేల? మనకన్నులయెదుటనే కార్యములను జేసి చూపి హూణవిద్య నిజమైన సిద్ధాంతములను దెలియఁబఱిచినప్పుడు అజ్ఞానపూర్ణములగు హిందువుల పురాణములు తమబలము నెప్పటియట్ల చూపఁగలవా? పూర్వ మింగ్లీషులేని కాలమునను, నిప్పటికిని నీభాషాజ్ఞాన మించుకేనియు లేనివారికిని, ద్యోతక మగుచున్న జనసామాన్యముయొక్క నమ్మకము పురాణములు ఏయర్థముతో వ్యవహింపఁబడుచుండెనో మనకుఁ దెలుపుడు చేయుచున్నది. అయినను పూర్వగ్రంథములందలి యభిమానమును విడువలేక యిప్పటికొందఱు వాని పైయర్థములు తప్పనియు, లోపల నింకొకయర్థ మున్నదనియుఁ జెప్పుచున్నారు. తన యసత్యము బట్టబయలైనప్పుడు మనుష్యుఁడేదేని యొకయుక్తినిఁ బన్ని దానిని నిజమని వాదింపఁ జూచునట్లే ఇంగ్లీషుభాషాభ్యాసమువలన నిజానిజములను దెలిసిన కొందఱు వట్టిదబ్బరగాఁ గానిపించు పవిత్రగ్రంథముల పైరీతివాక్యములను అసత్యములని దూరముగా నుంచలేక అభిమానాతిశయముచే లోపల నింకొకయర్థ మున్నదని చెప్పి వాని తొల్లింటి గౌరవమును గాపాడఁ జూచుచున్నారని మేము నమ్ముచున్నాము.

ఏది యెట్లున్నను నింగ్లీషువిద్య మనవారిలో నంతగా వ్యాపించకమునుపే పైరీతి మార్పుల ననేకములను జేసినది. ప్రకృతమునఁ బొట్టకూటికిమాత్రమే జనులు విద్య

నభ్యసించుచున్నారని మే మిదివఱకే వ్రాసియున్నాము. అదిగాక ప్రకృతమున నేర్పఁబడురీతి విద్యకూడ నదిచేయవలసినంత లాభమును గలుగఁజేయుటలేదు. ప్రకృతపు విద్యాశాఖాధికారులందఱును హిందువుల స్థితిగతులనుబట్టి యింకను దేశోపకారకములగు నభివృద్ధులనుదప్పక చేయుదురని మనము నమ్మవలసియున్నది. ఈరీతిమార్పులు వచ్చినను రాకయున్ననుగూడఁ బ్రకృతమున నేర్పఁబడుచున్నరీతి విద్యసహితము దశదిశలవ్యాపింపఁగానే మనదేశమునందును బెక్కంద్రు జగదీశచంద్రవసు లుత్పన్నమగుదురు. అప్పటికి స్త్రీవిద్యకూడ అతిశయించుటచేతను పశ్చిమదేశజ్ఞానము మనకడస్థాయినైయుండుటచేతను గొన్ని పూర్వాచారవ్యవహారాదులు పూర్ణముగా నడుగంటును. ఆకాలమునందు ఆఱునెలల వెనుక నుదికినపట్టు బట్టలును, మురికినీటిలోని పర్వస్నానములును, గోమయభక్షణములును ఏకాదశీనిరాహారములును గలలోనివార్తలై ఆరోగ్యశాస్త్రములు ప్రమాణగంథములగును. విద్యాభివృద్ధిఁగాంచిన నారీరత్నముల వివేకదృష్టి నెదుట పూర్వసిద్ధాంతములు రూపముమాఱి శుభ్రతయే మడియనియు నశుభ్రతయే మైలయనియు లోకమునకు వెల్లడించును. అంధకారబంధురములై పచన యష్టి సముద్భూత ధూమ పంకాలంకారములై, నిరంతర లూతామక్షికాదికీటకసంచార సమృద్ధములై అవశేపిత ఘృతతైలాదిపరిపూరిత కవాటములై తేజోవాయ్వాదిపంచభూత దుర్గమములై ప్రసవస్త్రీప్రాణాపహారకములై మహాఘోరములై ప్రత్యక్షయమద్వారములైయున్న కొన్నిహిందూగృహము లానాఁడు బహుకాలజీవనము నొసఁగెడు దివ్యమందిరములగును. ఇప్పుడు గొప్పయుద్యోగములకై పరీక్షలనీయ నన్యదేశములకు సకృతుగాఁ బోయెడువా రానాఁడువర్తకాదులకై తఱచుగా నరుగుచు నం దందలి సదాచారములను విమర్శించి మనదేశమున స్థాపించుచుందురు. ఇప్పు డింగ్లీషు చదువువా రాభాషనే యుత్తరప్రత్యుత్తరములను సంభాషణములను జరుపు నాచారము స్త్రీపురుష విద్యావ్యాప్తిమైనకొలఁదిని ముదిరిపోయి, కొన్నినాళ్ళకు ఇంగ్లీషునే దేశభాషనుగా మార్చివేయును. ఈకడపటివిషయము హిందూసంస్కర్తలకు సహితము హృదయశూలమై నాటవచ్చునుగాని, ప్రకృతమున జరుగుచున్నయాచారమును, దానిబలిమిని, రానున్నవిద్యాభివృద్ధిని, హూణప్రభుత్వమునందు మనకుఁగల గౌరవమును, నదియే చిరకాల ముండవలయునన్న మన నిష్కళంకమగు ప్రార్థనమును విమర్శించినప్పుడు భావికాలపు హిందూదేశభాషనుగూర్చిన మాయభిప్రాయము అసత్యము కానేరదు.

హిందువులయాచారవ్యవహారములను అప్రయత్నముగా మార్చుచున్న మహాశక్తినిఁ గలుగఁజేసిన రెండవకారణము ఆంగ్లేయులతోడి సంపర్కమని యిదివరకే వ్రాసియున్నాము. సర్వకళాశాలలయందును, నున్నత రాజకీయ కార్యస్థానములందును పెద్దపెద్ద వర్తకశాలలందును జాలచోట్ల నైరోపియను లుండియే యున్నారు. ఇదిగాక మతబోధనమునకై కొందఱు ప్రతి పెద్దపట్టణమునను నివసించుచున్నారు. మ్లేచ్ఛులని యింటివద్ది ముసలివాండ్రు వారి కెంతదూరముగా నున్నను, నిత్యసంబంధము గల మనము మాత్రము వడవడ వణకించు ప్రతిశీతకాలమునందును సాయంస్నానములను రాత్ర్యుపవాసములను ప్రతిదిన నూతనయజ్ఞోపవీతధారణములను జేయఁజాలము గదా. ఈవిధముగా మొదటిదినములలోనే మనవారియందు మీఱరాని యొకసంస్కరణ మారంభమైనది. ఇప్పటికినిఁ బూర్వాచారపరాయణులగు పెద్దలు కొందఱు తెల్లవారిని సమీపించినప్పు డావస్త్రములను దూరముగా నునిచి స్నానముమాత్రము చేయుచున్నను, వారి తఱువాతితరములవారు మాత్ర మాయాచారము నవలంబించుట లేదు. ఇట్లు కొన్నితరములు పోనుపోను ఇంగ్లీషువిద్యవలని యుత్తమజ్ఞానము దీనికి సహకారియై అన్యోన్యభేదములను బోనడఁపును. ఈభేదవిషయ మొకవేళ నిట్లే యుండుననుకొన్నను, ఆంగ్లేయులను మనము విశేషముగా గౌరవించుటకు వారియందు సుగుణము లనేకములు గలవు. హిందువులయందు బలెవారియందు కాలమును వ్యర్థపుచ్చుటయుఁ బరాముకయు లేవు. కాలముయొక్క విలువను గ్రహించువారు మనలోఁ గొద్దిమందియే యున్నారు. హిందువుఁడు రెండుగంటల కొకకార్యమును జేయఁ దలఁచెనా నాలుగుగంటలకుఁగాని యాపనికి వెడలిరాలేఁడు. మూడుగంటల కొకసభ యన్నయెడల నాలుగుగంటలకు వచ్చుట హిందువుల కాచారము. ఏకకాలముననే ప్రతిదినమును భోజనము చేయుటయు ఒక్కనిమిషమైన భేదము లేకుండ సకాలముననే నిద్రించుటయు మనవా రెఱుఁగనే యెఱుఁగరు. మనదేశపు సేవకు లిప్పుడు రమ్మన్న నిఁక కొంతతాళి వత్తురు. ఇప్పుడు చేయవలసిన పనిని ఎప్పుడో చేయుదురు. ఎప్పుడో చేయవలసినదాని కిప్పుడే తొందరపడుదురు. ఈవిధముగా నుచితానుచితజ్ఞతలేక చరించు హిందువులు ఐరోపియనుల పద్ధతులను జూడఁగానే వారిసమయసన్మానములును, వారిసేవకుల స్వామి భయమును, కొండ వచ్చి మీఁదఁ బడినను జంకక తమకార్యముల నాచరించువారి దీక్షయు, నద్భుతమును గలిగించి యుక్తధర్మములను సకాలమునకుఁ జేయుట మానవధర్మముసుఁడీయని మనకు హితబోధ చేయును. నిజముగా నీధూమశకటములును, నీపాఠశాలలును, నీవ్యవహారస్థానములును లేనియెడల హిందువుల సకాలకార్యాచరణమును వేఱఁ దెలుపవలెనా? ఐరోపియనుఁడు సరిగా నైదునిముషము లుండఁగానే ధూమశకటస్థానమును జేరుటయు ఛాండసుఁ డొకఁడు బండిపోయిన యొకగంటకు మెల్లఁగా వచ్చిచేరి "ఈదినమున రైలు కాలమున కింతముందుగా నేల వచ్చినది." అని యడుగుటయు, నీరెండుశాఖలలోని భేదములను మనకు విస్పష్టము చేయవా? ఐరోపియనులయందలి యిట్టి యాచారములును, వారి గృహముల యాకా

ములును, నందు అందముగా నమర్చిన వివిధవస్తువులును, వారివస్త్రముల యొక్కయు దేహముయొక్కయుఁ బరిశుభ్రతయు—నిట్టిగుణము లన్నియును వా రెంతటి మ్లేచ్ఛులైననుగూడ వారియందు మనవారికి నిజమైన గౌరవమును గార్యానుకరణతను గలిగించును. అయినను కార్యనిర్వహణమునం దప్రమత్తతతోఁ గాలానుగుణ్యముగా వర్తింపఁజేయు శ్రద్ధయుఁ భక్తియు స్వప్రయోజనపరత లేని వ్యాపారములందు మానవులకు సర్వసాధారణముగాఁ గలుగ నేరవు. అందువలన నీగుణము లలవడుటకు ముందుగానే దేశీయుల కందఱకును జేతినిండఁ బనిపెట్టు లాభకరమైన వ్యాపారములు రావలసియుండును. వానియుత్పత్తికిఁ దగినప్రోత్సాహమును సదుపాయములును బత్రికాధిపతులును బ్రభుత్వమువారునుగూడఁ గనఁబఱచుచుండవలెను. అట్టియుత్పత్త్యభివృద్ధులకుఁ బ్రథమచిహ్నము లిప్పుడే కానవచ్చుచుండుటచేఁ నిఁక కొన్నితరములనాఁటికి హిందువులుపై సద్గుణము లలవఱచుకొని భాగ్యవంతులయి యుందురని మేము తలఁచుచున్నాము.

ఐరోపియను లన్న మ్లేచ్ఛులనునభిప్రాయములు బలహీనములై వారియందు గౌరవము పొసఁగుచున్న యీకాలములో వేఱొకరీతి సంస్కరణ మారంభమయి హిందూపూర్వాచారముల బలిమిని తగ్గించుచున్నది. ఐరోపియనులను సమీపించినందున మైలబడినవని బట్టలను దూరముగా నుంచు నాచారము తొలఁగినకొలఁదిని కొందఱు హిందువులు వారియిండ్లకడ రహస్యముగానో బాహాటముగానో తేనీళ్ళనుసహిత మందుండఁ బానము చేయుచున్నారు. తమబ్రాహ్మణవంశమునైనను బాటింపక ఔషధమున కభ్యంతరము లేదని హూణవైద్యశాలలలో శూద్రులచే జలమిశ్రమము చేయఁబడినమందులను, అమెరికా, ఇంగ్లాండు మున్నగుప్రదేశములలోని హూణులచేఁ జేయఁబడిన 'కాడ్' అను మత్స్యపుచమురులను హిందువులు బాహాటముగాఁ దీసికొనుట వారిజాతిభేదములను దుర్గమునందు వేఱొకసందునుగూడ నేర్పఱిచి, హిందువుల భావిస్థితినిఁ దెలియఁబఱచుటకు నూతనమార్గము నొకదానినిఁగూడఁ గొనివచ్చినది. దీనికిఁ దోడుగా దొరలచేఁ బచనము చేయఁబడిన బిస్కెతులనఁబడు గోధుమచూర్ణపు రొట్టెలను గూడ బ్రాహ్మణబాలురుకూడ బాహాటముగా భుజించుచున్నారు.

దీనికి సహాయులై క్రైస్తవమతబోధకులు బ్రహ్మసమాజాదిమతములవారును జాతిభేదములను, సర్వసంస్కర్తలును దేశములోని యతిబాల్యవివాహాదిదురాచారములను దెగడుచుండుటచే, కంటికగపడకుండ అభిప్రాయములను మార్చి జనులను గార్యసంస్కర్తలను జేయుచున్న పైని చెప్పినవాని యట్లే, యిదియును పూర్వాభిప్రాయములను వేఱొకరీతిని మార్చుచున్నది. ఐరోపియనులను దమగృహములకుఁ బిలుచుట

కిప్పుడిప్పుడు కొందఱు సాహసించుచున్నారు. వెలిబడియున్న కార్యసంస్కర్తలతో రహస్యముగానైన సహపఙ్క్తినిఁ గుడువఁజాలువా రనేకు లున్నారు.

ఈ విధముగా దశదిశలనుండియుఁ జెలరేఁగి హిందువులే జాతిభేదములకు శత్రువులై వైరీతి యాచారములను మెల్ల మెల్లన నారంభించుటచే నిఁకఁ గొన్నితరముల నాఁటికి హిందూదేశమునందు జాతిభేదము లుండ వని మేము స్పష్టముగాఁ జెప్పఁగలము. పూర్వమున వీధినుండి యయినను నడువఁ గూడని మాలవాఁ డిప్పుడు పెద్ద పట్టణములలో బ్రాహ్మణుని రాసికొనిపోయినను నపవిత్రత లేనప్పుడును, పూర్వమువలె విద్యాగంధము నపహరించి శూద్రులను దాస్యవృత్తికే నియోగింపక, నిష్పక్షపాతబుద్ధితో మనన్యాయప్రభుత్వము యోగ్యత గలవారికే యతిశయపదవుల నొసఁగునప్పుడును నిఁకమీఁద నొకజాతికంటె వేఱొక్కటి ఘనమైనదన్న బ్రాహ్మణకల్పితమగు వాక్యము బల ముడిగి, ఈశ్వరునికండ్లకు మానవు లెల్లఱును సమానులే యనియు, నిజమైన పరిశ్రమ చేయువాఁడే యౌన్నత్యము నందు ననియు,—మూఁడు వేలయేండ్లనుండి హిందూదేశమునం దణఁగఁ ద్రొక్కఁబడుచున్న సత్యవాక్య మిప్పుడు మఱల పైకి లేచి, స్వతంత్రరాజ్యమును జేయఁ జాలును. ఎన్నివిఘాతములు వచ్చినను సత్య మెన్నఁడో యొకనాఁడు బయలువెడలక మానదుగదా.

స్త్రీపురుషవిద్యలును, ఉన్నతదశయందున్న సంఘములతోడి సాంగత్యములును, అన్యదేశయాత్రలును బ్రబలినకొలఁదిని జాతిభేదముల బల ముడిగినట్లే అతిబాల్యవివాహాదులబలమును నణఁగిపోవును. అప్పుడు అతిబాల్యవివాహములు జరగవు. స్త్రీపునర్వివాహమునకు నిర్బంధము లేకపోయినను యిచ్చ వచ్చినవారు వివాహమాడుట కభ్యంతరము లుండవు. కన్యాశుల్కములును వరశుల్కములును నాకాలమున శతాబ్దములక్రిందటిమాట లగును. స్త్రీవిద్యలును, స్త్రీస్వాతంత్ర్యములు నభివృద్ధిఁ గాంచి హిందువులలోని 'ఘోషా' పద్ధతి యడుగంటిపోవును. స్త్రీపురుషులు స్వయంవరములను జరుపుకొందురు. ఇష్టము లేనియెడల వివాహసంబంధములు విడఁగొట్టఁబడుచుండును. వేయేల ? నాగరికత నందిన దేశములోని సంఘాచారములే హిందూదేశమునందును నాచారములై దేశమున కంతకంతకు ఒక్కటే నాగరికతను దెచ్చిపెట్టును.

ఈవిధముగాఁ గొన్నిశతాబ్దములనాఁటికి సర్వసంస్కరణములును నప్రయత్నముగా నొడఁగూడునేని, సంస్కర్తలవలని ప్రయోజన మేమనియుఁ బన్రెండవ ప్రకరణమునందు సంస్కరణపురుషులనుగూర్చి మేమంతగా వ్రాయనేల యనియుఁ గొందఱు ప్రశ్నింపవచ్చును. కాని సంస్కర్తలవలనఁ బ్రయోజనము లేకపోలేదు. ఇఁకఁ గొన్నినాళ్ళకుఁ గావలసినకార్యము లనేకములు వారిప్రయత్నములవలన నిప్పుడే సమకూరు

ను. కొన్నికొన్ని దురాచారములవలన మనదేశమునకుఁ గలుగుచున్న నష్టములు ప్రయత్నపూర్వకముగా జరుగుసంస్కరణములవలన జనసముదాయమునంతను బాధింపనేరవు. ముం దొకనాఁడు హిందూసంఘము బాగుపడునుగదా యని ప్రభుత్వమువారు సహగమనాదులను శాసింపనియెడల నెందఱి ప్రాణములనో గాపాడఁగలిగియు నూరకొన్నట్లగును. ముం దొకనాఁడు వితంతువివాహము లాచారములగును గదాయని సంస్కర్తలూరకొనియున్నయెడల, నీలోపుగా వారుకాపాడఁ గలిగిన యనేక వితంతువులను యావజ్జీవబాధల ననుభవింపుఁడని చెప్పి యూరకొనవలసివచ్చును. ఈకారణమువలన సర్వసంస్కరణములకును సంస్కర్తలు కార్యానుకూలము కనువగురీతినిఁ బనిచేయవలెను. దీనియందే సంస్కర్తృత్వమునకుఁ బ్రధానధర్మములగు వివేచనాశక్తి దేశాభిమానము, సత్యదీక్ష మొదలగునవి నెలకొనియున్నవి. వలదన్నను, ఒకవేళ నీమధ్య సంస్కరణము లనవసరములని తలఁచినను, ఏది యెట్లున్ననుగూడ దయామయులై ఈశ్వరాభిముఖులైన సత్యసంస్కర్తలు తమపూనికనుండి వెలువడఁజాలరు. వీరి సంస్కరణములన్నియు, ముందు సిద్ధించు సంస్కరణములకు ఊతములైనిలిచి, వానిరాకను వేగపఱుచును. అంతవఱకో కొంతవఱకో వీరు సంఘమునకు వేఱైనిలిచి కష్టములనుభవించినను దఱువాతఁ బైసంస్కరణములు సిద్ధించినప్పుడు దానితో నేకీభావము నందుదురు.

ఈవిధముగా దేశమునకు ముందు సిద్ధించునని ప్రకృతవిషయములనుబట్టి మేము చెప్పినవిషయములు హిందూమతాచార పరాయణులకుఁ బెక్కండ్రకు మనస్తాపమును గలిగింపవచ్చును. 'కలౌపంచసహస్రాంతే జాయతేవర్ణసంకరః' అను పురాతనవాక్యము వారికి స్మరణకువచ్చి, పూర్వాచారములను వారికన్నులకడ నిలిపి రానున్న దుర్దినములను వారికిఁ జూపవచ్చును. మనపూర్వాచారములపై మన కెంత గౌరవవిశ్వాసములున్నను అవి పోవుననుకొన్నప్పుడు మన కెంతదుఃఖము కలిగినను, విమర్శనాబుద్ధితో యోగ్యాయోగ్యములను విచారించి, అభివృద్ధినే కాంక్షింపవలయునుగదా. అయినను ప్రకృతకాలపువిషయములను విమర్శించి ముం దీమార్పులు గలుగునని సత్యముగాఁ దోచినవాని నిటుఁ దెలిపుట మాకు విధియైనందున నీవాక్యములవలన మనోకష్టమునందువారు మమ్ము మన్నింతురుగాక.

ఇంతవఱకును హిందూదేశమునకు సంఘైక్యతను బ్రసాదించు సాధనత్రితయములో సామాన్యభాషనుగూర్చియు, సామాన్య నాగరికతనుగూర్చియు వ్రాసియున్నాము. ఇఁక సామాన్యమతమునుగూర్చి వ్రాయవలసియున్నది. ప్రకృతకాలమునందు హిందూదేశము నావరించియున్న ముఖ్యమత మశ్రద్ధ. దీనివలన హిందువులందఱును నీమత

ము ననుష్ఠించువారే యని భావింపరాదు. అత్యంతగౌరవనీయులై తమకుఁగల నమ్మకము కొలఁదిని దమమతముప్రకారముగా వీసమెత్తైన లోటులేకుండఁ జరించు పురుషాగ్రగణ్యులు మనలోఁ బెక్కండ్రున్నారు. కాని హూణవిద్య నభ్యసించు బాలురలో మతమునుగూర్చిన యభిప్రాయములే లేవు. ఏ మతమునుగూర్చియు వారి కంతఁగాఁ దెలియదు. విద్యాభ్యాసమువలన వారికి మన వారియాచారవ్యవహారాదులయందలి నమ్మకము చెడుటయును, సిద్ధాంతభాగములనుగూర్చి వారి కంతగాఁ దెలియకుండుటయును ననర్థదాయకములై హిందూబాలుర ననేకులను మతవిరహితులనుగాఁ జేయుచున్నవి. అందువలన వారియందు ఈశ్వరభక్తి ధర్మనిష్ఠ మొదలగుగుణము లలవడక మతవిషయములు తలకెక్కరాని సూదిపోటుమాటలై వారిజన్మములను నిరర్థకముచేసి, వారిని నాస్తికతాచరణులగు జేయుచున్నవి. ఏమియుఁ దెలియని హేతువువలనను బెద్దనాఁడు కఠినతరములైన మతధర్మములు దురవగాహములగును గావునను, అశ్రద్ధయే హిందూదేశమునం దొకమతమైనది. మనదేశమునందు దొరతనమువారి పాఠశాలలలోను హిందూపాఠశాలలలోను మ్యునిసిపాలిటీల యొక్కయు జిల్లాబోర్డుల యొక్కయు పాఠశాలలలోను ఏవిధమగు మతమును బోధింపఁబడుటలేదు. క్రైస్తవ పాఠశాలలయందుఁ జెప్పఁబడు 'బైబిలు' మనవారి తలలకెక్కుటలేదు. ఎక్కడనో తర్కశాస్త్రమునందుఁ బట్టపరీక్షకుఁ బోవుకొందఱికిమాత్రము సర్వమతసారభూతములగు ధర్మతత్త్వములు కొన్ని బోధింపఁబడుచున్నను, నవి సుగమములుగా నుండుటలేదు. అందైనను అర్థము తెలియని నాలుగుముక్కలను ముక్కున నిడుకొనివ్రాసి పరీక్షను దాఁటి, ఏఱు దాఁటినవెనుక తెప్పతగులఁ బెట్టునట్లు కొందఱు బాలురా గ్రంథముల నొకమూలఁ బాఱవైచుచున్నారు. భావి హిందూసంఘకారకులగు వారి కీరీతి మతాభిప్రాయము లుండుటచే, వారు తమజన్మమునుబట్టి యెంతటి హిందువుల మనుకొన్నను దానివలని నష్టములు కొలఁదికాలములోనే మనదేశమునకుఁ బొడసూపకపోవు. విద్యార్థిదశ దాఁటినతఱువాత నూతనవిద్యాభ్యాస మసంభవముగా నుండుటచేతను, విద్యార్థిదశయందుండఁగానే వారికి మతధర్మములను నేర్పుటసామాన్యము కాకపోవుటచేతను, దొరతనమువారే బాలురకు మతమునుగూర్చికూడ నేర్పు కట్టుబాట్లను జేయవలెనను విషయములో మేము బిషప్ వెల్డన్ గారితో నేకీభవించుచున్నాము. కాని యాయన చెప్పినదానివలె నెల్లపాఠశాలలలోను 'బైబిలు' నిర్బంధము కావలెనని మాయభిప్రాయము కాదు. ఏమతగ్రంథముతోఁగాని సంబంధమించుకేనియు లేని వేదాంతశాస్త్రము నీతిశాస్త్రము మొదలగువానియందలి ధర్మములను తర్కమును సిద్ధాంతపూర్వకముగా విమర్శించుచు నాయాయి తరగతుల బాలుర విద్యాబుద్ధుల కనువగురీతి విషయములతో గ్రంథములను వ్రాయించి, ఇతరమతగ్రంథములు నేర్పని సర్వపాఠశాలలయందును వానిని

నిర్బంధముగా నునుచుట ఉత్తమోత్తమమని మా యభిప్రాయము. అందువలన మత ధర్మములును బ్రకృతిశాస్త్రధర్మములవంటివేయై సత్యమును వారికి విమర్శించిచూపి, వారిని బాగుచేయును. ఇందువలననే హిందూదేశమునకు ఏకమతము సిద్ధించునుగాని లేని యెడల నీమతమునకు భావిచరిత్రము చాలవఱకెక్కుడగును.

ఏది యెట్లున్నను హిందూదేశమునకుఁ బురాతనమతములలో నెద్దియు భావి మతము కానేరదు. అద్వైతులు అద్వైతమే హిందూదేశమునకు భావిమతమగుననియు క్రైస్తవులు క్రైస్తవమనియు, మహమ్మదీయులు మహమ్మదీయమతమనియుఁ, దమతమ స్వమతముపైఁ గల యభిప్రాయముల ననుసరించి హిందూదేశముయొక్క భావిమతము నకును దానికిని ముడివెట్టఁదలచినను, వారియూహలకు మించిన యన్యమతధర్మము లప్పుడే హిందూదేశమునందు వ్యాపింప నారంభించినవి. తర్కజ్ఞానమభివృద్ధి నందిన కొలఁదిని మతమును నొకప్రకృతిశాస్త్రమై, సృష్టివిమర్శనమునకు వ్యతిరేకముగా నున్న దానినిఁ బ్రమాణముగా నంగీకరింపక నిరాకరించుచున్నది. దీని బలిమివలననే ఐరో పా అమెరికాఖండములం దేకేశ్వరోపాసక క్రైస్తవమతమును, ఇండియాయందు బ్రహ్మ సమాజమును స్థాపింపఁబడినవి. ప్రకృతిశాస్త్రధర్మములు ఏకారణమువలన గౌరవార్హ ములై జనుల నమ్మకములను జూఱఁగొనుచున్నవో ఈమతముల ధర్మములును నాకార ణమువలననే నావిధముననే జనాభిప్రాయముల నాకర్షించుకొనును. అయినను సంఘ సంస్కరణము పూర్తియగునాటికి మతసంస్కరణమును నగుననితలఁచుటకు వలసినసాధ నము లెవ్వియు లేవు.

ఈవిధముగా భాషయు, నాగరికతయు, మతమును హిందూదేశీయు లెల్లఱి లోను నొక్కటియే యయి యన్యోన్యభేదములను దొలఁగించినవెనుకనే హిందూదేశ మునకు నిజమయిన యభివృద్ధి గోచరించును. ఇం దొక్కొక్కనిర్బంధము తొలఁగిన కొలఁదినిఁ గొన్నిగొన్ని సదాచారములు కానవచ్చినను, నీమూఁడును జేరినప్పుడుగాని మనకు నిజమైన యభివృద్ధి కలుగనేరదు.

హిందూసంఘసంస్కారచరిత్రమునుగూర్చి యింతవఱకును జెప్పి, మాపాఠకులనుండి మేము సెలవు పుచ్చుకొనుటకుఁ బూర్వము కొన్నివిషయములను దెలుపవలసియున్నది. మాకు వ్రాయుటకు లభ్యమయిన ఈ చిన్నగ్రంథమునందు మనసంఘమును బాగు చేయు టకయి ప్రయత్నించి కొద్దిగానో గొప్పగానో పని చేసిన ఘనపురుషు లందఱినుగూర్చి యుఁ దెలిపియున్నాము. వారు చేసినపని యొక్క వారికే సంబంధించినదిగాదు. మన యందఱి మేలుకొఱకును వారు ప్రయత్నించియే యున్నారు. ఏదేశమున నివసించి నను నెక్కడ నున్నను నిజముగా 'పరోపకారార్థమిదంశరీరమ్' అనునట్లు తనజన్మమును

పరుల క్షేమమునకయి వినియోగించి, మరణకాలమునాఁడు 'నాజన్మమును వ్యర్థము చేయలేదుగదా' అని సంతోషించువాఁడే నిజమైన మానవుఁడు. పుట్టిన ప్రతివాఁడు ను జనిపోవువాఁడే. అందులో అర్బుదమున కొక్కఁడుమాత్రమే నిజమైన సార్థక జీవనుఁ డుండును. అందువలన నీగ్రంథమును జదివెడు ప్రతివారును దమదేశ క్షేమ మునకయి పనిచేసిన యుత్తమసంస్కర్తలయెడల గౌరవమును గలిగి, తామును దమ మరణకాలమునాఁడు 'ఈబ్రదు కొకయాట యని నేను కాలమును వ్యర్థముచేయక, ఈశ్వరభక్తితో నీమానవకోటికి నాచేతనైన సహాయము చేసితినిగదా' అని సంతోష ముతోఁ జెప్పఁగలిగినయెడల మాప్రయత్నము సార్థకమైనదని భావించెదము. మఱి యు హిందువులలో నిట్టిలోపము లున్నవని మే మిందు ఎత్తి చూపినవిషయములను గమనించి మనవారు వానినిఁ బోఁగొట్టుకొందురు గాక. పరమేశ్వరుఁడు మనభరత ఖండమునకు నిరంతరాభివృద్ధిని దయచేసి, సంస్కర్తలకు మనోధైర్యమును, బలమును న . ఁగుచుఁ గష్టజీవనులై యహోరాత్రములను బరితపించుచున్న మనదేశపువారల ను బాగుచేసి, తననిజదూతవలె నీదేశమునకు వచ్చి మనవారికిఁ గన్నులను దెఱపించి వారిని బాగుచేయుచున్న హూణప్రభుత్వమే యెల్లకాలమును మనదేశమును బాలించు నట్లనుగ్రహించునుగాక. ఈశ్వరభక్తులై సత్యాదరణులై యెల్లవారును నభివృద్ధి గాంచుచుందురు గాక.

సమాప్తము.

END OF
TITLE